


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 7.00

సంపుటి: 18 సంచిక: 35

ఆదివారం 27-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


kisna.com
#HarGharKisna
KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
KFNC40333EG | KFNC40333NG
Celebrate this Festive Season with our
Akshaya
Collection
ASSURED 50-100%
వజ్రాభరణాల తయారీ చార్జీలపై తగ్గింపు*
FLAT 25%
బంగారు అబరణాల తయారీ చార్జీలపై తగ్గింపు*
90%* బైబ్యాక్ | 95%* ఎక్స్ఛేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
Stores Open at 05:59 AM on 30th April
వివరల కోసం
franchise@kisna.com
91524 84423
మా ప్రస్తుత షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - శరత్ సిటీ మాల్, గచ్చిబౌలి 91005 50230 | ఇనార్బిట్ మాల్ - సైబరాబాద్, మైండ్‌స్పేస్, మాదాపూర్ 81212 78807
దుర్గానగర్ కాలనీ, సోమాజిగూడ 86554 75096 | సికింద్రాబాద్ - త్యాగరాయ నగర్, ఏ.ఎస్. రావు నగర్ 86554 75100
ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం - గాంధీ పార్క్ పక్కన, పాల్కొండ రోడ్ 70321 18437
విశాఖపట్నం - మెయిన్ రోడ్ న్యూ గాజువాక, మోహిని థియేటర్ ఎదురుగా 86554 75085
వస్తున్న షోరూమ్‌లు: ఆంధ్రప్రదేశ్ - విజయవాడ |గుంటూరు | విశాఖపట్నం - విఐపి రోడ్
SCAN HERE
KISNA ఇప్పుడు మొత్తం భారతదేశంలో 80కి పైగా ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌లు మరియు 1,500కి పైగా షాప్-ఇన్-షాప్ లొకేషన్లలో అందుబాటులో ఉంది.


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 7.00 సంపుటి: 18 సంచిక: 35

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 27-4-2025



'పహల్గాం'పై తటస్థ విచారణ

పాక్ ప్రధాని వింత ప్రతిపాదన.. కశ్మీర్‌పై మరోసారి అవాకులు.. దేనికైనా సిద్ధమేనని వ్యాఖ్యలు..

- వివరాలు 6లో




'మమ్మీ'ని మళ్లీ చంపేస్తున్నారు..

రూ.ఐదు లక్షలు ఖర్చు చేయలేక తెలంగాణ పురావస్తు మ్యూజియంలో విదేశీ కానుక శిథిలం.

- వివరాలు 2లో

రజతోత్సవ రణన్నినాదం


వరంగల్ శివారు ఎల్కతుర్తిలో సభా ప్రాంగణం. ఇన్‌సెట్‌లో వేదిక

నేడే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ

వరంగల్ శివారు ఎల్కతుర్తిలో భారీగా ఏర్పాట్లు

- దేశం దృష్టిని ఆకర్షించేలా ఉంటుందన్న పార్టీ నేతలు
- 1,200 ఎకరాల్లో సభ.. 10 లక్షల మంది వస్తారని అంచనా
- సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ జనంలోకి కేసీఆర్
- భవిష్యత్ పోరాటంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుకు శంఖారావం పూరించే చాన్స్

తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్)గా ప్రస్థానం ప్రారంభించి, బీఆర్‌ఎస్‌గా మారి నేడు 25వ ఏట అడుగు పెడుతున్న భారత రాష్ట్ర సమితి.. వరంగల్ శివారులోని ఎల్కతుర్తిలో 'రజతోత్సవ సభ' పేరిట ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యే ఈ సభను విజయవంతం చేసేందుకు సుమారు నెల రోజులుగా బీఆర్‌ఎస్ యంత్రాంగం మొత్తం సర్వశక్తులూ ఒడ్డుతోంది. సభకు దాదాపు 10 లక్షల మంది వస్తారని అంచనా. -14లో


శనివారం రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికా వద్ద పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం 6లో

కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ అరెస్టు

ఆయన భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు

- వివరాలు 7లో

కొత్త నాయకత్వం కావాలి



సంప్రదాయ రాజకీయాలకు కాలం చెల్లింది: రాహుల్ గాంధీ

- ఓపిక, ప్రేమ అనే లక్షణాలు రాజకీయ నాయకుల్లో ఉండాలి
- భారత్‌లోని పాలకపక్షం కోపం, ద్వేషం కనబరుస్తోంది
- కాంగ్రెస్ పార్టీ దృష్టి కోణం మాత్రం ప్రేమ, ఆప్యాయతలే
- భారత్ సమ్మిట్–2025లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత ప్రసంగం

2లో

తెలంగాణ ఆకాంక్షలను ప్రపంచానికి చాటండి

భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

‘మమ్మీ’ని మళ్లీ చంపేస్తున్నారు!

రూ.5 లక్షలు ఖర్చు చేయలేక తెలంగాణ మ్యూజియంలో విదేశీ కానుక శిథిలం

ఈజిప్టు మమ్మీకి 2017లో జర్మన్ తయారీ నైట్రోజన్ గ్లాస్ చాంబర్ ఏర్పాటు

ఏడాది క్రితం నిండుకున్న నైట్రోజన్ సిలిండర్ రీఫిల్లింగ్‌కు డబ్బులు విడుదల చేయని ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రాణం పోసుకున్న ‘మమ్మీ’ని తిరిగి చంపేస్తున్నారు.. ఓ అధికారి ప్రత్యేక శ్రద్ధతో విదేశాల నుంచి నిపుణులను రప్పించి పునరుద్ధరణ, పరిరక్షణ చర్యలు తీసుకుని.. శిథిలమవుతున్న స్థితి నుంచి మమ్మీని రక్షిస్తే, ఇప్పుడు ప్రభుత్వం దాన్ని తిరిగి ధ్వంసమయ్యే స్థితికి చేరుస్తోంది. కేవలం రూ.ఐదు లక్షలు ఖర్చు చేయలేక 2400 ఏళ్ల నాటి ఈ మమ్మీని శిథిలావస్థవైపు చేరుస్తోంది. స్వల్ప నిధులు కేటాయించకుండా ఏడాదిగా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. మన చరిత్రలో మమ్మీకి ఎలాంటి ప్రాధాన్యం లేకున్నా, కోరుకోకుండా ప్రత్యేక కానుకగా వచ్చిన ఓ విదేశీ చారిత్రక గుర్తు తెలంగాణ స్టేట్ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా ఉంది. అలాంటి మమ్మీ ఇప్పుడు మరోసారి మరణశయ్యలోకి జారుకుంటోంది.



బ్యాక్టీరియా, ఫంగస్‌తో శిథిలమయ్యే దిశలో మమ్మీ

ఫైల్ ఫొటో

విదేశీ నిపుణులు పరిరక్షించినా..

చనిపోయిన మనిషి శరీరంలోని నీటిని ప్రత్యేక పద్ధతిలో తొలగించి,.. రసాయనాల్లో ఉంచి, తర్వాత ఆరబెట్టి కొన్ని లేపనాలు పూసి మమ్మీగా మారుస్తారు. ఆ తర్వాత ప్రత్యేక వస్త్రంతో చుట్టేస్తారు. ఇలా తయారైన మమ్మీనే ప్రస్తుతం నాంపల్లిలోని తెలంగాణ పురావస్తు మ్యూజియంలో ఉంది. తొలుత కొన్ని దశాబ్దాల పాటు దీని గురించి తెలియక సాధారణ గాజు చాంబర్‌లో ఉంచారు. ఈ మమ్మీని ఆక్సిజన్ చుట్టుముడితే క్రమంగా అందులో బ్యాక్టీరియా, శిలీంధ్రాలు పుట్టి వస్త్రాన్ని, లేపన పూతను పాడుచేస్తాయి. అలా ఈ మమ్మీ కూడా కొంతమేర శిథిలమై వస్త్రంలోంచి శరీర భాగాలు వెలుపలికి చొచ్చుకొచ్చాయి. దీన్ని గుర్తించిన అధికారులు 2012లో ఇరాన్ నుంచి నిపుణులను రప్పించారు. వారు పరిశీలించి మమ్మీ ధ్వంసమవటం మొదలైందని, వెంటనే ఆక్సిజన్ చొరబడని గాజు చాంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కానీ, ఆ ప్రక్రియ వెంటనే చేపట్టలేదు. 2017లో పురావస్తు శాఖ డైరెక్టర్‌గా వచ్చిన అధికారి విశాలాచ్చి, ‘ముంబై ఛత్రపతి శివాజీ మహా రాజ్ వస్తు సంగ్రహాలయ’లోని మమ్మీ పరిరక్షణ నిపుణులను పిలిపించారు. వారి సలహా మేరకు జర్మనీకి చెందిన ‘గ్లాస్ హార్స్ బాష్’ కంపెనీ ప్రతినిధులను పిలిపించారు. వారు ప్రత్యేకంగా నైట్రోజన్ గ్లాస్ చాంబర్‌ను తీసుకుని మమ్మీకి శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షణ చర్యలు చేసి ఆ చాంబర్‌లో అమర్చారు. అప్పట్లో దాని కి రూ.58 లక్షలు ఖర్చయింది. నిపుణుల విమాన టికెట్లు, హోటల్ బిల్లులు కలిపి మరో రూ.10 లక్షల వరకు ఖర్చయినట్టు సమాచారం. ఆ గ్లాస్ చాంబర్‌లోకి ప్రత్యేక పద్ధతిలో నైట్రోజన్ నిరంతరం పంప్ అవుతుంటుంది. ఇందుకోసం నైట్రోజన్ సిలిండర్‌ను పక్కన ఏర్పాటు చేశారు. నైట్రోజన్ పంప్ అవుతున్నంతకాలం అందులోకి ఆక్సిజన్ చొరబడదు. ఆక్సిజన్ నిండిపోతే మమ్మీకి ఏర్పాటు చేసిన రక్షణ వ్యవస్థ దెబ్బతిని క్రమంగా శిథిలమవుతుంది.



అవీ ఇవీ..

- కొన్ని అపురూప వస్తువులనూ ఇదే తరహాలో శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తారు. హత్యకు ముందు దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ ధరించిన వస్త్రాలను అదే తరహాలో పరిరక్షించారు.
- దివంగత ప్రధాని ఇందిరపై కాల్పులు జరిపిన ప్రాంతంలో ఆమె శరీరం నుంచి చిమ్మిన రక్తం మరకలను కూడా అదే శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షించారు.

ఏడాదిగా మళ్లీ.. ఏడాది క్రితం వరకు నైట్రోజన్ సరఫరా ప్రక్రియ సాఫీగా సాగింది. కానీ, ఇప్పుడు నైట్రోజన్ నిండుకుంది. దాన్ని మళ్లీ రీఫిల్ చేసి చాంబర్‌ను పరీక్షించేందుకు ముంబై నుంచి నిపుణులు రావాల్సి ఉంది. ఇందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. కానీ, పురావస్తు శాఖ వద్ద నిధులు లేవు. ఆ మొత్తాన్ని ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కానీ, ఏడాదిగా ఆ ఫైలు సచివాలయంలో దుమ్ముకొట్టుకుపోతోంది.

ఈజిప్టు యువరాణి.. ఈ మమ్మీని 25 ఏళ్ల వయసున్న యువతిగా శాస్త్రీయంగా నిర్ధారించారు. అయితే, అది ఈజిప్టు యువరాణి నౌషు (నౌషుషు)దిగా చరిత్ర చెబుతోంది. మమ్మీపై ఉంచిన వస్త్రంలో ఆమేరకు లిఖిత పూర్వకంగా సమాచారం ఉందని అధికారులు చెబుతున్నారు. యువరాణి మమ్మీ కావటంతో 1930లో అధిక ధరకు కొనుగోలు చేసినట్టు సమాచారం. ఏడో నిజాం అల్లుడు నాసిర్‌నవాజ్ జంగ్ ఈ మమ్మీని ఈజిప్టు నుంచి వేయి పౌండ్లకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చాడని, ఆయన దానిని నిజాంకు బహుమతిగా ఇవ్వగా, నిజాం దానిని స్టేట్ మ్యూజియంకు కానుకగా సమర్పించారని చెబుతారు.

రాహుల్‌గాంధీకి పుస్తకాన్ని బహూకరించిన సీతక్క

‘హాయ్ సీతక్కా.. హౌ ఆర్ యూ’ అంటూ పలకరించిన రాహుల్



రాహుల్‌గాంధీకి పుస్తకాన్ని అందజేస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఓ పుస్తకాన్ని బహూకరించారు. శనివారం హెచ్ఐసీసీ భారత్ సమ్మిట్ వేదికపై సీతక్కను ‘హాయ్ సీతక్కా.. హౌ ఆర్ యూ’ అంటూ రాహుల్ పలకరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి ‘లెటర్స్ ఫ్రం ఎ ఫాదర్ టు హిస్ డాటర్’ పుస్తకాన్ని అందజేశారు. తన కూతురు ఇందిరాగాంధీకి దివంగత మాజీ ప్రధాని నెహ్రూ రాసిన లేఖల సమాహారమే ఈ గ్రంథం. ఈపుస్తకాన్ని బహూకరించిన సీతక్కను రాహుల్ ఆప్యాయంగా భుజం తట్టారు.

విదేశీ డెలిగేట్స్‌తో కలిసి మహిళా బజార్ సందర్శన

భారత్ సమ్మిట్ ప్రతినిధులను వెంటపెట్టుకొని శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌ను మంత్రి సీతక్క సందర్శించారు. తెలంగాణ కళారూపాలతో విదేశీ ప్రతినిధులు, సీతక్కకు కళాకారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పేరిణీ శివ తాండవం ఇతర తెలంగాణ నృత్య, ఇతర కళారూపాలను ప్రదర్శించారు. మహిళల విజయ గాథలతో కూడిన లఘుచిత్ర ప్రదర్శన జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్, పెట్రోల్ బంక్ నిర్వహణ, ఐకేపీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణ, ఇతర అనుభవాలను సంఘాల సభ్యులు తెలియజేశారు.

మహిళా మంత్రులకు చీరలు బహూకరించిన ఎంపీ చామల



మంత్రి సీతక్కకు చీర బహూకరిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులు, ఎంపీలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి చీరలు బహూకరించారు. సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఉన్న తెలంగాణ ఇక్కత్ చీరలను కొనుగోలు చేసి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్యలకు అందజేశారు.

కొత్త నాయకత్వం కావాలి

సంప్రదాయ రాజకీయాలకు కాలం చెల్లింది

- భారత్‌లోని పాలకపక్షం కోపం, ద్వేషం కనబరుస్తోంది
- కాంగ్రెస్ పార్టీ దృష్టి కోణం మాత్రం ప్రేమ, ఆప్యాయతలే
- భారత్ సమ్మిట్–2025లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



శనివారం హెచ్ఐసీసీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ. చిత్రంలో సల్మాన్ ఖుర్షీద్, మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి ఇతర ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ పాత తరం రాజకీయాలకు కాలం చెల్లిందని.. అందుకే భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా కొత్త రాజకీయ నాయకత్వం రావాలని.. దాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అందుకు భారత్ సమ్మిట్–2025 వేదిక కావాలని ఆకాంక్షించారు. రెండు రోజుల భారత్ సమ్మిట్–2025 అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం జరిగిన ప్లీనరీకి ముఖ్యఅతిథిగా రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యయుత పార్టీలన్నీ విధానాలను మార్చుకుంటున్నాయని చెప్పారు. భారత్ జోడో యాత్ర చేపట్టేందుకు దారితీసిన పరిస్థితులతోపాటు యాత్రకు ముందు, ఆ తర్వాత తనలో రాజకీయంగా వచ్చిన మార్పుల గురించి వివరించారు. దేశంలోని పాలకపక్షం ద్వేషం, కోపాలను విస్తరింపజేయాలనే ఆలోచనతోనే ముందుకెళ్తోందని రాహుల్ విమర్శించారు. కానీ కాంగ్రెస్ పార్టీ దృష్టి కోణం మాత్రం ప్రేమ, ఆప్యాయతలేనని స్పష్టం చేశారు.

దేశ ప్రజల్ని కలిసేందుకే భారత్ జోడో యాత్ర చేపట్టా

‘ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పార్టీలు మౌలిక విధానాలను మార్చుకుంటున్నాయి. పదేళ్ల క్రితం నాటి ఆలోచనలు ఇప్పుడు పనిచేయవు. ఒక్కమాటలో చెప్పాలంటే పాత తరం రాజకీయం చనిపోయింది. ఇప్పుడు కొత్త రకం రాజకీయాలు రావాలి. ఇది ప్రపంచ రాజకీయాలకు ఒక సవాల్ లాంటిది. కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ ఓ వలయంలో చిక్కుకొని ఒంటరైంది. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలనే ఆలోచనలో భాగంగా మా అవకాశాలన్నింటినీ నిర్వీర్యం చేశారు. అప్పుడు ఏం చేయాలని ఆలోచించా. అందుకే దేశం ఆ చివరి నుంచి ఈ చివరి వరకు నడక ద్వారా ప్రజలను కలవాలనే నిర్ణయంతో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4 వేల కి.మీ. పాదయాత్ర చేశా. ఈ పాదయాత్రలో ఓపిక, ప్రేమ గురించి నేర్చుకున్నా. రాజకీయ నాయకులకు ఈ రెండు లక్షణాలు ఉండాలి. ప్రజలు ఏం చెబుతున్నారన్నది ఓపికగా వినగలగాలి. ప్రజలపట్ల ప్రేమ, ఆప్యాయతలను చూపించగలగాలి. విధానాల రూపంలో ప్రజలతో పరోక్షంగా కలిసి ఉండటం కంటే వారిపట్ల ప్రేమ బంధం ఏర్పరచుకోగలగాలి’ అని రాహుల్ గాంధీ చెప్పారు.

ముగిసిన ‘భారత్ సమ్మిట్’

దేశ, విదేశ ప్రగతిశీల నాయకుల చర్చలకు వేదికగా నిలిచిన సదస్సు

సాక్షి, హైదరాబాద్: జాతీయ, అంతర్జాతీయ ప్రగతిశీల నాయకుల చర్చా వేదికగా ‘భారత్ సమ్మిట్’ప్రత్యేకతను చాటింది. ‘న్యాయం, సమానత్వం, గౌరవం, శాంతి.. ఇవే మా లక్ష్యాలు’అంటూ ఈ సదస్సు చివరలో దేశ, విదేశాల నాయకులు ప్రకటించారు. హైదరాబాద్‌లో రెండురోజుల పాటు సాగిన ఈ సమ్మిట్ శనివారం ముగిసింది. వందకుపైగా దేశాల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం, ఆర్థిక, సామాజిక, పర్యావరణ, డిజిటల్ రంగాలలో న్యాయ సాధన అనే ముఖ్య లక్ష్యాలతో ఈ సదస్సు జరిగింది. ముగింపు సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొని సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ‘హైదరాబాద్ డిక్లరేషన్’.. భవిష్యత్తులో భారత్‌తో పాటు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా ప్రతినిధులు ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధానంగా అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఐరాస ప్రాధాన్యం తగ్గిపోవడం, అగ్రరాజ్యం అమెరికా పెద్దన్న వైఖరి అనుసరించడం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్–పాలస్తీనాల మధ్య భీకర పోరు కొనసాగడం, ఆఫ్రికా, ఇతర ఖండాల్లో రాజకీయ అనిశ్చితి, ఈ పరిణామాలన్నింటి మధ్య మహిళలు, ఇతరవర్గాల ప్రజలపై పడుతున్న ప్రభావం తదితర అంశాలను చర్చించారు.

అభివృద్ధికి మోడల్‌గా తెలంగాణ..

సదస్సు ముగింపు సందర్భంగా ‘ఓవర్ కమింగ్ పోలరైజేషన్ విత్ ప్లూరిలిజం, డైవర్సిటీ అండ్ రెస్పెక్ట్, యాక్సిలరేటింగ్ క్లైమేట్ జస్టిస్, ఎకనమిక్ జస్టిస్ ఇన్ అన్సర్టన్ టైమ్స్, పీస్ అండ్ జస్టిస్ ఇన్ ఎ మల్టీపోలార్ వరల్డ్ వంటి అంశాలపై అంశాలపై ప్యానల్ చర్చలు జరిగాయి. ఈ విషయాలపై చర్చ సందర్భంగా వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు, పాలసీ నిపుణులతో పాటు, జాతీయస్థాయి నాయకులు, తెలంగాణకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఇతరనేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో వివిధ అంశాలను ప్రస్తావించారు. తెలంగాణను న్యాయం, సమానత్వం ఆధారిత అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర నేతలు స్పష్టంచేశారు. రాహుల్ గాంధీ ‘న్యాయ్’సిద్ధాంతం ఆధారంగా అభివృద్ధి మార్గంలో ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ సాధనగా ముందుకెళుతున్నట్టు ప్రకటించారు. పెట్టుబడుల ఆకర్షణతోపాటు పెట్టుబడిదారుల విశ్వాసం పెంపొందించే దిశలో ప్రాంతీయ అభివృద్ధి మోడల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతున్నట్టు వారు తెలిపారు. హైదరాబాద్ డిక్లరేషన్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. రాజ్యసభ సభ్యుడు ప్రొఫెసర్ మనోజ్ ఝా.. తన ప్రసంగంలో దేశంలో వేగంగా మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న ద్వేష ఆధారిత రాజకీయాలను గమనించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ, ప్రాంతీయ అభివృద్ధి నమూనాలను ప్రస్తావించారు. తెలంగాణ, తమిళనాడు లాంటి రాష్ట్రాలు చూపిన మార్గం ఇతర రాష్ట్రాలకు ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు. ‘మేము గ్లోబల్ సౌత్ తరఫున ప్రతినిధ్యం వహిస్తూ.., పునర్నిర్మాణం, పునర్విమర్శ ద్వారా సమానత్వం, న్యాయాన్ని స్థాపిస్తున్నాం. తెలంగాణ, తమిళనాడు అభివృద్ధి మోడ ల్స్ సమాజ మార్పునకు చక్కటి ఉదాహరణలు’అని వ్యాఖ్యానించారు. శుక్రవారం నాలుగు అంశాలపై ప్యానెల్ చర్చలు జరగగా, శనివారం నాటి నాలుగు చర్చలను కూడా కలిపి మొత్తం ఎనిమిది అంశాలపై ఈ సమ్మిట్‌లో జరిగిన సమాలోచనల్లో దేశ, విదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆకాంక్షలను ప్రపంచానికి చాటండి

- తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి
- ప్రభుత్వ పనితీరు, లక్ష్య సాధన గురించి వివరించండి
- భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులకు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలు కేంద్రంగానే పనిచేస్తున్నాం: భట్టి



సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షల గురించి ప్రపంచానికి చాటాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులను కోరారు. సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగావకాశాల కల్పన, పర్యావరణ సమతుల్యతను సాధిస్తూ ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రజాప్రభుత్వం చేపట్టిన మిషన్‌లో భాగస్వాములు కావాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. ‘ఈ సదస్సుకు వచ్చిన అందరికీ కృతజ్ఞతలు. మీకు ఆతిథ్యమివ్వడం గౌరవంగా ఉంది. మీరంతా మా రాష్ట్రం గురించి ప్రపంచానికి తెలియజేయండి. ఇక్కడ మీరు చూసింది... మా పని, లక్ష్య సాధనను వివరించండి. తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి’ అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ సమ్మిట్–2025లో భాగంగా శనివారం జరిగిన ప్లీనరీలో సీఎం రేవంత్ మాట్లాడారు.

ప్రజావసరాల కోసం కాంగ్రెస్ ముందుకెళ్తుంది..

తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్నా గత పదేళ్లలో పోరాట ఫలితాలు ప్రజలకు అందలేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ‘ప్రజావసరాలను అర్థం చేసుకొని కాంగ్రెస్ ముందుకెళ్తుంది. దేశంలో సాగునీరు, విద్యారంగాల అభివృద్ధి కోసం నెహ్రూ పనిచేశారు. ఆ తర్వాత వచ్చిన ఇందిరా గాంధీ పేదరిక నిర్మూలన కోసం కృషి చేశారు. అనంతరం దేశాన్ని పాలించిన రాజీవ్ గాంధీ, పి.వి. నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌లు దేశ ఆధునీకరణ కోసం తపించారు. వారు చేసిన కృషి వల్లే నేడు ప్రపంచంలోనే భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది’ అని రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రాబడులను పెంచి పేదలకు పంచాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి రేవంత్ వివరించారు.

సమ్మిట్ నుంచి స్ఫూర్తి పొందుతాం: భట్టి

భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచ దేశాల ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటి తొలి రోజు నుంచి ప్రజలు కేంద్రంగానే పనిచేస్తున్నామన్నారు. ఈ సమ్మిట్ స్ఫూర్తితో తమ విధానాలను మరింత మెరుగుపరుచుకుంటామని భట్టి అన్నారు. ప్లీనరీలో భాగంగా పలువురు విదేశీ ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకున్నారు. సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులకు సీఎం బహుమతులు ప్రదానం చేశారు. ప్లీనరీ ముగింపు సందర్భంగా మంత్రి ఉత్తమ్ వందన సమర్పణ చేశారు. ప్లీనరీలో మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్కతోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే నైతికహక్కు బీఆర్ఎస్‌కు లేదు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బీఆర్ఎస్ నేతలు తమ పదేళ్ల పాలనలో ప్రజల హక్కులను హరించారని ఆయన మండిపడ్డారు. ఏఐ సాయంతో తమ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. భారత్ సమ్మిట్ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఫొటోలను రెండు రోజుల ముందే సోషల్ మీడియాలో విడుదల చేయడం వెనుక బీఆర్ఎస్‌నేతల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. శనివారం హెచ్ఐసీసీలో ‘భారత్ సమ్మిట్ –2025’లో భాగంగా ‘న్యాయ పథ్’పేరిట నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇతర దేశాలతో భారత్‌కున్న సత్సంబంధాలు, చారిత్రక ఘటనలను నేటి తరానికి తెలియజేయాలనే సంకల్పంతోనే ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ...‘ఈ సమ్మిట్‌కు అనేక దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఎగ్జిబిషన్ ద్వారా భారత దేశ చరిత్ర మొత్తం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు వివిధ దేశాలతో మంచి సంబంధాలు నెలకొల్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న అనేక అలజడులపై సమ్మిట్‌లో చర్చ జరిగింది. దీనిపై కొంత మంది ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. వాళ్ల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు’అని పేర్కొన్నారు.

ఇదంజగత్



...కన్నబిడ్డలా పోషించి ఎంతో పెద్ద చేశాం!

ఐక్యతా ప్రపంచమే లక్ష్యం

శ్రామికుల హక్కులు, ఆకాంక్షలను గౌరవించే సమాజమే ధ్యేయం

- స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సంఘీభావాలతోనే ప్రగతి, శాంతి
- నియంత్రణ లేని కార్పొరేట్ల గుత్తాధిపత్యాన్ని తిరస్కరిస్తున్నాం
- భారత్ సమ్మిట్–2025లో ‘హైదరాబాద్ డిక్లరేషన్’.. ఆమోదించిన ప్రతినిధులు



భారత్ సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: అందరికీ సమాన హక్కులు ఉండే బాధ్యతాయుత, ఐక్యతా ప్రపంచాన్ని సృష్టించడమే లక్ష్యంగా ప్రగతిశీల శక్తులన్నీ పనిచేయాలని భారత్ సమ్మిట్–2025 తీర్మానించింది. ‘శ్రామిక ప్రజల ఆకాంక్షలు, హక్కుల్ని గౌరవించే ప్రపంచం కావాలి. అన్యాయాలను కలసికట్టుగా ఎదుర్కోవడం ద్వారా అందరికీ సంపూర్ణ జీవనం అందించే నూతన శకాన్ని సృష్టిస్తాం’ అని స్పష్టం చేసింది. హైదరాబాద్ వేదికగా జరిగిన రెండు రోజుల భారత్ సమ్మిట్ ముగింపు సందర్భంగా శనివారం ఈ మేరకు హైదరాబాద్ డిక్లరేషన్‌ను ప్రపంచ దేశాల ప్రతినిధులు ఆమోదించారు. ప్రస్తుత తరంతోపాటు భావి తరాలకు ప్రగతి, శాంతితో కూడిన ప్రపంచం కావాలంటే నాలుగు సూత్రాలతో ముందుకెళ్లాలని.. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సంఘీభావాలే ఈ భూగ్రహాన్ని రక్షిస్తాయని డిక్లరేషన్ అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు నిరంకుశ ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను దీటుగా ఎదుర్కొంటామని.. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయానికి అండగా నిలబడతామని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొల్పడం, మానవ భద్రతలే ధ్యేయంగా పనిచేయాలని తీర్మానించింది. డిక్లరేషన్ సారాంశాన్ని కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, యాన్ లిండే (స్వీడన్)లు ప్లీనరీ సెషన్‌లో చదివి వినిపించారు.

హైదరాబాద్ డిక్లరేషన్‌లోని కీలకాంశాలు

- ప్రపంచ నలుమూలల్లో పనిచేస్తున్న ప్రగతిశీల శక్తులుగా, సామాజిక–ప్రజాస్వామిక, సోషలిస్టు, కార్మిక ఉద్యమకారులుగా స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సంఘీభావాల విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉంటామని పునరుద్ఘాటిస్తున్నాం.
- తీవ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల వైఖరిని ఖండిస్తున్నాం. అతివాద నాయకులు, నిరంకుశ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య గతిని తప్పిస్తున్నాయి. స్వేచ్ఛను కుదిస్తున్నాయి.
- నియంత్రణ లేని కార్పొరేట్ల గుత్తాధిపత్యాన్ని తిరస్కరిస్తున్నాం. బహుపాక్షిక ఒప్పందాల ఉల్లంఘన, మానవ హక్కులు, లింగ సమానత్వంపై దాడికి పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ మానవాళికి జరుగుతున్న అన్యాయాలను నిరోధించడం ద్వారా సమానత్వంతో కూడిన బాధ్యతాయుత ఐక్యతా ప్రపంచంగా మార్చాలని అభిప్రాయపడుతున్నాం.
- సార్వభౌమాధికారాన్ని బలహీనపరిచే, అస్థిరత దిశగా ప్రపంచాన్ని నడిపించే, సమాజాన్ని తీవ్రంగా విభజించే ఆర్థిక అన్యాయాలను సరిదిద్దాలని భావిస్తున్నాం.
- ప్రపంచంలోని 300 కోట్ల మంది జీవన స్థితిగతులను ప్రమాదంలోకి నెట్టేలా ముదురుతున్న వాతావరణ సంక్షోభంపై యుద్ధం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. స్వచ్ఛమైన గాలి, నీరు, జీవ వైవిధ్యంతో కూడిన వాతావరణం ప్రాథమిక హక్కు కావాలని, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచ ఏకాభిప్రాయం రావాలని ఆకాంక్షిస్తున్నాం.
- న్యాయబద్ధత, జవాబుదారీతనం, మానవ హక్కులను రక్షించడం, గౌరవించడం దిశగా ప్రజాబాహుళ్య, రాజకీయ, ఆర్థిక విధానాల్లో మార్పులు రావాలి. ప్రపంచ న్యాయ కల్పనకు ఉపయోగపడే సంఘీభావం, అహింస, సత్యం, న్యాయం లాంటి ప్రగతిశీల విధానాలను అనుసరిస్తాం.
- అంతర్జాతీయ న్యాయసూత్రాల ఆధారంగా పనిచేసే రాజకీయ శక్తులతో కలిసి పనిచేస్తాం. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని పోగొట్టే, సమాన అవకాశాలు సృష్టించే ఆర్థిక నమూనాలు రూపొందాలి. లింగ భేదానికి తావు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.
- వనరులపై ప్రజాస్వామ్యయుత నియంత్రణ, న్యాయ మైన వాణిజ్యవిధానాలు, ప్రపంచీకరణను ప్రోత్సహించే సమతౌల్య ఆర్థిక ప్రతిపాదనలు కావాలి. ఆహారం, నీరు, ఇంధనం, వైద్యం, విద్య, గృహం, సాంకేతికతల ను ప్రజలందరికీ అందించే విధానాలు రావాలి.
- అభివృద్ధి చెందుతున్న, దక్షిణప్రాంత దేశాలకు తగిన ప్రాతినిధ్యాన్ని కల్పించేలా అంతర్జాతీయ సహకార వ్యవస్థ రూపొందాలి.

స్వతంత్ర సంస్థలైన ప్రెస్, యూనివర్సిటీలు, కోర్టులు, పౌర సంస్థలను రక్షించుకుంటాం. విద్వేషం, హింస, అవాస్తవాలను ప్రచారం చేసే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వ్యతిరేకిస్తున్నాం.

భారత్ భద్రతకు 'ఇస్రో' భరోసా..!

వచ్చే మూడేళ్లలో 150 ఉపగ్రహ ప్రయోగాలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) దేశ భద్రత అవసరాల కోసం రాబోయే మూడేళ్లలో 150 ఉపగ్రహాలను ప్రయోగించేందుకు సిద్ధమవుతోంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో ఒకేసారి నాలుగు రాకెట్లు అనుసంధానానికి వీలుంది. అలాగే తమిళనాడులోని కులశేఖరపట్నంలో నిర్మాణంలో ఉన్న ప్రయోగ కేంద్రాన్ని కూడా ఈ ఏడాదిలోపు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటి ద్వారా త్వరితగతిన ఉగ్రప్రహ ప్రయోగానికి అవకాశం లభిస్తోంది.

కమ్యూనికేషన్ ఉపగ్రహాలకు ప్రాధాన్యత

ఇంటర్‌నెట్ విస్తరణ నేపథ్యంలో నెట్‌వర్క్ కెపాసిటీ పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందు కోసం కమ్యూనికేషన్ ఉపగ్రహాలను అధిక సంఖ్యలో ప్రయోగించాలనే ప్రణాళిక రూపొందించారు. భారతదేశానికి దాదాపు 7,500 కిలోమీటర్ల మేర తీరరేఖ ఉండటంతో, తీరప్రాంతాల్లో నిఘా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 55 ఉపగ్రహాలు అవసరాలను తీర్చలేకపోవడంతో, కొత్త ఉపగ్రహాల కోసం ఇస్రో భారీ ప్రణాళికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తున్న నేపథ్యంలో, 150 ఉపగ్రహాల భద్రతకు సంబంధించి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ అవసరాల కోసం ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు వేగంగా పనిచేస్తున్నారు. అంతే కాదు, కేంద్రం చేపట్టిన సంస్కరణల వల్ల అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ రూపకల్పన, ప్రయోగాల్లో ప్రైవేట్ రంగం భాగస్వామ్యాన్ని కూడా పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

మే నుంచి బిజీబిజీ..

ఇస్రో మే నెల నుంచి వరుసగా నాలుగు ముఖ్యమైన ప్రయోగాలకు సిద్ధమవుతోంది. ముందుగా మే మొదటి వారంలో జీఎస్ఎల్‌వీ–ఎఫ్16 ప్రయోగాన్ని నిర్వహించిన అనంతరం, మిగిలిన మూడు ప్రయోగాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యాంశాలు పరిశీలిస్తే, మొదటి ప్రయోగ వేదికపై పీఎస్ఎల్‌వీ–సీ61 రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో జీఎస్ఎల్‌వీ–ఎఫ్16 ప్రయోగానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రెండవ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో గగన్‌యాన్–1 ప్రయోగానికి ఎల్‌వీఎం3–జీ1 రాకెట్ సిద్ధమవుతోంది. సాలిడ్‌స్టేజ్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఎల్‌వీఎం3–ఎం5 రాకెట్ అనుసంధానం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఏరియల్ వ్యూ

జీ-20 అవసరాలపై దృష్టి

జీ–20 దేశాల అవసరాల మేరకు వాతావరణ మార్పులపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక ఉపగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో 50 శాతం వ్యయాన్ని భారత్, మిగతా 50 శాతం వ్యయాన్ని జీ–20 దేశాలు భరించనున్నాయి.

అంతరిక్ష యాత్ర లక్ష్యం

ఇక మానవ సహిత అంతరిక్ష యాత్రకు కూడా ఇస్రో సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా చంద్రయాన్– 4 మిషన్ ప్రయోగానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అంగారక గ్రహంపై మరింత లోతుగా అధ్యయనం చేయడానికి మంగళ్‌యాన్–2 మిషన్, అలాగే శుక్రగ్రహ ఉపరితలం, వాతావరణంపై అధ్యయనం చేయడానికి శుక్రయాన్ మిషన్ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఇంటర్ ఫలితాల శాతం తగ్గిన కాలేజీలపై త్వరలో సమీక్ష

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అత్యుత్తమ మార్కులు సాధించిన 200 మందికి అవార్డులు అందజేత



ప్రతిభ కనబరిచిన గురుకులాల విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్‌లో ఫలితాల శాతం తగ్గిన కాలేజీలపై త్వరలో సమీక్ష నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా సంస్థలపై రూ.వేలకోట్లు ఖర్చు చేస్తోందని, ఈ నేపథ్యంలో అవి అత్యుత్తమ ఫలితాలు సాధించాల్సిందేనని ఆయన అన్నారు. ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన రెండువందల మంది బీసీ గురుకుల సొసైటీ విద్యార్థులకు మంత్రి పొన్నం శనివారం అవార్డులు అందించారు. టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ, మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించడమంటే మిగిలిన విద్యార్థులు మంచి ర్యాంకులు తెచ్చేలా స్ఫూర్తి అందించినట్లే అని అన్నారు. గురుకుల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచిందని, కేవలం ఇంటర్మీడియెట్‌లోనే కాకుండా ఉన్నత చదువుల్లో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను తమ పిల్లలుగా భావించి బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం' ఆదేశాల మేరకు వర్గీకరణ జరగలేదా?

- కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎస్సీ ఉపకులాల వర్గీకరణ జరగలేదా అని సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. ఈలోగా అత్యవసరమైతే మధ్యంతర ఉపశమన ఆదేశాల కోసం ధర్మాసనం ముందు ప్రస్తావించవచ్చని పిటిషనర్‌కు స్వేచ్ఛనిచ్చింది. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను సవాల్ చేస్తూ హైకోర్టులో మాల మహానాడు జాతీయాధ్యక్షుడు జి.చెన్నయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా వన్ మ్యాన్ కమిషన్ ఇచ్చిన గణాంకాల మేరకు ఉప కులాల వర్గీకరణ చేశారని, తాజా లెక్కలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ప్రస్తుత ఎస్సీ కులాల గణాంకాల మేరకు వర్గీకరణ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది డీవీ సీతారాంమూర్తి వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఉప కులాల వెనుకబాటును నిర్ణయించడానికి తాజా గణాంకాలు అవసరమని, అయితే ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. సాంఘిక సంక్షేమాభివృద్ధి శాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖ, జీఏడీ ముఖ్య కార్యదర్శి సహా ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

పహల్గాం ఉగ్రదాడిపై సచివాలయ ఉద్యోగుల నిరసన

సాక్షి, హైదరాబాద్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల హత్యాకాండను తెలంగాణ సచివాలయ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం సచివాలయం ప్రధాన గేటు ముందు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలాంటి క్రూర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఇది మానవత్వంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం చేయాలని కోరారు.

పరిశ్రమలకు భూముల ధరలు పెంపు

కనిష్టంగా ఐదు.. గరిష్టంగా పది శాతం వరకు పెంచిన టీజీఐఐసీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పరిశ్రమల భూముల ధరలు పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఐదు నుంచి పది శాతం వరకు ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆయా ఇండస్ట్రియల్ పార్కులు, ఎస్టేట్లలో భూములకు ఉన్న డిమాండ్, అందుబాటులో ఉన్న స్థలాల ఆధారంగా ఈ ధరలను పెంచినట్లు తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఐఐసీ) ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. పెరిగిన ధరలు ఈనెల 9 నుంచి అమలులోకి వచ్చాయి. రాష్ట్రంలో ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు భూములను కేటాయిస్తున్న విషయం విదితమే. టీజీఐఐసీ ఆయా జిల్లాల్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్లు, ఇండస్ట్రియల్ పార్కులు, ఎస్ఈజెడ్‌లను ఏర్పాటు చేస్తుంది. వీటి ఏర్పాటు కోసం సేకరించిన భూములను పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది. ఆయా లేఅవుట్‌లలో రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజీ వంటి వాటిని అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయిస్తుంది. ఇలా కేటాయించే భూములకు ప్రభుత్వం ధరలను నిర్ణయిస్తుంది. భూములు పొందిన యాజమాన్యాలు రెండేళ్లలో పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తిని ప్రారంభించాక ఆ భూమిని పరిశ్రమకు రిజిస్ట్రేషన్ చేస్తుంది. టీజీఐఐసీకి రాష్ట్రవ్యాప్తంగా 170 ఇండస్ట్రియల్ పార్కులు, ఎస్టేట్లు, ఎస్ఈజెడ్‌లు ఉండగా, ఇందులో 45 శాతం వరకు మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నాయి.

చదరపు మీటరు రూ.1.61 లక్షలు..

పెరిగిన భూముల ధరలను పరిశీలిస్తే.. మాదాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ యూనిట్లు, హైటెక్ సిటీ లేఅవుట్‌లలో ఒక చదరపు మీటరుకు రూ.1.61 లక్షలుగా టీజీఐఐసీ నిర్ణయించింది. అత్యల్పంగా సిద్దిపేటలోని ఫిట్టెడ్ ఫ్యాక్టరీస్ కాంప్లెక్స్‌లో చదరపు మీటరు రూ.269గా నిర్ణయించారు. అలాగే మేడ్చల్–సిద్దిపేట జోన్ పరిధిలో ఉన్న తునికిబొల్లార్ ఎఫ్ఎఫ్‌సీలో కూడా చదరపు మీటరుకు రూ.323గా నిర్ణయించారు. అయితే కొన్ని ఇండస్ట్రియల్ పార్కులు, ఎస్టేట్‌లలో స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండగా, మరికొన్ని ఎస్టేట్‌లలోని స్థలాలను ఎవరూ అడగడం లేదని టీజీఐఐసీ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'ప్రతినిధితో పేర్కొన్నారు. ఇలా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో భూములను సేకరించి వాటిని అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయిస్తామని ఆయన తెలిపారు.

సంపదకు బదులు దారిద్ర్యాన్ని పెంచుతున్న మోదీ

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో ప్రొఫెసర్ నాగేశ్వర్



మహాసభల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఖమ్మం మయూరిసెంటర్: దేశంలో కార్పొరేట్ల లాభాలు 400 శాతం పెరిగితే.. ఉద్యోగుల జీతాలు ఐదు శాతం మాత్రమే పెరుగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. ప్రభుత్వం విద్యా, ఆరోగ్యం తదితర సామాజిక రంగాలపై ఖర్చు పెట్టలేకపోతోందని విమర్శించారు. ఖమ్మంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలు శనివారం రెండో రోజుకు చేరగా, ప్రతినిధుల సభలో ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రారంభోపన్యాసం చేశారు. కార్పొరేట్ల నుంచి వచ్చే ఆదాయం నానాటికీ తరుగుతోందని.. ఒకప్పుడు 32 శాతంగా ఉన్న ఆదాయం 26 శాతానికి పడిపోయిందని అన్నారు. దేశంలో 22 కోట్ల మంది ప్రజల రోజువారీ ఆదాయం రూ.300కన్నా తక్కువ ఉంటే, గౌతమ్ అదానీకి రోజుకు రూ.1,600 కోట్ల ఆదాయం ఎలా వస్తుందని ప్రశ్నించారు. శ్యాం పిట్రోడా ప్రతిపాదనల ప్రకారం సంపద, వారసత్వంపై పన్ను ఎందుకు విధించకూడదో చెప్పాలన్నారు. ప్రధాని మోదీ సంపదను కాకుండా దారిద్ర్యాన్ని పెంచుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా, ధనిక, పేద అంతరాలను దాటి విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని నాగేశ్వర్ పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ముప్పా శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీ.పీ.సాను, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రోజ్‌గార్ మేళా ద్వారా 9.25 లక్షల ఉద్యోగాలు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోజ్‌గార్ మేళా ద్వారా మూడేళ్లలో 9.25 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. శనివారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గతంలో హామీ ఇచ్చారని, దానికి కట్టుబడి ఇప్పటి వరకు రోజ్ గార్ మేళా ద్వారా 9.25 లక్షల మందికి నియామక పత్రాలను అందించినట్లు వెల్లడించారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 700 మందికి సంజయ్ నియామక పత్రాలు అందజేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలుంటే.. ఇతర ఉద్యోగులపై భారం పడుతుందని, తద్వారా మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సేవలందించడం కష్టమవుతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా లాంటి పథకాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన వారికి అభినందనలు తెలిపారు.

తెలుగులోనూ ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల నియామక పరీక్ష

- మళ్లీ నిర్వహించాలని టీఆర్ఈఐఆర్‌బీకి హైకోర్టు ఆదేశం




సాక్షి, హైదరాబాద్: ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల నియామక పరీక్షలను మరోసారి నిర్వహించాలని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఆర్ఈఐఆర్‌బీ)ని హైకోర్టు ఆదేశించింది. ఈసారి ఆంగ్లంతో పాటు తెలుగులోనూ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని బోర్డుకు స్పష్టం చేసింది. 2023, ఏప్రిల్ 5న జారీ చేసిన నోటిఫికేషన్‌లో నియామక పరీక్షలను తెలుగు, ఆంగ్లంలో నిర్వహిస్తామని పేర్కొని, అదే ఏడాది ఆగస్టులో కేవలం ఆంగ్లంలోనే పరీక్ష నిర్వహించారని పేర్కొంటూ నల్లగొండ జిల్లా చర్లపల్లికి చెందిన ఎం.రమేశ్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపిస్తూ.. నోటిఫికేషన్‌లో ఇరు భాషల్లో పరీక్ష నిర్వహిస్తామని బోర్డు వెల్లడించిందన్నారు. పరీక్షా కేంద్రానికి వెళ్లిన తర్వాత తెలుగు అభ్యర్థులకు కూడా ఆంగ్లం పేపరే ఇచ్చారని, దీంతో వారు షాక్‌కు గురయ్యారని తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు తెలుగులో పరీక్ష నిర్వహించకుంటే ఆ మాధ్యమ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సింగిల్ జడ్జి అభ్యర్థులకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసినా.. బోర్డు, మరికొందరు దానిపై అప్పీళ్లు దాఖలు చేశారని చెప్పారు. పిటిషన్లతో పాటు అప్పీళ్లను కూడా పరిశీలించిన ధర్మాసనం.. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు పరీక్ష నిర్వహించాలని బోర్డుకు ఆదేశాలు జారీచేసింది. వీలైనంత త్వరగా పరీక్ష పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

ఫార్మసిస్టులు.. ఇక ఫార్మసీ ఆఫీసర్స్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఫార్మసిస్టుల హోదాను ప్రభుత్వం ఫార్మసీ ఆఫీసర్స్‌గా మార్చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య, విద్య, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, వైద్య విధాన పరిషత్‌లలో పనిచేస్తున్న ఫార్మసిస్టు గ్రేడ్–1 ఉద్యోగులను ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసీ సూపర్‌వైజర్లను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లుగా మార్చింది. దీనిపై రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్, ఉపాధ్యక్షుడు ఉప్పు భాస్కర్‌రావు శనివారం సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.



'సాగుబడి' వ్యవసాయ కథనాలు బాగున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశంసించారు. సాక్షి సాగుబడిలో ప్రచురితమైన కథనాల సంకలనం 'సాగుబడి– ప్రకృతి వ్యవసాయదారులకు పెద్దబాలశిక్ష–1'ని శనివారం ఉదయం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. సంకలనకర్త సాక్షి సాగుబడి డెస్క్ ఇన్‌చార్జ్ పంతంగి రాంబాబును మంత్రి ఈ సందర్భంగా సత్కరించారు.

మే 1నుంచి టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు

- ఐదు ఉమ్మడి జిల్లాల్లో 42 రోజుల పాటు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవుల్లో భాగంగా టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణ 42 రోజుల పాటు ఇస్తామని వివరించింది. మే1 నుంచి జూన్ 11వరకు ఈ శిక్షణ సాగుతుందని తెలిపింది. కోర్సు కోసం ఈనెల 29 వరకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 18–45 ఏళ్ల మధ్య వయసుండి, ఈనెల 17వ తేదీ నాటికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో లేదా పాఠశాల విద్యాశాఖ వరంగల్, హైదరాబాద్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులను లేదా జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని సూచించింది.

బార్లకు భారీగా దరఖాస్తులు

- మిర్యాలగూడలో ఒక బార్‌కు 226... మీర్‌పేటలో 200 అప్లికేషన్లు
- 1,346 దరఖాస్తులతో ప్రభుత్వానికి రూ.13.46 కోట్ల ఆదాయం
- ఈనెల 29న డ్రా...అదేరోజు బార్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు భారీ స్పందన వచ్చింది. మొత్తం 25 బార్లకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా శనివారం గడువు ముగిసే సమయానికి 1,346 దరఖాస్తులు వచ్చాయి. అంటే బార్‌కు సగటున 50 కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నమాట. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఒక్క బార్ కోసం 226 మంది పోటీపడటం గమనార్హం . అదేవిధంగా రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలోనూ ఒక బార్‌కు 200 దరఖాస్తులు రావడం ఎక్సైజ్ శాఖనే ఆశ్చర్యపరిచింది. మొత్తం మీద ఈ బార్ల దరఖాస్తుకు నిర్ధారించిన రూ. లక్ష ఫీజు మేరకు మొత్తం 1,346 దరఖాస్తులకుగాను రూ.13.46 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరింది. బెల్లంపల్లిలో ఒక బార్‌కు కేవలం ఒకే దరఖాస్తు రావడంతో మళ్లీ ఆ బార్ గడువును పొడిగించారు. మిగిలిన 24 బార్‌లకు ఈనెల 29న డ్రా తీసి అదే రోజున విజేతలకు కేటాయిస్తామని ఎక్సైజ్ శాఖ వర్గాలు తెలిపాయి.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం
తిథి: అమావాస్య రా.1.23 వరకు
తదుపరి వైశాఖ శుద్ధ పాడ్యమి
నక్షత్రం: అశ్విని రా.1.08 వరకు, తదుపరి భరణి
వర్జ్యం: రా.9.25 నుండి 10.55 వరకు
దుర్ముహూర్తం: సా.4.33 నుండి 5.23 వరకు
అమృత ఘడియలు: సా.6.23 నుండి 7.54 వరకు

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

తహవ్వుర్ రానా (26/11 సూత్రధారి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు


"రేపటితో నీ రిమాండ్ ముగుస్తుంది..." అన్నాడు నా లాయర్. "తర్వాత ఏం జరుగుతుంది?" అని నేను నా లాయర్‌ని అడగలేదు.

నా తరఫున వాదించటానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన లాయర్ అతడు. 'ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ' నుంచి వచ్చాడు. గవర్నమెంట్ డబ్బులిచ్చి నడిపిస్తున్న లీగల్ అథారిటీ నుంచి, గవర్నమెంటే ఏర్పాటు చేస్తే నా కోసం వచ్చిన లాయర్‌ను నేను అడిగేది ఏముంటుంది? అతని పేరేమో పీయూష్ సచ్‌దేవ!

'ఏమైనా తిన్నావా?' అంటాడు!
'ఏమైనా అన్నారా?' అంటాడు!
'ఆరోగ్యం ఎలా ఉంది?' అంటాడు.
'ఇక ఉండేదా మరి?!' అంటాడు.

ఈ నాలుగే... రోజు మార్చి రోజు అతడు నన్ను అడిగే ప్రశ్నలు. ఊరికే వస్తుంటాడు, పోతుంటాడు. 'ధైర్యంగా ఉండు, న్యాయం గెలుస్తుంది..' అంటాడు! నేనడిగానా 'నాక్కాస్త ధైర్యమివ్వు' అని, నేనడిగానా 'న్యాయాన్ని గెలిపించు' అని!!

ఒకరోజు వచ్చాడు. "నువ్వు మందులేమీ వేసుకోవటం లేదనీ, కనుక నువ్వు చెప్పుకుం



టున్నట్లుగా నీకు 33 అనారోగ్యాలేమీ లేవనీ, అందుచేత నీ ఇంటరాగేషన్ టైమ్‌ను తగ్గించే అవసరం లేదనీ వాళ్లు వాదించబోతున్నట్లు తెలిసింది..." అన్నాడు!

"నువ్వూ, వాళ్లూ నా గురించి ఏదైనా వాదించుకోండి. అది నాకు సంబంధం లేని విషయం. నాకైతే ఒక ఖురాన్, ఒక పెన్ను, కొన్ని తెల్ల కాగితాలు తెప్పించు..." అన్నాను.

తెప్పించాక, "ఇవన్నీ ఎందుకు?!" అని అడిగాడు.

"పవిత్ర ఖురాన్ గ్రంథం నా డాక్టర్. ఆ డాక్టర్ నాకు ప్రిస్క్రిప్షన్ రాయటానికి ఈ పెన్ను, ఈ తెల్ల కాగితాలు. ప్రవక్త సూక్తులే నేను వేసుకునే మందులు..." అని చెప్పాను.

తర్వాతి విజిట్‌లో ... "నా కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడించగలవా?!" అని అడిగాను.

"కష్టం కావచ్చు" అన్నాడు.

"ఎందుకు కష్టం కావచ్చు?!" అన్నాను.

"మీ 'కుటుంబ సభ్యులు' ఒకరు పాకిస్తాన్‌లో 78 ఏళ్ల కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. ఇంకొకరు లాహోర్, రావల్పిండి వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నప్పటికీ వారు జైల్లో ఉన్నారని పాకిస్తాన్ అంటోంది కనుక జైల్లోంచి మాట్లాడటం కుదరదు. మీ మిగతా కుటుంబ సభ్యులు పాకిస్తాన్‌లోని కోట్ లఖ్పత్ జైల్లో వెంటిలేటర్ మీద ఒకరు, అమెరికా జైల్లో ఒకరు, ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో ఒకరు ఉన్నారు. కాబట్టి వారందరితో ఫోన్‌లో మాట్లాడించటం కష్టం" అన్నాడు నా లాయర్!

నా చేతిలో కనుక ఒక గన్ ఉండి ఉంటే అక్కడికక్కడ... అది ఎన్.ఐ.ఎ జైలు అని, నేను పోలీస్ రిమాండ్‌లో ఉన్నానని కూడా చూడకుండా రూఫ్ టాప్ మీదకు బులెటిన్ పేల్చి అతడి భయాన్ని కళ్లజూసేవాడిని!

"నేను మాట్లాడతానంటున్నది నా కుటుంబ సభ్యులతో మిలార్డ్..." అన్నాను నా లాయర్‌తో, కోపంగా.

"కానీ అవతలి వైపు వాళ్లు ఇలాగే వాదిస్తారు మిస్టర్ తహవ్వుర్. అయినా మన ప్రయత్నం మనం చేద్దాం..." అన్నాడు.

రెండు రోజుల తర్వాత వచ్చి – "మీరు మీ కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి జడ్జి గారు 'నాట్ అలౌడ్' అనేశారు..." అని చెప్పాడు.

అతడు అటు వెళ్లగానే, ఎన్.ఐ.ఎ. ఆఫీసర్ వచ్చి కూర్చున్నాడు. "నువ్వు 26ని వదిలిపెట్టటం లేదా? లేక 26 నిన్ను వదిలిపెట్టటం లేదా?" లేక... నువ్వూ, 26 కలిపి ఈ దేశాన్ని వదిలిపెట్టటం లేదా?" అన్నాడు!

నాకర్థమైంది! నా రిమాండ్ రేపే ముగిసి, మళ్లీ రేపే మొదలు కాబోతోంది.

"చెప్పు... మొన్న పహల్గామ్‌లో 26 మందిని చంపిన టెర్రర్ ఎటాక్ వెనుక నీతో పాటు ఎవరెవరు ఉన్నారు?" అని ఫ్రెష్‌గా ఇంటరాగేషన్ మొదలుపెట్టాడు ఎన్.ఐ.ఎ. ఆఫీసర్!!

ఇండియా, దట్ ఈజ్ భారత్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



ఎట్టకేలకు పాకిస్తాన్ తన ముసుగును తొలగించింది. ఉగ్రవాద ముఠాలను పాలుపోసి పెంచి పెద్దచేసింది తామేనని అధికారికంగా అంగీకరించినట్లయింది. పాకిస్తాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ రెండు రోజుల క్రితం 'స్కైన్యూస్' ప్రతినిధితో మాట్లాడుతూ అమెరికా కోసం, పశ్చిమ రాజ్యాల కోసం తామీ 'చెత్తపని'ని చేయవలసి వచ్చిందని అంగీకరించారు. అయితే పహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక తమ హస్తం లేదని పాత పద్ధతిలోనే బుకాయించే ప్రయత్నం చేశారు. ఈ బుకాయింపునకు పెద్దగా విలువుండదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించింది తామేనని అంగీకరించిన తర్వాత వారి కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని వాదిస్తే అంగీకరించడానికి ఎవరూ సిద్ధంగా ఉండరు.

భారత్‌పైకి ఉగ్ర ముఠాలను ఉసిగొలిపే అవసరం కూడా పాకిస్తాన్‌కే ఉన్నది. ఇప్పుడదొక విఫల రాజ్యంగా ప్రపంచం ముందు నిలబడి ఉన్నది. ఎన్నడూ రాజకీయ సుస్థిరత లేదు. చెప్పుకోదగిన ఆర్థికాభివృద్ధీ లేదు. తరచుగా మిలిటరీ పాలకుల పెత్తనానికి తలొగ్గే దుఃస్థితి. ప్రజాస్వామ్యం ఒక మేడిపండు చందం. 'ద్విజాతి' సిద్ధాంతం అనే విద్వేషపు విత్తనంతో మొలకెత్తిన పాకిస్తాన్ వటవృక్షంగా మారి పిశాచ గణాలకు ఆశ్రయమిస్తున్నది. ముస్లిములు ఒక జాతి, హిందువులు మరొక జాతి అన్నదే ఈ ద్విజాతి సిద్ధాంతం.

ఇదొక అసహజమైన భావన. ఒకే ప్రాంతం, ఒకే చరిత్ర, ఉమ్మడి అనుభవాలు, ఆచార వ్యవహారాలు మొదలైన వాటి ప్రాతిపదికపై ఒక జాతిని గుర్తిస్తారు. వీటికి పాలనాపరమైన, చట్టపరమైన అంశాలు కూడా తోడు కావచ్చు. కానీ మతాన్నే జాతిగా భావించే ఆలోచనాధోరణి నుంచి ఇంకా పాకిస్తాన్ బయటపడలేదు. పది రోజుల కిందటి పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, డిఫ్యాక్టో పాలకుడైన అసీమ్ మునీర్ ఉపన్యాసాన్ని గమనిస్తే సమీప భవిషత్తులో ఆ దేశం ఈ ఆలోచన నుంచి బయటపడే అవకాశం లేదని అర్థమవుతుంది. ప్రవాసీ పాక్ వ్యాపారవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పాకిస్తాన్ పుట్టుక గురించి మీ పిల్లలకు చెప్పండి, ఆ తర్వాతి తరాలకు కూడా చెప్పండి. ముస్లింలు వేరనీ, హిందువులు వేరనీ చెప్పండి. మన ద్విజాతి సిద్ధాంతం గురించి చెప్పండ'ని సభికులకు ఆయన నూరిపోశారు.

కశ్మీర్ సమస్యను ఎప్పటికీ విడిచిపెట్టబోమనీ, అది తమ జీవనాడని కూడా ఆయన రెచ్చగొట్టారు. ఇది జరిగిన వారం రోజులకే పహల్‌గామ్ దాడి జరగడం గమనార్హం. రెండు ప్రయోజనాల్ని ఆశించి పాకిస్తాన్ పాలకులు ఈ ద్విజాతి విద్వేష భావజాలాన్నీ, కశ్మీర్ అంశాన్నీ జ్వలింపజేస్తున్నారనుకోవాలి. స్వదేశీ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి వారి భావోద్వేగాలను భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టడం మొదటిది. ఇక రెండవది – భారతదేశ ప్రజలను కూడా మత ప్రాతిపదికన విడదీసి, ఈ దేశాన్ని అస్థిరత పాలు చేయాలని భావించడం. భారత ప్రజలు కూడా మత ప్రాతిపదికపై విడిపోయి విద్వేషాలు వెదజల్లుకుంటే పాకిస్తాన్ పన్నిన ఉచ్చులో చిక్కుకున్నట్టే!

పాకిస్తాన్ ప్రస్థానానికి భిన్నంగా భారత్ తన ప్రయాణాన్ని ప్రారంభించింది. లౌకిక, ప్రజాస్వామిక రాజ్యంగా అది తనను తాను ఆవిష్కరించుకున్నది. 'భారతీయులమైన మేము' అంటూ తన రాజ్యాంగ రచనను ప్రారంభించిందే తప్ప విభజన నామవాచకాలను వాడలేదు. దేశం పేరును 'హిందూస్థాన్' అని ప్రకటించాలని కొన్ని వర్గాలు డిమాండ్ చేసినప్పటికీ రాజ్యాంగ సభలోని సభ్యులెవరూ దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఇండియా లేదా భారత్ అనే పేర్లపైనే సభ్యులు రెండుగా విడిపోయారు. చివరకు 'ఇండియా, దటీజ్ భారత్' అనే అంబేడ్కర్ సూచించిన పదబంధాన్ని అందరూ ఆమోదించారు. హెచ్.వి. కామత్ ఒక్కరే తొలుత 'హింద్' అనే పేరును ప్రతిపాదించి, ఆయనే ఉపసంహరించుకున్నారు. ఆ రకంగా భారత రాజ్యాంగంలో 'ఇండియా, దటీజ్ భారత్ షల్ బీ ఏ యూనియన్ ఆఫ్ స్టేట్స్' అనే వాక్యం ఒకటవ అధికరణంగా చేరింది.

బహువిధమైన సువిశాల భారతదేశ భిన్నత్వంలో ఏకత్వానికి ఈ మొదటి అధికరణం అద్దంపట్టింది. హిందూయిజం కూడా దాని అంతస్సారంలో భిన్నత్వంలో ఏకత్వమేనని ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. దాన్నాయన ఒక మతంగా కాకుండా హిందూ జీవన విధానంగా పరిగణించిన విషయం తెలిసిందే. ఈ జీవన విధానంలో భిన్న ఆచార వ్యవహారాలు కలిగిన ప్రవంతులు కలిసి ప్రయాణిస్తాయి. సహజీవనం చేస్తాయి. భారతీయత కూడా అంతే! కశ్మీరియత్ కూడా అంతే! కశ్మీరీ హిందూ, ముస్లింల మధ్య ఒకప్పటి మత సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, ఉమ్మడి పండుగలు, ఉత్సవాలు, సూఫీ – భక్తి ఉద్యమాల ప్రభావం, లౌకిక భావాలు కలగలిసిన జీవన విధానమే 'కశ్మీరియత్'గా భావిస్తారు.

కశ్మీరీ యువత స్వతంత్ర భావాలను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం హైజాక్ చేసిన తర్వాత కూడా, కశ్మీరీ పండితులను ఈ ఉగ్రవాదం లోయ నుంచి తరిమేసిన తర్వాత కూడా, భారత్ సైన్యాలు కశ్మీర్ లోయను ఒక బందీఖానాగా మార్చి పౌరహక్కుల్ని ఉక్కు పాదాలతో తొక్కేసిన తర్వాత కూడా, ఆర్టికల్ 370 రద్దు ద్వారా ఆ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని ఊడబెరికిన తర్వాత కూడా, ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, కనీస రాష్ట్ర హోదాను లాగేసుకున్న తర్వాత కూడా 'కశ్మీరియత్' సజీవంగా నిలిచే ఉందని మొన్నటి దాడి సందర్భంగా జరిగిన పరిణామాలు నిరూపించాయి.

ఉగ్రవాద మూకలు అమాయక పర్యాటకుల మీద తుపాకులతో తూటాలు కురిపిస్తుంటే వాళ్లను కాపాడేందుకు చావుకు తెగించి ముష్కర మూకను ప్రతిఘటించి ప్రాణాలు బలిపెట్టిన సయ్యద్ హుస్సేన్ సజీవ కశ్మీరియత్‌కు ప్రతీక. ఆ దాడి నుంచి తప్పించుకున్నవారు తమకు అండగా నిలబడి కాపాడిన కశ్మీరీ ముస్లిం యువత మానవత గురించి కథలు కథలుగా చెబుతున్నారు. ఆ రాష్ట్రానికి పర్యాటకులుగా వెళ్లినవారు ఘటన తర్వాత బిక్కుబిక్కుమంటున్న వేళ వందలాది ముస్లిం గృహస్థులు వారికి తోడుగా నిలబడి ఆశ్రయం కల్పించారనీ, సాదరంగా సాగనంపారనీ కూడా వార్తలొస్తున్నాయి. అయితే, ఆ వార్తలకు ప్రధాన స్రవంతి మీడియాలో రావాల్సిన ప్రాధాన్యం రావడం లేదు. సౌభ్రాతృత్వంతో కూడిన 'కశ్మీరియత్'కూ, 'ద్విజాతి' సిద్ధాంతపు విద్వేషానికీ ఎప్పటికీ సాపత్యం కుదరదు. కాకపోతే భారతీయత ఆ సౌభ్రాతృత్వాన్ని సమాదరించి గౌరవించాలి. భారత ప్రభుత్వం కశ్మీరీల కిచ్చిన హామీలను అమలు చేయాలి. వారి విశ్వాసాన్ని చూరగొనాలి. ఇది జరిగిన నాడు కశ్మీర్ కోసం వెయ్యేళ్ల యుద్ధానికైనా సిద్ధపడతామన్న నాటి పాక్ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో మాటలకు ఇంకో వెయ్యేళ్లు జోడించినా ఫలితముండదు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ గళం విప్పుతున్నాయి. భారత్‌కు బాసటగా ఉంటామని ప్రకటిస్తున్నాయి. తాము ఒంటరవుతున్నామని గమనించిన పాకిస్తాన్ ప్రధాని దాడి ఘటనపై విచారణకు సిద్ధమని ప్రకటించారు. ముష్కర మూకను రెచ్చగొట్టింది పాక్ ఆర్మీ చీఫ్. సిసలైన పాక్ పాలకుడు ఆయనే! ఉగ్రవాదులకు మూడు దశాబ్దాలుగా ఆశ్రయమిస్తున్నామని పాక్ రక్షణమంత్రి స్వయంగా ప్రకటించిన తర్వాత పాక్ ప్రధాని అమాయకత్వం నటిస్తే ఎవరు నమ్ముతారు? ఈ అనుకూల వాతావరణంలోనే ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాక్‌పై కఠిన చర్యలను తీసుకోవడానికి కేంద్రం ఉపక్రమించాలి. అయితే ముందుగా దాడికి దిగిన ముష్కరులకు పాక్‌తో ఉన్న సంబంధాలను ధ్రువీకరించవలసిన అవసరం ఉన్నది.

దాడి ఘటనలో ప్రభుత్వపరంగా భద్రతా ఏర్పాట్లలో లోపాలు, నిఘా వైఫల్యాలు స్పష్టంగా వెల్లడయ్యాయి. అవి దాచేస్తే దాగని నిజాలు. కనీసం ఇప్పుడా హంతకులను పట్టుకొని వారితో పాక్ సంబంధాలను రుజువు చేసైనా చేసిన తప్పును దిద్దుకోవలసిన అవసరమున్నది. ఘటన తర్వాత ప్రధాని మోదీ తీవ్రంగానే స్పందించారు. ఇది దేశంపై జరిగిన దాడిగా ప్రకటించారు. వెంటనే కొన్ని చర్యలను ప్రకటించారు. అందులో ముఖ్యమైనది సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడం. నిజానికి ఈ పని ఎప్పుడో చేయాల్సింది. బహుశా అంతర్జాతీయ ఒత్తిడి పర్యవసానంగా నెహ్రూ ఈ ఒప్పందానికి తలూపి ఉంటారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ఇప్పుడున్నంత పలుకుబడి అప్పుడు లేదు. నెహ్రూకు వ్యక్తిగత పలుకుబడి మాత్రం ఉండేది. ఉగ్రవాదాన్ని అప్పుడింకా ఈ స్థాయిలో ఊహించలేదు. కనుక పాకిస్తాన్‌కూ పశ్చిమ రాజ్యాల మద్దతు ఉండేది.

సింధు నదీ జలాల ప్రవాహంలో సగానికి పైగా భారత్‌లో ఉన్న పరివాహక ప్రాంతమే మోసుకెళ్తున్నది. సింధు నది టిబెట్‌లోని కైలాస పర్వతం పాదాల దగ్గర పుట్టి, భారత్‌లోని లద్దాఖ్, పాక్ ఆక్రమిత గిల్గిట్‌లలో 1100 కిలోమీటర్లు ప్రవహించి పాకిస్తాన్‌లో ప్రవేశిస్తుంది. నదికి కుడివైపు నుంచి పాక్ భూభాగం, పాక్ ఆక్రమిత భూభాగాల ద్వారా అరడజనుకు పైగా ఉపనదులు కలుస్తాయి. అందులో కాబూల్ నది, గిల్గిట్ నది, హూంజా నది, స్వాట్ నది ముఖ్యమైనవి. కానీ భారత్ నుంచి సింధులో ఎడమ వైపుగా కలిసే పంచ నదులే ఆ నదికి ప్రాణం. ఈ ఐదు నదుల్లో జీలం, చీనాబ్ నదులతోపాటు సింధు నది జలాలపై పూర్తి హక్కుల్ని ఈ ఒప్పందం పాక్‌కు కట్టబెట్టింది. సట్లెజ్, రావి, బియాస్ నదీ జలాలపై మాత్రమే భారత్‌కు వినియోగించుకునే హక్కులు దక్కాయి.

> ఉగ్రవాద మూకలు అమాయక పర్యాటకుల మీద తుపాకులతో తూటాలు కురిపిస్తుంటే వాళ్లను కాపాడేందుకు చావుకు తెగించి ముష్కర మూకను ప్రతిఘటించి ప్రాణాలు బలిపెట్టిన సయ్యద్ హుస్సేన్ సజీవ కశ్మీరియత్‌కు ప్రతీక. ఆ దాడి నుంచి తప్పించుకున్నవారు తమకు అండగా నిలబడి కాపాడిన కశ్మీరీ ముస్లిం యువత మానవత గురించి కథలు కథలుగా చెబుతున్నారు. ఆ రాష్ట్రానికి పర్యాటకులుగా వెళ్లినవారు ఘటన తర్వాత బిక్కుబిక్కుమంటున్న వేళ వందలాది ముస్లిం గృహస్థులు వారికి తోడుగా నిలబడి ఆశ్రయం కల్పించారనీ, సాదరంగా సాగనంపారని కూడా వార్తలొస్తున్నాయి. అయితే, ఆ వార్తలకు ప్రధాన స్రవంతి మీడియాలో రావాల్సిన ప్రాధాన్యం రావడం లేదు. సౌభ్రాతృత్వంతో కూడిన 'కశ్మీరియత్'కూ, 'ద్విజాతి' సిద్ధాంతపు విద్వేషానికీ ఎప్పటికీ సాపత్యం కుదరదు. కాకపోతే భారతీయత ఆ సౌభ్రాతృత్వాన్ని సమాదరించి గౌరవించాలి. భారత ప్రభుత్వం కశ్మీరీల కిచ్చిన హామీలను అమలు చేయాలి. వారి విశ్వాసాన్ని చూరగొనాలి. ఇది జరిగిన నాడు కశ్మీర్ కోసం వెయ్యేళ్ల యుద్ధానికైనా సిద్ధపడతామన్న నాటి పాక్ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో మాటలకు ఇంకో వెయ్యేళ్లు జోడించినా ఫలితముండదు.

సింధు నది బేసిన్‌లో ఈ పంచ నదులకున్న కీలక పాత్రకు రుగ్వేదకాలం నుంచే అంటే మూడున్నర వేల యేళ్ల క్రితం నుంచే గుర్తింపు ఉన్నది. రుగ్వేద ఆర్యులు ఈ బేసిన్‌ను 'సప్తసింధు'గా పిలిచారు. రుగ్వేద కాలానికి ఇంచుమించు సమాన కాలంలో పర్షియన్ నాగరికతలో ప్రభవించిన 'అవెస్తా' గ్రంథం కూడా ఈ లోయను 'హప్తహెందూ'గా ప్రస్తావించింది. అంటే ఆ ఏడు నదులకు సింధుతో సమాన ప్రాధాన్యతనిచ్చారు. వాటిని 1. సింధు నది, 2. వితస్తా (జీలం), 3. అసిక్ని లేదా చంద్రభాగా (చీనాబ్), 4. పురుష్ణి (రావి), 5. విపాస (బియాస్), 6 శతుద్రి (సట్లెజ్), 7. సరస్వతీ నదులుగా రుగ్వేదం ప్రస్తావించిందని చెబుతారు. ఈ ఏడో నది వేలయేళ్ల క్రితమే ప్రస్తుత రాజస్థాన్ ప్రాంతంలో అంతరించి ఉంటుందని భావిస్తున్నారు.

ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే సింధు బేసిన్‌లో భారత భూభాగానికి ఉన్న ప్రాధాన్యత అర్థమవుతుంది. న్యాయబద్ధంగా ఈ బేసిన్‌లో సగటున లభ్యమయ్యే ఎనిమిది వేల టీఎమ్‌సీల్లో (బ్రిటానికా లెక్క) సగం మనకు దక్కాలి. కానీ ఒప్పందం కారణంగా ఇరవై శాతం జలాలపైనే హక్కులున్నాయి. ఆ యా ప్రాంతాల నైసర్గిక స్వరూపాలు, అవసరాలను దృష్టిలో పెట్టుకొని 'బేసిన్లూ లేవు, భేషజాలూ లేవు' అని గతంలో కేసీఆర్ వ్యాఖ్యానించడం నిజమే. కానీ అది ఒకే దేశంగా ఉన్నప్పటి మాట. రెండు దేశాలుగా విడిపోయిన తర్వాత, ఒక దేశం మీద మరొక దేశం ఉగ్రదాడులు చేస్తున్న నేపథ్యంలో బేసిన్లూ ఉంటాయి. భేషజాలూ ఉంటాయి.

కీలకమైన పంచ నదుల ప్రవాహాన్ని భారత్ అడ్డుకుంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ శక్తీ అడ్డుకోకపోవచ్చు. కానీ ఈ చర్య వలన పాక్ పౌరుల ఆహార భద్రతకు కలిగే ముప్పును, పర్యావరణ మార్పుల సంభావ్యతను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. పాక్ పాలకుల స్పందనను బట్టి ఈ జలాయుధ ప్రయోగ తీవ్రత ఉండవచ్చు. భారతీయులుగా ఈ దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం, దేశ భద్రత కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలకు మద్దతునీయడం ప్రజల బాధ్యత. అదే సందర్భంలో ప్రజలను విడగొట్టకుండా భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలబెట్టుకోవడం ద్వారా మాత్రమే భారతీయత నిలబడుతుంది. ద్విజాతి సిద్ధాంతం ప్రభావం మన దేశంలో కూడా కొంతమందిపై ఇప్పుడు కనిపిస్తున్నది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే పాకిస్తాన్ బాటలోనే భారత భవిష్యత్తును దర్శించవలసి వస్తుంది. భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ జీవన విధానమే కాలపరీక్షకు తట్టుకొని అభివృద్ధికి ఆలంబనగా నిలిచింది. ఇకముందు కూడా అదే మనకు శ్రీరామరక్ష.

vardhelli1959@gmail.com

పార్టీ స్థాపనకు ఏడాది ముందు...

సందర్భం



సిరికొండ మధుసూదనాచారి

టీఆర్‌ఎస్ ఆవిర్భవించే సమయంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ లక్ష్య శుద్ధితో విజయం సాధించాలని కేసీఆర్ పార్టీని స్థాపించారు. ఆనాడు తెలుగుదేశం, కాంగ్రెస్ రెండు బలమైన పార్టీలు, రెండు బలమైన సామాజిక వర్గాలు. వీరికి ధన బలంతో పాటు ప్రసార మాధ్యమాల తోడు ఉంది. ఒక్క అంశం అనుకూలంగా లేని, చుట్టూ గాఢాంధకారం అలుముకున్న ప్రతికూల పరిస్థితులలో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు సాహసోపేతం. ఈ సాహసం ఒక్క కేసీఆర్‌కే చెల్లు.

విస్తృత చర్చలు– సంతృప్తికర వివరణలు

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ స్థాపనకు ఒక సంవత్సరం ముందు నుండే సన్నాహాలు, చర్చలు ప్రారంభమయ్యాయి. పార్టీ పేరు, జెండా, కండువా 2000 లోనే నిర్ణయమైనాయి. తెలుగుదేశం పార్టీ స్థాపించబడిన నాటి పరిస్థితుల సమీక్ష జరిగింది. కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను, తనపై ఉన్న అభిమానాన్ని ఓట్లుగా మల్చుకొని కేవలం 9 మాసాల కాలంలోనే ఎన్టీయార్ అధికారం చేపట్టిన విషయం ప్రస్తావనకొచ్చింది.

పార్టీ పెట్టాలనుకునే విషయం తెలిసి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష దీపాన్ని ఆరిపోకుండా అప్పటివరకు కాపాడుతున్న సంఘాలు... తెలంగాణ జన సభ, తెలంగాణ మహా సభ, తెలంగాణ ఐక్య వేదిక, తెలంగాణ ప్రజా సమితి, తెలంగాణ ప్రజా పార్టీ, తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్, తెలంగాణ లాయర్స్ అసోసియేషన్, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్, తెలంగాణ స్టడీ ఫోరం, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్, తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం, తెలంగాణ జన పరిషత్, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్, తెలంగాణ సాంస్కృతిక వేదిక, తెలంగాణ జన సంఘటనలకు చెందిన కొందరు వచ్చి చర్చించడం, తమ అభిప్రాయాలను వెలిబుచ్చడం జరిగింది. మరికొందరిని కేసీఆరే స్వయంగా ఆహ్వానించి చర్చించారు.

తెలంగాణలోని ప్రముఖుల వివరాలను సేకరించి, సందర్భానుసారంగా వారితోనూ కేసీఆర్ చర్చలు జరిపారు. వారిలో దాశరథి రంగాచార్య, కాళోజీ నారాయణరావు, వైస్ ఛాన్సలర్లు నవనీత రావు, ఆర్వీయార్ చంద్రశేఖర్ రావు, జయశంకర్, జస్టిస్ సీతారాం రెడ్డి, గౌరవ నిఖిలేశ్వర్, 'ప్రెస్ అకాడమీ' పొత్తూరి వెంకటేశ్వర రావు, జస్టిస్ భాస్కర్ రావు, ప్రొఫెసర్లు మధుసూదన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కోదండరాం రెడ్డి, సింహాద్రి, బియ్యాల జనార్ధన రావు, కంచె ఐలయ్య, కేశవరావు జాదవ్, జల సాధన సమితి దుశర్ల సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలంగాణ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రభాకర్, ప్రజ్ఞా మ్యాగజైన్ కెప్టెన్ పాండురంగ రెడ్డి తదితరులున్నారు. వీరిలో చాలామందితో సంప్రదింపులు జరిపి, వారి సూచనలు స్వీకరించారు.



2001 ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటిస్తున్న కేసీఆర్

తెలంగాణ మేధావులు, విద్యావంతులు, యువకులు, కవులు, కళాకారులతో చర్చలు సాగిస్తూనే, మరోవైపు తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో తన వద్దకు వచ్చేవారి సందేహాలన్నిటికీ సవివరమైన, సంతృప్తికరమైన వివరణ ఇచ్చి, అప్పటివరకు అపనమ్మకం ఉన్నవారిలో సంపూర్ణ విశ్వాసం పెంచేవారు. వివిధ పార్టీలలో పనిచేసే నాయకులు ఎవరికి వారుగా కేసీఆర్‌ను కలిసి, చర్చించి, అనుమానాలు నివృత్తి చేసుకున్న తర్వాత కలిసి పనిచేయడానికి సంసిద్ధత చెప్పేవారు. ఇటువంటి వారిలో కెప్టెన్ లక్ష్మీకాంతరావు, దేశిని చిన్న మల్లయ్య, నాయిని నర్సింహారెడ్డి లాంటి పెద్దలు ఉన్నారు. ఒకానొక సందర్భంలో లక్ష్మీకాంతరావు 'తెలంగాణ రాష్ట్రం సాధ్యమేనా? ఎలా సాధ్యమవుతుంది?' అని సంశయం వ్యక్తం చేయగా, కేసీఆర్ ఇచ్చిన సుదీర్ఘ వివరణ అనంతరం, 'తెలంగాణ సిద్ధించిందనే భావన మీ జవాబుతో నాకు కలిగింది. ఇక నుండి ఎప్పుడు ఈ విషయంలో అనుమానం వ్యక్తం చేయను, వివరణ కోరను. తెలంగాణ సాకారం అయ్యేంత వరకు మీతోనే నా పయనం' అని ఉద్విగ్నుడయ్యారు.

స్టేట్ ఫైట్– స్ట్రీట్ ఫైట్ కాదు!

వివిధ రాజకీయ పార్టీల నాయకుల, కార్యకర్తల తాకిడి రోజురోజుకు పెరుగుతూ రేయింబవళ్ళు చర్చోపచర్చలు సాగేవి. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే చర్చలు మధ్యరాత్రి వరకు జరిగేవి. కొన్ని సందర్భాల్లో తెల్లవారు వరకు ఈ చర్చలు జరిగేవి. ఒకరిద్దరు ఉన్నా, పది మంది ఉన్నా, వందలాది మందిలో ఉన్నా కేసీఆర్ నాలుగైదు గంటలు నిరాఘాటంగా తెలంగాణ ఉద్యమం సాగించే క్రమాన్ని సోదాహరణలతో సహా వివరించేవారు. వారు లేవనెత్తిన సంశయాలకు సంతృప్తికర సమాధానం ఇచ్చి, వచ్చిన వారిలో అత్యధికులను ఉద్యమ కార్యోన్ముఖులను చేసేవారు. ఒకట్రెండు సందర్భాల్లో ఉద్యమం ఆవేశభరితంగా, ఆందోళన పథంలో సాగాలని అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేయగా... ఇది స్టేట్ ఫైట్, స్ట్రీట్ ఫైట్ కాదనీ; లక్ష్యం సాధించే వరకు సుదీర్ఘ పోరాటానికి సమాయత్తం కావాలనీ; పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలు కాబట్టి భావ వ్యాప్తిని సాగించి, ప్రజలను సమీకరించి, శక్తిగా మలిచి, ఎన్నికల్లో గెలిచి, గాంధీజీ ప్రబోధించిన అహింసా మార్గంలోనే రాష్ట్రం సాధించాలనీ; ఒక ప్రాంతానికి న్యాయం జరగాలని చేసే ఈ ప్రయత్నంలో ఇంకొక ప్రాంతం వారికి ఇబ్బందులు కలిగించడం వాంఛనీయం కాదనీ; తాను శాంతియుత పంథాలో మాత్రమే పయనిస్తాననీ కరాఖండిగా చెప్పేవారు. ఈ విధానం నచ్చని కొందరు మళ్ళీ వచ్చేవారు కాదు.

సంకీర్ణాల్లో ఒక్క ఓటైనా విలువే!

2000వ సంవత్సరంలో తెరాస పార్టీని స్థాపించవలెననే చర్చలు సాగుతున్న తరుణంలో దేశ రాజకీయ చిత్రపటం అనుకూలంగా ఉందా లేదా అనే సమీక్ష కూడా జరిగింది. కారణం గతంలోని చేదు అనుభవం. అయితే 1969 – 71 నాటి రాజకీయ పరిస్థితులకు పూర్తి భిన్నమైన పరిస్థితులు అప్పుడు నెలకొన్నాయి. ఒకప్పుడు ఇందిరా గాంధీ భారీ మెజారిటీతో ఏక పార్టీ పాలన సాగింది. తదనంతరం కొన్ని దశాబ్దాలు తక్కువ మెజారిటీతో ఏక పార్టీ పాలన, అటుపిమ్మట సంకీర్ణ ప్రభుత్వాల కాలం సాగుతోంది. సంకీర్ణ యుగం రాష్ట్రం సాధించుకోవడానికి అనువైనదిగా తేలింది. 1999వ సంవత్సరంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఒక్క ఓటు తేడాతో విశ్వాస పరీక్షను కోల్పోయి ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. లోక్‌సభలో ఒక సభ్యుడి ఓటు కూడా అత్యంత కీలకంగా మారిన ఈ పరిణామం ప్రస్తావనకు వచ్చింది. అంటే సంకీర్ణాల యుగంలో మూడు, నాలుగు లోక్‌సభ స్థానాలతో కూడా జాతీయ రాజకీయాల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించవచ్చని తేలింది. 1971 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తెలంగాణ ప్రజా సమితిని 14 స్థానాల్లో పదింట గెలిపించారు. టీఆర్‌ఎస్ చిత్తశుద్ధి, నిబద్ధతతో ఉద్యమాన్ని నడిపి ప్రజా విశ్వాసాన్ని పొందగలిగితే, కచ్చితంగా లోక్‌సభకు చెప్పుకోదగిన సంఖ్యకు ప్రతినిధులను తెలంగాణ ప్రజలు తప్పక గెలిపిస్తారనే నమ్మకం కలిగింది. 10 మంది లోక్‌సభ సభ్యులున్నప్పటికీ 1971లో తెలంగాణ రాష్ట్రం సాధించబడక పోవడానికి బలమైన కారణం లోక్‌సభలో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని సంఖ్యా బలం ఉండటమే. నాడు అధికార బలంతో కాంగ్రెస్ తెలంగాణ ప్రజా సమితి సభ్యులను విలీనపర్చుకుంది. కానీ దానికి భిన్నంగా నేడు సంకీర్ణాలే శరణ్యం కాబట్టి పార్లమెంట్‌లో కనీస ప్రాతినిధ్యంతో ఒత్తిడి ద్వారా రాష్ట్రాన్ని సాధించవచ్చని నమ్మకం కుదిరింది.

తెలంగాణ రాష్ట్రం సాధ్యమేనని సంపూర్ణ విశ్వాసం కలిగిన కేసీఆర్... శాసన సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. ప్రజలను ఆలోచింపజేసి, ఆశలు రేకెత్తించి విశ్వాస బీజాలు నాటారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో జలదృశ్యం కేంద్రంగా 2001 ఏప్రిల్ 27న పార్టీ జెండా ఎగురవేయబడింది. పదవీ త్యాగంతో పార్టీ స్థాపించారు, ప్రాణ త్యాగానికి సిద్ధమై తెలంగాణ రాష్ట్రం సాధించారు.

వ్యాసకర్త బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు, తెలంగాణ శాసన మండలిలో ప్రతిపక్ష నేత
(బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా)

సస్పెన్షన్ సాధ్యమే

సింధూ ఒప్పందంపై నిపుణుల స్పష్టీకరణ

పూర్తిగా తిరస్కరించవచ్చు కూడా

అంతర్జాతీయ చట్టాల్లో వీలుంది

పూర్తిస్థాయి యుద్ధాలు. కార్గిల్ వంటి దురాక్రమణలు. మరెన్నో లెక్కలేనన్ని దుశ్చర్యలు. గత 75 ఏళ్లలో భారత్‌పై పాకిస్తాన్ మతిలేని ఉన్మాద చర్యలు అన్నీ ఇన్నీ కావు. అయినా సామాన్య పాకిస్తానీలను దృష్టిలో పెట్టుకుని సింధూ జల ఒప్పందాన్ని భారత్ ఎప్పుడూ గౌరవిస్తూనే వచ్చింది. ఆర్థికంగానే గాక అన్నివిధాలా పతనావస్థకు చేరినా దాయాదికి ఇక బుద్ధి రాబోదని పహల్గాం దాడితో తేలిపోయింది. దాంతో ఓపిక నశించి పాక్‌కు శాశ్వతంగా బుద్ధి చెప్పే చర్యల్లో భాగంగా సింధూ ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసింది. ఏకపక్షంగా అలా చేసే అధికారం భారత్‌కు లేదంటూ పాక్ గగ్గోలు పెడుతోంది. ఇది తమపై యుద్ధ ప్రకటనేనంటూ ఆక్రోశిస్తోంది. అయితే అంతర్జాతీయ చట్టాల మేరకు భారత్ చర్య సబబేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం మానుకోని పక్షంలో సింధూ ఒప్పందానికి నూకలు చెల్లుతాయంటూ పాక్‌ను భారత్ ఎన్నో సార్లు హెచ్చరించింది. సస్పెన్షన్‌కు సంబంధించి ఒప్పందంలో స్పష్టమైన నిబంధనలేవీ లేవు. పైగా అందులోని ఆర్టికల్ 12 ప్రకారం ఒప్పందానికి సవరణలు, ఇరుదేశాల ఆమోదంతో పూర్తిగా రద్దు మాత్రమే సాధ్యం. అలాంటప్పుడు సస్పెన్షన్ నిర్ణయాన్ని ఏ ప్రాతిపదికన తీసుకున్నారన్నది ప్రాధాన్యం సంతరించుకుంది. 1969 వియన్నా కన్వెన్షన్, ఇతర అంతర్జాతీయ న్యాయ ఒప్పందాల ప్రకారం అలా చేసేందుకు వీలుందని సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ స్పష్టం చేశారు. 'పరిస్థితుల్లో మౌలిక మార్పులు'చోటుచేసుకున్న సందర్భాల్లో వియన్నా కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 62 ప్రకారం ఒప్పందాన్ని పూర్తిగా తిరస్కరించడం కూడా సాధ్యమేనని మాజీ సింధూ జల కమిషనర్ పి.కె.సక్సేనా వివరించారు. ఈ విషయంలో ఇంకా మరెన్నో చర్యలు తీసుకునే అవకాశం కూడా భారత్‌కు ఉందని కూడా ఆయన స్పష్టం చేశారు.

ఆర్టికల్ 62 ఏమంటోంది...?

ఒప్పందం కుదుర్చుకున్న నాటితో పోలిస్తే అనంతర కాలంలో పరిస్థితుల్లో తలెత్తే మౌలిక మార్పులకు సంబంధించిన నియమ నిబంధనలను వియన్నా కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 62లో పేర్కొంటుంది. అవి ఒప్పంద సమయంలో ఊహించనివై, ఆ మార్పుల ప్రభావం వల్ల ఒప్పంద బాధ్యతలను నెరవేర్చలేని పరిస్థితులు తలెత్తితే ఒప్పందాన్ని సస్పెండ్ చేయవచ్చని అది చెబుతోంది. కనుక ఈ విషయంలో పాక్ చేసేదేమీ ఉండబోదని కౌల్ అన్నారు. ''చివరికి అంతర్జాతీయ న్యాయస్థానం తలుపు తట్టినా లాభముండదు. నిరంతర ఉగ్ర దాడులు, ఫలితంగా భౌతిక, ఆర్థిక భద్రతకు, దేశ సార్వభౌమత్వానికి తలెత్తుతున్న ముప్పు ఒప్పంద పరిస్థితుల్లో మౌలిక మార్పులకు దారి తీసిందని భారత్ వాదించవచ్చు. సింధూ ఒప్పందం కుదిరిందే ఇరు దేశాల నడుమ స్నేహం, సద్భావనల స్ఫూర్తికి కార్యరూపమిచ్చేందుకు! పాక్ చర్యల నేపథ్యంలో ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి''అని వివరించారు. పర్యావరణ సవాళ్లు, ఉగ్ర దాడుల నేపథ్యంలో ఒప్పందాన్ని సమీక్షించి మార్చుకోవాల్సిన అవసరముందని కొన్నేళ్లుగా భారత్ చెబుతోందని గుర్తు చేశారు.

ఇవన్నీ చేయొచ్చు...

- ఒప్పందం సస్పెన్షన్ వల్ల సింధూ బేసిన్ నదుల నీటి ప్రవాహ నెలవారీ డేటాను భారత్ ఇకపై పాక్‌తో పంచుకోవాల్సిన అవసరం లేదు.
- నీటి ప్రవాహాల ఉమ్మడి తనిఖీకి పాక్ అధికారులకు భారత్‌లోకి ప్రవేశం నిరాకరించవచ్చు.
- నీటి ప్రవాహాలను నియంత్రించడం వంటి కఠిన చర్యలకు కూడా తీసుకోవచ్చు.
- సింధూతో పాటు జీలం, చినాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదుల ప్రవాహాలను కాల్వల వంటివాటిలోకి మళ్లించవచ్చు. వాటిపై డ్యాముల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా మరింత నీటిని నిల్వ చేయవచ్చు. ఇలాంటి చర్యలతో పాక్‌లోకి వాటి ప్రవాహాన్ని నిరోధించవచ్చు.
- సింధూ బేసిన్‌కు సంబంధించి భారత్, పాక్ నడుమ పలు అంతర్జాతీయ వేదికలపై న్యాయపోరాటం సాగుతోంది. జీలం ఉపనది కిషన్‌గంగపై నిర్మిస్తున్న జల విద్యుత్కేంద్రం వంటివి వీటిలో ఉన్నాయి. ఆ వివాదాలన్నింటి నుంచీ ఇప్పుడు భారత్ ఏకపక్షంగా వైదొలగవచ్చు కూడా.
- వేసవి దృష్ట్యా సింధూ బేసిన్‌లోని నదీ ప్రవాహాలను భారత్ ఇప్పుడు ఏమాత్రం నియంత్రించినా తాగు, సాగునీరుతో పాటు జల విద్యుత్ తదితరాల కోసం పాక్ అల్లాడటం ఖాయమే.

– సాక్షి, నేషనల్ డెస్క్





పోప్ ఫ్రాన్సిస్ భౌతికకాయాన్ని ఉంచిన శవపేటికపై జింక్ కవర్‌తో తుది సీల్ వేస్తున్న కార్డినల్ కెవిన్



శనివారం వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద పోప్ అంత్యక్రియల కార్యక్రమం



జెలెన్‌స్కీ దంపతులు, ద్రౌపదీ ముర్ము



ట్రంప్, మాక్రాన్ తదితరులు

ప్రజా పోప్‌కు

అశ్రునయనాలతో తుది వీడ్కోలు

అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్న ప్రపంచ దేశాధినేతలు, రాజకుటుంబాలు

- లక్షల్లో హాజరైన పోప్ అభిమానులు, సాధారణ పౌరులు
- వాటికన్ స్క్వేర్‌లో మొదలై రోమ్‌లోని మేరీ మేజర్ బాసిలికాలో నిరాడంబరంగా ముగిసిన ఖనన కార్యక్రమం

వాటికన్ సిటీ: నిరుపేదలు, అణగారిన వర్గాలకు ఆపన్నహస్తం అందించిన మానవతామూర్తి, విశ్వవ్యాప్తంగా కోట్లాది మంది క్యాథలిక్‌ల అత్యున్నత మతాధికారి పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రపంచాధినేతలు, లక్షలాది మంది అభిమానులు నేరుగా వందల కోట్ల మంది క్రైస్తవులు టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాల్లో చూస్తూ తుది వీడ్కోలు పలికారు. అభిమానులు, ఆప్తులు శోకతప్త హృదయాలతో వీడ్కోలు పలికాక తాను సదా స్మరించే మేరీమాత చిత్రపటం ఉన్న సెయింట్ మేరీ మేజర్ బాసిలికా చర్చి భూగర్భంలో 88 ఏళ్ల పోప్ శాశ్వత విశ్రాంతి తీసుకున్నారు. శనివారం వాటికన్ సిటీలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ అంతిమయాత్ర కొనసాగింది. పోప్ కోరిక మేరకు వాటికన్ శివారులోని రోమ్ పరిధిలోని సెయింట్ మేరీ మేజర్ బాసిలికా చర్చిలో ఆయన పార్థివదేహాన్ని ఖననం చేశారు. అత్యంత నిరాడంబరంగా ఈ కడసారి క్రతువు కొనసాగింది. ఆయన కోరిక మేరకు పోప్ సమాధి మీద లాటిన్ పదమైన 'ఫ్రాన్సిస్‌క్యూస్'అనే పదాన్ని చెక్కారు. శ్వాససంబంధ వ్యాధి ముదిరి చివరకు బ్రెయిన్‌స్ట్రోక్, గుండె వైఫల్యంతో ఈ నెల 21వ తేదీన పోప్ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.

బరువైన హృదయాలతో బారులు తీరిన జనం

అంతకుముందు సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో పోప్ ముఖంపై వాటికన్ మాస్టర్ ఆఫ్ సెరిమనీస్ ఆర్చ్‌బిషప్ డియాగో గియోవన్నీ రవెల్లీ దవళవర్ణ పట్టు వస్త్రాన్ని కప్పారు. తర్వాత జింక్ పూత పూసిన శవపేటిక మూతను పెట్టి సీల్‌వేశారు. తర్వాత పోప్ పార్థివదేహాన్ని భద్రంగా ఉంచిన శవపేటికను చర్చి సహాయకులు సెయింట్ పీటర్స్ స్క్వేర్ భారీ బహిరంగ ప్రదేశానికి తీసుకొచ్చారు. అక్కడే ప్రపంచ దేశాల అధినేతలు, పలు రాజ్యాల రాజులు, పాలకులు, అంతర్జాతీయ సంస్థల అధినేతలు, ప్రతినిధులు దాదాపు 2,50,000 మంది పోప్ అభిమానులు ఆయనకు చివరిసారిగా ఘన నివాళులర్పించారు. అక్కడ ఉన్నవారిలో చాలా మంది కన్నీరుమున్నీరుగా విలపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు, భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్, బ్రిటన్ యువరాజు విలియం, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మేక్రాన్ దంపతులు, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్ దంపతులు, ఇరాన్ సాంస్కృతిక శాఖ మంత్రి సయ్యద్ అబ్బాస్ సలేహ్ షరియతా, ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలోనీ, స్లొవేకియా అధ్యక్షుడు పీటర్, ఐర్లాండ్ అధ్యక్షుడు హిగ్గిన్స్‌సహా 160 మంది వీవీఐపీలు ఈ కార్యక్రమంలో పాల్గొని పోప్‌కు అంజలి ఘటించారు. భారత్ తరఫున ముర్ముతోపాటు కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు, సహాయ మంత్రి జార్జ్ కురియన్, గోవా డెప్యూటీ స్పీకర్ జాషువా డిసౌజాలు హాజరయ్యారు. పోటెత్తిన లక్షలాది మంది పోప్ అభిమానులు, క్రైస్తవులతో సెయింట్ పీటర్స్ స్క్వేర్ కిక్కిరిసిపోయింది. తోపులాట ఘటనలు జరక్కుండా అధికారులు నగరవ్యాప్తంగా భారీ ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేసి మొత్తం అంత్యక్రియల కార్యక్రమాన్ని చివరిదాకా ప్రత్యక్ష ప్రసారాలుచేశారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద అధినేతలు నివాళులర్పించాక శవపేటికను ప్రత్యేకవాహనంలోకి ఎక్కించాక అంతిమయాత్ర మొదలైంది. నగరంలో దారి పొడవునా వీధుల్లో లక్షలాది మంది జనం బారులు తీరి ప్రియతమ పోప్‌కు ''పాపా ఫ్రాన్సిస్కో''అని నినాదాలు చేస్తూ తుది వీడ్కోలు పలికారు. పోప్‌గా బాధ్యతలు చేపట్టాక ఈ 12 ఏళ్ల కాలంలో పోప్‌చేసిన మంచి పనులను గుర్తుచేసుకున్నారు. అంత్యక్రియలు మొత్తం 91 ఏళ్ల కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే మార్గదర్శకత్వంలో నిర్వహించారు. వేలాది మంది ఇటలీ పోలీసుల పహారా మధ్య ఈ అంతిమయాత్ర ముందుకు సాగింది. గగనతల రక్షణ కోసం హెలికాప్టర్లను వినియోగించారు.



సెయింట్ మేరీ బాసిలికాలో పోప్ అంత్యక్రియల తుది ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కార్డినల్ కెవిన్ జోసెఫ్ ఫారెల్

స్వాగతం పలికిన ఖైదీలు, ట్రాన్స్‌జెండర్లు

ఈ అంతిమయాత్రలో స్థానికులతోపాటు ప్రపంచదేశాల నుంచి తరలివచ్చిన లక్షలాది మంది జనం రహదారికి ఇరువైపులా నిలబడి కడసారి తమ పోప్‌ను చూసుకోగా శవపేటికను తీసుకొచ్చిన వాహనశ్రేణి ఎట్టకేలకు సెయింట్ మేరీ మేజర్ బాసిలికా చర్చి ప్రాంగణానికి చేరుకుంది. అక్కడే వేచి ఉన్న ఖైదీలు, లింగమార్పిడి వ్యక్తులు, నిరాశ్రయులు, శరణార్థులు, వలసదారులు స్విస్ గార్డ్స్ బలగాల నుంచి పోప్ అంతిమయాత్ర బాధ్యతలను తీసుకున్నారు. పోప్ మొదట్నుంచీ అణగారిన వర్గాలతోపాటు సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్న ఖైదీలు, ట్రాన్స్‌జెండర్లు, నిరాశ్రయులు, శరణార్థుల అభ్యున్నతి కోసం పాటుపడటం తెల్సిందే. చర్చి అంతర్భాగంలోని భూగర్భంలో శవపేటికను ఉంచే కార్యక్రమంలో ప్రధానంగా ఖైదీలు, వలసదారులే పాల్గొన్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం కార్డినళ్లు, పోప్ అత్యంత సన్నిహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమ కవరేజీకి మీడియాను అనుమతించలేదు. వాటికన్ సిటీలో కాకుండా వేరే చోట పోప్‌ను ఖననం చేయడం గత వందేళ్ల చరిత్రలో ఇదే తొలిసారి.

'పహల్గాం'పై తటస్థ విచారణ

- పాక్ ప్రధాని వింత ప్రతిపాదన
- కశ్మీర్‌పై మరోసారి అవాకులు
- దేనికైనా సిద్ధమేనని వ్యాఖ్యలు
- నీళ్లివ్వకుంటే రక్తం పారుతుంది
- బిలావల్ భుట్టో ప్రేలాపనలు

ఇస్లామాబాద్: పహల్గాం పాశవిక ఉగ్ర దాడిపై పాక్ ప్రేలాపనలు ఆగడం లేదు. దాడికి తమను అకారణంగా నిందిస్తున్నారంటూ పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ వాపోయారు. దాడిపై 'తటస్థ, పారదర్శక'దర్యాప్తు జరగాలని శనివారం వింత ప్రతిపాదన చేశారు. అలాగైతే తామూ అందులో భాగమవుతామని చెప్పారు. కశ్మీర్ ప్రజలు తమ హక్కులు సాధించుకునేదాకా వారికి అండగా నిలుస్తామంటూ అవాకులు పేలి అసలు నైజం చాటుకున్నారు. ''సింధూ నది జలాలను ఆపేసే ప్రయత్నాలను పూర్తి శక్తియుక్తులతో అడ్డుకుంటాం. అందుకోసం అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ వాడుకుని తీరతాం''అని ప్రకటించారు. ''ఉగ్రవాదాన్ని పాక్ ఎప్పుడూ ఖండిస్తూనే వచ్చింది. మేం శాంతికాముకులం''అని చెప్పుకున్నారు! దాన్ని తమ బలహీనతగా భావించొద్దన్నారు. భారత్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడ్డా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ''కశ్మీర్‌ను పాక్ జీవనాడి. జిన్నా కూడా అదే చెప్పారు''అంటూ పాత పాట అందుకున్నారు.

కశ్మీరీల పోరుకు దన్ను: మునీర్

కశ్మీరీల పోరుకు దన్నుగా నిలుస్తామంటూ పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కూడా ప్రేలాపనలకు దిగారు. ''కశ్మీర్ పాక్ జీవనాడి. దాన్ని ఎన్నటికీ మర్చిపోలేం. హిందువులు, ముస్లింలు భిన్న జాతులకు చెందిన వారు''అంటూ తాను ఇటీవల చేసిన వ్యాఖ్యలనే పునరుద్ఘాటించారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు. మతం, ఆచారాలు, సంప్రదాయాలు, భావజాలం, ఆకాంక్షలు... ఇలా అన్ని విషయాల్లోనూ హిందువులతో పోలిస్తే ముస్లింలు పూర్తిగా భిన్నమని చెప్పుకున్నారు.

మోదీ యుద్ధోన్మాదం: భుట్టో

సింధూ జలాలను భారత్ అడ్డుకుంటే నదుల్లో రక్తం పారుతుందంటూ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చైర్మన్ ఉన్మాద వ్యాఖ్యలు చేశారు. ''సింధూ నది మాది. ఎప్పటికీ మాకే చెందుతుంది. అందులో నీరైనా పారుతుంది, లేదంటే వారి రక్తమైనా పారుతుంది''అంటూ ప్రగల్భాలకు దిగారు. శుక్రవారం సింధ్ ప్రావిన్స్‌లో బహిరంగ సభలో బిలావల్ భుట్టో మాట్లాడారు. ''సింధూ నాగరికత కేంద్రమైన మొహెంజోదారో ఉన్నది పాక్‌లోని లార్ఖానాలోనే. కనుక సింధూ నది మాదే. దాన్ని కాపాడుకుంటాం''అని చెప్పుకొచ్చారు. ''దశాబ్దాల క్రితం కుదిరిన నీటి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ రద్దు చేయలేరు. సింధూ జలాలను దోచుకుంటామంటే ఊరుకోం. మోదీ యుద్ధోన్మాదాన్ని పాక్, అంతర్జాతీయ సమాజం సహించబోవు''అన్నారు.

భారత్, పాక్‌లది వెయ్యేళ్ల పోరు!

ట్రంప్ వ్యాఖ్యలపై ట్రోలింగ్

న్యూయార్క్: భారత్, పాక్ తమ ఉద్రిక్తతలను అంతర్గతంగానే పరిష్కరించుకుంటాయమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వెలిబుచ్చారు. పోప్ అంత్యక్రియల నిమిత్తం వాటికన్ వెళ్తూ శుక్రవారం ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ క్రమంలో హాస్యాస్పద వ్యాఖ్యలు చేశారు. ''భారత్, పాక్‌కు ఇది కొత్తేమీ కాదు. కశ్మీర్ కోసం ఇరుదేశాల మధ్య వెయ్యేళ్లకు పైగా పోరు నడుస్తోంది. బహుశా 1,500 ఏళ్లుగా అనుకుంటా''అని చెప్పుకొచ్చారు. అంతేగాక పహల్గాం ఉగ్ర దాడిలో 30 మందికి పైగా పర్యాటకులు మరణించారంటూ సంఖ్యను కూడా తప్పుగానే చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలను నెటిజన్లు ఒక రేంజ్‌లో ట్రోల్ చేస్తున్నారు. కశ్మీర్ ఘర్షణల గురించి ట్రంప్‌కు తెలిసినంతగా బహుశా ఇంకెవరికీ తెలియదేమో అంటూ ఒకరు వ్యంగ్యంగా కామెంట్ చేశారు. ''అవునా! నేనింకా పాకిస్తాన్ 1947లో పురుడు పోసుకుందనే అపోహలో ఉన్నా''అని మరొకరు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పాక్ అధికారి ప్రేలాపన

భారత నిరసనలపై ఉక్రోశం

- గొంతు కోసేస్తామంటూ సైగలు
- లండన్ హైకమిషన్ వద్ద ఘటన

లండన్: ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుతున్న వేళ పాక్ సైన్యాధికారి ఒకరు అగ్నిలో ఆజ్యం పోసే చేష్టలకు పాల్పడ్డారు. పహల్గాం దాడిని నిరసిస్తూ శనివారం లండన్లోని పాక్ హై కమిషన్ ముందు శాంతియుత ఆందోళనకు దిగిన భారతీయులపై బెదిరింపులకు దిగారు. ఆ క్రమంలో 'గొంతు కోస్తా'నంటూ వారినుద్దేశించి కార్యాలయం బాల్కనీ నుంచి సైగలు చేశారు. భారత వైమానిక దళ అధికారి అభినందన్ పోస్టర్‌ను ప్రదర్శిస్తూ వారిని గేలి చేశారు. అతన్ని పాక్ హైకమిషన్ కార్యాలయంలో పని చేస్తున్న తైమూర్ రహత్‌గా గుర్తించారు. తైమూర్ తీరు పాక్ సైనిక, దౌత్యాధికారుల సంస్కార రాహిత్యానికి అద్దం పట్టిందంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. 2019లో బాలాకోట్ దాడుల సందర్భంగా అభినందన్ నడుపుతున్న యుద్ధ విమానం కూలి ఆయన పాక్‌లో దిగి సైన్యానికి చిక్కడం తెలిసిందే. రెండు రోజుల తర్వాత పాక్ ఆయన్ను విడుదల చేసింది. లండన్ ఆందోళనల్లో పలువురు యూదులు కూడా పాల్గొని భారత్‌కు సంఘీభావం తెలపడం విశేషం. ''మేమూ ఇస్లామిక్ తీవ్రవాదం, ఉగ్రవాదాల బాధితులమే. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన పాశవిక దాడి 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడిని తలపించింది''అని వారు చెప్పుకొచ్చారు.

మీ గొంతులపైనే కత్తి

తైమూర్ బెదిరింపు సైగలపై ఢిల్లీ మంత్రి మంత్రి మంజీందర్‌సింగ్ మండిపడ్డారు. ''అమాయక ప్రజలను గొంతు కోస్తామని బెదిరించడమా? ముందు మీ తలకాయలు కాపాడుకోండి. కత్తి వేలాడుతున్నది మీ గొంతులపైనేనని తెలుసుకోండి''అంటూ మండిపడ్డారు. తైమూర్‌తో పాటు బెదిరింపు సైగలు చేసిన వారిపై ఇంగ్లండ్ చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు.



సెయింట్ పీటర్స్ బసిలికాలో ఏకాంతంగా కూర్చుని చర్చిస్తున్న జెలెన్‌స్కీ, ట్రంప్

ట్రంప్, జెలెన్‌స్కీ

ఏకాంత చర్చలు

వాటికన్ సిటీలో ఓ 15 నిమిషాలు

- త్వరలోనే అత్యున్నత సమావేశమని వెల్లడి
- పుతిన్‌తో ముఖాముఖిపై పరోక్ష సూచనలు

కీవ్: పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వాటికన్ సిటీకి వెళ్లిన అమెరికా అధ్యక్షుడు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అక్కడే భేటీ అయ్యారు. అంత్యక్రియల కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముందుగా వీరిద్దరూ సెయింట్ పీటర్స్ బసిలికాలో 15 నిమిషాలు మాట్లాడుకున్నారు. ప్రైవేట్‌గా సమావేశమైన ఇద్దరు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు జరిగాయని వైట్ హౌస్ కూడా తెలిపింది. ఇతర వివరాలను తర్వాత వెల్లడిస్తామని పేర్కొంది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలికేలా అత్యున్నత స్థాయి సమావేశం త్వరలోనే జరగనుందని అంతకుముందు రోమ్ చేరుకున్న ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'పుతిన్, జెలెన్‌స్కీ ఒప్పందానికి అతి సమీపంలో ఉన్నారు. యుద్ధం ముగింపునకు రావాలంటే వీరి సమావేశం జరగాలి. చాలా ముఖ్యమైన అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. ఇప్పుడే ఈ రక్తపాతాన్ని ఆపాలి. క్రూరమైన, అర్థరహితమైన ఈ యుద్ధానికి ముగింపు పలుకుతాం'అని శుక్రవారం ఒక ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. క్రిమియా రష్యాతోనే ఉంటుందని ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్ శుక్రవారం మాస్కోలో పుతిన్‌తో సమావేశమవడం తెల్సిందే. వాటికన్‌లో ట్రంప్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ సైతం సోషల్ మీడియాలో స్పందించారు. 'ఒక్కో అంశాన్ని సవివరంగా చర్చించాం. వీటిపై సానుకూల ఫలితాలను ఆశిస్తున్నాం. ప్రజల ప్రాణాలను కాపాడుకోవడం, సంపూర్ణ, బేషరతు కాల్పుల విరమణ, మళ్లీ యుద్ధం రాకుండా నివారించే విశ్వసనీయమైన, శాశ్వత శాంతి మాకు కావాలి'అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అత్యంత కీలకమైన సమావేశాలు జరగనున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరుగనున్న భేటీపై ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఇది చారిత్రాత్మకంగా మారే అవకాశం ఉందన్నారు. అయితే, భేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించేలా రష్యాపై తక్షణమే ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. శనివారం మరోసారి చర్చలు కొనసాగించాలని ట్రంప్, జెలెన్‌స్కీ నిర్ణయించుకున్నారని ఉక్రెయిన్ అధ్యక్షభవనం ప్రతినిధి సెర్హి నికిఫొరోవ్ అంతకుముందు వెల్లడించారు. కానీ, పోప్ అంత్యక్రియలు ముగిసిన వెంటనే ట్రంప్ నేరుగా రోమ్ విమానాశ్రయం చేరుకుని, ఎయిర్ ఫోర్స్ విమానంలో అమెరికాకు బయలుదేరారు. దీంతో, రెండో సమావేశానికి అవకాశం లేకుండా పోయింది.



పోర్టు వద్ద వ్యాపించిన దట్టమైన పొగలు

ఇరాన్ నౌకాశ్రయంలో భారీ పేలుళ్లు

కంటెయినర్ల నుంచి అగ్నికీలలు

- ఐదుగురి సజీవదహనం
- 700 మందికి గాయాలు

మస్కట్: ఇరాన్‌లోని బందార్ అబ్బాస్ నగర శివారులోని షాహీద్ రజేయీ నౌకాశ్రయంలో శనివారం అత్యంత శక్తివంతమైన పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో ఐదుగురు సజీవదహనమయ్యారు. 700 మందికిపైగా గాయపడ్డారు. పేలుడు ధాటికి సమీప భవనాల అద్దాల కిటికీలు ధ్వంసమయ్యాయి. ఒక భవనం పూర్తిగా నేలమట్టమైనట్లు తొలుత వార్తలొచ్చాయి. చాలా కిలోమీటర్ల దాకా ఈ పేలుడు ప్రభావం కనిపించిందని స్థానికులు చెప్పారు. పేలుళ్ల ధాటికి పెద్దస్థాయిలో పుట్టగొడుగు ఆకారంలో ఎర్రని మంటలు, దట్టమైన పొగ వెలువడ్డాయి. నౌకాశ్రయంలోని కంటెయినర్లలో నిల్వచేసిన రసాయనాల కారణంగానే పేలుళ్లు సంభవించాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే పేలుళ్లకు కారణాలను ఇరాన్ ప్రభుత్వం ఇంతవరకు ప్రకటించలేదు. క్షిపణి వేగంగా దూసుకెళ్లడానికి సాయపడే ప్రొపెల్లంట్‌లో వాడే అత్యంత మండే స్వభావమున్న రసాయనాలను ఈ నౌకాశ్రయంలో నిల్వచేశారని, వీటిని భద్రపర్చడంలో నిర్లక్ష్యం కారణంగానే పేలుళ్లకు జరిగాయని వార్తలొచ్చాయి. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.

మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని హార్మోజ్గన్ ప్రావిన్స్ విపత్తు నిర్వహణ విభాగ సారథి మెహర్‌దాద్ హసన్‌జాదాహ్ చెప్పారు. యురేనియం శుద్ధి వేగాన్ని తగ్గించాలనే ప్రతిపాదనలతో అమెరికా ఇరాన్‌తో మూడోదఫా చర్చలు ఒమన్ దేశంలో మొదలెట్టిన కొద్దిసేపటికే ఈ పేలుళ్లు జరిగాయి. ఇరాన్ శత్రువర్గాల నుంచి డ్రోన్ దాడుల కారణంగా పేలుళ్లు సంభవించాయని వచ్చిన వార్తలను మాత్రం ప్రభుత్వం ఖండించింది. నౌకాశ్రయం పరిధిలో అత్యంత ప్రమాదకర రసాయనాలు, వస్తువులను తెచ్చిపెట్టారని ఇరాన్ కస్టమ్స్ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదలచేసింది. వాటి వల్లే పేలుళ్లు జరిగాయనే అంశాన్ని మాత్రం ప్రస్తావించలేదు.

రెండోరోజూ కాల్పుల హోరు

- సరిహద్దుల్లో పాక్ దుశ్చర్యలు
- దీటుగా బదులిచ్చిన బలగాలు

శ్రీనగర్/న్యూఢిల్లీ: పహల్గాంలో పాశవిక దాడి తర్వాత ఉద్రిక్తంగా మారిన భారత్, పాకిస్తాన్ సరిహద్దు వెంట వరసగా రెండో రోజూ బుల్లెట్ల వర్షం కురిసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ శుక్రవారం అర్ధరాత్రి సైతం పాకిస్తాన్ బలగాలు సరిహద్దు వెంట కాల్పులు జరిపాయి. వీటిని భారత బలగాలు దీటుగా బదులిచ్చాయి. తమ తుపాకులకు పనిచెప్పామని భారత సైన్యం శనివారం తెలిపింది. ఇంతటి కాల్పుల మోత మోగినా ఇరువైపులా ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని తెలుస్తోంది.

ఉగ్రవాదుల రహస్యస్థావరం బట్టబయలు

పహల్గాం దాడి ఉగ్రవాదులను వెంటాడి వేటాడే క్రమంలో కొనసాగుతున్న గాలింపు చర్యల్లో భద్రతా బలగాలు తాజాగా ఉగ్రవాదుల స్థావరాన్ని గుర్తించాయి. కుప్వారా జిల్లాలోని సెదోరీ నాలా, ముష్తాఖాబాద్ మచిల్‌లలో గాలించగా ఇది బయల్పడింది. ఈ స్థావరం నుంచి ఐదు ఏకే-47 రైఫిళ్లు, ఎనిమిది ఏకే-47 మేగజైన్‌లు, ఒక పిస్టల్, ఒక పిస్టల్ మేగజైన్, 660 రౌండ్ల ఏకే-47 బుల్లెట్లు, మెషీన్ గన్‌కు సంబంధించిన 50 బుల్లెట్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు శ్రీనగర్‌లోని 60 ప్రాంతాల్లో సైన్యం విస్తృతస్థాయిలో తనిఖీలు చేపట్టింది. ఉగ్రవాదుల సానుభూతిపరులను వందలాది మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో కశ్మీర్‌లో ఏడుగురు లష్కరే ఉగ్రవాదుల ఇళ్లను భద్రతా దళాలు నేలమట్టం చేశాయి.

క్లుప్తంగా...

ప్రెజర్‌బాంబు పేలి జవాన్‌కు గాయాలు

- 'ఆపరేషన్ కర్రిగుట్ట'లో ఘటన



గాయపడిన డీఆర్‌జీ జవాన్

చర్ల: మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబు పేలి 'ఆపరేషన్ కర్రిగుట్ట'లో పాల్గొన్న డీఆర్‌జీ జవాన్ గాయపడ్డాడు. మావోయిస్టుల ఏరివేత పేరిట తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టల్లో జవాన్లు కూంబింగ్ చేస్తుండటం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గలగం సమీపంలో ఓ జవాన్ ప్రెజర్‌బాంబుపై అడుగు వేయడంతో.. అది పేలి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హెలీకాప్టర్‌లో బీజాపూర్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా, జవాన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

కొడుకులారా.. కొరివైనా పెట్టరా?

- కరీంనగర్ జిల్లా వన్నారంలో వృద్ధుడి ఆకస్మిక మృతి
- కొరివి పెట్టకుండా ఠాణా మెట్లెక్కిన కొడుకులు

మానకొండూర్: కొడుకులు పుట్టారని సంబరపడితే.. కొరివి పెట్టకుండా కొట్టుకుంటున్నారు. కని, పెంచి, ప్రయోజకులను చేస్తే అనాథ శవంగా అంత్యక్రియలు జరపకుండా శవజాగరణ చేయించారు. దీంతో వృద్ధుడి మృతదేహం మూడ్రోజులు జిల్లా ఆస్పత్రి మార్చురీలో ఉండగా.. శనివారం పోలీసులు, గ్రామస్తుల జోక్యంతో అంత్యక్రియలు పూర్తిచేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వన్నారం గ్రామానికి చెందిన జంగిలి కొమురయ్య (74), రాజకొమురవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు జంగిలి ఓదెలు, జంగిలి రవి, ఇద్దరు కూతుళ్లు సంతానం. రాజకొమురవ్వ కొంతకాలం కిందటే చనిపోయింది. ఓదెలు, రవి మధ్య చాలా రోజులుగా భూ తగాదాలు జరుగుతున్నాయి. ఈనెల 24న ఇంటి వద్ద జంగిలి కొమురయ్య చనిపోయాడు. అంత్యక్రియలు నిర్వహించాల్సిన కొడుకులిద్దరూ.. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని, ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భద్రపరిచారు. శనివారం బ్లూకోల్ట్స్ సిబ్బంది వెంకట్రామయ్య ఫిర్యాదుతో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. పెద్ద కొడుకు తలకొరివి పెట్టాడు. కొమురయ్యది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ బి.సంజీవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



జంగయ్య

పూడూరు: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కడుమూరులో జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన జొన్నాడ జంగయ్య (40) శనివారం మధ్యాహ్నం తన పొలంలోని బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు శంషాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రాణం తీసిన మస్కిటో కాయిల్

- ఊపిరి ఆడక బాలుడు మృతి, బాలికకు అస్వస్థత

హయత్‌నగర్: దోమల బెడద నుంచి రక్షణ కోసం పెట్టుకున్న మస్కిటో కాయిల్ కారణంగా మంచంపై పరుపు కాలిపోయి పొగ అలుముకోవడంతో ఊపిరి ఆడక ఓ బాలుడు మృతి చెందగా, బాలిక అస్వస్థతకు గురైంది. ఈ సంఘటన శనివారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ భువనేశ్వరి కాలనీకి చెందిన అబ్దుల్ ఖాదర్ జిలానీకి ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్లు. శుక్రవారం రాత్రి పెద్ద పిల్లలు అర్హన్, ఆఫియాలు జిలానీతో కలిసి హాలులో పడుకోగా అతని భార్య, చిన్న కొడుకు అబ్దుల్ రెహమాన్ (4), కూతురు అతిఫా(4)లు కలిసి బెడ్‌రూంలో పడుకున్నారు. దోమల కోసం బెడ్‌రూంలో మస్కిటో కాయిల్ వెలిగించగా, అది పరుపు మీద పడింది. పరుపుకు మెల్లగా మంట రాజుకుని పొగ ఏర్పడింది. పొగ తీవ్రం కావడంతో ఉక్కిరిబిక్కిరి అయిన రెహమాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న బాలిక అతిఫా అస్వస్థతకు గురైంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ అరెస్టు

- ఆయన భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు
- హరిరామ్‌పై ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు
- ఆయన ఇళ్లు, కార్యాలయంలో శనివారం ఏసీబీ సోదాలు
- తెలంగాణ, ఏపీలో ఏకకాలంలో 14 చోట్ల దాడులు
- భూములు, ఇతర ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం
- ఏసీబీ అధికారుల వెల్లడి



ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన షేక్‌పేట్‌లోని ఈఎన్సీ హరిరామ్ నివాసం

సాక్షి, హైదరాబాద్/ మర్కూక్ (గజ్వేల్): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్‌ను అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) అరెస్టు చేసింది. అక్రమాస్తుల ఆరోపణలపై శనివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి పొద్దుపోయేవరకు హరిరామ్ ఇళ్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. తెలంగాణ, ఏపీలో ఏకకాలంలో 14 చోట్ల సోదాలు నిర్వహించి అక్రమాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదుచేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సోదాలకు సంబంధించి శనివారం రాత్రి ఏసీబీ డీజీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

రెండు రాష్ట్రాల్లో సోదాలు: హైదరాబాద్, సిద్దిపేట, ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. షేక్‌పేట్‌లోని ఆదిత్యా రాయల్ పామ్స్‌లోని విల్లా నంబర్ 16లో ఉన్న హరిరామ్ నివాసం సహా ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లలో శనివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి పొద్దుపోయేవరకు సోదాలు కొనసాగాయి. ఆ సమయంలో హరిరామ్ దంపతులు ఇంట్లోనే ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని జలసౌధలోని హరిరామ్ కార్యాలయంతోపాటు పలు సెక్షన్లలో కూడా సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో హరిరామ్ ఆస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సిద్దిపేట జిల్లా మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డలోని హరిరామ్ స్వగృహంలో, ములుగులోనూ సోదాలు నిర్వహించారు. హరిరామ్ అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమంగా చర, స్థిరాస్తులు కూడబెట్టినట్లు ఆధారాలు లభించాయని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆదివారం సైతం సోదాలు కొనసాగే అవకాశం ఉన్నట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి.

ఏసీబీ సోదాల్లో గుర్తించిన హరిరామ్ ఆస్తులు

✦ షేక్‌పేట్‌లో ఒక విల్లా ✦ కొండాపూర్‌లో ఒక విల్లా ✦ శ్రీనగర్‌లో ఒక ఫ్లాట్ ✦ మాదాపూర్‌లో ఒక ఫ్లాట్ ✦ నార్సింగిలో ఒక ఫ్లాట్ ✦ అమరావతిలో ఒక వాణిజ్య స్థలం ✦ మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి ✦ పటాన్‌చెరులో 20 గుంటల భూమి ✦ హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో రెండు గృహాలు ✦ బొమ్మలరామారంలో 6 ఎకరాల్లో మామిడి తోటతో కూడిన ఫామ్ హౌస్ ✦ కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం ✦ కుత్బుల్లాపూర్‌లో ఒక ఖాళీ స్థలం ✦ మిర్యాలగూడలో ఒక ఖాళీ స్థలం ✦ ఒక బీఎమ్‌డబ్ల్యూ సహా రెండు కార్లు ✦ బంగారు ఆభరణాలు ✦ బ్యాంకు డిపాజిట్లు

భగ్గుమన్న అన్నదాత

- ధాన్యం బస్తాలకు నిప్పు



ధాన్యానికి నిప్పు పెడుతున్న రైతన్నలు

కోనరావుపేట (వేములవాడ): కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహించిన రైతులు రోడ్డుపై ధాన్యం పారబోసి నిప్పు పెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం అజ్మీరాతండాలో శనివారం రైతులు ధాన్యం బస్తాలను రోడ్డుపై పోసి నిప్పు పెట్టి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న కోనరావుపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే అకాల వర్షాలకు తడిసి ముద్దయిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. ధాన్యం తరలించడానికి లారీలు రాకపోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయని తెలిపారు. సమస్యను పరిష్కరిస్తానని ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

మే 5న తెలంగాణకు నితిన్ గడ్కరీ

- రాష్ట్రంలో రూ.6,280 కోట్ల విలువైన జాతీయ రహదారులను జాతికి అంకితం
- ట్రిపుల్ ఆర్ (దక్షిణ భాగం)ను జాతీయ రహదారిగా ప్రకటించేందుకు అంగీకరించిన కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో దాదాపు రూ.6,280 కోట్ల వ్యయంతో నిర్మించిన 285 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను మే 5వ తేదీన కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సంయుక్తంగా జాతికి అంకితం చేయనున్నారు. ఈ పర్యటనలో మొదట ఆదిలాబాద్ జిల్లాలో, ఆ తర్వాత హైదరాబాద్ నుంచి.. రెండు వేర్వేరు చోట్ల నుంచి జాతీయ రహదారులకు సంబంధించిన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో దాదాపు రూ.6,280 కోట్ల ఖర్చుతో 285 కి.మీ. మేర జాతీయ రహదారులకు సంబంధించిన పలు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటితో పాటు రూ.961 కోట్లతో 51 కి.మీ. మేర చేపట్టనున్న రెండు జాతీయ రహదారుల ప్రాజెక్టు పనులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేయనున్నారు. కాగా, హైదరాబాద్ నార్త్‌లో గ్రీన్ ఫీల్డ్ రీజనల్ ఎక్స్‌ప్రెస్ హైవే (రీజనల్ రింగ్ రోడ్ – ఉత్తర భాగం) ప్రాజెక్టుకు సంబంధించి పబ్లిక్–ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ), కేబినెట్ అను మతులు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆర్థికపరమైన అంశాలపై త్రైపాక్షిక ఒప్పందాలు చేసుకోవాలని, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టుకు రూ.18,772 కోట్లు ఖర్చు కావొచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. అలాగే హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు (సౌత్) నిర్మాణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే.. ఈ ప్రాజెక్టును జాతీయ రహదారిగా ప్రకటించేందుకు కూడా కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం రూ.13 వేల కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణలో 50 శాతం ఖర్చుగా రూ.2,230 కోట్లు భరించేందుకు కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వ శాఖ అంగీకరించింది.

కేంద్ర మంత్రి బిజీబిజీ..
సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

రూ.1,034 కోట్లతో 'డిండి' పనులకు ఆమోదం

- కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ నిర్ణయం



(ఫైల్)

సాక్షి, హైదరాబాద్: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల–డిండి అనుసంధానం ప్రాజెక్టు కింద 1, 2, 3 ప్యాకేజీలకు సంబంధించిన రూ.1,034.44 కోట్ల విలువైన పనుల టెండర్లను కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ) ఆమోదించింది. నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో సమావేశమైన సీఓటీ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్యాకేజీ–1 కింద ఏదుల రిజర్వాయర్ నుంచి అప్రోచ్ కాల్వ, 0–2.5 కి.మీల వరకు ప్రధాన కాల్వ, 2.5–5.5 కి.మీల మధ్య సొరంగం నిర్మాణ పనులకు రూ.300.08 కోట్ల అంచనాలతో టెండర్లను ఆహ్వానించగా, 4.49 శాతం అధికంగా రూ.313.55 కోట్లతో బిడ్లు వేసిన సరళ ప్రాజెక్టు వర్క్ లిమిటెడ్ కంపెనీకి పనులు అప్పగించాలని సీఓటీ సిఫారసు చేసింది. ఇక 5.5–11 కి.మీల మధ్య సొరంగం నిర్మాణానికి రూ.349.61 కోట్లతో టెండర్లను ఆహ్వానించగా, 4.61 శాతం అధికంగా రూ.365.73 కోట్లతో బిడ్లను వేసిన సుధా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు పనులు అప్పగించాలని నిర్ణయించింది. 11–16.5 కి.మీల మధ్య సొరంగం నిర్మాణ పనులకు రూ.350.29 కోట్లతో టెండర్లను ఆహ్వానించగా, 3.96 శాతం అధికంగా రూ.364.16 కోట్లతో బిడ్లు వేసిన వీఏఆర్‌కేఎస్ ఇంజనీరింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి పనులు అప్పగించాలని సిఫారసు చేసింది. ప్యాకేజీ–4 కింద రూ.290 కోట్లతో టెండర్లు పిలవగా, 4.99 శాతం అధికంగా రూ.305 కోట్లతో సీవీఆర్–ప్రసాద్ జేవీ కంపెనీ బిడ్లు వేసింది. దీనిని ఆమోదించకుండా సీఓటీ వివరణ కోరింది. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి రిజర్వాయర్‌కి 60 రోజుల్లో 30 టీఎంసీల నీళ్లను తరలించి 3.61 లక్షల ఎకరాల ఆయకట్టుకి సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఆస్తి కోసం.. కన్న కొడుకే కాలయముడై..!

- ట్రాక్టర్‌తో ఢీకొట్టించడంతో ప్రాణాలు విడిచిన దంపతులు
- విజయనగరం జిల్లాలో దారుణ ఘటన

పూసపాటిరేగ: కడుపున పుట్టిన కొడుకే ఆస్తికోసం తల్లిదండ్రులను ట్రాక్టర్‌తో గుద్దించి హతమార్చిన ఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాండ్రింకి అప్పలనాయుడు (55), పాండ్రింకి జయమ్మ (53)కు రాజశేఖర్, రాధ ఇద్దరు పిల్లలు. కుమార్తె రాధను ఆనందపురం మండలం నేలతేరుకు చెందిన వ్యక్తితో వివాహం చేశారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం తరువాత ఆమె మృతిచెందింది. తమకు ఉన్న 80 సెంట్లు పొలంలో వివాహ సమయంలో 20 సెంట్లు భూమిని రాధ పేరిట తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై కుమారుడు రాజశేఖర్ తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్నాడు. భూమి విషయమై వారితో కొంత కాలంగా గొడవపడుతున్నాడు. తల్లిదండ్రుల నుంచి విడిపోయి తన భార్య, కుమార్తెతో కలిసి వేరుగా నివసిస్తున్నాడు. సొంతంగా ట్రాక్టర్ నడుపుతున్నాడు. వ్యసనపరుడు కావడంతో అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలోని నడుపూరి కల్లాల వద్ద రాధకు ఇచ్చిన భూమిని విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. ఇందులో భాగంగా జేసీబీ, ట్రాక్టర్ సాయంతో చదునుచేసే పనులను సాయంత్రం చేపట్టాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లి కుమారుడిని ప్రశ్నించారు. ఈ క్రమంలో వారిపై ఆగ్రహంతో ఊగిపోతూ ట్రాక్టర్‌తో ఢీకొట్టి హతమార్చాడు. వారు మృతి చెందినట్లు నిర్ధారణ అయ్యాక అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, ఎస్‌ఐ ఐ.దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారు.

వడదెబ్బకు గురై యువకుని మృతి

నడిగూడెం: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన యువకుడు చెవుల నర్సింహారావు (33) వడదెబ్బతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం వడదెబ్బకు గురైన నర్సింహారావు.. ఇంటి వద్దే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆటో వెంటపడిన పోకిరీలు

- తప్పించుకునే ప్రయత్నంలో స్తంభాన్ని ఢీకొట్టిన డ్రైవర్.. మహిళ మృతి..

సనత్‌నగర్ (హైదరాబాద్): మద్యం మత్తులో ఉన్న పోకిరీలు అర్ధరాత్రి ఆటోను వెంబడించగా, వారినుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆటో డ్రైవర్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ కార్ఖానాకు చెందిన జవేరియా రిజ్వానా (47), పిల్లలు మహ్మద్ మాజ్ అహ్మద్ (20) ఆయేషా సల్మా (11)లతో కలిసి ఈ నెల 24న రాత్రి 11 గంటలకు టోలిచౌకి జానకినగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఫంక్షన్ పూర్తయిన అనంతరం ముగ్గురూ ఇంటికి వెళ్లేందుకు అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో రాపిడో ఆటో బుక్ చేసుకున్నారు. 1.55 గంటల సమయంలో మద్యం సేవించిన స్థితిలో ఉన్న నలుగురు యువకులు రెండు బైక్‌లపై ఆటోను వెంబడించడం ప్రారంభించారు. ఈ క్రమంలో వారు అసభ్యపదజాలంతో దూషించడంతో ఆటోలో ఉన్న ముగ్గురూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆటో బేగంపేట బాలంరాయి సమీపంలోని రాయల్ లే ప్యాలెస్ వద్దకు రాగానే బైక్‌లపై ఉన్నవారు ఆటోను ఓవర్‌టేక్ చేస్తూ ఆపడానికి ప్రయత్నించాడు. అయితే ఆటో డ్రైవర్ భయంతో వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో జవేరియా రిజ్వానాకు ఆటోలోని రాడ్ బలంగా తగలి తలకు తీవ్రంగా గాయమైంది. అది చూసి అప్పటివరకు వారిని వెంబడించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న రిజ్వానాను సమీపంలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడవిలో దారితప్పి.. చివరికి శవమై..

- కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహం లభ్యం
- సిద్దిపేట జిల్లాలో ఘటన



యాదయ్య మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): మతి స్థిమితం సరిగ్గా లేని వ్యక్తి అడవిలో దారి తప్పిపోయాడు. ఎక్కడెక్కడో మండుటెండలో తిరిగాడు. తినడానికి తిండి దొరక్క, తాగడానికి చుక్క నీరు లేక పది రోజులుగా యాతన అనుభవించాడు. చివరికి నీరసించి మృత్యువాత పడ్డాడు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల శివారులోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. శనివారం ఎస్‌ఐ బోయిని పరశురామ్ ఈ వివరాలు వెల్లడించారు. మిరుదొడ్డికి చెందిన వనం యాదయ్య (58) ఐదేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి స్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో ఈ నెల 14న యాదయ్య ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధు, మిత్రుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం కొందరు వ్యక్తులు అడవిలో వేటకు వెళ్లగా, అక్కడ దుర్వాసన వస్తుండటాన్ని గమనించారు. వెళ్లి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మనిషి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యాదయ్యగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అడవిలో దారి తప్పి, 10 రోజుల పాటు మండుతున్న ఎండలకు నీరసించి మృత్యువాత పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వారు చెప్పారు.

తేనె కోసం అడవికి వెళ్తే ప్రాణం పోయింది

- ఎత్తయిన చెట్టుపై నుంచి కిందపడ్డ యువకుడు
- అడవిలో దారి తప్పడంతో చికిత్స ఆలస్యం
- నిర్మల్ జిల్లాలో ఘటన



మల్లేశ్ మృతదేహం

కడెం: తేనెపై ఆశ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం నాయకపుగూడకు చెందిన కుర్ర మల్లేశ్ (28) తన స్నేహితులతో కలసి తేనె సేకరణ కోసం నిర్మల్ జిల్లా కడెం మండలం చిట్యాల్ అటవీ ప్రాంతానికి వచ్చాడు. అయితే చెట్టుపైనుంచి కిందపడి మృతిచెందాడు. శుక్రవారం రాత్రి కుర్ర మల్లేశ్, కుర్ర రాజు, దూస రాజన్న, అలాగే మల్లేశ్ అనే పేరున్న మరో వ్యక్తి చిట్యాల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో తేనె సేకరించేందుకు వెళ్లారు. ఎత్తయిన చెట్టుపై ఉన్న తేనె తుట్టెలను తీసేందుకు మల్లేశ్, రాజు చెట్టుపైకి ఎక్కారు. తుట్టెలు తీసే క్రమంలో మల్లేశ్ కాలుజారి సుమారు 30 మీటర్ల ఎత్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.

అడవిలో దారితప్పి.. మల్లేశ్‌ను రక్షించేందుకు స్నేహితులు అతడిని ఎత్తుకుని బయలుదేరారు. కానీ, అర్ధరాత్రి అడవిలో దారి తప్పారు. వారి వద్ద టార్చ్‌లైట్ తప్ప సెల్‌ఫోన్ లేకపోవడంతో గుట్టలు దాటుతూ, దారి కోసం తిరుగుతూ, తెల్లవారుజామున 3 గంటలకు చిట్యాల్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌కు చేరుకున్నారు. అప్పటికే కుర్ర మల్లేశ్ మృతి చెందాడని గుర్తించారు. సమీప పొలాల్లో మల్లేశ్ శవాన్ని ఉంచి, 10 కిలోమీటర్ల దూరంలోని బోర్నపల్లికి చేరుకుని, మాజీ ప్రజాప్రతినిధి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఎం. కృష్ణసాగర్‌రెడ్డి మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగ

కల్వల మల్లికార్జున్‌రెడ్డి

తెలంగాణది మహోజ్వల చరిత్ర. ప్రత్యేక సంస్కృతి, విభిన్న జీవన విధానం. నిత్య చైతన్యం ఇక్కడి సమాజ లక్షణం. అయినా శతాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అణచివేతలకు గురైన ప్రాంతం. అంతులేని దుఃఖం, తీరని వేదన నుంచి బయటపడేందుకు నిరంతరం ఆరాట పడిన జనం. నెత్తుటి ధారల నడుమ త్యాగాల దారిలో నడిచిన పోరాటాల గడ్డ. చరిత్ర పొడవునా సాగిన దోపిడీ, కుట్రల నడుమ తెలంగాణ నిలువెల్లా ఒక గాయాల వీణ. తెగిన గొంతులను సవరించుకుని అస్తిత్వాన్ని చాటుకునేందుకు దశాబ్దాల పాటు సాగించిన పోరు గానం. స్వపరిపాలన, స్థానిక సంపద పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం సాగిన ఉద్యమ పతాక. భూమి, భుక్తి, విముక్తి మొదలు.. నిధులు, నీళ్లు, నియామకాల కోసం నిర్బంధాల నడుమ తెలంగాణ గడ్డ జరిపిన నిత్య పోరాటం వర్తమాన భారతంలో ఒక చరిత్ర.





రాష్ట్ర సాధన అస్త్ర శస్త్రాలకు ఏడాది పాటు పదును పెట్టి బరిలోకి దిగిన యుద్ధ వీరుడు. ఉప ఎన్నికలను రాజీనామా అస్త్రాలుగా సంధించిన రాజకీయ సమర యోధుడు. అనునిత్యం ఆయనది ప్రజాక్షేత్రం. వ్యూహ చతురతతో గల్లీ నుంచి ఢిల్లీ దాకా రాజకీయాలను ప్రభావితం చేసిన వ్యూహ చతురుడు. ఎన్నికల పొత్తులు, సంకీర్ణ రాజకీయాలు, రాజకీయ పునరేకీకరణ పాచికలు, పదవీ త్యాగాలతో రాజీనామా అస్త్రాలు సంధించిన సవ్యసాచి. పిడికెడు మందితో ప్రయాణం ప్రారంభించి.. తెలంగాణ కోసం కుష్టు రోగిని కౌగిలించుకుంటా, గొంగలి పురుగును కూడా ముద్దాడుతానన్న ధీశాలి. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అంటూ నినదించిన ఉద్యమ గళం. ఉద్యమ దీక్ష నుంచి స్వరాష్ట్ర సాధన వరకు సాగిన ఆయన ప్రయాణం ఒక స్ఫూర్తిదాయక యాత్ర. మొత్తంగా తెలంగాణ ఆత్మ గౌరవం కోసం నిటారుగా నిలబడి స్వరాష్ట్ర సాధనకు ముందుకు కదిలిన ఉద్యమ పతాక కేసీఆర్.

తెలంగాణ గడ్డపై ఒక జాతి ఆకాంక్షలు జ్వలించిన సమయంలో ఒక స్వప్న స్వరమై, స్వాభిమాన శంఖారావమై సాగించిన యాత్ర. రాజకీయ లక్ష్యం కోసం కాకుండా ప్రజల హృదయ స్పందనకు అద్దం పట్టిన ఉద్యమ కాగడా. తెలంగాణ గడ్డను ఉద్యమ క్షేత్రంగా మార్చిన వెలుగు దివ్వె. రాజకీయ శూన్యత నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా పురుడు పోసుకున్న ఉద్యమ కెరటం. రాజకీయ సునామీ సృష్టించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కలను సుసాధ్యం చేసిన ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి. మడమ తిప్పకుండా సాగిన సుదీర్ఘ పోరులో ఉద్యమం ప్రసవించిన బిడ్డ టీఆర్ఎస్. పాతికేళ్ల ప్రస్థానంలో ఉద్యమం, అధికారం, ప్రతిపక్షం అనే మైలురాళ్ల మీదుగా సాగుతూ టీఆర్ఎస్‌గా పురుడు పోసుకున్న బీఆర్ఎస్‌కు ఇది రజతోత్సవ సంబురం.





> తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే వరకు విశ్రమించేది లేదు.. మధ్యలో విరమిస్తే నన్ను రాళ్లతో కొట్టి చంపండి..
>
> – టీఆర్ఎస్ స్థాపించిన తర్వాత కేసీఆర్

నిర్బంధాల నడుమ నిత్యపోరాటాల బాటన సాగిన చరిత్ర

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం సాగిన సమరం

తెలంగాణ గడ్డపై ఉద్యమ గానం, సమర గీతం కేసీఆర్

ప్రజా హృదయ స్పందనకు అద్దం, ఉద్యమ కాగడా టీఆర్ఎస్

తెలంగాణ జాతి స్వరం కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా పదవీ త్యాగాల పునాదుల మీద పార్టీని ప్రారంభించిన ఉద్యమ నాయకుడు. ఎత్తుపల్లాలు ఎదురైనా, ఎత్తిన జెండా దించకుండా ముందుకు సాగిన నాయకుడు. బీఆర్ఎస్ 25 ఏళ్ల ప్రస్థానంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఉద్యమ నేతగా, ప్రభుత్వ సారథిగా, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ స్ఫూర్తిమంత ప్రయాణం సాగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపనతో తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత గమ్యాన్ని ముద్దాడారు. 'నీళ్లు.. నిధులు.. నియామకాలు' ఎజెండాగా ఆయన ఎక్కని కొండ లేదు.. మొక్కని బండలేదు.



శూన్యత నుంచి సునామీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1995కు అటూ ఇటుగా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వ పాలన తెలంగాణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రాజేసింది. వర్షాభావ పరిస్థితులు, రైతుల ఆత్మహత్యలు, విద్యుత్ కోతలు ప్రజల జీవితాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. విద్యుత్ సంస్కరణల పేరిట చంద్రబాబు కరెంటు చార్జీలు పెంచడం, అసెంబ్లీ ముట్టడికి వచ్చిన వారిపై జరిగిన 'బషీర్‌బాగ్ కాల్పులు' ఘటనలో ముగ్గురు మరణించడం నాడు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తీవ్రంగా కలిచివేసింది. విద్యుత్ చార్జీల పెంపుతో తెలంగాణ రైతులు ఎదుర్కొనే దయనీయతను వివరిస్తూ 2000 సంవత్సరంలో చంద్రబాబుకు కేసీఆర్ బహిరంగలేఖ రాశారు. ఈ నేపథ్యంలో నుంచే తెలంగాణకు స్వీయ అస్తిత్వం కలిగిన రాజకీయ పార్టీ అవసరమనే నిర్ణయానికి కేసీఆర్ వచ్చారు. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ తీరాన ఉన్న 'జలదృశ్యం' సాక్షిగా 2001, ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భవించింది. శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవికి, సిద్దిపేట శాసన సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఏకకాలంలో కేసీఆర్ రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేంత వరకు విశ్రమించేది లేదని..మధ్యలో విరమిస్తే తనను రాళ్లతో కొట్టి చంపమని కేసీఆర్ పిలుపునిచ్చారు. టీఆర్ఎస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 2001 మే, 17న కరీంనగర్‌లో సింహగర్జన పేరిట నిర్వహించిన సభకు భారీ స్పందన లభించింది.

సిద్దిపేట ఉపఎన్నికతో బరిలోకి

కేసీఆర్ రాజీనామాతో 2001 సెప్టెంబర్ 22న సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. తొలిసారిగా టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన కేసీఆర్ 58,712 మెజారిటీతో విజయం సాధించారు. మరోవైపు టీఆర్ఎస్ ఏర్పడిన కొద్ది నెలల్లోనే 2001లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 85 జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకొని కరీంనగర్, నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవులు దక్కించుకుంది. పార్టీ ఏర్పడిన మూడు నెలల్లోనే 25 శాతం ఓటు బ్యాంకును సాధించింది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్న టీఆర్ఎస్.. ఆ ఎన్నికల్లో 26 ఎమ్మెల్యే, ఐదు పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించింది. తర్వాతి కాలంలో టీఆర్ఎస్‌కు చెందిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలో కేంద్రంలో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ కేబినెట్ మంత్రిగా, ఆలె నరేంద్ర సహాయమంత్రిగా చేరారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో టీఆర్ఎస్ చేరింది.

రాజీనామాల పర్వం..

తెలంగాణపై కాంగ్రెస్ నాన్చివేత ధోరణిని నిరసిస్తూ 2005 జూలైలో రాష్ట్ర కేబినెట్, 2006 ఆగస్టు 22న కేంద్ర కేబినెట్ నుంచి టీఆర్ఎస్ మంత్రులు వైదొలిగారు. 2006 సెప్టెంబర్ 12న కరీంనగర్ ఎంపీ పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. అదే ఏడాది డిసెంబర్ 4న జరిగిన ఉపఎన్నికలో కేసీఆర్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిపై 2.01లక్షల ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2008 మార్చి 3న టీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలు, 16 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేశారు. అయితే ఉప ఎన్నికలో కేసీఆర్‌తో సహా ఇద్దరు ఎంపీలు, ఏడుగురు టీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రమే ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో 2009 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని మహాకూటమితో టీఆర్ఎస్ పొత్తు కుదుర్చుకుంది.

కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో..: ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009 సెప్టెంబర్ 2న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించగా, రోశయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా ప్రకటిస్తూ 2009 అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణలో ఆందోళనలకు దారితీసింది. ఈ ఆందోళనకు సంఘీభావం ప్రకటించిన కేసీఆర్ 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు' పరిష్కారం అని నినదించారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అంటూ 2009 నవంబర్ 29 నుంచి సిద్దిపేటలో ఆమరణ దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు. 11 రోజుల పాటు కేసీఆర్ నిరాహార దీక్ష కొనసాగడంతో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు డిసెంబర్ 9వ తేదీ అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై వెనక్కి తగ్గిన కేంద్రం సంప్రదింపుల పేరిట 2009 డిసెంబర్ 23న మరో ప్రకటన చేసింది. దీంతో సరికొత్త వ్యూహానికి పదును పెడుతూ కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ సహా అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెస్తూ జేఏసీని ప్రతిపాదించారు.

స్వరాష్ట్ర కల సాకారం.. తొలిసారి అధికారం..: సుదీర్ఘ ఉద్యమ ఫలితంగా 2014 ఫిబ్రవరి 17న లోక్‌సభలో, 20న రాజ్యసభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొందింది. 2014 జూన్ 2న భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ మనుగడలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 2014 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ తొలిసారిగా ఒంటరిగా పోటీ చేసింది. 17 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసి 11 చోట్ల గెలుపొంది లోకసభలో ఎనిమిదో అతిపెద్ద పార్టీగా అవతరించింది. 119 అసెంబ్లీ స్థానాలకుగాను 63 చోట్ల గెలుపొంది సొంత బలంతో తెలంగాణ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టింది. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా 2014, జూన్ 2న ప్రమాణ స్వీకారం చేశారు.

ఫక్తు రాజకీయ పార్టీగా టీఆర్ఎస్..: రాష్ట్ర సాధన లక్ష్యంగా అవతరించిన టీఆర్ఎస్ ఫక్తు రాజకీయ పార్టీగా వ్యవహరిస్తుందని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించారు. రాజకీయ పునరేకీరణ పేరిట 2014–18 మధ్యకాలంలో టీడీపీ, కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వలసలను ప్రోత్సహించారు. బీఆర్ఎస్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత రాజకీయ పునరేకీకరణ పేరిట ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంది.

అధికార పీఠం నుంచి ప్రతిపక్ష స్థానానికి..: జాతీయ రాజకీయాల్లో ఎంట్రీ కోసం పార్టీ పేరును మార్చుకొని పొరుగు రాష్ట్రాల్లో అడుగు పెట్టేందుకు సన్నాహాలు చేసుకున్న బీఆర్ఎస్‌కు 2023 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఆ ఎన్నికల్లో 39 స్థానాల్లో మాత్రమే విజయం సాధించడంతో బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలో అడుగు పెట్టారు. పార్టీ ఆవిర్భవించిన 25 ఏళ్లలో బీఆర్ఎస్‌కు తొలిసారిగా లోక్‌సభ ప్రాతినిధ్యం లేకుండా పోయింది. 2014లో 11, 2019లో 9 సీట్లలో గెలుపొంది లోక్‌సభలో ఎనిమిదో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్.. 2024 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 17 స్థానాల్లో ఒక్కటి కూడా గెలుచుకోలేక పోయింది.

ఫిరాయింపులతో ఉక్కిరిబిక్కిరి..: అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నుంచి పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. వీరిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఏకంగా కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కీలక పదవులు అనుభవించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి వంటి నేతలు కూడా హస్తం గూటికి వెళ్లారు. పార్టీలో సెక్రటరీ జనరల్ పదవిలో ఉన్న రాజ్యసభ సభ్యుడు కేకే ఎంపీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పలువురు ఎమ్మెల్సీలు కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఈ నేపథ్యంలోనే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంను ఆశ్రయించింది. దానిపై విచారణ జరుగుతోంది.

పక్కా రోడ్ మ్యాప్‌తో ఉద్యమంలోకి..

కేసీఆర్ పక్కా రోడ్‌మ్యాప్ రూపొందించుకున్న తర్వాతే తెలంగాణ ఉద్యమంలో అడుగు పెట్టారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుకు మునుపు ఆయన లోతుగా విషయ పరిజ్ఞానం పెంచుకునేందుకు కసరత్తు చేశారు. 1969 ఉద్యమం నేర్పిన పాఠాల నుంచి 'శాంతియుత మార్గంలోనే తెలంగాణ' అనే నిర్ణయం తీసుకున్నారు. రక్తం చుక్క చిందించకుండా తెలంగాణ సాధిస్తానని, ఉద్యమం వీడితే రాళ్లతో కొట్టండి అని పిలుపునివ్వడం ద్వారా తన నిబద్ధతను చాటే ప్రయత్నం చేశారు.

ఉప ఎన్నికలు.. రాజీనామా అస్త్రాలు

లక్ష్య సాధనకు పదవులకు రాజీనామా, ఉప ఎన్నికలను అస్త్రంగా వాడిన నేత దేశ చరిత్రలో బహుశా కేసీఆర్ ఒక్కరేనేమో. భావజాల వ్యాప్తి, లక్ష్య సాధనకు ఉప ఎన్నికలతో ప్రయోగాలు చేశారు. ఉప ఎన్నికల అస్త్రం 2008లో విఫలమైనా, 2010లో ఉప ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై కేసీఆర్ పట్టును పెంచాయి. 2012లో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించడం ద్వారా జరిగిన ఉప ఎన్నికలు కేంద్రంపై తెలంగాణ ఇవ్వాల్సిన అనివార్యతను సృష్టించాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో డిపాజిట్లను కోల్పోగా కాంగ్రెస్ కూడా నాలుగు చోట్ల డిపాజిట్ గల్లంతు అయ్యింది.

అనునిత్యం ప్రజాక్షేత్రంలోనే..



టీఆర్ఎస్ ఏర్పాటు ద్వారా అనునిత్యం క్షేత్ర స్థాయిలోనే ఉండేలా కేసీఆర్ కార్యాచరణ కొనసాగింది. తెలంగాణ భావజాల వ్యాప్తికి వరుస బహిరంగ సభలు, నాగార్జునసాగర్ నీళ్ల, చేనేత కార్మికుల కోసం బిక్షాటన, విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సభ, పాలమూరు వలస కూలీల సమస్యపై పాదయాత్ర, జల సాధన సభ, సిద్దిపేట నుంచి సైకిల్ ర్యాలీ, ఫ్లోరైడ్ సమస్యపై పాదయాత్ర వంటి కార్యక్రమాలతో తొలి రెండేళ్లు కేసీఆర్ అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉండేలా చూసుకున్నారు. ఉద్యమానికి కీలక మలుపు అవసరమైన ప్రతీ సందర్భంలోనూ భారీ బహిరంగ సభలు నిర్వహించడం కేసీఆర్ శైలిగా మారిపోయింది.

ఉద్యమ సమయంలోనే 'దళితాభివృద్ధి'

తెలంగాణ రాష్ట్రంలో దళితుల అభివృద్ధికి అవసరమైన రోడ్‌మ్యాప్‌ను 2003లోనే సిద్ధం చేశారు. 2003 అక్టోబర్ 17న హైదరాబాద్ గ్రీన్ పార్కు హోటల్‌లో దళిత స్వయం సమృద్ధి సమావేశం నిర్వహించారు. అదే ఏడాది అక్టోబర్ 18, 19 తేదీల్లో టీఆర్ఎస్ ఎస్టీ, ఎస్సీ, బీసీ పాలసీలను విడుదల చేశారు. ఈ పాలసీలను ప్రజలకు వివరించేందుకు అక్టోబర్ 22న మేడారంలో పల్లెబాటను కేసీఆర్ ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రారంభించిన పథకాల్లో ఈ పాలసీలు మూలాధారంగా నిలిచాయి.

నేషనల్ ఫ్రంట్ కన్వీనర్‌గా కేసీఆర్

జాతీయ రాజకీయాలపై కేసీఆర్ తన ఆలోచన, మక్కువను ఉద్యమ సమయం నుంచే వివిధ రూపాల్లో బయటపెడుతూ వచ్చారు. ఓ వైపు క్షేత్ర స్థాయిలో తన కొత్త పార్టీని బలోపేతం చేస్తూనే మరోవైపు ఢిల్లీ రాజకీయాలను ప్రభావితం చేయడంపై కేసీఆర్ దృష్టి పెట్టారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న నాయకులు, పార్టీలకు ఒకే తాటి మీదకు తెచ్చి 2003 సెప్టెంబర్ 9న ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. కొత్త రాష్ట్రాల నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి దానికి కేసీఆర్ కన్వీనర్‌గా కొనసాగారు. 2008 ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రతికూల ఫలితాలు ఎదురైనా అధిగమిస్తూ ఢిల్లీలో 'థర్డ్ ఫ్రంట్' ఏర్పాటు దిశగా చర్చలు జరిపారు. 2008 జూలై 18 నుంచి 23 వరకు అజిత్ సింగ్, మాయావతి, దేవెగౌడ్ తదితరులతో చర్చలు జరిపారు. 2022లో బీఆర్ఎస్ స్థాపనకు ముందూ కేసీఆర్ జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ ఫ్రంట్ కోసం కేసీఆర్ ఇవే తరహా ప్రయత్నాలు చేయడం గమనార్హం.

ఎన్నికల పొత్తులు.. ఎత్తులు

టీఆర్ఎస్ ఆవిర్భంచిన కొద్ది నెలల్లోనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి 25 శాతం ఓటు బ్యాంకు సాధించిన కేసీఆర్.. 2004 సాధారణ ఎన్నికల్లో తమతో పొత్తు పెట్టుకోవాల్సిన అనివార్యతను కాంగ్రెస్‌కు సృష్టించారు. 2009 సాధారణ ఎన్నికల నాటికి తెలంగాణ ఏర్పాటు పట్ల విముఖంగా ఉన్న టీడీపీ, సీపీఐ, సీపీఎంతో కూడిన 'మహా కూటమి' తోనూ కేసీఆర్ వ్యూహాత్మకంగా ఎన్నికల అవగాహన కుదుర్చుకున్నారు. 2004లో కాంగ్రెస్ టీఆర్ఎస్‌కు లాభం చేకూర్చగా, 2009 ఎన్నికల్లో టీడీపీ కలిసి పోటీ చేయడం కలిసి రాలేదు. రాష్ట్ర అవతరణ తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ కేసీఆర్ ఒంటరిగా బరిలోకి దిగారు.

ఉద్యమ కాలం నుంచే రాజకీయ పునరేకీకరణ..: పార్టీని బలోపేతం చేయడం, ఎదుటి పార్టీలను బలహీన పరచడం లక్ష్యంగా కేసీఆర్ ఉద్యమ కాలం నుంచే రాజకీయ పునరేకీరణ వ్యూహానికి పదును పెడుతూ వచ్చారు. పార్టీ ఆవిర్భావ సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న రేగులపాటి పాపారావు (టీడీపీ), రావుల రవీంద్రనాథ్‌రెడ్డి (బీజేపీ), ఆలె నరేంద్ర (ఎంపీ బీజేపీ) కేసీఆర్‌తో కలిసి నడిచారు. 2009లో కేసీఆర్ ఆమరణ దీక్ష ఘట్టం తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ టి.రాజయ్య, టీడీపీ నుంచి జోగు రామన్న, గంప గోవర్దన్ టీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎంపీలు డాక్టర్ వివేక్, మందా జగన్నాథం, పలువురు మాజీ ఎంపీలు టీఆర్ఎస్‌లో చేరారు. ఇదే కోవలో 2014లో అధికారంలోకి వచ్చింది మొదలు 2014–23 మధ్యకాలంలో టీడీపీ, కాంగ్రెస్ లక్ష్యంగా కేసీఆర్ పునరేకీకరణ కొనసాగించారు.

ఉద్యమ రూపాలుగా కళలు.. పండుగలు..: రాష్ట్ర సాధన ఉద్యమంలో సాంస్కృతిక కోణాన్ని కూడా ఆవిష్కరించి ఉద్యమ రూపం ఇచ్చిన నేత కేసీఆర్. జానపద పాటలు, నృత్యాలు, ఒగ్గు కథలు, గొల్ల సుద్దులు, బుర్ర కథలు, యక్షగానాలు, బతుకమ్మలు, బోనాలు తెలంగాణ ఉద్యమానికి ఆలంబనగా నిలిచాయి. ధూంధాం, వంటావార్పు, సడక్ బంద్, రైలు రోకో, సాగర హారం, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, తదితరాలు కొత్త ఉద్యమ రూపాలను ఆవిష్కరించాయి.

స్వరాష్ట్ర ఆకాంక్ష ప్రతీక 'తెలంగాణ తల్లి'..: తెలుగుతల్లి అస్తిత్వాన్ని 'ఎవరి తల్లి.. ఎక్కడి తల్లి' అని ప్రశ్నించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే 'తెలంగాణ తల్లి' అనే భావనకు కేసీఆర్ పురుడు పోశారు.

జేఏసీ.. వినూత్న ఆలోచన..: ఎన్నికల్లో పొత్తులతో ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, టీడీపీలను తెలంగాణవాదంతో కట్టిపడేసిన కేసీఆర్ తర్వాతి కాలంలో ఈ వ్యూహాన్ని మరింత విస్తృతం చేశారు. 2009 డిసెంబర్ 9 నాటి ప్రకటనపై కేంద్రం వెనక్కి తగ్గిన నేపథ్యంలో అన్ని పార్టీలు, శక్తులను ఏకతాటిపైకి తెచ్చేందుకు 'జాయింట్ యాక్షన్ కమిటీ' అనే ఎత్తుగడను తెరమీదకు తెచ్చారు. 2009 డిసెంబర్ 23న నాటి కాంగ్రెస్ కీలక నేత జానారెడ్డి నివాసంలో అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి 'జేఏసీ' ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రొఫెసర్ కోదండరాం జేఏసీ చైర్మన్‌గా కళింగ ఫంక్షన్ హాల్‌లో తొలి భేటీ నిర్వహించారు. తర్వాతి కాలంలో ఈ జేఏసీ నుంచి కాంగ్రెస్, టీడీపీ వైదొలిగినా బీజేపీ, ఇతర పక్షాలు చివరి వరకూ కొనసాగాయి. విభిన్న భావజాలాలు కలిగిన పార్టీలు, సంస్థలు, ఉద్యోగసంఘాలు జేఏసీ వేదికగా పనిచేశాయి.

కలానికి పదును పెట్టిన కేసీఆర్..: రాష్ట్ర సాధన ఉద్యమంలో టీఆర్ఎస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలంగాణ కళలు, సాహిత్యాన్ని ఆయుధంగా మార్చిన వైనం కూడా కేసీఆర్‌లో చూడొచ్చు. అవసరమైన సందర్భంలో తాను కలం చేతబట్టి పాటలు రాసిన సందర్భాలు కూడా ఉన్నాయి. 'సిపాయిల తిరుగుబాటు విఫలం అయ్యిందని.. అనుకుంటే వచ్చేదా దేశానికి స్వాతంత్ర్యం, రాజీలేని పోరాటమే విజయం సాధిస్తుంది.. ముమ్మాటికి తెలంగాణ రాష్ట్రమొచ్చి తీరుతుంది' అని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యమ నేపథ్యంలో వచ్చిన జై బోలో తెలంగాణ సినిమాలో 'గారడీ చేస్తుంద్రు.. గజిబిజి చేస్తుంద్రు' అంటూ తెలంగాణ వ్యతిరేకుల తీరును ఎండగట్టారు.

చెప్పినదీ.. చెప్పనిదీ చేయడమే..!..: ప్రత్యేక రాష్ట్రం నేపథ్యంలో ఏర్పడిన ప్రభుత్వాధినేతగా తాను చెప్పినదీ చెప్పనిదీ కూడా చేసి చూపడం ద్వారా కేసీఆర్ తన వినూత్న శైలిని చాటుకుంటూ వస్తున్నారు. 2014 జూన్ 2 నుంచి 2018 సెప్టెంబర్ 6 వరకు 51 నెలల పాటు సాగిన పాలనలో వినూత్న నిర్ణయాలతో విమర్శలు, ప్రశంసలు పొందిన సందర్భాలు అనేకం. బీపీఎల్ ఆదాయ పరిమితి, ఆసరా పెన్షన్ల పెంపు, బీడీ కార్మికులకు భృతి వంటి సంక్షేమ పథకాలతో పాటు 'కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్' వంటి వినూత్న పథకాలతో ప్రజల్లోకి వెళ్లారు. 2014–18 వరకు ముఖ్యమంత్రిగా తొమ్మిదిన్నరేళ్ల ప్రస్థానంలో సుమారు 500 సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి ఆచరణలో చూపిన నేత కేసీఆర్. ఎన్నికల మేనిఫెస్టోలో లేని దళితబంధు, చేప పిల్లల పంపిణీ వంటి పథకాలు లెక్కకు మిక్కిలి. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకున్న నేతగా పేరొందిన కేసీఆర్ వ్యవసాయం, నీటిపారుదల, ఐటీ, పరిశ్రమలు, విద్య ఇలా ప్రతీ రంగంపైనా తనదైన ముద్ర వేశారు.

ప్రతిపక్ష నేతగా మరో ప్రస్థానం..: నాలుగు దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో ఉంటూ ఉద్యమ నేతగా, ప్రభుత్వాధిపతిగా పనిచేసిన కేసీఆర్ 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఓటమితో ప్రతిపక్ష నాయకుడి పాత్రలోకి మారిపోయారు. ఎర్రవల్లి నివాసం నుంచే పార్టీ యంత్రాంగాన్ని నడుపడంలోనూ విలక్షణ శైలిని చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ఎండగట్టడంలో పార్టీకి దిశా నిర్దేశం చేస్తూ పాలక పక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

> 'ప్రారంభించిన లక్ష్యాన్ని అందుకునే అవకాశం అతి కొద్దిమందికే దక్కుతుంది. తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా ముగించిన అరుదైన నాయకుడు. కేంద్ర మంత్రిగా ఏ శాఖ కేటాయించాలని అడిగినప్పుడు "నా లక్ష్యం మీకు తెలుసు. నాకు తెలంగాణ రాష్ట్రం కావాలి. ఏ శాఖ ఇచ్చినా నాకు అంగీకారమే' అంటూ వ్యక్తిగత అవకాశాల కంటే తెలంగాణ సాధనకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడు' అంటూ దివంగత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన ఆత్మకథ 'ది కొయలేషన్ ఇయర్స్ 1996-2012'లో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్) వ్యవస్థాపకుడు కేసీఆర్ గురించి చేసిన వ్యాఖ్యలు.



2001 మే 17న కరీంనగర్ సింహగర్జన సభలో..



ఆమరణదీక్ష విరమిస్తూ..



సీఎంగా ప్రమాణం చేస్తూ..

సాక్షి హైదరాబాద్

ఆదివారం : 27 : ఏప్రిల్ : 2025



అక్రమంగా ఆరువేల మంది!
నగర శివారులోని బాలాపూర్, పహాడీషరీఫ్, జల్‌పల్లి, కంచన్‌బాగ్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో అక్రమంగా ఆరువేల మంది రోహింగ్యాలు ఉన్నట్లు సమాచారం. -12లో



చల్లచల్లగా.. వేడి తాక'కుండ'..
నగర మార్కెట్లతో పాటు ఆన్‌లైన్ వేదికలు, ఆర్గానిక్ బజార్లలో మట్టి కుండలకు గిరాకీ ఏర్పడింది. వేసవి దాహార్తి తగ్గాలంటే కుండ నీరే శరణ్యమని పలువురు భావిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
38.0/25.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 38, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





మిస్ వరల్డ్ పోటీలపై నిరసన

నగరంలో వచ్చే నెలలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తూ శనివారం పీఓడబ్ల్యూ, ఐద్వా, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

సుస్మిత శోభితం!



బంజారాహిల్స్: మనలోని విలువలు, క్రమశిక్షణనే పిల్లలు నేర్చుకుంటారని మాజీ విశ్వ సుందరి, బాలీవుడ్ నటి సుస్మితాసేన్ అన్నారు. హైవిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో థ్రెడ్స్ ఆఫ్ హోప్– విద్యపై దాతృత్వం అనే అంశంపై శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో బాలీవుడ్ నటీమణులు దియామీర్జా, సుస్మితా సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుస్మితా సేన్ మాట్లాడుతూ.. తాను మిస్ యూనివర్స్ అయిన తర్వాత లైఫ్‌లో ఎన్నో విషయాలు తెలుసుకున్నానన్నారు. దియా మీర్జా మాట్లాడుతూ.. ఉల్లాసంగా ఉంటేనే జీవితం ఉత్సాహంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

'తెలంగాణ'కు జల'దృశ్యం'

కొండా లక్ష్మణ్ నివాసంలో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి

- అమర వీరుల స్తూపం వద్ద టీఆర్ఎస్ ఏర్పాటు ప్రకటన
- అదేరోజు పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ బాధ్యతల స్వీకరణ
- మలిదశ ఉద్యమాన్ని పదునెక్కించిన భాగ్యనగరం



సాక్షి, సిటీబ్యూరో:

అది 2001, ఏప్రిల్ 27వ తేదీ. చారిత్రక హుస్సేన్‌సాగర్ తీరం. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యం. ఇక్కడే గులాబీ జెండా గుబాళించింది. సాగర్ కెరటాల వలే కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ నింగిలో రెపరెపలాడింది. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి ఊపిరి పోసుకుంది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో శాసనసభ్యుడిగా, డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతున్న కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) అదే రోజు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వం సహా అన్ని పదవులకు రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టారు. అలా.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో తొలి అధ్యాయానికి అంకురార్పణ జరిగింది. మలిదశ ఉద్యమాన్ని మరింత పదునెక్కించి రాజకీయ స్వరూపాన్ని సంతరించుకుంది. అదొక చారిత్రక సందర్భం. ఆ రోజు నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించే వరకు ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) అనేక కార్యక్రమాలను చేపట్టింది. వినూత్నమైన పద్ధతిలో పోరాటాలను కొనసాగించింది. పార్టీ అధినేతగా కేసీఆర్ పిలుపునందుకుని అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. తొలినాళ్లలో జలదృశ్యంలో పార్టీ సమావేశాలు, కార్యకలాపాలు కొనసాగాయి.

వారం రోజుల్లోనే భవనం అప్పగింత..

నిజానికి 2000 సంవత్సరం నాటికే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమం ఒక స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేసేందుకు.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకొనేందుకు ఒక రాజకీయ పార్టీ అవసరమని భావించిన కొందరు ప్రముఖులు కేసీఆర్ నేతృత్వంలో దానిని స్థాపించేందుకు ముందుకు వచ్చారు. అలా దేశిని చినమల్లయ్య, మందాడి నర్సింహారెడ్డి, గాదె ఇన్నయ్య, సురేందర్‌రెడ్డి, మధుసూధనాచారి తదితరులు కేసీఆర్‌తో కలిసి 2000 సంవత్సరంలోనే పార్టీ పేరు, గుర్తు, జెండా ఖరారు చేశారు. ఆ మరుసటి సంవత్సరం ఏప్రిల్ 17వ తేదీన పత్రికా సమావేశం ఏర్పాటు చేసి అధికారికంగా టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఆ సమయంలోనే ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వద్దకు వెళ్లి పార్టీపై ఆయనతో చర్చించారు. అప్పటి వరకు టీఆర్ఎస్‌కు కార్యాలయ భవనం లేదు. దీంతో జలదృశ్యం భవనంలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ఆయన ముందు ఉంచారు. అందుకు ఆయన వెంటనే అంగీకరించారు. వారం రోజుల్లోనే భవనాన్ని ఖాళీ చేసి అశోక్‌నగర్‌కు వెళ్లిపోయారు.

- అలా 2001వ సంవత్సరం ఏప్రిల్ 27వ తేదీన జలదృశ్యంలో టీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభమైంది. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు కేసీఆర్ తన ఉద్యమ అనుచరులతో కలిసి గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఒక ప్రదర్శనగా బయలుదేరి జలదృశ్యం భవనానికి చేరుకున్నారు. ఆ రోజు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నినాదాలు, 'జై తెలంగాణ' పాలి కేకలు మిన్నంటాయి. ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక రాష్ట్రం కోసం కలలు కంటున్న తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు జలదృశ్యం వైపు ఆశావహంగా దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్ర సమితికి అధ్యక్షుడిగా కేసీఆర్ పేరును నిమ్మ నర్సింహారెడ్డి ప్రతిపాదించగా, గాదె ఇన్నయ్య బలపరిచారు. టీఆర్ఎస్ అధ్యక్షుడిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టడానికి ముందు డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు, టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

ఆనాటి లక్ష్యాలు ఇవి..

'నీళ్లు, నిధులు, నియామకాలు' తెలంగాణ ప్రజల ఆకాంక్షలుగా, ఉద్యమ నినాదాలుగా మారినప్పటికీ మొట్టమొదట ఐదు అంశాలను పార్టీ ఎజెండాగా ప్రస్తావించారు.

- తెలంగాణలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలి. నిరుపేద, సామాన్య, మధ్య తరగతి తదితర వర్గాల ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలి.
- ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి. ఉపాధి హామీకి చట్టబద్ధతను కల్పించాలి.
- తెలంగాణ సంపదను కాపాడాలి.
- తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకోవాలి.



గులాబీ అంబాసిడర్ కార్ల శ్రేణి

ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత

గచ్చిబౌలి: బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు వినూత్న రీతిలో 25 గులాబీ అంబాసిడర్ కార్ల శ్రేణిని శనివారం ఎమ్మెల్సీ కవిత జెండా ఊపి ప్రారంభించారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకుడు రవి యాదవ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నుంచి కార్ల శ్రేణిని ఆమె ప్రారంభించారు. 25 అంబాసిడర్ కార్లను గులాబీ రంగుతో తీర్చిదిద్దారు. ఈ కార్లలో రవి యాదవ్ బృందం ఎల్కతుర్తి బహిరంగ సభకు బయలుదేరింది.

చీకట్లు తొలగేనా!

ఈ నెలాఖరులో ఈఈఎస్ఎల్‌తో వీధి దీపాల నిర్వహణ గడువు ముగింపు

- సొంతంగానే నిర్వహణ చేపట్టనున్న జీహెచ్ఎంసీ
- ఆ ఫలితాలతో భవిష్యత్ కార్యాచరణ చేపట్టే అవకాశం



లెక్కల కోసం..

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే పలు ప్రాంతాల్లో కారుచీకట్లతో అల్లాడుతున్న నగర ప్రజలకు వీధిదీపాల సమస్యలు తగ్గుతాయో, పెరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏడేళ్ల క్రితం ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటుతో పాటు నిర్వహణ ఒప్పందం కుదుర్చుకున్న ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ (ఈఈఎస్ఎల్) గడువు ఈ నెలాఖరుతో ముగిసియనుంది. మే 1 నుంచి జీహెచ్ఎంసీయే స్వయంగా నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు సంబంధిత యంత్రాంగం సిద్ధమైంది. ఎల్ఈడీ పేరిట జీహెచ్ఎంసీకి ఏటా విద్యుత్ ఖర్చుల భారం తగ్గుతుందని వాటిని ఏర్పాటు చేసిన ఈఈఎస్ఎల్.. ఒప్పందానికి అనుగుణంగా పని చేయలేదనే చెప్పాలి. ఏడేళ్ల వరకు అంటే, ఈ నెల 30 వరకు 98 శాతం వెలుగులుంటాయని చెప్పినప్పటికీ, ఏ రోజూ అది సక్రమంగా అమలు కాలేదు. డ్యాష్‌బోర్డు నిర్వహణ మొదలు ఎస్ఎంఎస్ బాక్సుల (స్విచింగ్ పాయింట్లు) ఏర్పాటు దాకా అన్నీ ఉల్లంఘనలే. కాగా.. గడువు ముగిసిపోతుండటంతో రెండు మూడు నెలల వరకు తామే నిర్వహణ చేపడితే నిర్వహణపై తగిన అవగాహన వస్తుందనే తలంపుతో సంబంధిత అధికారులున్నారు. రెండు మూడు నెలల పాటు నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈలోగా విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి, ప్రభుత్వ సూచనకనుగుణంగా కొత్త ఏజెన్సీని నియమించడమో, లేక ఎలా చెబితే అలా చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

థర్డ్‌పార్టీ సేవలు..

జీహెచ్ఎంసీతో ఒప్పందం కుదుర్చుకున్న ఈఈఎస్ఎల్ నిర్వహణ బాధ్యతల్ని థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లకు అప్పగించింది. కాంట్రాక్టర్లు సిబ్బందిని నియమించుకొని పనులు చేస్తున్నారు. ఈఈఎస్ఎల్‌కు పని చేసిన కాంట్రాక్టు ఏజెన్సీలే జీహెచ్ఎంసీకి సైతం పని చేయనున్నట్లు తెలిసింది. ఒక్కో వీధిదీపం నిర్వహణకు జీహెచ్ఎంసీ ఈఈఎస్ఎల్‌కు రూ.22 చెల్లించగా.. కాంట్రాక్టు ఏజెన్సీలకు రూ.18 చెల్లించనున్నట్లు సమాచారం. ఒప్పందం మేరకు వెలగాల్సిన వీధిదీపాలు 5,40,494 కాగా, వాస్తవంగా ఎన్ని ఉన్నాయో లెక్కలే లేవు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. ఇప్పటికి దాదాపు 2.40 లక్షల సర్వే పూర్తికాగా, మిగతా వాటి సర్వే త్వరలో పూర్తికానుంది.సర్వే పూర్తయితే వాస్తవంగా ఎంత కేబుల్ అవసరం.. ఇతరత్రా వివరాలూ తెలియనున్నాయి. ప్రస్తుతం కేబుల్ పేరిట సైతం జీహెచ్ఎంసీలో భారీయెత్తున నిధుల దుబారా జరిగినట్లు తెలుస్తోంది. సర్వే పూర్తి చేశాక ప్రతి వీధిదీపం వెలిగిన సమయాన్ని బట్టే చెల్లింపులు చేసేందుకు, అందుకు తగిన సాంకేతిక ఏర్పాట్లు చేసుకునేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఇతర నగరాలు సైతం తిరిగి దానితో ఒప్పందానికి సుముఖంగా లేవని సమాచారం. జీహెచ్ఎంసీ సైతం అదే ఆలోచనలో ఉండగా.. ఈఈఎస్ఎల్ సైతం జీహెచ్ఎంసీలో పనిచేసేందుకు సిద్ధంగా లేదని తెలుస్తోంది. తమకు జీహెచ్ఎంసీ నుంచి రూ.150 కోట్ల బకాయిలున్నట్లు ఈఈఎస్ఎల్ చెబుతుండగా, నిర్వహణ లోపంతో ఈఈఎస్ఎల్ పెనాల్టీ బకాయిలు రూ. 200 కోట్ల దాకా ఉన్నట్లు జీహెచ్ఎంసీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

రెండు నెలల్లో తేలుతుంది..

ఎల్ఈడీ దీపాల వల్ల జీహెచ్ఎంసీకి ఏడేళ్లలో దాదాపు రూ.673 కోట్లు ఆదా అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు. దాంతో మిగిలే నిధులే ఈఈఎస్ఎల్‌కు చెల్లిస్తామని జీహెచ్ఎంసీ రూ.563.58 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. కానీ, నిధుల మిగులు సంగతి అటుంచి ప్రజలకు చీకట్లు మాత్రం తప్పలేదు. జీహెచ్ఎంసీ స్వీయ నిర్వహణలో ప్రజలకు చీకట్లు తొలగుతాయో, లేక సమస్యలు పెరుగుతాయో రానున్న రెండు నెలల్లో వెల్లడి కానుంది.

ప్రయాణికురాలికి అస్వస్థత.. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఎయిర్‌పోర్టులో బాధితురాలి మృతి

శంషాబాద్: ప్రయాణికురాలు అస్వస్థతకు గురికావడంతో.. వారణాసి నుంచి బెంగళూరు వెళ్తున్న విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్ సీఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బెంగళూరు పద్మనాభనగర్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం పదిరోజుల పాటు ఉత్తర భారత యాత్ర పూర్తి చేసుకుని శుక్రవారం రాత్రి ఇండిగో విమానం 6ఈ–499 విమానంలో బెంగళూరుకు బయలుదేరింది. అర్ధరాత్రి మార్గంమధ్యలో ఉన్న సమయంలో ప్రయాణికురాలు తులసమ్మ (76)కు గుండెపోటు రావడంతో విమానంలోనే సీపీఆర్ చేశారు. సిబ్బంది సమాచారం మేరకు పైలట్ శంషాబాద్ ఏటీసీ నుంచి అనుమతి తీసుకుని విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించి అత్యవసరంగా దింపారు. వృద్ధురాలిని హుటాహుటిన ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు..



నగరాన్ని వీడిన ఓ పాకిస్థానీ

- విమానంలో దుబాయ్‌కి ప్రయాణం
- నేడు మరో ముగ్గురు వెళ్లే అవకాశం
- ఎల్‌టీవీలపై వైఖరి చెప్పని కేంద్రం



సాక్షి, సిటీబ్యూరో: పాకిస్థాన్ నుంచి షార్ట్ టర్మ్ వీసాపై (ఎస్‌టీవీ) నగరానికి వచ్చిన నలుగురు పౌరుల్లో ఒకరు శనివారం వెళ్లిపోయారు. సిటీ పోలీసులు నోటీసులు జారీ చేయడంతో విమానంలో దుబాయ్ వెళ్లిపోయాడు. మిగిలిన ముగ్గురూ ఆదివారం వెళ్లిపోయే అవకాశం ఉంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర దేశంలో ఉన్న పాకిస్థానీయుల వీసాలు రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ప్రస్తుతానికి ఎస్‌టీవీ కేటగిరీకి చెందిన వారిని ఆదివారం లోపు పంపాలంటూ కేంద్రం ఆదేశించింది. దీంతో నగర పోలీసులు శనివారం ఆ నలుగురికీ నోటీసులు జారీ చేశారు. వీరిలో ఓ పురుషుడు, ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. పురుషుడు, ఓ మహిళ వేర్వేరుగా సిటీకి రాగా... తన చిన్నారితో మరో మహిళ వచ్చారు. శనివారం పురుషుడు శంషాబాద్ విమానాశ్రయం నుంచి విమానంలో దుబాయ్ వెళ్లిపోయాడు.

- నగరంలో ఉన్న 199 మంది పాకిస్థానీల్లో ఈ నలుగురే ఎస్‌టీవీతో వచ్చారు. సైబరాబాద్‌లో ఉంటున్న 11 మంది లాంగ్ టర్మ్ వీసా (ఎల్‌టీవీ)తోనే ఉంటుండటంతో వారికి ప్రస్తుతం నోటీసులు జారీ చేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మొత్తం ముగ్గురు పాకిస్థానీలు ఉన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన అన్నదమ్ముల్ని వివాహం చేసుకున్న అక్కాచెల్లెళ్లు లాంగ్ టర్మ్ వీసాపై ఉంటున్నారు. వీరి వీసా గడువు సెప్టెంబర్ వరకు ఉండటంతో పాటు కేటగిరీ వేరు కావడంతో వీరిని పంపే ఆస్కారం లేదని తెలుస్తోంది. ఇక్కడి యువకుడు దుబాయ్‌లో ఉండగా అతడిని ప్రేమ వివాహం చేసుకున్న మరో పాకిస్థానీ ప్రస్తుతం భర్తతో కలిసి వాసవీ కాలనీలో నివసిస్తున్నారు.
- ఈమె లాంగ్‌టర్మ్ వీసా గడువు గతంలోనే ముగిసిపోయింది. భర్తతో కలిసి జీవిస్తున్న తనకు వీసా పొడిగించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఈ మహిళ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో ఆమె విషయంలోనూ పోలీసులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నిఘా విభాగానికి చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'ప్రస్తుతం కేంద్రం నుంచి కేవలం షార్ట్ టర్మ్ వీసాలు ఉన్న వారికే నోటీసులు జారీ చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. లాంగ్‌టర్మ్ వీసాలు ఉన్న వారికి సంబంధించి ఎలాంటి స్పష్టత లేదు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి వచ్చే తదుపరి ఆదేశాలను బట్టి వీరిపై నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు.

పవర్ పైపైకి..



గ్రేటర్‌లో 16.13 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం

- 2024 ఏప్రిల్‌తో పోలిస్తే.. ఈసారి అనూహ్యంగా డిమాండ్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

గ్రేటర్‌లో ఏప్రిల్ మాసంలో విద్యుత్ డిమాండ్ ఇలా..

సంవత్సరం	మెగావాట్లు
2022	3,435
2023	3,756
2024	4,352

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరుగుతోంది. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే.. ప్రస్తుత ఏప్రిల్ మాసంలో 16.13 శాతం వృద్ధిరేటు నమోదైంది. అత్యధికంగా రంగారెడ్డి జోన్‌లో 17.77 శాతం వృద్ధిరేటు నమోదు కాగా.. ఆ తర్వాత స్థానంలో మేడ్చల్ జోన్‌లో 16.31 శాతం నమోదైంది. మెట్రో జోన్‌లో 13.86 శాతం నమోదైంది. ఇక సర్కిళ్ల వారీగా పరిశీలిస్తే.. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్, కొండాపూర్ డివిజన్లలో అత్యధికంగా 31.75 శాతం వృద్ధి రేటు నమోదు కాగా, బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని గ్రీన్‌లాండ్స్, బంజారాహిల్స్ డివిజన్ల పరిధిలో 22.62 శాతం, మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ డివిజన్లలో 20.20 శాతం పెరుగుదల కన్పించింది. ఐటీ కంపెనీలు, వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్న సైబర్‌సిటీలో విద్యుత్ డిమాండ్ భారీగా నమోదవుతుండటం గమనార్హం. భవిష్యత్ అవసరాల మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు ఇప్పటికే కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం (పీటీఆర్) 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు పెంచారు. అధిక లోడ్‌తో సమస్యలు ఎదుర్కొంటున్న ఫీడర్లను విభజించి, ప్రత్యామ్నాయంగా మరో ఫీడర్‌కు అనుసంధానించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యను నియంత్రించేందుకు ఎర్తింగ్ సదుపాయాలను కల్పించారు.

భార్యను కాదని మరో యువతితో సహజీవనం

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ భర్త

కేపీహెచ్‌బీకాలనీ: భార్యను కాదని మరో యువతితో సహజీవనం చేస్తున్న భర్తను భార్య బంధువులతో కలిసి వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. బాధితులు, కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన మేరకు.. బాలానగర్ ఐడీపీఎల్ కాలనీకి చెందిన కర్రి దీప్తి రాణి (31)కి శ్రీకాకుళానికి చెందిన సన్నపాల శివాజీరావు (33)కు 2019లో వివాహం జరిగింది. 2021లో దీప్తికి కూతురు జన్మించింది. ఈ క్రమంలో శివాజీరావు ప్రతి చిన్న విషయానికి భార్య దీప్తితో ఘర్షణ పడేవాడు. విడాకులు ఇస్తానని బెదిరించేవాడు. భర్త, అత్తమామలు కూడా కట్నం కోసం వేదించేవారు. ఆడపిల్ల పుట్టిందని ఇంటికి తీసుకెళ్లేందుకు సుముఖత చూపలేదు. భర్తతో కాపురం చేసేందుకు దీప్తి ప్రయత్నించినా శివాజీరావు నిరాకరించాడు. దీంతో భర్త గురించి వాకబు చేసిన దీప్తి తన భర్త మరో యువతితో సహజీవనం చేస్తున్నాడని తెలుసుకుంది. శనివారం బంధువులతో కలిసి నిజాంపేట రోడ్డులోని శివాజీరావు ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి బెడ్రూంలో యువతీతో ఉన్న శివాజీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శివాజీ, అతని తల్లిదండ్రులు, అమ్మమ్మలు, తాతయ్యలు, బంధువులపై వరకట్నం వేదింపుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మహనీయుల జన జాతర సభ

ఇబ్రహీంపట్నం: పూలే, అంబేడ్కర్ మహనీయుల జన జాతర సభను ఇబ్రహీంపట్నంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ సామేల్, కార్యదర్శి మస్కు ప్రకాశ్ కారత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు సల్మాన్‌ఖాన్

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన మేరకు.. సుభాష్‌నగర్‌లోని సీఎంఆర్ స్కూల్ సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయాలు చేపడుతున్నాడని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అక్కడికి చేరుకోగా అనుమానాస్పదంగా తచ్చాడుతున్న వ్యక్తి పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా నల్లటి రంగు కవర్‌లో రూ.1350 గ్రాముల గంజాయి పట్టుబడింది. అతనిని విచారించగా జీడిమెట్ల గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ సమీపంలో నివసించే పఠాన్ సల్మాన్‌ఖాన్(26)గా గుర్తించారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య



పూజా గుప్త (ఫైల్)

దుండిగల్: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఓ మహిళ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జై సింగ్‌గుప్త కుటుంబంతో కలిసి దుండిగల్ తాండా–2లో నివసిస్తున్నాడు. ఇతనికి భార్య పూజా గుప్త(35) ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన పూజా ఈ నెల 25న సాయంత్రం గాగిల్లాపూర్‌లోని చెరువులో దూకింది. శనివారం చెరువులో మహిళ మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబ తగాదాల కారణంగానే తాను చనిపోతున్నానని, పిల్లలను మంచిగా చూసుకోవాలని సెల్‌ఫోన్‌లో వీడియో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చెత్త కుప్పలో నవజాత శిశువు మృతదేహం

కుత్బుల్లాపూర్: నవజాత శిశువు మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. కొంపల్లి గ్రీన్ పార్కు ఎవెన్యూలోని చెత్తకుప్పలో శనివారం ఓ నవజాత శిశువు మృతదేహం ఉండటతో స్థానికులు 100 నెంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పాతికేళ్లుగా కేసీఆర్ వెంటే ఉన్నా..

- పార్టీలో జీవిత కాలం రెండో సభ్యత్వం నాదే..
- కేసీఆర్ ఎక్కడికి బయలుదేరినా.. ఇమామ్–ఎ–జామీన్
- 'సాక్షి'తో మాజీ హోం మంత్రి మహమూద్ అలీతో



సాక్షి, సిటీ బ్యూరో: తెలంగాణలో అభివృద్ధిని పరుగులు పెట్టించి, పేద ప్రజలకు సంక్షేమాన్ని పంచిన కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) వ్యవస్థాపక సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ పాతికేళ్ల పండుగ సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో తన ఉద్యమ అనుభవాలను పంచుకున్నారు.

- ప్రజలు ఒక్కసారి చేసే పొరపాటుతో కాంగ్రెస్‌ను ఐదేళ్లు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారు. తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక కేసీఆర్ అని, బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ద్వారా మరోసారి రుజువు కానుంది.
- రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే తెలంగాణ రాష్ట్ర సాధన కల సంతృప్తి ఇచ్చింది. హైదరాబాద్ పాతబస్తీ నుంచి పాతికేళ్లుగా కేసీఆర్ వెన్నంటే నడుస్తున్నా, టీఆర్‌ఎస్ పార్టీ అవిర్భావం కంటే ముందు పత్రికలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం రాబోతున్నట్లు చదివి వెంటనే ఆయన ఇంటికి వెళ్లి కలిశా..
- హైదరాబాదీ ముస్లిం – తెలంగాణ ఉద్యమంలో ఎలా కలిసివస్తావని పలువురు ప్రశ్నించారు. అప్పుడు నేను విద్యార్థి దశలోనే 1969 తెలంగాణ ఉద్యమ్యంలో కీలక పాత్ర పోషించా. ఆ తర్వాత ఉద్యమం చల్లారడం కుటుంబ వ్యాపారంలో నిమగ్నమయ్యా.
- తెలంగాణ వస్తే ఆంధ్ర పాలకుల పెత్తనం పోయి మా నీళ్లు, మా విద్యుత్, మా ఉద్యోగాలు మాకు వర్తిస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశా. అప్పుడు నన్ను పై ఫ్లోర్‌కు తీసుకెళ్లి నా పేరు అడిగి మహమూద్ భాయి.. మాతో జత కలవండి ...కొట్లాది తెలంగాణ సాధిద్దామని చెప్పి భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే పిలుపు..
- ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఒక తండ్రిగా కేసీఆర్ ను గౌరవిస్తూ వ్యూహాలకు అనుగుణంగా పనిచేస్తూ వస్తున్నా. పార్టీ ఆవిర్భావం నుంచి తన నివాసంలోని ఆఫీస్‌లో కేసీఆర్‌కు ప్రత్యేక చాంబర్, కుర్చీ ఉందని గుర్తు చేశారు. టీఆర్‌ఎస్ పార్టీలో జీవిత కాలం రెండో సభ్యత్వం నాదే..
- కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తుంటే తన తల్లి, సతీమణి మినహా బంధువులు, మిత్రులు, తోటి వ్యాపారులందరూ ఉద్యమం పేరుతో తూటాలు, లాఠీ దెబ్బలు ఎందుకు తింటావు... ప్రశాంతంగా వ్యాపారం చేసుకోమని ఉచిత సలహా ఇచ్చారు.
- కానీ, తెలంగాణ సాధన కల లక్ష్యంతో ముందుకు సాగితే.. ప్రత్యేక రాష్ట్ర సాకారంతో పాటు ఊహించని విధంగా డిప్యూటీ సీఎం,హోం మంత్రి లాంటి కీలక పదవులు నిర్వహించే భాగ్యం కలిగింది. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు కేసీఆర్ ఎక్కడికి బయలుదేరినా.. ఆయన చేతికి ఇమామ్–ఎ–జామీన్ కడుతున్నా.
- ఒక సారి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి 1000 కార్ల ర్యాలీ బయలు దేరినప్పుడు తాను జ్వరంతో ఇమామ్–ఏ జామిన్ కట్టడం మర్చిపోగా.. మహమూద్ భాయి దట్టీ తేలేదా అని అడిగి చాంద్రాయణ గుట్ట వద్ద అరగంట సేపు ర్యాలీ నిలిపి వేశారు .దట్టీ తీసుకొచ్చి కట్టి తర్వాత ర్యాలీ ముందుకు సాగిందని గుర్తు చేసుకున్నారు.

భారీ అగ్ని ప్రమాదం..
300 గుడిసెలు దగ్ధం

కట్టుబట్టలతో పరుగులు తీసిన బాధితులు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులోని వివాదాస్పద స్థలంలోని గుడిసెల్లో శనివారం అగ్ని ప్రమాదం జరిగి సుమారు 300 పైగా గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఎగిసి పడుతూ విస్తరిస్తుండడంతో బాధితులు గుడిసెల నుంచి బయటికి పరుగులు తీశారు. ఐదు అగ్నిమాపక వాహనాలతో మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



గుడిసెలు కాలిపోయి బూడిద మిగిలిన దృశ్యం

ఎలా జరిగిందంటే. ?

కుంట్లూరు సర్వేనెంబర్ 214 నుంచి 224 వరకు ఉన్న సుమారు 100 ఎకరాలు భూమిపై కొంత కాలంగా వివాదం కొనసాగుతుంది. ఈ భూమి తమకు చెందుతుందని ప్రైవేటు వ్యక్తులు వాదిస్తుండగా ఇది భూదాన భూమి అని సీపీఐ నాయకులు వాదిస్తున్నారు. ఈ వివాదం కోర్టులో కొనసాగుతుండగా సీపీఐ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం వేలాది మంది పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. కోర్టు వివాదం ఉన్న భూమిలోని గుడిసెలలో అగ్ని ప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా తగలబెట్టారా... ప్రమాద వశాత్తు జరిగిందా... అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ ప్రవీణ్‌కుమార్, సీఐ నాగరాజుగౌడ్, ట్రాఫిక్ సీఐలు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సందర్శించారు.ఈ ప్రమాదంపై అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుడిసెలు తగులబడి సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకుంటామన్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు.



మంటల్లో కాలిపోతున్న గుడిసెలు

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురి అరెస్ట్

రూ. 4.10 లక్షలు స్వాధీనం

సైదాబాద్: ఆఫ్‌లైన్ విధానంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి కేశవనగర్ కాలనీలో ఒక ఇంటిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సైదాబాద్ పోలీసులకు ఈనెల 24న రాత్రి సమాచారం అందింది. వెంటనే సైదాబాద్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. అక్కడ నలుగురు వ్యక్తులు ఆఫ్‌లైన్ విధానంలో పంటర్ల నుంచి డబ్బు వసూలు చేస్తూ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని పోలీసులు నిర్ధారించారు. వారిని గుడిమల్కాపూర్‌కు చెందిన జి.శరత్ చంద్ర, కార్వాన్‌కు చెందిన సందీప్‌కర్ సాగర్, తాళ్లగడ్డకు చెందిన జి.సాయికుమార్, కేశవ్‌నగర్‌కు చెందిన జి.ఉత్తమ్ చంద్ర యాదవ్‌గా పోలీసులు గుర్తించారు. వారి నుండి రూ. 4.10 లక్షల నగదు, 5 మొబైల్ ఫోన్లు, బెట్టింగ్‌కు ఉపయోగిస్తున్న పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రతకు నోడల్ ఏజెన్సీ ఒక అవసరం

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. చీఫ్‌ఎలక్ట్రికల్ సేఫ్టీ ఇన్ బిల్డింగ్స్‌చీఅనే అంశంపై శనివారం హైడ్రా కార్యాలయంలో జరిగిన సదస్సులో రంగనాథ్ మాట్లాడారు. విద్యుత్ వినియోగంలో ఉన్న లోపాలవల్లే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్న వేళ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు.. అందరిలో అవగాహన పెంచడం అవసరం ఉందన్నారు. భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారో లేదో పరిశీలించడానికి సంబంధిత విభాగాలకు చెందిన నిపుణుల బృందంతో ఒక నోడల్ ఏజెన్సీని రూపొందించాలని అభిప్రాయపడ్డారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, బాయిలర్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

- పేరుమోసిన గోవా పెడ్లర్ అరెస్టు
- 2018లో కూడా అరెస్టయిన నిందితుడు



లివియో జోసఫ్



ఉబలంక శంకర్

బంజారాహిల్స్: నైజీరియా నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తూ గోవాతో పాటు ముంబయ్, హైదరాబాద్‌లలో విక్రయిస్తున్న అంతర్జాతీయ డ్రగ్ పెడ్లర్‌తో పాటు సహకరించిన మరో వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. గోవాకు చెందిన లివియో జోసఫ్ అల్మిడా అలియాస్ ప్యూషా (41) గోవాకు తరచూ పర్యాటకులుగా వచ్చే నైజీరియన్లతో ఎనిమిదేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయాల ద్వారా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించవచ్చని, నైజీరియా నుంచి తాము దిగుమతి చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అలా నైజీరియా నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకుంటూ విక్రయిస్తున్న జోసఫ్ కదలికలపై నగర పోలీసులు దృష్టిసారించారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లోని కమలాపురికాలనీ ప్రాంతంలో జోసఫ్ ఓ వ్యక్తికి కొకైన్ విక్రయిస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన నుంచి 11 గ్రాములు ఎండీఎంఏ, 10 గ్రాముల కొకైన్, రూ.1.97 లక్షల నగదు, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి మూడు రోజుల క్రితం జోసఫ్ హైదరాబాద్‌కు రాగా ఇక్కడ ఓ వ్యక్తి ఆశ్రయమిస్తున్నట్లుగా గుర్తించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్‌లో నివసించే ఉబలంక శంకర్ (48) అనే వ్యక్తి షెల్టర్ ఇవ్వడమే కాకుండా బైక్ కూడా సమకూర్చి తన ఇంట్లోనే ఆశ్రయమిచ్చాడు. ఆయనను కూడా బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. 2018లో కూడా జోసఫ్ హైదరాబాద్‌లోనే డ్రగ్స్ విక్రయిస్తుండగా అప్పుడు కూడా వీరిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిద్దరూ కలిసి హైదరాబాద్‌లో పలువురికి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. నగరంలో ప్రతి నెలా రెండు సార్లు సంజయ్, లోకేష్, సతీష్ వర్మ, అమిత్, సిద్ధార్థ, రుద్రరాజు తదితర కస్టమర్లకు విక్రయిస్తున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. హైదరాబాద్‌కు వచ్చినప్పడల్లా పాత కేసులో భాగంగా కోర్టుకు హాజరవుతూ వచ్చేటప్పుడే గోవా నుంచి డ్రగ్స్ తీసుకువస్తూ తెలిసిన కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. గోవా నుంచి హైదరాబాద్‌కు రావడానికి బస్సులోనే వస్తుంటాడని, బస్సులో అయితే ఎలాంటి చెకింగ్‌లు ఉండవన్న ఉద్దేశ్యంతో తన మాజీ భార్యతో టికెట్ బుక్ చేయిస్తుంటాడని తేలింది.

25 మంది ట్రాన్స్‌జెండర్లపై కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లో గోయల్ జ్యువెలర్స్ ఆభరణాల షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా డబ్బులు డిమాండ్ చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ షాపు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు 25 మంది ట్రాన్స్‌జెండర్లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రోడ్డు నంబర్-2లో రుచిత్ అగర్వాల్ అనే వ్యాపారి గోయల్ జ్యువెలర్స్ పేరుతో షాపు ప్రారంభోత్సవం చేస్తుండగా పెద్ద ఎత్తున ట్రాన్స్‌జెండర్లు లోనికి ప్రవేశించి డబ్బులు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ బైఠాయించి పూజా కార్యక్రమాలకు అడ్డు తగిలి, వ్యాపార లావాదేవీలకు ఆటంకం కలిగించారు. దీంతో షాపు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృత బార్ యజమానిపై కేసు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని అమృత బార్ అండ్ రెస్టారెంట్ యజమానితో పాటు మేనేజర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. అమృత బార్‌లో ఈ నెల 24వ తేదీన రాత్రి కొంత మంది గుమికూడటమే కాకుండా లోపల గొడవ జరుగుతున్నట్లుగా పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో లోనికి వెళ్లి చూడగా అమృత బార్ క్యాషియర్‌తో పాటు వెయిటర్లు కొంతమంది కస్టమర్లపై దాడి చేస్తూ న్యూసెన్స్‌కు క్రియేట్ చేస్తున్నట్లుగా గుర్తించారు. కానిస్టేబుల్ నరేందర్‌కుమార్ ఫిర్యాదు మేరకు బార్‌ను నడపడంతో నిర్లక్ష్యం వహించిన యజమాని, మేనేజర్లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న మైనర్ డ్రైవర్ల పట్టివేత



జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలు ఇచ్చిన వారిపై కూడా కేసులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శనివారం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రితో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, ఫిలింనగర్ ప్రాంతాల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు, జరిమానాలు కూడా ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-7లోని స్మైలీ బ్యూటీ స్పాలో కొంత కాలంగా మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు సోదాలు చేసి నిర్వాహకులను అరెస్టు చేయడమే కాకుండా సెక్స్ వర్కర్లను పునరావాస కేంద్రానికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. రోడ్డు నంబర్-7లో స్మైలీ బ్యూటీ స్పాను బోయిని బసవరాజు అనే వ్యక్తి కొంతకాలంగా నడిపిస్తున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు, క్రాస్ మసాజ్ చేయిస్తున్నట్లుగా పోలీసుల దాడుల్లో వెల్లడైంది. దీంతో నిందితుడితో పాటు సెక్స్ వర్కర్లను కూడా అదుపులోకి తీసుకుని వీరి నుంచి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు కస్టమర్లను కూడా అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు

వెంగళరావునగర్: మహిళను వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం మంచిర్యాలకు చెందిన యువతికి 2019లో అదే ప్రాంతానికి చెందిన దారంగుల వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇరువురు ప్రేమించుకున్నారు. వివాహం చేసుకోవాలని అనుకున్నారు. అయితే ఆమె తల్లిదండ్రులు వారి వివాహానికి అంగీకరించలేదు. దాంతో ఆమెకు వేరే వ్యక్తితో వివాహమైంది. ప్రస్తుతం ఆమెకు ఇద్దరు పిల్లలు. ఇటీవల భర్తతో మనస్పర్థలు రావడంతో విడాకుల కోసం ప్రయత్నిస్తోంది. ఈ మేరకు నగరానికి వచ్చి రహమత్‌నగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఇటీవల వెంకటేష్ ఆమెను కలిసి తరచూ వేధిస్తున్నాడు. తనకు ఇష్టం లేదని చెప్పినా ప్రేమించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దాంతో అతడిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

22 మార్గాల్లో..

'ఆపరేషన్ రోప్'

- 400కు పైగా ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు
- పాదచారులకు అందుబాటులో ఫుట్‌పాత్‌లు
- మళ్లీ ఏర్పాటు చేయకుండా నిఘా
- ఉల్లంఘనలపై కేసు నమోదు



జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకోవడం ద్వారా పాదచారులు రోడ్డు ఎక్కుతుండటం.. ఆపై ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ట్రాఫిక్ పోలీసులు ఆరు నెలల నుంచి ఆపరేషన్ రోప్ పేరుతో ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు. వాహనదారులకు, పాదచారులకు అడ్డంకులు సృష్టిస్తూ అటు ఫుట్‌పాత్‌లతో పాటు ఇటు రోడ్లను ఆక్రమిస్తున్న వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గడిచిన ఆరు నెలల వ్యవధిలో 22 మార్గాల్లో ఆపరేషన్ రోప్ నిర్వహించి మార్గాలను సుగమం చేశారు. ఫుట్‌పాత్‌లపై, రోడ్ల పక్కన సుమారు 400లకు పైగా డబ్బాలు, చిరువ్యాపారాలు, ఆక్రమణలు తొలగించారు. దీంతో 80 శాతం ప్రాంతంలో ఫుటపాత్‌లు క్లియర్ అయ్యి పాదచారులకు అందుబాటులోకి వచ్చాయి.

70కి పైగా ఆక్రమణల తొలగింపు

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ఎన్టీఆర్ భవన్ మీదుగా ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తా వరకు మూడు కిలోమీటర్ల మేర ఆపరేషన్ రోప్ నిర్వహించి సుమారు 70కి పైగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. అపోలో ఆస్పత్రి నుంచి సురుచి హోటల్ వరకు, అటు లోటస్ పాండ్ వరకు చేపట్టిన 'రోప్' వల్ల ఇక్కడ అంబులెన్స్‌లు సజావుగా ముందుకు సాగుతున్నాయి. పంజగుట్ట చౌరస్తా నుంచి అమీర్‌పేట వరకు, మైత్రీవనం నుంచి ఎర్రగడ్డ వరకు, సత్యం టాకీస్ నుంచి బల్కంపేట ఎల్లమ్మ గుడి వరకు, సోమాజిగూడ మోనప్ప ఐల్యాండ్ నుంచి రాజ్‌భవన్ వరకు ఇలా 22 చోట్ల ఆపరేషన్ రోప్ నిర్వహించారు.

స్పెషల్ డ్రైవ్ కొనసాగించాలని ఆదేశం

నగర పోలీసు కమిషనర్‌గా సీవీ ఆనంద్ రెండోసారి బాధ్యతలు చేపట్టగానే మొదటి ప్రాధాన్యతగా ఆపరేషన్ రోప్‌పైనే దృష్టి పెట్టారు. టోలిచౌకిలో జరిగిన రోప్‌లో ఆయన కూడా పాల్గొని ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగించాలని ఆదేశించారు. ఫలితంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే పెద్ద ఎత్తున ఆక్రమణలు తొలగించడమే కాకుండా సామాగ్రిని సీజ్ చేశారు.

విశాలంగా మారిన రోడ్లు

బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లో నిర్వహించిన రోప్ ద్వారా పెద్ద ఎత్తున ఆక్రమణలు తొలగిపోయి ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి వచ్చాయి. అంతర్గత రహదారుల్లో కాకుండా రద్దీగా ఉండే ప్రధాన రహదారులపైనే రోప్ నిర్వహించి ఆక్రమణలు తొలగించారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి–నందినగర్ లైన్‌లో కూడా ఆక్రమణలు తొలగిపోయి ఇక్కడ రోడ్లు విశాలమయ్యాయి. చాలాచోట్ల రోడ్ల పక్కన ఆక్రమణలు తొలగించడంతో వాహనదారులు సజావుగా ముందుకుసాగుతున్నారని ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే కూడా తరచూ ఆపరేషన్ రోప్‌లో పాల్గొంటూ ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించారు.

భారత్ మాతాకీ జై.. పాకిస్తాన్ ఖబడ్దార్



ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలో ఎఫ్ఎన్‌సీసీ సభ్యులు

బంజారాహిల్స్: పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎఫ్ఎన్‌సీసీ నుంచి భారీగా తరలివచ్చిన సభ్యులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై.. పాకిస్తాన్ ఖబడ్దార్ అంటూ నినాదాలు చేశారు. ఫిలింనగర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిశేషగిరిరావు, ఎఫ్ఎన్‌సీసీ కేఎస్ రామారావు, పరచూరి గోపాలకృష్ణ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీకి భారీ ఎత్తున సభ్యులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.

పాకిస్తాన్ చిత్రపటాల దహనం

హిమాయత్‌నగర్: పాకిస్తాన్ ఉగ్రవాదులు సృష్టించిన పిరికిపంద చర్యలను ఖండిస్తూ శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని శివసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద పాకిస్తాన్ దేశ చిత్ర పటంతో పాటు పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చిత్రపటాలను శనివారం దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, మైనార్టీ నాయకుడు అహ్మద్, రామకృష్ణ అనిల్, రాహుల్, సాయి, అఖిల్, సాయి, ముని, మారుతి, విష్ణు, దత్తా తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

ఉగ్రవాదాన్ని అంతం చేయాలని జాగో ఇండియా జాగో ఫౌండేషన్ చైర్మన్ జావీద్ షరీఫ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పహల్గామ్‌లో అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ శనివారం జాగో ఇండియా జాగో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో నిలోఫర్ కేఫ్ యజమాని బాబురావు, ఫౌండేషన్ సభ్యులు ముబ్బర్, మణిలాల్ షా, డా.అలంగిర్ రిజ్వి, మొహమ్మద్ అలీ, అష్రాఫ్, కోచ్ ఖాలిద్, సురేందర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న శివసేన కార్యకర్తలు



నిరసనలో జావీద్ షరీఫ్ తదితరులు

ఫ్రీ లెఫ్ట్ విస్తరణపై సమీక్ష

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ముందు నుంచి ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైపు వెళ్లే ఫ్రీ లెఫ్ట్‌లో ట్రాఫిక్ రాకపోకలపై అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ముందు ఫ్రీ లెఫ్ట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఇక్కడ పర్యటించిన ఆయన ఫ్రీలెఫ్ట్‌ను మరింత విశాలం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇక్కడ ఫ్రీ లెఫ్ట్‌ను ఇంకా విస్తరిస్తే రెండు లేన్లలో కార్లు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు.



కేబీఆర్ పార్కు చౌరస్తాలో ట్రాఫిక్‌ను సమీక్షిస్తున్న అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే..

వెంగళరావునగర్: ఇప్పుడు ఎన్నికలు వచ్చినా తిరిగి ప్రజలు బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తారని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం ఆమె ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని, కాంగ్రెస్ హయాంలో ప్రజలు నష్టపోయారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోగా తప్పును కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌పై బురద చల్లుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభకు డివిజన్ నుంచి వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, అంబటి రామకృష్ణ, వేణు, ఆంజనేయులు యాదవ్, సత్యనారాయణ, పవన్ ముదిరాజ్, గజ్జల బాలకృష్ణ పాల్గొన్నారు.



గొడవ చేయవద్దన్నందుకు వ్యక్తిపై దాడి

- తీవ్రంగా కొట్టడంతో ఆస్పత్రిలో చేరిన బాధితుడు
- దంపతులపై కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: ఆస్పత్రి వద్ద గొడవ చేయవద్దని చెప్పినందుకు సూపర్‌వైజర్‌పై దాడికి పాల్పడిన దంపతులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో ఉన్న గుడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ సెంటర్ సూపర్‌వైజర్ అబ్బూరి లక్ష్మీపతి తనకు తెలిసిన వ్యక్తి సయ్యద్ సలీముద్దీన్‌తో ఆస్పత్రి గేటు వద్ద మాట్లాడుతున్నాడు. అదే సమయంలో ఖాజీ హబీబ్ అలీ, ఆయన భార్య దీబాఫజల్ అక్కడకు వచ్చి ఒక ప్రాపర్టీ విషయంలో సలీముద్దీన్‌తో వాగ్వాదానికి దిగారు. అరుపులు, కేకలతో న్యూసెన్స్ చేస్తుండగా ఆస్పత్రి వద్ద గొడవ పడవద్దని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని లక్ష్మీపతి వారికి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఖాజీ, ఆయన భార్య దీబా ఇద్దరూ అతడిని చితకబాదారు. పోలీసులకు ఫోన్ చేయాలని నంబర్ డయల్ చేస్తుండగా దీబా ఫోన్ లాక్కొని ధ్వంసం చేసింది. దంపతులిద్దరూ బాధితుడిపై తిరగబడి తీవ్రంగా కొట్టడంతో వెంటనే ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. తనను చంపడానికి కూడా వెనుకాడకుండా ఆగ్రహంతో ఊగిపోతూ తీవ్రంగా కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఫిర్యాదు చేయగా ఖాజీ హబీబ్, ఆయన భార్య దీబాపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 28, క్యాప్సికం 50, కాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 09, క్యారెట్ 21, దొండకాయ 18, గుండు బిన్నీస్ 75, గింజచిక్కుడు 45, గోకరకాయ 35, కీర 31, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 27, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 50, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 23 ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో యువకుడి నుంచి ఆన్‌లైన్‌లో రూ.50 వేలు దోచుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహబూబ్ బాషా పీఈటీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 11న అతడి భార్య ఇన్‌స్టాగ్రాం చూస్తుండగా టెలిగ్రాం వచ్చింది. రిసెప్షన్ మంచి జీతం కోసం ఆ టెలిగ్రాంను ఇన్‌స్టాల్ చేశారు. అందులో వివిధ రెస్టారెంట్స్‌లో రిసెప్షనిస్టుల కోసం వెతికే క్రమంలో ఆమె బ్యాంకు ఖాతా వివరాలను పొందుపర్చారు. అందులో కొంత పెట్టుబడి పెట్టాలని సూచించారు. ఆమె రూ.50 వేల వరకు నగదును ఆన్‌లైన్‌లో వారికి ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వడానికి ఇంకా నగదు పంపాలని చెప్పారు. అనుమానం వచ్చిన మహిళ తన నగదును కాజేసిన ఆన్‌లైన్ జాబ్ వారిపై చర్యలు తీసుకోవాలని సైబర్ పోలీసులకు, అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో..

గిరిజన ఉద్యోగులకు అన్యాయం

తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

హిమాయత్‌నగర్: పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ రూల్స్ ప్రకారం దక్కాల్సిన పదోన్నతుల్లో గిరిజన ఉద్యోగులకు అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ఆరోపించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి స్థానికేతరుడు అయిన 70 ఏళ్లు దాటిన ఆర్‌సీ. కుమార్‌ను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఫైనాన్స్ అడ్వైజర్‌గా నియమించి రూ.2.50 లక్షల జీతం చెల్లిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ప్రావీణ్యత కలిగిన ఇంజినీర్లు ఉన్నప్పటికీ వారి సేవలను ఉపయోగించుకోకుండా వేరే రాష్ట్రంలో ఉన్న వ్యక్తిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఏపీకి చెందిన మరో ఉద్యోగిని లీగల్ అడ్వైజర్‌గా నియమించి రూ.1.50 లక్షల జీతం చెల్లిస్తున్నారని ఆరోపించారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజినీర్ల కొరత ఉన్నందున రిటైర్డ్ అయిన రాష్ట్రానికి చెందిన స్థానిక డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజినీర్లను నియమించాలని కోరారు.

డీపీడీపీ చట్టం నుంచి జర్నలిస్టులను మినహాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్

పంజగుట్ట: డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ) చట్టం 2023 అమలులోకి వస్తే జర్నలిస్టులు రాసే, ప్రచురించే హక్కులు కోల్పోతారని నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్‌ఫర్మేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం వస్తే ఎవరైనా అవినీతికి పాల్పడ్డా, మరేదైనా నేరం చేసినా అతడి అనుమతి తీసుకుని వార్త రాయాల్సి వస్తుందని, ఇది ఇన్వెస్టిగేషన్ జర్నలిజానికి ఎంతో ప్రమాదమని వారు అభిప్రాయపడ్డారు. చాలా దేశాల్లో ఈ చట్టం అమలులో ఉన్నప్పటికీ జర్నలిస్టులకు మినహాయింపు ఉందని, కానీ మనదేశంలో లేకపోవడం బాధాకరమని వారు అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో డీపీడీపీ 2023 చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు అంజలి భరద్వాజ్, రాకేష్ దుబ్బుడు, అమృత జోహ్రి మాట్లాడుతూ.. ఈ చట్టం ప్రకారం జర్నలిస్టులు వ్యక్తిగత సమాచారం సేకరించడం, సేకరించినా సంబంధిత వ్యక్తుల అనుమతి లేకుండా ఆ సమాచారాన్ని ఏ రూపంలోనూ ప్రచారం చేయలేని స్థితి ఉంటుందన్నారు. మొదట చట్టం ముసాయిదాలో జర్నలిస్టులకు మినహాయింపు ఉన్నప్పటికీ పార్లమెంట్‌లో పాస్ అయిన బిల్లులో మినహాయింపు ఇవ్వలేదన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే దాదాపు రూ.500 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రశ్నించే మీడియా సంస్థలకు, స్వతంత్ర జర్నలిస్టులకు భయభ్రాంతులకు గురిచేసేందుకు, ప్రభుత్వానికి మద్దతు తెలిపే సంస్థలకు మినహాయింపు ఇవ్వడానికి వీలుగా ఈ చట్టం ఉందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు సి.వనజ, కార్యవర్గ సభ్యులు వి.బాపూరావు, పద్మావతి, శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ యజమానురాలు కంజర్ల మణెమ్మ వర్ధంతిని గోకుల్ థియేటర్ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి మాజీ కార్పొరేటర్లు కంజర్ల సదాశివయాదవ్, కిలారి మనోహర్, కంజర్ల కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం నిర్వహించారు.

ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతం చేయాలి

పంజగుట్ట: ఉగ్రదాడిలో చనిపోయిన టూరిస్టులకు నివాళి అర్పిస్తూ సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎ.మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. యావత్ దేశం కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణమ్మ, మధుకర్ యాదవ్, అహ్మద్, జకీర్, రోహిత్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి



బంజారాహిల్స్: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆరో రోజు శనివారం కొనసాగింది. యూనివర్సిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరమణ, శ్రీనివాస్, దయాకర్, రవీంద్రనాథ్ సోలమన్, చంద్రకళ, కిషోర్‌కుమార్‌రెడ్డి మద్దతు పలికారు.

దాహం తీర్చని కేంద్రాలు

- గతేడాది ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జలమండలి
- ఒక్కచోట కూడా నీరు అందించని వైనం



బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద జలమండలి ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి కేంద్రం

బంజారాహిల్స్: ఎండా కాలంలో దాహార్తి తీర్చాల్సిన కేంద్రాలు తాళాలు వేసి దర్శనమిస్తున్నారు. జలమండలి ఆధ్వర్యంలో గతేడాది బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో ఉచిత తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి వేసవి ప్రారంభమైన నెల రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం వీటిని తెరవాలనే ఆలోచనే లేకుండా ఉన్నారు. ఫలితంగా పాదచారులు, వాహనదారులు తాళం వేసి ఉన్న ఈ కేంద్రాలను చూస్తూ ముందుకు సాగాల్సి వస్తోంది. బంజారాహిల్స్‌లోని బసవ తారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో పదుల సంఖ్యలో దాతలు వచ్చి నిరాశ్రయులకు, రోగుల సహాయకులకు ఆహారాన్ని పంపిణీ చేస్తుంటారు. భోజనం చేసిన వారు గొంతు తడుపుకుందామంటే కనీసం నీరు కూడా దొరకడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంజగుట్ట చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సైతం గతేడాది అధికారులు ప్రారంభించిన ఉచిత తాగునీటి కేంద్రం ఇప్పటికీ తెరుచుకోలేదు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ వేసవిలోనైనా తాగునీటి కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు మైస్ ఎస్ యువర్స్ వెడ్డింగ్ జ్యువెలరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ప్రపంచ నృత్య దినోత్సం సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, ఆల్ ది బెస్ట్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌-2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని బీఆర్ఎస్ భవన్ సమీపంలో ఉన్న కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

శ్రీకృష్ణ దేవరాయ పాత్రలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 108వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రదర్శించిన అష్టదిగ్గజాలు నాటకంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం శ్రీ కృష్ణదేవరాయలుగా నటించారు. నిత్యం అభ్యుదయ, విప్లవ భావాల ప్రసంగాలతో ప్రజలను ఆలోచింపజేసే ప్రొ.కాశీం ఒక్కసారిగా నాటక ప్రదర్శనలో ప్రత్యక్షమవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఆశ్చర్యానికి గురయ్యారు.

నల్సార్ యూనివర్సిటీతో ఒప్పందం

హిమాయత్‌నగర్: నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ఆర్.వి.ఆర్. అసోసియేట్స్, ఐపీఆర్ అడ్వకేట్స్ హైదరాబాద్ మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది. ప్రపంచ మేధోసంపత్తి హక్కుల దినోత్సవం సందర్భంగా, నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొ.కృష్ణదేవరావు, ఆర్.వి.ఆర్ అసోసియేట్స్, ఐపీఆర్ అడ్వొకేట్, ప్రతినిధి మేఘం మల్లికార్జునరెడ్డి ఎంఓయూ మీద సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో నల్సార్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐపీఆర్(మేధోసంపత్తి హక్కు) ప్రత్యేక సబ్జెక్టుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి దొంతిరెడ్డి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం ఆర్.వి.ఆర్ అసోసియేట్స్, ఐపీఆర్ న్యాయవాదులు గోల్డ్‌మెడల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రొ.అనింద్య సర్కార్, సుబోధ్ కుమార్, ఆర్.వి.ఆర్ అసోసియేట్స్ న్యాయవాదులు పి.వి.వి.గోపాల కృష్ణమూర్తి, అనంత కేశవన్, రిషిత పాండే, అక్షత్ శర్మ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోల్కొండ: అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గోల్కొండ మోతీదర్వాజాకు చెందిన మహ్మద్ ఇబ్రహీం(36) కొంత కాలంగా అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇబ్రహీం ఇంట్లోనే నిద్రపోయాడు. అయితే మహ్మద్ ఇబ్రహీంకు భార్యపై గత కొన్ని రోజులుగా అనుమానం ఉంది. కొద్ది రోజుల క్రితం భార్యాపిల్లలను పుట్టింటికి పంపించాడు. కాగా ఇబ్రహీం గదిలోంచి ఎంతకు బయటకు రాకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి తలుపు తీసి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు.పోలీసులు వచ్చి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అక్రమంగా ఆరువేల మంది!

బాలాపూర్‌లో రోహింగ్యాల తిష్ట

- అడ్డదారుల్లో భారత గుర్తింపు కార్డులు పొందుతున్న వైనం
- వీరిని కూడా వెనక్కి పంపాలని డిమాండ్



భారత పౌరసత్వ కార్డులు పొందిన రోహింగ్యాలు

పహాడీషరీఫ్: పాకిస్తాన్ పౌరులను ఆ దేశానికి తిరిగి పంపాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో అందరి దృష్టి మయన్మార్(బర్మా) దేశానికి చెందిన రోహింగ్యా ముస్లింలపై పడింది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడుల నేపథ్యంలో పాక్ అక్రమ వలసదారులపై భారత్ అప్రమత్తమైంది. దిక్కుతోచని స్థితిలో రోహింగ్యాల శరణార్థుల ముసుగేసుకుని నగర శివారులోని బాలాపూర్, పహాడీషరీఫ్, జల్‌పల్లి, కంచన్‌బాగ్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాలకు పలువురు వచ్చిచేరారు. కాలక్రమేణా వేలాదిగా అక్రమార్గంలో వచ్చి స్థిరపడ్డారు. కొందరు ఏకంగా భారత పౌరసత్వ కార్డులు కూడా పొందారు. బాలాపూర్ రాయల్ కాలనీలోని వీరి క్యాంప్‌లో తలదాచుకున్న ఓ ఉగ్రవాదిని సైతం గతంలో ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. దేశ భద్రతకు ముప్పువాటిల్లే పరిస్థితి ఉన్న నేపథ్యాన్ని వివరిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు రోహింగ్యాల విషయమై వినతిపత్రాలు అందజేశారు.



జులైలో బిక్కుబిక్కుమంటూ వచ్చిన రోహింగ్యాలు(ఫైల్)

బాలాపూర్‌లో 6 వేల మంది

2012 జులైలో బర్మా దేశంలో జరిగిన అల్లర్ల కారణంగా మొదట 210 మంది బాలాపూర్ రాయల్ కాలనీ, హాఫీజ్‌బాబా నగర్‌కు వచ్చి తలదాచుకున్నారు. ఈ సమయంలోనే యూఎన్‌హెచ్‌సీఆర్(యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రిఫ్యూజెస్) శరణార్థులుగా కార్డులు కూడా పొందారు. కాలక్రమేణా మరికొంత మంది రావడంతో వీరి సంఖ్య ఇప్పుడు గణనీయంగా పెరిగింది. పోలీసుల రికార్డుల ప్రకారం ప్రకారం బాలాపూర్ పరిధిలోని 27 క్యాంప్‌లలో సుమారు ఆరు వేల మంది వరకు నివాసం ఉంటున్నారు. వీరికి సంబంధించిన అన్నిరకాల నమూనాలను పోలీసులు ఇదివరకే సేకరించారు.

ఇక్కడి పరిస్థితులపై పట్టు సాధించి..

బాలాపూర్ పరిసరాల్లో నివాసముంటున్న శరణార్థులు స్థానికంగా ఉన్న కొందరిని మచ్చిక చేసుకుని ఏకంగా భారత గుర్తింపు కార్డులు పొందుతుండటం గమనార్హం. ఓటర్ గుర్తింపు కార్డు మొదలుకుని ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందుతున్నారు. జమ్మూ, కశ్మీర్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం మంది కార్డులు పొందుతుండగా.. స్థానిక దళారుల సహకారంతో కొంత మంది రోహింగ్యాలు ఇక్కడ గుర్తింపు కార్డులు పొందుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



ఆధార్ కార్డు పొంది 2018 మార్చి 17న అరెస్టైన ముగ్గురు రోహింగ్యాలు

తరచూ న్యూసెన్స్

- 2018 మార్చి 17న అక్రమంగా ఆధార్ కార్డులు పొందిన రోహింగ్యాలైన మహ్మద్ హసన్(23), మహ్మద్ ఆరిఫ్(18), మహ్మద్ సైఫుల్ ఇస్లాం(18)లను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు మహ్మద్ హసన్ అఫ్సర్ అనే వ్యక్తి సాయంతో బహదూర్‌పురా చిరునామాపై ఆధార్ కార్డులు పొందారు.
- 2017 సెప్టెంబర్ 12న ఆధార్ కార్డు సహాయంతో పాస్ పోర్టు తీసుకునేందుకు యత్నించిన మహ్మద్ ఇస్మాయిల్ అనే బర్మా దేశస్తుడిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు.
- 2016- 17 సంవత్సరంలో బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీసులు అక్రమంగా కార్డులు పొందిన 25 మంది రోహింగ్యాలను అరెస్ట్ చేశారు.
- 2017 సెప్టెంబర్ 16న తమ దేశానికి చెందిన యువకుడికి యూఎన్‌హెచ్‌సీఆర్ కార్డు ఇప్పిస్తానంటూ రూ.10 వేలు తీసుకొని మోసానికి పాల్పడిన బర్మా దేశస్తుడిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు.
- 2014 అక్టోబర్ 9న మహ్మద్ హుస్సేన్(20) మైనర్‌ను వివాహం చేసుకునే క్రమంలో తలెత్తిన వివాదంతో రెచ్చిపోయిన రోహింగ్యాలు పోలీసులు, స్థానిక బస్తీ వాసులపై రాళ్ల దాడికి తెగబడ్డారు. ఈ సమయంలో బస్తీ వాసులు, రోహింగ్యాల నడుమ పెద్ద గొడవే జరిగింది.
- 2014 నవంబర్‌లో శరణార్థుల ముసుగులో ఉన్న ఖాలేద్ మహ్మద్ అనే వ్యక్తిని ఉగ్రవాద సంబంధాల అనుమానంతో రాయల్ కాలనీ నుంచి ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు.

మత్స్య పారిశ్రామిక సంఘాలు ఏర్పాటు చేయాలి

తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్

హిమాయత్‌నగర్: ముదిరాజ్‌లతో మత్స్య పారిశ్రామిక సంఘాలు నూతనంగా ఏర్పాటు చేసి అన్ని సంఘాలలో ముదిరాజ్‌లకు పాత, కొత్త సభ్యత్వాలు కల్పించాలని, జీఓ నెం.6 అమలు చేయాలని మత్స్య శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణకు శనివారం తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్‌తో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు మత్స్య కారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీకి ముదిరాజ్‌లు ఎలా మత్స్యకారులనే విషయాన్ని చారిత్రక ఆధారాలతో వివరంగా తెలిపినట్లు పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో 1964 నాటి జీఓ నెం.98 ద్వారా ముదిరాజ్ కులంతో సహా 29 సామాజిక సమూహాలను అధికారికంగా మత్స్యకార సంఘాలుగా గుర్తించిందని పేర్కొన్నారు. తెలంగాణలోని ముదిరాజ్, బెస్త, ముత్తరాసి, తెనుగొల్లు వర్గాల చేపల వేట హక్కులను ధ్రువీకరిస్తూ ఒక వివరణ జారీ చేయాలని నిపుణుల కమిటీని కోరారు. వందల ఏళ్లకుపైగా పూర్వీకులు చేసినట్లుగానే ఈ హక్కులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సంఘం సభ్యులు ప్రధానంగా చేపలు పట్టడంలో నిమగ్నమై తెలంగాణ అంతటా 3,400 కంటే ఎక్కువ మత్స్యకార సహకార సంఘాల మద్దతుతో వృత్తిని కొనసాగిస్తూ వేలాది కుటుంబాల జీవనోపాధి అవసరాలను తీరుస్తున్నారని తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న చొప్పరి శంకర్ ముదిరాజ్

నైపుణ్యం పెరిగితేనే మెరుగైన సేవలు

తెలంగాణ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా

సాక్షి, సిటీబ్యూరో: వైద్యుల్లో స్కిల్ పెరిగితేనే ప్రజలకు మంచి చికిత్సలు అందించే వీలుంటుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా అన్నారు. శనివారం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో స్కల్ బేస్ ఎండోస్కోపి సమ్మిట్-25 రెండు రోజుల ఇంటర్నేషనల్ సమ్మిట్, లైవ్ వర్క్‌షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ సర్జరీల కోసం అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. న్యూరో ఎండోస్కోపీ స్కల్ బేస్ సర్జరీతో ఖచ్చితమైన లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తిచేయవచ్చని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ సర్జరీల కోసం రోబోటిక్ న్యూరో సర్జరీ, న్యూరో ఎండోస్కోపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మెదడలో గడ్డలు, మూర్ఛ వ్యాధి చికిత్సల్లో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. యశోద ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని అందరికీ అందించాలనే లక్ష్యంతో యశోద ఆసుపత్రి ఏటా షేరింగ్ నాలెడ్జ్ ప్రోగ్రాంలను నిర్వహిస్తోందన్నారు. ఫోకస్ బేస్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కల్ బేస్ ఎండోస్కోపీ ట్రీట్‌మెంట్ ఖచ్చితమైన లక్ష్యాలను చేరుకుంటుందన్నారు. చికిత్స చేసినపుడు పక్కనున్న అవయువానికి హానికలగకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సుమారు 500 మంది వైద్యులు పాల్గొన్నారు.



లులు మాల్‌లో చాక్లెట్ ఫెస్టివల్ ప్రారంభం



కేపీహెచ్‌బీకాలనీలోని లులు మాల్‌లో చాక్లెట్ ఫెస్టివల్ ను ప్రారంభిస్తున్న బాల నటుడు మాస్టర్ రేవంత్

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీలోని లులుమాల్‌లో చాక్లెట్ ఫెస్టివల్ నడుస్తోంది. లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్‌ను శుక్రవారం రాత్రి బాల నటుడు(సంక్రాంతికి వస్తున్నాం ఫేం) మాస్టర్ రేవంత్ ప్రారంభించారు. ఈ నెల 27 వరకు కోకో మిలన్ యాక్టివిటీస్ ఉంటాయని, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలు నేర్పిస్తామని రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. లులు బిగ్ చాకో డేస్‌లో రూ.200 నుంచి ఐ ప్యాడ్ గెలుచుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ విమేశ్, లులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఎలక్ట్రోవెంజా-2025'

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంజేసీఈటీ) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎలక్ట్రోవెంజా-2025'పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల మేథోమథనానికి సంబంధించి పలు రకాల పోటీలు నిర్వహించారు. రోబోలింపిక్స్ పేరిట రోబోటిక్స్ క్లబ్ నిర్వహించిన ఇంజనీరింగ్ యుద్ధంలో రోబోలు తలపడిన తీరు అబ్బురపరిచింది. ఐఈఈఈ సెంట్రల్ హాక్ స్ప్రింట్ నిర్వహించిన హైస్పీడ్ హ్యాకథాన్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్‌యూఈఎస్ గౌరవ కార్యదర్శి జాఫర్ జావీద్, కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ ఆయేషా నాజ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన జేఎన్టీయూహెచ్ వీసీ



కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌కుమార్‌రెడ్డి జేఎన్టీయూహెచ్ అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాపరమైన వినూత్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికల గురించి గవర్నర్‌కు వివరించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిశోధనలో నూతనత్వం, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో సమన్వయం పెంపొందించడంలో విశ్వవిద్యాలయం తీసుకుంటున్న చొరవను గవర్నర్ అభినందించారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించాలి



2వ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ వైద్యులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలోని వైద్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎంకే రావూఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్ గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం 2వ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల వైద్యులు పాల్గొన్నారు. ముందుగా ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టెరిఫెరల్ మెడికల్ కాలేజ్‌లో పనిచేస్తున్న వైద్యులకు అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు. వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీస్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను ఉస్మానియా, గాంధీ కేఎంసీ నిజామాబాద్‌కు బదిలీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ సర్జన్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఇతర ప్రమోషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికిగాను ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ దీన్‌దయాల్, డాక్టర్ రమేష్, కామారెడ్డి శ్రీనివాస్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జూలై లోపు పూర్తిస్థాయి 4 జీ సేవలు

బీఎస్ఎన్ఎల్ సౌత్ డీజీఎం దినేష్

చార్మినార్: జూలై నెల లోపు పూర్తిస్థాయిలో 4 జీ సేవలు అందుబాటులోకి వస్తాయని బీఎస్ఎన్ఎల్ సౌత్ డీజీఎం ఈ.దినేష్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ చాంద్రాయణగుట్ట కస్టమర్ సర్వీస్ సెంటర్ ఎదురుగా శనివారం సర్వీస్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉత్తమ సేవలను అందించడంలో బీఎస్ఎన్ఎల్ ముందుందని వివరించారు. బీఎస్ఎన్ఎల్ సేవల వినియోగంలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా..అనే విషయాలను ఆరా తీశారు. కొన్ని సమస్యల పరిష్కారానికి సంబందిత అధికారులు వెంటనే స్పందించారు. కస్టమర్లు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలతోపాటు పలు సూచనలు, సలహాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 జీ సేవలను పూర్తి స్థాయిలో అందించనున్నామని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పెరిగిన ఈ రోజుల్లో సైబర్ నేరాలు సైతం అంతే వేగంగా పెరిగాయని, బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకోవడంతో సైబర్ నేరాల బారిన పడకుండా ఉంటామన్నారు. బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వసూలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏజీఎంలు ఎంఆర్‌వీ శాస్త్రీ, రాములు, ఎంటీ రాంజీల తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



కస్టమర్ సర్వీస్ క్యాంప్‌లో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ సౌత్ డీజీఎం దినేష్, అధికారులు, సిబ్బంది

మార్పులతోనే సామాజిక వికాసం

ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న

హిమాయత్‌నగర్: మార్పులతోనే సమాజం మరింత వికసిస్తుందని, వ్యవస్థలు శాశ్వతంగా ఉంటే అవి నిరంకుశత్వంగా మారే ప్రమాదం ఉందని ప్రజాకవి ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న అన్నారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మానవీయత నిలబడాలని, హింసకు వ్యతిరేకంగా త్యాగం ఉండాలని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారంరాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వై.వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన రచయిత కుమార్ కునపరాజు రచించిన 'రష్యా నుంచి ప్రేమతో'పుస్తకాన్ని గోరెటి వెంకన్న ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకంలో రష్యా సంస్కృతి, సంప్రదాయాలను రచయిత ఎంతో అద్భుతంగా వివరించారని తెలిపారు. సమసమాజ ఆకాంక్షతో రచించిన ఈ పుస్తకం ఎంతో ప్రేరణ కల్పించిందన్నారు. కార్యక్రమంలో రచయిత కుమార్ కునపరాజు, స్వర్ణ కిలారి, ఏఎస్ జగన్నాథశర్మ, మహ్మద్ ఖదీర్ బాబు, తాడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న

రక్తమార్పిడిలో ఆధునిక పద్ధతులు

నిమ్స్‌లో అందుబాటులోకి రానున్న లియుకోరెడక్షన్ విధానం

లక్డీకాపూల్: రక్తమార్పిడిలో లియుకోరెడక్షన్‌తో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నిమ్స్ బ్లడ్ బ్యాంక్ హెచ్ఓడీ డాక్టర్ వి.సుధీర్ కుమార్ అన్నారు. శనివారం నిమ్స్ బ్లడ్ సెంటర్‌లో ల్యూకో సైట్ రిడక్షన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ రక్తమార్పిడి వల్ల ఎదురయ్యే ప్రమాదాన్ని సరికొత్త విధానాలతో సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ప్రపంచ దేశాలు యూనివర్సల్ లియుకోరెడక్షన్ ప్రక్రియను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. త్వరలో నిమ్స్‌లోనూ ఈ తరహా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. ఫలితంగా క్యాన్సర్, ల్యుకేమియా, తలసేమియా, బాధితులకు మరింత మెరుగైన వైద్య సేవలందించడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్ఓడీ డాక్టర్ తేజ, మెడికల్ ఆంకాలజీ డాక్టర్ సదాశివుడు, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్ఓడి డా. వేణు మాధవ్, బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది మహేష్, మురళీకృష్ణ, శేఖర్, వెంకటరత్నం, సుజాత, నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



యుద్ధం వస్తే పాక్‌కు తీవ్ర నష్టం

- మాజీ ఆర్మీ, నేవీ అధికారులు
- న్యూక్లియర్ వార్ జరిగితే పాక్ కనుమరుగే అంటున్న ఇండో-పాక్, కార్గిల్ యుద్ధ వీరులు

రసూల్‌పురా: భారతదేశం, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఎప్పుడు వచ్చినా మన సైన్యం సిద్ధంగా ఉందని పలువురు మాజీ ఆర్మీ అధికారులు అన్నారు. జమ్ము, కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన మారణహోమం నేపథ్యంలో మన దేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. దీంతో 1965 ఇండో-పాక్ యుద్ధం, 1971 బంగ్లాదేశ్, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న విజయవీరులు వింగ్ కమాండర్, ఎయిర్ కమోడోర్, ఆర్మీ హవాల్దార్ తమ అభిప్రాయాలు తెలిపారు. భారత్‌తో పాక్ యుద్ధం చేస్తే ఆ దేశానికి చాలా నష్టం వాటిల్లుతుందని, మన దేశానికి పాక్షిక నష్టం ఉంటుందని వెల్లడించారు. ఒకవేళ న్యూక్లియర్ వార్ జరిగితే పాకిస్తాన్ పూర్తిస్థాయిలో కనుమరుగవుతుందని అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.


యుద్ధం రాకపోవచ్చు...



మనదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధం వాతావరణం ఉన్నప్పటికీ అది యుద్ధానికి దారి తీయకపోవచ్చు. ఒకవేళ యుద్ధం వచ్చినా మన ఆర్మీ, ఎయిర్, నేవీ విభాగాలు సర్వదా సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు యుద్ధం వచ్చినా సిద్ధంగా ఉన్నాయి. సాధారణ యుద్ధం జరిగితే పాకిస్తాన్‌కు అన్ని విధాలా అధిక నష్టం , మనకు పాక్షికంగా నష్టం వాటిల్లుతుంది. ఒకవేళ న్యూక్లియర్ ఆయుధాలతో యుద్ధం జరిగితే కనుక పాకిస్తాన్ పూర్తిగా నాశనమవుతుంది. వాయుసేన తరపున నేను 1965 ఇండో- పాక్ యుద్ధంలో ఆర్మీకి సహకారంగా 14 రోజులు ఉన్నాను. 1971లో బంగ్లాదేశ్ విమోచనం కోసం జరిగిన యుద్ధంలో అంబాలా డేరాబస్సీ నుంచి యుద్ధ విమానాల ద్వారా మిస్సైల్ ప్రయోగించాం. ఆర్మీకి సహాయంగా వాయుసేన తరఫున యుద్ధంలో పాల్గొన్నాం.

- స్వరణ్‌జీత్ సింగ్, విశ్రాంత ఎయిర్ కమోడోర్, కంటోన్మెంట్ న్యూబోయిన్‌పల్లి

పాకిస్తాన్ తోక ముడవాల్సిందే...



మన దేశంతో యుద్ధం జరిగితే పాకిస్తాన్ తోక ముడవాల్సిందే. 1965 ఇండో-పాక్, 1971 బంగ్లాదేశ్ యుద్ధంతోపాటు కార్గిల్ యుద్ధంతో పాకిస్తాన్‌కు మన దేశం తగిన గుణపాఠం నేర్పింది. ఒకవేళ న్యూక్లియర్ వార్ జరిగితే పాకిస్తాన్ నెలమట్టమవుతుంది. బోర్డర్‌కు సమీపంలో ఉన్న మన నగరాలు పాక్షికంగా దెబ్బతింటాయి. సింధూ జలాలను నిలిపివేయడం సబబే. నేను 1965లో బెంగాల్, 1971లో అస్సాం నుంచి యుద్ధాల్లో వాయుసేన తరఫున పాల్గొన్నాను. పాకిస్తాన్‌కు చాలా నష్టం చేశాం.

- ఆవుల భారత్‌భూషణ్, రిటైర్డ్ వింగ్ కమాండర్, వెస్ట్ మారేడుపల్లి, కంటోన్మెంట్

కశ్మీర్ కోసమే పాక్ పన్నాగం



పాకిస్తాన్ ముష్కరులు దొంగ దెబ్బ తీయటం మామూలే. మొన్నటి పహల్గామ్ దుశ్చర్య కశ్మీర్ దక్కించుకోవాలని పాకిస్తాన్ చేస్తున్న కుటిల యత్నంలో భాగమే. పాకిస్తాన్ మూడు యుద్ధాల్లో ఓడినా గుణపాఠం నేర్చుకోవడం లేదు. మన సైనిక, వాయు, నేవీ ఆయుధ సంపత్తిని పాకిస్తాన్ సైన్యం తట్టుకోలేదు. కార్గిల్‌పై మన జెండా ఎగురవేసిన బృందంలో నేను కూడా ఉండటం చాలా గర్వంగా ఉంది.

- కామేశ్వర్‌రావు, కార్గిల్ యుద్ధ వీరుడు, విశ్రాంత హవాల్దార్, 21 మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రి రెజిమెంట్

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, ఆదివారం, 27 ఏప్రిల్ 2025

వేసవి ముదురుతోంది. నగరంలో సగటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. చల్లని నీటిని అందించడానికి ఫ్రిడ్జ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, సహజమైన చల్లదనం కోసం నగరవాసులు మళ్లీ మట్టి కుండలనే ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యాన్ని అందించే మట్టి ప్రత్యేకతను గుర్తించినవారు ఇప్పుడు నగరంలోని మార్కెట్లతో పాటు ఆన్‌లైన్ వేదికల నుంచి, ఆర్గానిక్ బజార్ల నుంచి కుండలను కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో దాహార్తిని తగ్గించుకోవాలంటే కుండలోని నీటితోనే సాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



చల్లచల్లగా.. వేడి తాకకుండ..

వేసవి కాలంలో నగరంలో కుండలకు స్టార్ స్టేటస్



రూ.300 నుంచి రూ.3000 వరకూ ధరల్లో విభిన్న రకాలు	అటు కళాత్మకంగా, ఇటు చల్లని ఆరోగ్యాన్ని అందించేలా	ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి వెరైటీ కుండలు	వాటర్ బాటిల్స్ సహా ఇతర పాత్రలూ అమ్మకం

ఫ్రిడ్జ్ వాటర్ తాగడం వల్ల తాత్కాలికంగా దాహం తీరినట్టు అనిపించినా, ఆ తర్వాత శరీరానికి హానినే కలిగిస్తుందని వైద్యులు గత కొంత కాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. సహజంగానే మట్టికి చల్లబరిచే గుణం ఉంటుంది. మట్టి కుండలు సహజంగా ఆవిరి ద్వారా నీటిని చల్లబరుస్తాయి. వాటిని వేడి వాతావరణానికి అనువైనవిగా తయారు చేస్తాయి. అలా నీటిని చల్లబరచడం, సహజమైన శీతలీకరణ, మెరుగైన జీవక్రియ, మెరుగైన జీర్ణక్రియతో పాటు రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. వీటితోపాటు మట్టికుండల్లో నీరుటి వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది పర్యావరణానికీ మేలు చేస్తుంది. అంతేకాదు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలోనూ, వడదెబ్బను నివారించడంలోనూ సహాయపడుతుంది. కడుపులో ఉత్పత్తయ్యే ఆమ్లతను తగ్గించే సామర్థ్యం ఈ నీటికి ఉండటం వల్ల అజీర్ణం, గుండెల్లో మంట వంటి సమస్యలకు నివారణగా పనిచేస్తుంది.

చేతికుండలకు కేరాఫ్ ఆదిలాబాద్..

నగరంలో ఆదిలాబాద్ కుండలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆదిలాబాద్ ప్రాంతం మట్టికళలో ప్రత్యేకత సంతరించుకుంది. అక్కడి మట్టి అత్యంత మెత్తగా, మరిన్ని అధిక ఫిల్టర్ గుణాలు కలిగి ఉంటుందని సమాచారం. అంతేకాక ఆదిలాబాద్ కుండలు మిగతా ప్రాంతాల కుండలకంటే గాఢతతో ఉండి, ఎక్కువ రోజుల పాటు నీటిని చల్లగా ఉంచగలుగుతాయి. అలాగే వాటిపై ప్రత్యేకమైన చేతి పనితో ఆకర్షణీయమైన డిజైన్లు కూడా జతచేస్తూ అక్కడి కళాకారులు వాటిని సంపూర్ణంగా సంప్రదాయ పద్ధతిలో తయారు చేస్తున్నారు. వేసవిలో టూర్లు ఎక్కువ వెళ్లే వాళ్లు ఉంటారు కాబట్టి వారి కోసం.. బయట ప్రయాణాలకు అనువైన చిన్న పరిమాణంలో క్లే వాటర్ బాటిల్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి.



ఆకట్టుకునే వెరైటీలెన్నో..



ప్రస్తుతం మార్కెట్‌లో గడ్డ కుండలు, జైపూర్ కుండలు, పెయింటెడ్ డిజైన్ కుండలు, ఆదిలాబాద్ మట్టి కుండలు వంటి అనేక రకాలు లభిస్తున్నాయి. చిన్న పరిమాణం గల సాధారణ కుండలు నుంచి పెద్ద డిజైనర్ కుండలు వరకూ ఎన్నో రకాలు వినియోగదారులను ఆకట్టుకునేలా కొలువుదీరాయి. చిన్న చిన్నవి రూ.100 నుంచి ధరల్లో ఉంటే మధ్యస్థాయి మోడళ్లు రూ.250–400 మధ్య ఉన్నాయి. ఇంకా పెద్ద డెకరేటివ్ కుండలు రూ.600 నుంచి రూ.1200 వరకూ ధరల్లో లభిస్తున్నాయి. ప్రత్యేక హ్యాండీ క్రాఫ్ట్ కుండలు, ప్రత్యేక డిజైన్లతో రూపొందించినవాటి కోసం రూ.1500 ఆపైన కూడా నగరవాసులు వెచ్చిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని లామకాన్, సికింద్రాబాద్‌లోని సాక్రడ్ స్పేస్, వంటి చోట్ల నిర్వహించే ఆర్గానిక్ సంతల్లో గచ్చిబౌలిలోని పలు ఆర్గానిక్ బజార్లలో కుండలు ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ కుండలు పూర్తి స్థాయిలో హ్యాండ్ మేడ్, రసాయన రహిత మట్టి ఉపయోగించి తయారవుతాయని, అందుకే వీటితో ఆరోగ్య ప్రయోజనాలు అధికంగా ఉంటాయని తయారీదారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో.. మట్టి వాసన..

ఏళ్లనాటి మట్టి వాసనకు మళ్లీ మంచి రోజులు వచ్చాయనడానికి నిదర్శనంగా ఆన్‌లైన్‌లో పలు వెబ్‌సైట్లు నిలుస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, కాంప్లాంట్ మార్కెట్లు, సహజశ్రీ, ఆర్గానిక్ ఇండియా వంటి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగరవాసులు మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు.. ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించే వెబ్‌సైట్లలో లభించే ప్రత్యేకమైన 'ఎకో ఫ్రెండ్లీ వాటర్ పాట్స్'కి మంచి ఆదరణ ఉంది. ఎర్తెన్ ఫైన్ క్రాఫ్ట్స్ విలేజ్ డెకార్, కావేరీ డెల్టా ప్రాంతం నుంచి హ్యాండీ క్రాఫ్ట్ చేసిన మట్టికుండలు, క్లే కుకింగ్‌వేర్ సైతం అందించే జిష్తా, కుకింగ్ పాన్‌లు, కర్రీ పాన్‌లు, వాటర్ డిస్పెన్సర్లు తదితర మట్టి ఉత్పత్తులు అందించే మడ్ కార్ట్ వంటివి ఆన్‌లైన్ విపణిలో మట్టికి కేరాఫ్‌గా నిలుస్తున్నాయి.



మట్టిలోని పోషకాలతో మేలు..

బంకమట్టిలోని ఖనిజాలు ఎంజైమాటిక్ కార్యకలాపాలకు మద్దతునిస్తాయి. పోషకాల శోషణను మెరుగుపరుస్తాయి. మట్టిలోని ఖనిజాలు నీటి రుచిని కొద్దిమోతాదులో పెంచుతాయి. తద్వారా అధిక పరిమాణంలో నీరు తాగడానికి దోహదం చేస్తుంది. తద్వారా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండడానికి వీలు కల్పిస్తుంది. ఈ మట్టి నీళ్లలోని ఆల్కలీన్ స్వభావం శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపి, రోగనిరోధక వ్యవస్థకు ఊతమిస్తుంది. అలాగే ప్లాస్టిక్ లేదా మెటల్ కంటైనర్లతో పోలిస్తే, మట్టికుండలో నీరు రసాయనాల రహితం. కుండలో నిల్వవున్న నీటికి కాలపరిమితి కూడా ఉండదు. మట్టికుండలు బయోడీగ్రేడబుల్ అంటే పునర్వినియోగానికి వీలైనవి.






మైన్ ఎన్ యువర్స్ ప్రదర్శన

బంజారాహిల్స్ : బంజారాహిల్స్ రోడ్‌నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మైన్ ఎన్ యువర్స్ వెడ్డింగ్ జ్యువెలరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సినీ నటీమణులు అషురెడ్డి, స్రవంతి ముఖ్య అతిథులుగా హాజరై ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్న భిన్న రకాల వస్త్రాభరణాలను ధరించి ప్రదర్శించారు. వీరితో పాటు పలువురు మోడల్స్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో వెడ్డింగ్, ఫెస్టివల్‌కు సంబంధించిన డిజైనరీ వస్త్రాభరణాలు, దుస్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు హర్‌ప్రీత్ సింగ్ తెలిపారు.

రేపటి నుంచి ది ఎటర్నల్ చిత్ర ప్రదర్శన





సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు నరేందర్‌రెడ్డి సమర్పిస్తున్న 'ది ఎటర్నల్ మెస్మెరైజర్' చిత్రకళా ప్రదర్శన మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరుగనుంది. చిత్రకారుడు నరేందర్‌రెడ్డి గీసిన పలు అందమైన, అపురూప చిత్రాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరనున్నాయి. ఈ చిత్రకళా ప్రదర్శనను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారని నిర్వాహకులు తెలిపారు.. ప్రదర్శన వచ్చే నెల 4వ తేదీ వరకూ సందర్శకులకు, ఔత్సాహికులకు అందుబాటులో ఉండనుందని తెలిపారు.



ఇనార్బిట్‌లో ది గ్రీన్ ఫ్లీ

ఇటు పర్యావరణ ఉత్సవం, అటు జాక్‌నైట్స్ సంగీతోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ అనుకూల జీవనాన్ని ప్రోత్సహించడంతో పాటు, స్థానిక గ్రీన్ బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడానికి, 'ది గ్రీన్ ఫ్లీ' పేరిట ఒక ఫ్లీ మార్కెట్‌ను సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ నిర్వహిస్తోంది. ఆదివారంతో ముగిసే ఈ కార్యక్రమం అన్ని వయసుల, వర్గాల పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దామని ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ది గ్రీన్ ఫ్లీ లో ప్రత్యేక ఆకర్షణగా సేంద్రీయ దుస్తులు, ఉపకరణాలు, బయోడీగ్రేడబుల్ హోమ్‌వేర్, సహజ సౌందర్య పోషణ ఉత్పత్తుల వరకూ అన్ని రకాలనూ ప్రదర్శిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా సందర్శకులు ప్రముఖ రాక్ బ్యాండ్ జాజ్ నైట్స్ సంగీతాన్ని కూడా ఆస్వాదించవచ్చని, అలాగే ప్రముఖ అంతర్జాతీయ జాజ్ కళాకారుని లైవ్ కాన్సర్ట్ ఆకట్టుకుంటుందన్నారు.



హైటెక్స్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌పో–2025 ప్రారంభం

దేశ విదేశాలకు చెందిన ఆహార సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన
మూడు రోజుల పాటు కొనసాగింపు



మాదాపూర్ : ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తున్నట్టు నిర్వాహకుడు తిలక్‌రాజ్ అరోరా తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్‌పో–2025ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలునాయక్, తిలక్‌రాజ్ అరోరా మాట్లాడుతూ ఆహార పదార్థాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, పంపిణీ కార్యకలాపాల పరిశ్రమ భారత్‌లో యేటా వృద్ధి చెందుతోందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను విరివిగా వాడుతున్నారన్నారు. వాటితో తయారు చేసిన పదార్థాలకు డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. దేశ విదేశాలకు చెందిన వందలాది సంస్థలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆహార సంస్థకు చెందిన సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో పలు ఆసక్తికర సెషన్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టాల్స్‌లో తమ అనుమానాలను సందర్శకులు అడిగితెలుసుకోవచ్చన్నారు. సంస్థ ప్రతినిధులు శివం ఆరోరా, అలోక్‌శర్మ, దామోదర్, దేవోడా పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభించిన సినీ హీరో నిఖిల్

మగ్ స్టోరీస్‌లో తారల సందడి..

సాక్షి, సిటీ బ్యూరో: గచ్చిబౌలిలోని 'మగ్ స్టోరీస్ కెఫే అండ్ కిచెన్' వేదికగా టాలీవుడ్‌కు చెందిన పలువురు సిరి ప్రముఖులు శనివారం సందడి చేశారు. పలు హిట్ చిత్రాలతో పాటు, టీవీ కార్యక్రమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన అనితా చౌదరి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మగ్ స్టోరీస్ కెఫే అండ్ కిచెన్'ను ప్రముఖ యువ హీరో నిఖిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణి మాలిక్, నటుడు ఉత్తేజ్, నటి శ్రీలక్ష్మి, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దాము, ప్రొడ్యూసర్ స్రవంతి రవికిషోర్, రచయిత బీవీఎస్ఎన్ రవి, నటుడు రఘుబాబు, డైరెక్టర్ నందినీ రెడ్డి వంటి పలువురు సినీ ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నటి అనితా చౌదరి మాట్లాడుతూ.. ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా భావించే హైదరాబాద్ నగరంలో అరుదైన రుచులతో రెస్టారెంట్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ భేష్..

సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రత, సురక్షిత డ్రైవింగ్ అలవాట్లపై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా నిర్వహిస్తోంది. (హెచ్ఎమ్ఎస్ఐ) ఆధ్వర్యంలో నెలకొల్పిన నగరంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ చెప్పుకోదగిన సేవలు అందిస్తోందని పలువురు కొనియాడారు. ఈ పార్క్ ఏర్పాటై పదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం 10వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నియో గురుకుల్ – ది స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్నేక్ అండ్ లాడర్ గేమ్, సేఫ్టీ రైడింగ్ థియరీ సెషన్, సైకిల్ యాక్టివిటీ వంటి ఇంటరాక్టివ్ సెషన్లలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అండ్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌చార్జ్ జి.హరీష్ హాజరయ్యారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ ప్రారంభమైనప్పటి నుంచి 2 లక్షలకు మంది పైగా రహదారి భద్రతపై శిక్షణ పొందారని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.



క్లుప్తంగా...

రాహుల్‌గాంధీ కాదు.. ఎలక్షన్ గాంధీ

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని.. ఎలక్షన్ గాంధీగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. ఈ మేరకు ఆమె శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయలేదని, ప్రజలకు ఇచ్చిన మాట ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలు, అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మోసం చేశారని పేర్కొన్నారు. దారి తప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల రాహుల్ గాంధీకి స్వాగతమని ఎద్దేవా చేశారు. ఆయన ఎన్నికల సమయంలో వచ్చారు తప్పా.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు, బుల్డోజర్లు పెట్టి పేదల ఇళ్లను కూల్చినప్పుడు, హెచ్‌సీయూలో చెట్లు తొలగిస్తున్నప్పుడు రాలేదని గుర్తు చేశారు. అందుకే వంద సార్లయినా రాహుల్ గాంధీని.. ఎలక్షన్ గాంధీ అని పిలుస్తానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూలో లాఠీ దెబ్బలు తిన్న విద్యార్థులను రాహుల్‌గాంధీ పరామర్శించాలని కవిత డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ఖతమైనట్టే..

ఎంపీ అర్వింద్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బరాజ్‌లు ఖతం అయినట్టేనని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. 2019లోనే మరమ్మతులు చేసి ఉంటే లాభం ఉండేదేమోనని, ఇప్పుడు మాత్రం మూడు బరాజ్‌లు ఎందుకు పనికి రానట్టేనన్నారు. గత ప్రభుత్వం తప్పు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసిందని, డీపీఆర్‌కు ఆమోదం రాకముందే పనులు ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టును పైసలు సంపాదించాలనే ఆలోచనతోనే స్టార్ట్ చేశారని, పైగా దానికి జాతీయ హోదా ఇవ్వలేదని బీజేపీపై కేటీఆర్ బురదచల్లే ప్రయత్నం చేశారన్నారు. శనివారం అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ ఏ ముఖం పెట్టుకుని ఆదివారం వరంగల్‌లో మీటింగ్ పెట్టారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. '2001లో టీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. 2009లో రాజకీయ పార్టీగా మారింది. 2014 తర్వాత ప్రైవేట్ లిమిటెడ్‌గా మారింది. 2018 తర్వాత ప్రొప్రైటరీ ఫర్మ్ అయింది. ఇప్పుడు ఆ పార్టీకి తెలంగాణకు సంబంధమే లేదు' అని అర్వింద్ పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కంటే కూడా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇంకా ప్రమాదకరమన్నారు. కేసీఆర్‌కు.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గరి మిత్రుడని, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్లు కేసీఆరే ఇచ్చారని ఆరోపించారు.

కేసీఆర్ చెప్పే ప్రతి మాట ఊరూరా చెప్పాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రజతోత్సవ సభతో ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయని, సభలో కేసీఆర్ చెప్పే ప్రతి మాట ఊరూరా చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కురువ విజయ్ కుమార్ తదితరులతో ఆయన మీడియాతో మాట్లాడారు. 2001లో ప్రారంభమైన పార్టీ 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' అనే దాకా వెళ్లి ప్రత్యేక రాష్ట్రం సాధించిందని, 25 ఏళ్ల పాటు సుదీర్ఘ ప్రయాణం చేసిందన్నారు. ఉద్యమం నడుస్తున్నప్పుడే రాష్ట్రం వస్తే చేయాల్సిన పనులపై బ్లూ ప్రింట్ రూపొందించుకున్న నేత కేసీఆర్ అని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రజలను నమ్మించి కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేటీఆర్ గులాబీ జెండా ఎగుర వేస్తారని, తర్వాత జలదృశ్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారని తెలిపారు.



'లైవ్ షాపింగ్' కింగ్ ఆసియా

ప్రత్యక్షంగా వీడియో చూస్తూ చేసే వీడియో షాపింగ్ లేదా లైవ్ షాపింగ్‌కి ప్రపంచంలో ఆసియా ఖండంలో ఉన్నంత క్రేజ్ మరెక్కడా లేదు. ఆసియా తరవాత కొద్దో గొప్పో ఉత్తర, దక్షిణ అమెరికాల్లో మళ్లీ ఈ రకమైన షాపింగ్ చేస్తున్నారు. ఈ షాపింగ్‌లో ఆసియా వాసులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నది ఆహార పదార్థాలే. కానీ, మిగతా ఖండాల్లో మాత్రం ఫ్యాషన్‌కి సంబంధించినవి ఎక్కువ కొంటున్నారు.

ఆయా ఖండాల్లో కొనుగోళ్లు (బిలియన్ డాలర్లలో)

	ఆసియా	అమెరికాలు	యూరప్
ఆహారం	121	7.1	1.7
ఫ్యాషన్	103.8	8.1	2.8
ఎలక్ట్రానిక్స్	76.1	6.3	2
సౌందర్య, చర్మ సంరక్షణ ఉత్పత్తులు	67.6	5.7	1.7

ఆధారం: స్టాటిస్టా



రజతోత్సవ రణన్నినాదం

సభ ఏర్పాట్లు ఇలా

- సభా స్థలి విస్తీర్ణం: 1,213 ఎకరాలు
- బీఆర్ఎస్ అంచనా ప్రకారం సభకు హాజరయ్యే ప్రజలు: సుమారు 10 లక్షలు
- మహాసభ ప్రాంగణం: 154 ఎకరాలు
- ప్రధాన వేదికపై సీటింగ్: 500 మందికి
- సభా సమయం: సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు.
- వాహనాల పార్కింగ్ : 1,059 ఎకరాలు
- సభికుల కోసం సిద్ధం చేసిన వాటర్ బాటిళ్లు: 10.80 లక్షలు
- మజ్జిగ ప్యాకెట్లు: 16 లక్షలు
- సభావేదిక చుట్టూ అంబులెన్స్‌లు: ఆరు రూట్లు, 20 అంబులెన్స్‌లు
- మెడికల్ క్యాంపు: సభావేదిక చుట్టూ 12
- ట్రాఫిక్, పార్కింగ్ నిర్వహణ కోసం: 2,500 మంది వలంటీర్లు

నేడే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ● వరంగల్ శివారు ఎల్కతుర్తిలో అట్టహాసంగా ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)గా ప్రస్థానం ప్రారంభించి, బీఆర్ఎస్‌గా మారి నేడు 25వ ఏట అడుగు పెడుతున్న భారత రాష్ట్ర సమితి.. వరంగల్ శివారులోని ఎల్కతుర్తిలో 'రజతోత్సవ సభ' పేరిట ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు హాజరయ్యే ఈ సభను విజయవంతం చేసేందుకు సుమారు నెల రోజులుగా బీఆర్ఎస్ యంత్రాంగం మొత్తం సర్వశక్తులూ ఒడ్డుతోంది. సభకు దాదాపు 10 లక్షల మంది వస్తారన్న అంచనాతో 1,200 ఎకరాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు రెండుమూడు రోజుల ముందునుంచే ఎల్కతుర్తికి ప్రయాణం ప్రారంభించాయి.


హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ ప్రాంగణంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రజలు

దేశం దృష్టిని ఆకర్షించేలా..

14 ఏండ్లు ఉద్యమ పార్టీగా, తొమ్మిదిన్నరేళ్లు అధికార పార్టీగా ప్రస్థానం సాగించిన బీఆర్ఎస్.. ఏడాదిన్నరగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. 2023 నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, 2024 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ తొలిసారి నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మొత్తం దేశం దృష్టిని ఆకర్షించేలా సభ ఉంటుందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. సుమారు ఏడాది తర్వాత తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగు పెడుతున్న కేసీఆర్.. 'రజతోత్సవ సభ'లో చేసే ప్రసంగంపై ఆసక్తి నెలకొంది. తెలంగాణ చరిత్రలో మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీయే విలన్‌గా ఉందని ఈ సభలో కేసీఆర్ మరోసారి బలంగా ప్రస్తావించే అవకాశముంది. కేవలం 15 నెలల పాలనలోనే ప్రజల ముందు ఇంతగా పతనమైన ప్రభుత్వాన్ని చూడలేదని పార్టీ అంతర్గత సమావేశాల్లో కేసీఆర్ చెప్తూ వస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ మళ్లీ ఛిన్నాభిన్నమైందని ఇటీవల పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. రజతోత్సవ సభలో ఇవే అంశాలను మరింత బలంగా, తనదైన శైలిలో ప్రజలకు వివరించే అవకాశముంది.

ఏడాది తర్వాత తిరిగి ప్రజాక్షేత్రంలోకి..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో అధికారం కోల్పోయిన కేసీఆర్.. కొద్ది రోజుల తర్వాత నివాసంలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరారు. సుమారు రెండు నెలల చికిత్స, విరామం తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల సన్నాహాలను ప్రారంభించారు. ఫిబ్రవరి 13న ప్రతిపక్ష నేతగా కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను పరిరక్షించాలంటూ నల్లగొండలో నిర్వహించిన సభలో పాల్గొన్నారు. మార్చి 12న కరీంనగర్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నేతృత్వంలో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. 2024 మార్చి 31న తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఏప్రిల్ 5 నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం బస్సు యాత్ర చేశారు. ఎన్నికల ప్రచారం చేయకుండా ఎన్నికల సంఘం నుంచి రెండు రోజుల పాటు నిషేధం కూడా ఎదుర్కొన్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఒక్క సీటులోనూ విజయం సాధించలేకపోయింది. దీంతో పార్టీ అంతర్గత సమావేశాలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల మొదటి రోజు మాత్రమే హాజరవుతూ వస్తున్నారు. సుమారు ఏడాది కాలంగా బహిరంగ సభలకు, క్షేత్ర స్థాయి పర్యటనలకు దూరంగా ఉన్న కేసీఆర్.. తిరిగి రజతోత్సవ సభ ద్వారా ప్రజాక్షేత్రంలో అడుగు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రకటించే భవిష్యత్ కార్యాచరణపై అటు పార్టీలోనూ, ఇటు ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది.

అట్టహాసంగా ఏర్పాట్లు

రజతోత్సవ సభ కోసం అట్టహాసంగా ఏర్పాట్లు చేశారు. ఎల్కతుర్తి, చింతలపల్లి, దామెర, కొత్తపల్లి, గోపాల్‌పూర్, బావుపేట తదితర గ్రామాల రైతుల నుంచి సేకరించిన 1,213 ఎకరాల్లో సభ నిర్వహిస్తున్నారు. ఇందులో 154 ఎకరాల్లో మహాసభ ఏర్పాట్లు చేయగా, సభకు హాజరయ్యే ప్రజలను తరలించే వాహనాల పార్కింగ్ కోసం 1,059 ఎకరాలు కేటాయించారు. వేసవి ప్రతాపం తీవ్రంగా ఉండటంతో సభికుల కోసం 10.80 లక్షల వాటర్ బాటిళ్లు, 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేశారు. ఎండవేడిమికి ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సేవలందించేందుకు సభావేదిక చుట్టూ 12 వైద్య శిబిరాలు, 20 అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సభా వేదికపై 500 మంది..

సభా వేదికను భారీగా ఏర్పాటు చేశారు. కేసీఆర్‌తోపాటు సుమారు 500 మందివరకు వేదికపై ఆసీనులయ్యే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే వాహనాల ట్రాఫిక్ నియంత్రణ కోసం 2,500 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి నియమించారు. 1,100 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ఈ సభకు కేసీఆర్ హెలికాప్టర్‌లో వస్తారని పార్టీవర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సభా వేదికకు 500 మీటర్ల దూరంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు కేసీఆర్ చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఆయన వేదికపైకి చేరుకుంటారని చెబుతున్నారు. కేసీఆర్ సుమారు గంటకుపైగా ప్రసంగించే అవకాశం ఉందన్నారు.

నీటిపారుదల చరిత్రలో మైలురాయి

- సీతారాంసాగర్, సీతమ్మ సాగర్‌కు కేంద్ర అనుమతులపై మంత్రి ఉత్తమ్
- ప్రభుత్వం చేసిన ఏడాదిన్నర కృషి ఫలించిందని వ్యాఖ్య
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8 లక్షల ఎకరాలకు ఉపయోగమని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ నీటిపాదరుల చరిత్రలో కీలక మైలురాయి లాంటి పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర జలవనరుల శాఖ సీతారాం సాగర్ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ బ్యారేజీకి అనుమతి ఇచ్చింది. మేం చేసిన ఏడాదిన్నర కృషి ఫలించింది. నీటిపారుదల శాఖలో ఇది ముందడుగు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు చాలా కాలంగా గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్నారు. గోదావరి జలాల్లో 68 టీఎంసీలు.. 8 లక్షల ఎకరాలకు ఉపయోగం' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్' ప్రాంగణం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ కూలిపోయినందున సీతమ్మ సాగర్ నిలబడుతుందా అని కేంద్రం అడిగిందని ఉత్తమ్ చెప్పారు. అయితే కేంద్ర జలసంఘానికి అన్ని వివరాలు పంపితే అప్పుడు అనుమతి ఇచ్చిందని వివరించారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందని.. ముంపు నష్టం, రక్షణ గోడ కోసం కేంద్రాన్ని నిధులు కోరామన్నారు. దీనిపై కేంద్రం కొంత సానుకూలంగా ఉందని చెప్పారు.


వారిని ప్రజలే శిక్షించాలి..

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ. లక్ష కోట్లు దోపిడీ చేసిన వాళ్లకు ఎలాంటి శిక్ష వేయాలో ప్రజలు ఆలోచించాలని మంత్రి ఉత్తమ్ కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు మొదలుపెడితే బీఆర్ఎస్ సర్కార్ రీడిజైన్ పేరుతో అంచనాలను రూ. లక్షన్నర కోట్లకు పెంచిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టు వారి హయంలోనే కూలిందన్నారు. కాళేశ్వరం బరాజ్‌ల వైఫల్యాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) రూపొందించిన నివేదికను చూస్తే వారు ఎంత దుర్మార్గం చేశారో అర్థం అవుతుందన్నారు. నివేదికపై సమీక్షించి ముందుకెళ్తామన్నారు.

రేపు ఎన్డీఎస్ఏ నివేదికపై సీఎం సమీక్ష

కాళేశ్వరం బరాజ్‌ల వైఫల్యాలపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం జలసౌధలో సమీక్షించనున్నారు. నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు బరాజ్‌ల పునరుద్ధరణ కోసం సమగ్ర అధ్యయనాలు నిర్వహించాల్సి ఉంది. మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన 7వ బ్లాకును తొలగించాలా? లేక ఉంచాలా? అనే అంశంపై నిర్ణయాన్ని కమిటీ ప్రభుత్వానికే వదిలేసింది. ఈ నేపథ్యంలో కమిటీ నివేదికలో వెల్లడైన అంశాలతోపాటు సిఫార్సులపై నిర్ణయం తీసుకోవడానికి సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. కాగా, నీటిపారుదల శాఖలో నియమితులైన 199 మంది జేటీఓలు, 224 మంది ఏఈలు కలిపి మొత్తం 423 మందికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ నియామక పత్రాలు అందజేయనున్నారు.

పంట..గిట్టుబాటు లేక తంటా!



వర్షాలు లేక అరకొర నీటితో సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలుగా టమాటా ధర 15 కేజీలు రూ.70 నుంచి రూ.100 పలుకుతుండడంతో కూలీలకు డబ్బులు ఇవ్వడానికే చాలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలంలోని టీఎస్‌కుప్పానికి చెందిన రైతు గంగిరెడ్డి టమాటాను మార్కెట్‌కు తరలించడం వల్ల కూడా నష్టమేనంటూ ట్రాక్టర్ టమాటాలను శనివారం పంటపొలాల సమీపంలోనే పారబోశారు. – బైరెడ్డిపల్లె

విజయప్రస్థానానికి బీఆర్ఎస్ సిద్ధం

రాష్ట్ర కార్యదర్శి దామోదర్

సాక్షి, హైదరాబాద్: రజతోత్సవ సభ వేదికగా గులాబీ దళపతి కేసీఆర్ సారథ్యంలో.. బీఆర్ఎస్ మరోసారి విజయ ప్రస్థానానికి సిద్ధమవుతోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. ఈ సభ బీఆర్ఎస్ పూర్వ వైభవానికి నాంది కానుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగ.. ప్రతి కార్యకర్త గుండె నిండా గులాబీలు పూయిస్తోందని అభివర్ణించారు.

ఉస్మానియా భవితకు ప్రణాళికలు రూపొందించాలి

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవిర్భవించి ఏప్రిల్ 27వ తేదీన 108 సంవత్సరంలోకి అడుగుపెట్టనుందని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయం గమనాన్ని అవలోకనం చేసుకొని.. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాల్సి ఉందన్నారు.

కొత్త కొలువుల జోరు

- 2024–25లో కోటీ 45 లక్షల ఉద్యోగాల సృష్టి... సగటున నెలకు 12 లక్షల ఉద్యోగాల కల్పన
- 6.4 శాతం ఆర్థిక వృద్ధి రేటు అంచనాతో సానుకూల ఫలితాలు
- ఈపీఎఫ్‌వోలో కొత్త సంస్థల నమోదు మాత్రం అంతంతే

న్యూఢిల్లీ: దేశంలోని వ్యవస్థాపక రంగంలో ఉద్యోగ కల్పన జోరుమీద ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ రంగం రికార్డు స్థాయిలో కోటీ 45 లక్షల కొత్త కొలువులు సృష్టించింది. దేశంలో పటిష్ట ఆర్థిక వృద్ధి అంచనాల నేపథ్యంలో పలు సంస్థల్లో నియామకాలు భారీగా జరుగుతున్నాయి. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) గణాంకాల ప్రకారం 2022–23 ఆర్థిక సంవత్సరంలో కోటీ 38 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన జరిగింది.

సగటున నెలకు 12 లక్షల ఉద్యోగాలు


2024–25 ఆర్థిక సంవత్సరంలో సగటున నెలకు 12 లక్షల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లో మొత్తంగా సృష్టించిన కొత్త కొలువుల సంఖ్య 1,32,25,401. చివరి నెల సగటును కూడా కలుపుకుంటే కోటీ 45 లక్షల కొత్త నియామకాలు జరిగాయి. ఇది 2022–23తో పోల్చితే 7 లక్షలు అధికం.

6.4 శాతం ఆర్థిక వృద్ధి రేటు

ప్రభుత్వ అంచనాల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఆర్థిక వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంది. 2025–26లోనూ దాదాపు ఇదే స్థాయిలో వృద్ధి రేటు నమోదయ్యే అవకాశముందని భావిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో పటిష్ట వృద్ధి కారణంగా కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా ఉద్యోగులు తమ జీతాలను నగదు చెల్లింపులకు బదులు బ్యాంక్ ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేసే ట్రెండ్ పెరిగిందని నిపుణులు పేర్కొంటున్నారు. దీని కారణంగానే వ్యవస్థాపక రంగంలో కొత్త ఉద్యోగాల పెరుగుదల ఈపీఎఫ్‌వో డేటాలో భారీగా నమోదువుతున్నట్లు చెబుతున్నారు.

కొత్త కంపెనీలు తక్కువే

దేశంలో కొత్తగా ఏర్పాటైన సంస్థల సంఖ్య ఈ ఏడాది తక్కువగానే ఉంది. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి చూస్తే ఈపీఎఫ్ఓలో నమోదైన కొత్త సంస్థల సంఖ్య 2024–25లో కనిష్టంగా ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లో మొత్తం 45,860 కొత్త సంస్థలు ఈపీఎఫ్ఓలో రిజిస్టర్ అయ్యాయి. అంటే సగటున నెలకు 4,169 సంస్థలు. ఇంత తక్కువ సంఖ్యలో సంస్థలు ఈపీఎఫ్‌వోలో చేరడానికి కారణం ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు లేకపోవడమేనని పేర్కొంటున్నారు. 2024 జూలైలో ప్రకటించిన ఎంప్లాయ్‌మెంట్ లింక్‌డ్ ఇన్‌సెంటివ్ స్కీమ్ (ఈఎల్ఐ) అమల్లోకి వస్తే పరిస్థితి మారుతుందని చెబుతున్నారు.



రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్రకు నాంది

- రజతోత్సవ సభపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సభకు గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలి
- వాహనాలకు అన్ని వైపులా గులాబీ జెండాలను కట్టాలి
- నాయకులతో టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ సూచన




సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చరిత్రను సృష్టించబోతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చరిత్రాత్మక సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగంపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొందని తెలిపారు. ఈ సభకు సబ్బండవర్గాలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. శనివారం పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గ్రామంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ఉదయాన్నే గులాబీ జెండాలు ఆవిష్కరించుకొని సభకు బయలుదేరాలని సూచించారు. సభకు అందరూ గులాబీ రంగు దుస్తులు ధరించి రావాలని కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి సభకు తరలి రావాలనే ఉత్సాహం ప్రజల్లో పెద్ద ఎత్తున ఉందని, వారందరినీ సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి సభా ప్రాంగణానికి చేరుకునేలాగా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు.

వాహనాలపై గులాబీ జెండాలు ఎగరాలి: సభకు తరలివచ్చే ప్రతి వాహనానికి అన్ని వైపులా గులాబీ జెండాలను కట్టుకుని ఉత్సాహంగా బయలుదేరాలని కేటీఆర్ కోరారు. ఎండల వల్ల ఇబ్బంది లేకుండా ప్రతి బస్సులో మంచినీళ్ల బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు భోజన వసతి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ నలువైపుల నుంచి తరలివచ్చే వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఇప్పటికే రూట్ మ్యాప్ పంపించామని, దానికి అనుగుణంగానే ఆయా రూట్లలో సభా స్థలికి చేరుకోవాలని ఆదేశించారు. సభా ప్రాంగణానికి 30 కిలో మీటర్ల దూరం నుంచి రోడ్లపై ఎక్కడా వాహనాలు నిలపరాదని, నేరుగా వారికి సూచించిన పార్కింగ్ స్థలాలకు చేరుకొని మాత్రమే వాహనాలను నిలపాలని సూచించారు. అనేక ప్రాంతాల్లో పార్టీ వలంటీర్లు ఎప్పటికప్పుడు గైడ్ చేసేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. సభకు చేరుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ మంచినీటి బాటిళ్లతోపాటు, మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు వలంటీర్లు సిద్ధంగా ఉంటారని కేటీఆర్ చెప్పారు.

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ సర్కారే

- కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం
- కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత
- పాలేవో.. నీళ్లేవో ప్రజలకు అర్థమైంది
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఎల్కతుర్తిలో సభాస్థలి పరిశీలన



సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని, కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ప్రజలకు ఎన్నో హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. కానీ, ఏడాదిన్నరలోనే పాలు ఏవో నీళ్లు ఏవో తేలిపోయి ప్రజలకు కూడా అర్థమైందని పేర్కొన్నారు. ఏడాదిన్నరలో ఒక్క కొత్త పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేకపోగా ఉన్న పథకాలను నాశనం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పోయి, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ వేడుకల సభాస్థలిని మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్ తదితరులతో కలిసి సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి గద్దె ఎక్కిన కాంగ్రెస్ ఒక్క పథకం తేలేదని విమర్శించారు.

కొత్తవి లేవు.. పాతవి రావు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చెప్పిన పథకాలు ఇవ్వకపోయినా గతంలో ఉన్న పథకాలను కూడా అమలుచేయటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై విసిగి వేసారిన రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. 'నీళ్ల లేక కాదు.. పాలన చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెట్టింది. ఇది చేతకాని దద్దమ్మ ప్రభుత్వం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆదాయం తగ్గిపోయింది. పాలన చేతకాక రేవంత్‌రెడ్డి మాట తప్పిండు. రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేశారు. రైతుల కోసం పని చేసింది కేవలం కేసీఆర్ ప్రభుత్వమే. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ రావాలి.. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. వరంగల్ జిల్లా అతిపెద్ద సభకు వేదికగా నిలిచింది. ఇప్పటికే సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనం సభకు తరలి వస్తున్నారు. బీఆర్ఎస్ వేడుకలు అంటే నిజంగా ప్రజలకు ఒక పండుగ లాంటివి. ఈ సభలో కేసీఆర్‌ను చూడాలని, ఆయన ఏం మాట్లాడుతారో వినాలని ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు' అని తెలిపారు.

ఆలయం కూల్చివేత ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

హిందువుల అరెస్టులు సరికాదు: ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో శివాలయం ధ్వంసం చేసిన ఘటనలో పోలీసులు సకాలంలో స్పందించలేదని, పోలీసుల వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఘటనకు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోకుండా..కేవలం హిందువుల మీద నాలుగు ఎఫ్ఐఆర్‌లు పెట్టారని విమర్శించారు. ఆలయం ధ్వంసం కేసులో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన డీజీపీ జితేందర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఘటనకు కారణాలు, స్థానిక పరిస్థితులను డీజీపీకి వివరించారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు, డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. పక్కన ఉన్న మదర్సాలో ఉన్న పిల్లలను వదిలి బీజేపీ, హిందూ కార్యకర్తలను ఇష్టం వచ్చినట్టు అరెస్ట్ చేస్తున్నారని, మదర్సాలో ఉంటున్న వారు ఎవరన్న విషయంపై ముందు విచారణ జరపాలని జిల్లా ఎస్పీని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మదర్సాల్లో ఉంటున్నవారు ఏ రాష్ట్రం వారు..ఏ దేశం వారన్నది దర్యాప్తు చేయాలని ఆయన పోలీస్ శాఖను కోరారు. లక్షల్లో సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని చెప్పే తెలంగాణ పోలీసులకు విగ్రహం పగిలిన తర్వాత మదర్సా పిల్లలు ఆ ప్రాంతం లోపలికి పోయి, బయటికి వచ్చిన వీడియోలు ఎందుకు బయటకురావని ప్రశ్నించారు. 70 వేల మంది రోహింగ్యాలు హైదరాబాద్‌లో ఉన్నారని సమాచారం ఉందని, తెలంగాణ, భాగ్యనగరంలో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్తాన్, రోహింగ్యాలను వెళ్లగొట్టకపోతే భాగ్యనగరం మండిపోతుందని రఘునందన్‌రావు హెచ్చరించారు.

రాష్ట్ర అభివృద్ధికి సీఎం విశేష కృషి

ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో కృషి చేస్తున్నారని, నిధుల సమీకరణకు ప్రపంచ వేదికలను ఉపయోగించుకుంటున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి చెప్పారు. జపాన్ దేశం ఒసాకాలోని వరల్డ్ ఎక్స్‌పో 2025లో ఇండియన్ పెవిలియన్‌ను చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డికి ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో, ఫుడ్ అండ్ బెవరేజెస్ యూనిట్ ఫంక్షనల్ ఆఫీసర్ డాక్టర్ గరిమా మిట్టల్ ఘనంగా స్వాగతం పలికారు. పెవిలియన్‌లో భారత దేశంలోని విభిన్న సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయ హస్తకళలు, ఇస్రో అంతరిక్ష కార్యక్రమం, భారత దేశంలోని ఆధునిక ఆవిష్కరణల గురించి అధికారులు చిన్నారెడ్డికి వివరించారు.

● విజయ పథం




● సోలార్ పవర్‌తో జీవితాల్లో కొత్త వెలుగు

సోలార్ సఖి

రైల్లో తొలిసారి ప్రయాణించిన ఆ మహిళలు.... 'రైలు ప్రయాణం ఇంత బాగుంటుందా!' అని సంబరపడి పోయారు. ఆ తరువాత మరో ప్రయాణం మొదలు పెట్టారు. అయితే అది రైలు ప్రయాణం కాదు. తమ జీవితాలను మార్చివేసిన ప్రయాణం. చిన్న చదువులు చదువుకున్న ఎంతో మంది గ్రామీణ మహిళలు సోలార్ ఇంజినీర్‌లుగా, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణిస్తున్నారు...



● సోలార్ సఖి: భవిష్యత్ తరానికి మార్గదర్శనం

రాజస్థాన్‌లో నిశ్చలగఢ్‌కు చెందిన తర్రీదేవి ఎన్నో సంవత్సరాలు విద్యుత్ సౌకర్యం లేని ఇంట్లోనే గడిపింది. అయిదవ తరగతి తరువాత తల్లిదండ్రులు చదువు మాన్పించడంతో ఇంటి పనులు చేసేది. గొర్రెలు మేపేది. ఇల్లే ప్రపంచంగా బతుకుతున్న తర్రీ దేవి జీవితాన్ని 'సోలార్ పవర్' మార్చి వేసింది. హర్మదా(జైపూర్)లో ఐదు నెలల సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కార్యక్రమం ఆమె జీవితాన్ని కొత్త దారిలోకి తీసుకువెళ్లింది.

సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కోసం సిద్ధం అయినప్పుడు..

'ఎందుకులే' అన్నారు తల్లిదండ్రులు. వారిని బలవంతంగా ఒప్పించాల్సి వచ్చింది,

'మా కమ్యూనిటీలోని మహిళలు ఎప్పుడూ ముసుగు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లలేదు. నేను ఎప్పుడూ పట్టణ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లలేదు' అంటుంది తర్రీదేవి.

కిషన్‌గఢ్‌కు వెళ్లడం...తన తొలి రైలు ప్రయాణం! 'అది పూర్తిగా కొత్త అనుభవం. ప్రయాణంలోని ఆనందం తెలిసొచ్చింది' అంటుంది తర్రీదేవి.



● 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకున్న తర్రీదేవి

శిక్షణలో సోలార్ ఇన్‌స్టలేషన్, ఫీల్డ్‌వర్క్‌కు అవసరమైన నైపుణ్యాలు సంపాదించింది. ఆ తరువాత స్వగ్రామానికి తిరిగివచ్చింది. 'మేము చాలా సంవత్సరాలు చీకటిలో జీవించాము. అందుకే మా జీవితాల్లో వెలుగు తీసుకురావాలనుకున్నాను' అంటుంది తర్రీదేవి.

సోలార్ ఇంజినీర్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్రీదేవి తన గ్రామానికి విద్యుత్ వెలుగులు తీసుకువచ్చింది. భారత రాష్ట్రపతి నుండి 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకుంది. ఇది కేవలం తర్రీదేవి విజయగాథ మాత్రమే కాదు... జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరాం, నాగాలాండ్‌తో సహా పదిరాష్ట్రాలలో మూడువేల మందికి పైగా గ్రామీణ మహిళా సోలార్ ఇంజినీర్‌ల విజయగాథ.

తమ గ్రామాల్లో సోలార్ ప్యానెళ్లను ఒంటిచేత్తో మరమ్మతు చేసే వీరు పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదిగారు. ఈ మార్పుకు కారణం హర్ష్ తివారీ నేతృత్వంలోని ఈఎంపీఐ ఇంటర్నేషనల్. ఈ సంస్థ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు సోల్డరింగ్, వైరింగ్, బ్యాటరీ సెటప్, ఫాల్ట్ ఫైండింగ్, ఇన్‌స్టలేషన్‌లలో ప్రావీణ్యం సాధించారు. గ్రామీణ మహిళలకు సాంకేతిక నైపుణ్యం, ఆర్థికస్వాతంత్ర్యం లక్ష్యంగా ఈఎంపీఐ ఇంటర్నేషనల్ పనిచేస్తోంది.

శిక్షణ అనంతరం మహిళలు తమ గ్రామాల్లో సోలార్ సొల్యూషన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. మరమ్మతులు, ఫస్ట్‌లెవల్ చెకప్‌లు నిర్వహించేందుకు వీలుగా చిన్న ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలు సజావుగా సాగేలా చూస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా సోలార్ ఇంజినీర్‌లను 'సోలార్ సఖీ' అని పిలుస్తారు.

'వ్యవసాయంతో పాటు చిన్న తరహా పరిశ్రమలలో సౌరశక్తితో నడిచే పరికరాలకు డిమాండ్ పెరుగుతుంది, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈఎంపీఐ ఇంటర్నేషనల్ సోలార్ సఖీలకు శిక్షణ ఇస్తోంది. జీవనోపాధి కల్పిస్తుంది. టెక్నికల్ ట్రైనింగ్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌లో కూడా శిక్షణ ఇస్తాం. గ్రామాల్లో సోలార్ సెటప్‌లలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే సోలార్ సఖులు పరిష్కారం చూపుతున్నారు' అంటున్నాడు హర్ష్ తివారీ.

కూల్ సమ్మర్

పక్షులను చల్లగా కాపాడుకుందాం!

వేసవి కాలం పక్షులకు కష్టకాలం. అధిక వేడి పక్షులకు ప్రమాదకరంగా మారుతుంది. డీహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా పక్షులను రక్షించడానికి... నీరు, నీడ, గాలి ప్రసరణకు ప్రాముఖ్యత ఇవ్వాలి. కొన్ని జాగ్రత్తలు...




● పక్షులకు అన్ని వేళలా శుభ్రమైన మంచినీరు అందుబాటులో పెట్టాలి ● వేర్వేరు ప్రదేశాలలో వాటర్ బౌల్స్ పెట్టాలి ● చల్లగా, ఫ్రెష్‌గా ఉండడానికి వాటర్ బౌల్స్‌లో ఐస్ క్యూబ్స్ వేయవచ్చు ● చల్లని, సౌకర్యవంతమైన స్థలంలో పక్షులు ఉండేలా చూడాలి ● కూలింగ్ మ్యాట్స్ ఉపయోగించవచ్చు ● పక్షులపై ఒక నిమిషం లేదా అర నిమిషం నీటిని స్ప్రే చేయాలి ● పక్షులకు సమీపంలో తడి టవల్స్ ఏర్పాటు చేయాలి ●వేగంగా శ్వాస తీసుకోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం, బద్ధకంగా కనిపించడం, తినడానికి ఆసక్తి చూపించకపోవడం...మొదలైనవి పక్షులకు సంబంధించి ఓవర్ హీటింగ్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి ● ఆహారం విషయానికి వస్తే.... నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ, దోసకాయలాంటివి అందించవచ్చు ● ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో వందలాది గ్రామాల్లో యానిమల్ యాక్టివిస్ట్‌లు వేసవి వేడి నుంచి పక్షులను కాపాడడానికి 'బర్డ్ రెస్టారెంట్స్' ఏర్పాటు చేశారు. పక్షులకు చల్లని నీడను ఇచ్చేలా నీరు, ఆహార పదార్థాలతో చెట్టు కొమ్మలపై ఈ రెస్టారెంట్‌లు ఏర్పాటు చేశారు.




● మానవత్వం

నిరీక్షణ ఫలించింది...



కొన్ని సంవత్సరాల నుంచి భర్తతో కలిసి మన దేశంలో ఉంటున్న క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ భారత్‌లో తన అనుభవాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. దిల్లీలో ఉంటున్న ఫిషర్ దంపతులు నిషా అనే దివ్యాంగురాలైన బాలికను దత్తత తీసుకోవాలనుకున్నారు. అయితే దత్తత ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది.

'2023లో అక్టోబర్‌లో దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా, 2024లో నిషాకు దగ్గరయ్యాం. 2025 ఏప్రిల్ నాటికి దత్తత పూర్తయింది. ఇప్పుడు నిషా మా అందమైన కుమార్తె' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసింది ఫిషర్.

'కౌంటింగ్ డౌన్ ది డేస్ అన్‌టిల్...' ట్యాగ్‌లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాను దత్తత తీసుకున్న పాప కనిపిస్తుంది.

మరో వీడియోలో చిన్నారి నిషాకు సంబంధించిన ఎమోషనల్ గ్లింప్స్‌ను షేర్ చేసింది. దివ్యాంగురాలు అనే కారణంతో నిషాను చిన్న వయసులోనే తల్లిదండ్రులు వదిలేశారు. రెండు సంవత్సరాలు అనాథాశ్రమంలో పెరిగింది నిషా. 'స్పెషల్ నీడ్స్ చైల్డ్‌ను దత్తత తీసుకోవాలనుకోవడానికి కారణం...వారికి కొత్త జీవితం ఇవ్వాలనుకోవడం' అంటుంది క్రిస్టెన్ ఫిషర్.

● గుడ్ అండ్ బ్యాడ్

కిడ్‌ఫ్లూయెన్సర్... కిం కర్తవ్యం



యూ ట్యూబ్‌లో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల వైరల్ వీడియోలు ప్రవాహంలా కనిపిస్తాయి. క్యాచీ కంటెంట్‌తో లక్షల్లో వ్యూస్ సాధిస్తున్నారు. లక్షల్లో సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మన దేశంలో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తెర వెనుక కథ గురించి చర్చ మొదలైంది. షూటింగ్‌ల కోసం వారు తరచుగా స్కూల్‌కు వెళ్లకుండా ఎక్కువ సెలవులు పెడుతున్నారా? సరిగా తింటున్నారా? తగినంత నిద్ర ఉంటోందా? కంటెంట్‌కు సంబంధించి ఒత్తిడికి గురవుతున్నారా? అందరు పిల్లల్లా సాధారణ జీవితాన్ని ఎంజాయ్ చేయలేకపోతున్నారా... ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి.

బాగా చదివే పిల్లలు కూడా 'కిడ్‌ఫ్లూయెన్సర్' ట్యాగ్‌లైన్ పుణ్యమా అని చదువులో వెనకబడిపోతున్నారు. 'నేను చాలా సాధించాను. నేను చాలా గ్రేట్' అనే భావన పెరిగిపోతుంది. 'యాభై ఏళ్ల క్రితం అకాడమిక్ ఎక్సలెన్స్ గోల్డ్ స్టాండర్డ్, ముప్పై ఏళ్ల క్రితం ఆటలు ఉండేవి. ఇప్పుడు క్రియేటివిటీ, డ్యాన్స్, మ్యూజిక్, విజువల్ కంటెంట్. ఒక్క వైరల్ వీడియో చాలు పిల్లలకు రాత్రికి రాత్రి స్టార్‌డమ్ తీసుకురావడానికి. ఈ తక్షణ పాపులారిటీ వల్లే పిల్లలు, తల్లిదండ్రులు వైరల్ కంటెంట్‌పై దృష్టి పెడుతున్నారు' అంటుంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.మేఘా పుష్కర్ణ.

హెల్త్

● టూత్

ఇంటి పట్టున ఉంటారు పంటి పని పట్టండి......



ఎముకలు పెరుగుతున్న కొద్దీ వచ్చే మార్పులు స్వాభావికమైనవి. అయితే ఎదిగే వయసులో ఉన్న కొందరు చిన్నారులు అలవాటుగా తమ వేలిని నోట్లో పెట్టుకుని థంబ్ సకింగ్ చేస్తుంటారు. ఇది నివారించాల్సిన విషయమే అయినప్పటికీ... పిల్లల సైకలాజికల్ ఎదుగుదల దృష్టితో చూస్తే వారి ఈ అలవాటును బలవంతంగా మాన్పకూడదనీ, క్రమంగా మాన్పించాలని నిపుణులు పేర్కొంటుంటారు. ఇలా ఎముకల పెరుగుదలతో వచ్చే మార్పులతోనూ, నోట్లో వేలుపెట్టుకునే అలవాటు వల్లా పలువరస షేప్ మారవచ్చు.

కొన్ని సాధారణ దంతసమస్యలివి...

● పిప్పిపళ్లు ● చిగుర్ల సమస్యలు ● పాలపళ్లు సరైన సమయంలో ఊడకపోవడం ● ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు, పళ్ల మధ్య సందులతో సమస్యలు ● ముఖానికి దెబ్బలు తగలడం వల్ల వచ్చే సమస్యలు.

పిప్పిపళ్లు...

దాదాపు 80 శాతానికిపైగా పిల్లల్లో పిప్పిపళ్లు, చిగుర్ల జబ్బులు కనిపిస్తుంటాయి. తీపి పదార్థాల ముక్కలు నోటిలోనే ఉండిపోవడంతో పెరిగిపోయిన బ్యాక్టీరియాతో పాటు వారు సరిగా బ్రష్ చేసుకోకపోవడం వల్ల ఆ పెరిగిన బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో నోటిలోనే ఉండిపోవడం, అవి విడుదల చేసే హానికర రసాయనాల వల్ల పళ్లలో రంధ్రాలు ఏర్పడి పిప్పిపళ్లు రావచ్చు. రంధ్రాల పరిమాణం పెరుగుతున్న కొద్దీ ఆహార వ్యర్థాలు అక్కడ ఎక్కువగా ఇరుక్కుపోవడం, దాంతో రంధ్రం మరింతగా పెరగడంతో పాటు ఇన్ఫెక్షన్స్ వచ్చి నొప్పి రావచ్చు. ఇలాంటి పిప్పిపళ్ల కారణంగా చిన్నారులు ఆహారం నమలడానికి ఇబ్బందిపడతారు. అన్నం తినడాన్ని అవాయిడ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. తమకు వచ్చే నొప్పిని తల్లిదండ్రులకు సరిగా చెప్పలేక ఇలా అన్నం తినడానికి నిరాకరిస్తుంటారు. దాంతో ఎదుగుదల కూడా ఎంతో కొంత ప్రభావితం కావచ్చు.

చికిత్స...

పిప్పిపళ్లకు సరైన సమయంలో చికిత్స చేయించకపోతే ఇన్ఫెక్షన్ పంటి ఎముక వరకు చేరి, పాల పళ్లతో పాటు తర్వాత రావాల్సిన శాశ్వతదంతాలూ పాడయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఇలాంటి పిల్లలను దంతవైద్యులకు చూపించినప్పుడు వారు పంటిలోని రంధ్రాలను పూడ్చివేయడం, ఇన్ఫెక్షన్‌ను తగ్గించడానికి తగిన యాంటీబయాటిక్స్ ఇవ్వడం వంటి చికిత్సలు చేస్తారు.

చిగుర్ల జబ్బులు...

చిన్నారులకు బ్రషింగ్ నైపుణ్యాలు అంతగా తెలియకపోవడంతో పళ్లలో చిక్కుకున్న ఆహారపదార్థాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం కారణంగా పిప్పిపళ్లతో పాటు చిగుర్ల సమస్యలు వచ్చే ముప్పూ ఉంటుంది. దీనికో కారణముంది. నోట్లో విపరీతంగా పెరిగిపోయిన బ్యాక్టీరియా, ఆహారపదార్థాలతో కలిసి ప్లాక్, క్యాలికులస్ అని పిలిచే మురికి సున్నితమైన చిగుర్ల చివర్లలోకి చేరుతుంది. ఈ మురికి కారణంగా చిగుర్లలో వాపు, కొందరిలో చిగుర్ల నుంచి రక్తస్రావం కావడం, నోటి దుర్వాసన వంటి సమస్యలు కూడా రావచ్చు. చిన్నవయసులోనే చిగుర్ల జబ్బు వస్తే పిల్లలు జీవితకాలం దృఢమైన పళ్లు లేక ఇబ్బంది పడవలసి రావచ్చు.

పిల్లలు ఎదుగుతూ ఉండే సమయంలో అన్ని ఎముకలతో పాటు ముఖానికి సంబంధించిన ఎముకలూ, దవడ ఎముకల్లోనూ మార్పులు వస్తుంటాయి. దాంతో చిన్నారుల్లో ఈ ఎదుగుదలకు సంబంధించిన కొన్ని సమస్యలు కనిపించవచ్చు. అలాగే చిన్నపిల్లలు చాక్లెట్లు, స్వీట్స్, జంక్‌ఫుడ్ వంటివి ఇష్టంగా తింటుంటారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగుతుంటారు. ఇవన్నీ నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. పిల్లల్లో వచ్చే కొన్ని సాధారణ డెంటల్ సమస్యలూ, వాటికి పరిష్కారాల కోసం ఈ కథనం.



డా. వికాస్ గౌడ్,
డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్



చికిత్స...

జింజివైటిస్ వంటి సమస్యలకు తగిన యాంటీబయాటిక్స్ వాడటతో పాటు చిగుర్లకు వచ్చే సమస్యను బట్టి దంతవైద్యులు పలు రకాల చికిత్సలు అందిస్తారు.

ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు పళ్లు / వంకరపళ్ల వంటి సమస్యలు...

ఎత్తుపళ్లు అన్నది పిల్లలను ఆత్మన్యూనతకు గురిచేసే సమస్య. మొదట్లో ఇది నివారించదగిన సమస్యే అయినప్పటికీ, తల్లిదండ్రుల అవగాహనాలోపం, మరి కొందరిలో వారి నిర్లక్ష్యం వల్ల ఇది తీవ్రమవుతుంది.

ఎత్తుపళ్లు / ఎగుడుదిగుడు పళ్లు / వంకర పళ్లకు కారణాలు...

● ఎత్తుపళ్లు చాలావరకు వంశపారంపర్యంగా వస్తుంటాయి. తల్లిదండ్రుల్లో ఒకరికిగానీ లేదా ఇద్దరికీ ఎత్తుపళ్లు ఉంటే పిల్లల్లోనూ వచ్చే అవకాశాలు 70 శాతానికి పైమాటే. పిల్లలకు ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు / వంకరపళ్లు, పళ్లమధ్య సందులు రాకుండా చేసే చికిత్సలు సైతం ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

● నోట్లో వేలుపెట్టుకోవడం, పెదవులు కొరకడం, నాలుకతో పళ్లను ముందుకు తోస్తూ ఉండటం, నోటితోనే గాలిపీల్చడం వంటి అంశాలూ ఎత్తుపళ్లకు కారణమవుతుంటాయి. ఎదుగుతున్న చిన్నారుల దవడ ఎముకలు మైనంలా ఒత్తిడి పడుతున్న దిశకు వంగిపోతుంటాయి. ఈ కారణం వల్లనే ఇక్కడ పేర్కొన్న దురలవాట్లు ఉన్న పిల్లల్లో దవడ ఎముకల షేపు మారిపోయి పళ్లు ఎత్తుగా రావచ్చు.

● పాలపళ్లు సమయానికి ఊడిపోకపోయినా, పిప్పిపళ్లను ముందే తీసేయాల్సి వచ్చినా ఎత్తుపళ్లు లేదా ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు రావడానికి ఈ అంశాలు కూడా ఒక కారణం.

ఎదిగే వయసులోనే ఎత్తుపళ్లను, ఎగుడుదిగుడు దంతాలనూ, సరిచేయడం, పళ్ల మధ్యన ఉండే సందులు చక్కదిద్దడం చాలా సులువు. చికిత్స ఫలితాలు కూడా దాదాపు నూరు శాతం ఉంటాయి. ఎదిగే వయసులో వచ్చే 'గ్రోత్ స్పర్' అనేది చికిత్సకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చికిత్స త్వరగా, సమర్థంగా జరిగేందుకు ఈ గ్రోత్ స్పర్ అంశం సహాయపడుతుంది.

ఎత్తుపళ్ల సమస్య రెండు రకాలుగా ఉండవచ్చు...

● కేవలం పళ్లు మాత్రమే ఎత్తుగా ఉండటం ● పళ్లతో పాటు దవడ ఎముకలు కూడా ఎత్తుగా ఉండటం.

పిల్లలు నవ్వినప్పుడు చిగుర్లు ఎక్కువగా కనిపించడం, నిద్రపోతున్నప్పుడూ పెదవులు తెరచుకునే ఉండటం, పెదవులు ముందుకు వచ్చినట్లుగా కనపడటం వంటివి ఎముక కూడా ఎత్తు పెరిగిందని చెప్పడానికి గుర్తులు.

చికిత్స...

● ఎదిగే వయసులో ఎత్తుగా ఉన్నట్లు గుర్తిస్తే... ఎలాంటి శస్త్ర చికిత్సలూ లేకుండానే పళ్లు, దవడలను ప్రత్యేకమైన క్లిప్స్‌తో సరిచేయవచ్చు. అయితే... ఎదిగిన పిల్లల్లో దవడ ఎముకలు ఎత్తుగా ఉంటే సర్జరీ చేయాల్సి రావచ్చు.



● పళ్లు ఎత్తుగా ఉన్నా, పళ్ల మధ్య సందులు ఉన్నా, వంకర టింకరగా ఉన్నా, ఎగుడుదిగుడుగా ఉన్నా క్లిప్పులతో వాటిని సరిచేయవచ్చు. అయితే పిల్లలకు అమర్చాల్సిన క్లిప్పులు అందరిలో ఒకేలా ఉండవు. వ్యక్తిగతమైన పరీక్షల తర్వాతే వారికి సరిపోయేవాటిని నిర్ణయించాల్సి ఉంటుంది.

పాలపళ్లు సరైన టైమ్‌లో ఊడకపోవడం...

సాధారణంగా పాలపళ్లలోని ప్రతి పన్నూ ఓ నిర్దిష్ట సమయం తర్వాత ఊడుతుంది. శాశ్వత దంతం తయారై బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నప్పుడే పాలపన్ను ఊడుతుంది. ఊడిన 3 నుంచి 4 నెలల్లో శాశ్వత దంతం వచ్చేస్తుంది.

ఏ కారణం వల్లనైనా పాలపన్ను ఊడకపోతే, దానికి ముందువైపో, వెనకవైపు నుంచో శాశ్వత దంతం వస్తుంది. (కొన్నిసార్లు పాల పన్ను ఊడకపోవడం వల్ల శాశ్వత దంతం బయటకు రాలేక చిగురులోనే చిక్కుకుపోవచ్చు కూడా). దాంతో రెండు వరసల్లో పళ్లు కనపడతాయి. అందుకే ఆరేళ్లు దాటిన పిల్లలను దంతనిపుణులకు తరచూ చూపిస్తూ పాలపళ్లు సరైన సమయంలోనే పడిపోతున్నాయా లేదా అని పరీక్ష చేయిస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి వారి పర్యవేక్షణలో చికిత్స చేయించాలి.

పరీక్షలు : ఎక్స్-రే సహాయంతో పాలపళ్లు, శాశ్వత దంతాలను, శాశ్వతదంతాలను చిక్కుకుపోయిన తీరును దంతవైద్యులు తెలుసుకోగలరు.

ముఖానికి దెబ్బలు తగలడం వల్ల...

ఎదిగే పిల్లలు ఆటలాడుతుంటారు. పైగా ఇవి సెలవురోజులు కావడం ఆడుకోవడం మరింత ఎక్కువ. ఆటల్లో పరుగెత్తుతూ పడిపోవడం, దెబ్బలు తగలడం, క్రికెట్ బంతి లేదా ఇతర బంతుల వంటివి తగలడం, పిల్లలు పోట్లాడుకోవడం వంటి చర్యలతో ముఖానికి దెబ్బలు తగలడం, పళ్లు విరగడం / వంగిపోవడం, దెబ్బలు తీవ్రమైనవైతే పెదవులు చీలడం, ముక్కు వంకర కావడం కూడా జరగవచ్చు.

ఇలా దెబ్బలు తగిలినప్పుడు వెంటనే చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పలువరస షేపు మారడం, పళ్లపై గుర్తులు ఏర్పడి అలాగే ఉండిపోవడం జరగవచ్చు. అందుకే పన్ను విరిగినా, ఊడినా వెంటనే ఆ ముక్కను పాలలో లేదా మంచినీళ్లలో ఉంచి దంతవైద్యులను కలవాలి.

వేసవి సెలవులు దంతవైద్యం చేయించడానికి అనువైన సమయం. ఈ సమయంలో స్కూళ్లకు సెలవులు ఉంటాయి కాబట్టి పిల్లల చదువులు వృథా కాకుండానే చికిత్స చేయించవచ్చు. పైగా చికిత్స తర్వాత వారు ఇంటిపట్టునే ఉంటారు కాబట్టి టైముకు మందులు ఇవ్వడానికి, తగిన జాగ్రత్తలు తీసుకోడానికి, పిల్లలకు తగినంత విశ్రాంతి ఇవ్వడానికి సెలవులన్నవి సరైన సమయం. కాబట్టి తల్లిదండ్రులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, పంటి సమస్యలున్న పిల్లలకు తగిన వైద్యసహాయం అందించవచ్చు.

● ఫుడ్

జంకొద్దు

వేసవిలో పిల్లలకు ఆహారం ఇవ్వాలంటే రెండు అంశాలు గుర్తుపెట్టుకోవాలి. మొదటిది వేసవి వేడిమి. రెండోది సెలవుల్లో వాళ్ల ఆటలు. నగరాల్లోని పిల్లలు ఎండల్లో పెద్దగా ఆడే అవకాశం లేకపోయినా పట్టణాల్లో, పల్లెల్లోని పిల్లలు ఇలా ఎండ వేడిమిలో ఆడటం మామూలే. అలాగే పెద్ద నగరాల్లోంచి సెలవులకు పల్లెలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గినప్పటికీ... కొంతమంది ఇప్పటికీ ఇలా వచ్చేవారు లేకపోలేదు. ఇలా వేసవిలోని వేడిమిని తట్టుకుంటూ... ఎక్కువ సమయం ఆటలకు ఇచ్చుకుంటూ ఉండేందుకు అవసరమైన శక్తిని సమకూరుస్తూ ఉండటానికి చిన్నారులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తెలిపే కథనం.



● అధిక శక్తికోసం పాల ఉత్పత్తులు...

పిల్లలకు తాజా లస్సీ, తాజా మజ్జిగ, ఫ్లేవర్డ్ మిల్క్, ఫ్రూట్ మిల్క్ షేక్‌లు (మ్యాంగో మిల్క్ షేక్) వంటివి ఇవ్వడం వల్ల ఒకపక్క అవి ద్రవాహారాలుగా వారు కోల్పోయే నీరు లవణాలను భర్తీ చేయడంతో పాటు ప్రొటీన్లనూ అందజేస్తాయి. ఎదిగే వయసులో ఎముకల బలం కోసం క్యాల్షియమ్‌ను ఇస్తాయి.

● తాజా పండ్లు... పిల్లలకు తాజా పండ్లు తినిపించడం ఎప్పుడూ మంచిదే. కాకపోతే పండ్ల రసాలకు బదులు వీలైనంతగా పండ్లను కొరికి తినేలా చూడాలి. ద్రవాలను భర్తీ చేయడం కోసం, వేసవి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ చల్లగా ఉండే తాజా పండ్ల రసాలనూ ఇవ్వవచ్చుగానీ... వీలైనంత వరకు వాటిలో చక్కెర కలపకపోవడం మంచిది.

● జంక్‌ఫుడ్ వద్దు... బర్గర్‌లు, పిజ్జాలు, చిప్స్ వంటి వాటి కోసం వాళ్లు మారాం చేస్తున్నప్పటికీ ఆరోగ్యానికి అవి హానికరమంటూ వాళ్లను సముదాయించడం మంచిది. ఆ వయసు పిల్లలను సమాధానపరచడం కష్టం కాబట్టి వాటిలో పనీర్, తాజాకూరగాయలు పుష్కలంగా నింపి ఇవ్వడం మంచిది. అయితే వాటిల్లో చీజ్ ఎక్కువగా ఉన్నవాటిని తినిపించడం అంతగా మంచిది కాదు. మరీ మారాం చేస్తుంటే గ్రిల్డ్ వెజిటబుల్స్‌ను పనీర్‌తో కలిపి ఇవ్వవచ్చు.



● ఐస్‌క్రీముల విషయంలో...

వేసవిలో ఐస్‌క్రీములు అడగని పిల్లలు ఉండరు. ఇంట్లో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ కస్టర్డ్స్, పుడింగ్స్, స్మూతీస్ వంటివి పిల్లలకి పెట్టవచ్చు. ఇవి ఆరోగ్యకరమే. ఇక కూల్ డ్రింక్స్ కోసమూ డిమాండ్ ఎక్కువగానే ఉండవచ్చుగానీ వాటిని ఇవ్వడం అంతమంచిది కాదని గుర్తుంచుకోండి



భారత బాక్సర్ల పతకాల పంచ్

అమాన్ (జోర్డాన్): భారత టీనేజ్ బాక్సర్లు ఆసియా అండర్–15, అండర్–17 చాంపియన్‌షిప్‌లో పతకాల పంట పండిస్తున్నారు. రెండు విభాగాల్లో కలిపి శనివారం మరో నాలుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్లోకి ప్రవేశించడంతో నాలుగు కాంస్యాలు ఖాయమయ్యాయి. అండర్–17 బాలుర 63 కేజీల క్వార్టర్స్‌లో అమన్ సివాచ్... జియద్రవ్ జేమ్స్ కాబ్రెరా (ఫిలిప్పీన్స్)పై గెలుపొందగా, 80 కేజీల క్వార్టర్ ఫైనల్లో దేవాన్ష్... అబ్దల్లా అల్దబ్బాస్ (జోర్డాన్)ను ఓడించాడు. సాహిల్ దుహాన్ (60 కేజీలు)... అమిర్ అలీ మెహార్బి (ఇరాన్) చేతిలో, అనంత్ గౌరీశంకర్ దేశ్‌ముఖ్ (66 కేజీలు)... డానియల్ పల్కర్‌బే (కజకిస్తాన్) చేతిలో, ప్రియాన్ష్ సెహ్రావత్ (75 కేజీలు)... కుర్షిద్ బెక్ జురేవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో పరాజయం చవిచూశారు. లోవెన్ గులియా (80 కేజీలు)పై ఫర్హాద్ గొర్బాని (ఇరాన్) గెలుపొందాడు. అండర్–17 బాలికల విభాగంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్లలో సిమ్రన్‌జీత్ కౌర్ (60 కేజీలు)... అయా అల్‌హసనత్ (జోర్డాన్)పై, హిమాన్షి (70 కేజీలు)... ఫరా అబు లేలా (పాలస్తీనా)పై విజయం సాధించారు. దీంతో పతకాల లెక్క 43కు చేరనుంది.



ట్రోఫీతో మూడు జట్ల కెప్టెన్లు

భారత్ X శ్రీలంక

ముక్కోణపు వన్డే టోర్నీలో నేడు తొలి మ్యాచ్

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరగనున్న తొలి పోరులో ఆతిథ్య శ్రీలంకతో భారత జట్టు తల పడుతోంది. భారత్, శ్రీలంకతో పాటు దక్షిణాఫ్రికా పాల్గొంటున్న ఈ టోర్నీలో మ్యాచ్‌లన్నీ ప్రేమదాస స్టేడియంలో జరగనున్నాయి. ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... ఈ టోర్నీలో యువ ఆటగాళ్ల సామర్థ్యాన్ని పరీక్షించాలని భారత్ భావిస్తోంది. ముక్కోణపు టోర్నీ మొదటి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేయాలని హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా చూస్తోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మతో భారత బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. గత కొంతకాలంగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న ఓపెనర్ షఫాలీ వర్మను సెలెక్టర్లు ఈ సిరీస్‌కు కూడా పరిగణనలోకి తీసుకోలేదు. గత రెండు సిరీస్‌ల్లోనూ చక్కటి విజయాలు సాధించిన టీమిండియా పూర్తి ఆత్మవిశ్వాసంతో ముక్కోణపు టోర్నీకి సిద్ధమైంది. వెస్టిండీస్, ఐర్లాండ్‌పై సిరీస్‌లు గెలిచిన టీమిండియా వరుసగా ఆరు వన్డేలు నెగ్గి శ్రీలంకలో అడుగుపెట్టింది.

కాశ్వీ గౌతమ్ అరంగేట్రం!

బ్యాటింగ్‌లో బలంగా ఉన్న టీమిండియాకు పేస్ బౌలింగ్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ బౌలర్లు రేణుక సింగ్, పూజ వస్త్రకర్, టిటాస్ సాధు గాయాలతో సతమతమవుతుండటంతో... యంగ్ ప్లేయర్లపై అధిక భారం పడనుంది. అండర్–19 మహిళల ప్రపంచకప్‌లో సత్తాచాటిన కాశ్వీ గౌతమ్ అంతర్జాతీయ అరంగేట్రం చేయడం ఖాయమే. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన కాశ్వీ 9 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టింది. హైదరాబాద్ మీడియం పేసర్ అరుంధతి రెడ్డి, కాశ్వీ తుది జట్టులో చోటు దక్కించుకోవడం ఖాయమే. మీడియం పేస్ ఆల్‌రౌండర్ అమన్‌జ్యోత్ కౌర్ కూడా అందుబాటులో ఉంది. అయితే శ్రీలంక పిచ్‌లపై స్పిన్నర్ల ఆధిపత్యమే ఎక్కువ. ఆ కోణంలోనూ భారత్ మెరుగ్గా ఉంది. సీనియర్ ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ, స్నేహ రాణాతో పాటు డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆకట్టుకున్న శ్రీచరణి జట్టులో ఉన్నారు. మరోవైపు శ్రీలంక జట్టు కెప్టెన్ చమరి ఆటపట్టుపై అధికంగా ఆధారపడుతోంది.

‘ఈడెన్’ను ముంచెత్తిన వాన

- పంజాబ్, నైట్‌రైడర్స్ మ్యాచ్ రద్దు
- పంజాబ్ 201/4
- రాణించిన ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్
- కోల్‌కతా 7/0



కోల్‌కతా: ఈ మ్యాచ్ గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే ‘మెరుపులు... చినుకులు... రద్దు!’ పంజాబ్ ఓపెనర్ల బౌండరీతో మొదలైన ఈ మ్యాచ్ బ్యాటింగ్ వండర్‌గా సాగింది. మైదానంలో జోష్ తెచ్చింది. ప్రేక్షకుల్ని బాగా అలరించింది. కానీ ఇదంతా ఒక ఇన్నింగ్స్ వరకే పరిమితమైంది. కోల్‌కతా లక్ష్యఛేదన మొదలయ్యాక ఒకటే ఓవర్‌కు ఆట ముగించాల్సి వచ్చింది. వానొచ్చి మైదానంతో పాటు అంతకు ముందరి పరుగుల వరదను ముంచెత్తింది. భారీ వర్షంతో చాలా సేపు నిరీక్షించినా ఆట కొనసాగే పరిస్థితి లేకపోవడంతో అంపైర్లు చివరకు మ్యాచ్‌ను రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. శనివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (49 బంతుల్లో 83; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 69; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 72 బంతుల్లో 120 పరుగులు జోడించారు. ఆ తర్వాత వర్షంతో ఆట నిలిచే సమయానికి కోల్‌కతా నైట్‌రైడర్స్ ఒక ఓవర్లో వికెట్ నష్టపోకుండా 7 పరుగులు చేసింది. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో పంజాబ్ మ్యాచ్ రద్దు కావడం ఇదే మొదటిసారి!

120 దాకా జోరే జోరు!

ఫోర్‌తో మొదలైన పంజాబ్ స్కోరు తర్వాత జోరందుకుంది. ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్‌ల క్రమంగా హోరెత్తించడంతో మైదానం పరుగుల పండగ చేసుకుంది. ఇద్దరు ఫోర్లు, సిక్స్‌లను అలవోకగా దంచేయడంతో స్కోరుబోర్డు దూసుకెళ్లింది. 4.3 ఓవర్లలో కింగ్స్ 50 స్కోరును దాటింది. హర్షిత్ పదో ఓవర్లో ప్రియాన్ష్ వరుసగా 4, 6, 4 బాదాడంతో 27 బంతుల్లోనే అతని ఫిఫ్టీ పూర్తయ్యింది. తర్వాత నరైన్ 11వ ఓవర్‌ను ఇద్దరు కలిసి చితగ్గొట్టారు. ప్రియాన్ష్ ఓ సిక్స్ కొడితే... ప్రభ్‌సిమ్రన్ రెండు సిక్సర్లు బాదాడు. దీంతో 22 పరుగులొచ్చాయి. ఈ ఓవర్లోనే జట్టు స్కోరు వంద దాటింది. ఎట్టకేలకు 12వ ఓవర్లో రసెల్ ఓపెనింగ్ జోడీకి చెక్ పెట్టాడు. ప్రియాన్ష్ భారీ షాట్‌కు యత్నించి వైభవ్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత 38 బంతుల్లో ప్రభ్‌సిమ్రన్ అర్ధ సెంచరీ పూర్తయింది. సకారియా వేసిన 13వ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 4, 4, 6 కొట్టడంతో మొత్తం 18 పరుగులు వచ్చాయి. వరుణ్ వేసిన 14వ ఓవర్‌ను పూర్తిగా ఆడిన ప్రభ్‌సిమ్రన్ 4, 0, 4, 6, 4, 1లతో 19 పరుగుల్ని పిండుకున్నాడు. దీంతో ఈ రెండు ఓవర్లలోనే 37 పరుగులు రావడంతో 121/1 స్కోరు కాస్తా 158/1గా ఎగబాకింది. 15వ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ అవుట్ కావడంతోనే స్కోరు, జోరు అన్నీ తగ్గాయి. మ్యాక్స్‌వెల్ (7), మార్కో యాన్సెన్ (3) నిరాశపరచగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) పెద్దగా మెరిపించలేకపోయాడు. దీంతో ఆఖరి 6 ఓవర్లలో పంజాబ్ 43 పరుగులే చేయగలిగింది.

ఈడెన్ గార్డెన్స్‌లో ఏ మ్యాచ్ జరిగినా గంట మోగించే ఆట ఆరంభించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే పహల్గాంలో ఉగ్ర ఘాతుకానికి నివాళిగా ఈ సారి గంట మోగించకుండా నల్ల రిబ్బన్లతో ఇరు జట్ల ఆటగాళ్లు మైదానంలోకి దిగారు. మ్యాచ్ ఆరంభానికి ముందు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) పహల్గాంలో అసువులు బాసిన పర్యాటకులకు నివాళులు అర్పించింది.


ప్రభ్‌సిమ్రన్ సింగ్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) వైభవ్ (బి) రసెల్ 69; ప్రభ్‌సిమ్రన్ (సి) పావెల్ (బి) వైభవ్ 83; శ్రేయస్ నాటౌట్ 25; మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7; యాన్సెన్ (సి) వెంకటేశ్ (బి) వైభవ్ 3; ఇన్‌గ్లిస్ నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1–120, 2–160, 3–172, 4–184. **బౌలింగ్:** వైభవ్ అరోరా 4–0–34–2, చేతన్ సకారియా 3–0–39–0, హర్షిత్ రాణా 2–0–27–0, వరుణ్ చక్రవర్తి 4–0–39–1, సునీల్ నరైన్ 4–0–35–0, రసెల్ 3–0–27–1.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ నాటౌట్ 1; నరైన్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (1 ఓవర్లో వికెట్ కోల్పోకుండా) 7. బౌలింగ్:** యాన్సెన్ 1–0–6–0.

ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
ముంబై	9	5	4	0	10	0.673
లక్నో	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	9	3	5	1	7	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్తాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై X లక్నో
వేదిక: ముంబై
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

ఢిల్లీ X బెంగళూరు
వేదిక: ఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


క్లాసెన్

మాల్దీవుల్లో సన్‌రైజర్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు ఐపీఎల్ మ్యాచ్‌ల ఒత్తిడికి దూరంగా కాస్త విరామం తీసుకున్నారు. తర్వాతి మ్యాచ్‌కు వారం రోజుల వ్యవధి ఉండటంతో సరదాగా గడిపేందుకు ఆటగాళ్లంతా శనివారం మాల్దీవులకు వెళ్లారు. చెన్నైలో సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత అక్కడి నుంచే టీమ్ సభ్యులు మాల్దీవులకు చేరుకున్నారు. సన్‌రైజర్స్ తమ తర్వాతి పోరులో శుక్రవారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో తలపడుతుంది. ఈ సీజన్‌లో ఆడిన 9 మ్యాచ్‌లలో 3 గెలిచి 6 ఓడిన టీమ్... మిగిలిన ఐదు మ్యాచ్‌లూ గెలిస్తేనే ‘ప్లే ఆఫ్స్’ చేరేందుకు అవకాశం ఉంటుంది.

సాక్షి సినిమా

తవ్వకం ఆరంభం


నాగచైతన్య

కొత్త సినిమా కోసం సరికొత్తగా మారిపోయారు నాగచైతన్య. ‘విరూపాక్ష’ ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ మిథికల్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ‘ఎన్‌సీ (నాగచైతన్య) 24–ది ఎక్స్‌కవేషన్ బిగిన్స్’ (తవ్వకం ఆరంభం) అంటూ ఈ సినిమాకు చెందిన స్పెషల్ వీడియోను శనివారం మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్, సెట్ వర్క్స్, రిహార్సల్స్, సాంకేతికమైన పనుల ప్రీ వర్క్స్ వంటి విజువల్స్ ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. ‘‘ఈ సినిమా కోసం నాగచైతన్య శారీరకంగా, మానసికంగా కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. అద్భుతమైన కథ, అత్యున్నత స్థాయి నిర్మాణ విలువలతో ఈ సినిమా నాగచైతన్య కెరీర్‌లో ఓ మైలురాయిలా ఉంటుంది’’ అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, కెమేరా: నీల్ డి. కున్హా.

శర్వాతో మళ్లీ...


అనుపమ

శర్వానంద్ హీరోగా నటించనున్న తాజా చిత్రం ‘శర్వా 38’ (వర్కింగ్ టైటిల్). సంపత్ నంది దర్శకత్వంలో లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించనున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. ‘శతమానం భవతి’లో శర్వానంద్, అనుపమ జంటగా నటించిన విషయం తెలిసిందే.

మరోసారి ఈ ఇద్దరూ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం ఇది. ‘‘హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న పాన్ ఇండియా మూవీ ‘శర్వా 38’. 1960ల చివరలో ఉత్తర తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో జరిగిన కథతో రూపొందనున్న మా సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినిచ్చేలా ఉంటుంది. ఈ కథలో అనుపమ పాత్ర కీలకంగా ఉంటుంది. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం. మా చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి కెమేరా: సౌందర్ రాజన్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

నా ఇరవయ్యేళ్ల ఆకాంక్ష నెర వేరింది

\- విజయ్ దేవరకొండ


సూర్య, నాగవంశీ, విజయ్ దేవరకొండ

‘‘నేను యాక్టర్ కావాలనుకున్నప్పుడు సూర్య అన్నని కలవాలనుకునేవాణ్ణి. ‘గజినీ’ సినిమా చూసి.. ఆ బాడీ ఏంటి? డ్యాన్స్ ఏంటి? నటన ఏంటి? ఏం చేస్తే ఇవన్నీ వస్తాయో తెలుసుకునేందుకు ఆయన్ని కలవాలని చాలాసార్లు అనిపించేది. కలవాలనే కోరిక ఉన్నా కలవలేకపోయాను. నా ఇరవయ్యేళ్ల ఆకాంక్ష నెరవేర్చిన ఈ మూమెంట్, ఈ ‘రెట్రో’ సినిమా నా జీవితంలో మరపురాని అనుభూతి’’ అని హీరో విజయ్ దేవరకొండ చెప్పారు. సూర్య, పూజా హెగ్డే జంటగా నటించిన చిత్రం ‘రెట్రో’. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. జ్యోతిక, సూర్య నిర్మించిన ఈ సినిమా మే 1న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రిలీజ్ చేస్తోంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ‘రెట్రో’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన **విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–** ‘‘కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో తమ కుటుంబ సభ్యుల్ని పోగొట్టుకున్న వారందరికీ ఒక మాట చెబుతున్నాను.. మేమంతా మీకు అండగా ఉంటాం. నా లైఫ్‌లో ఒక సినిమాటిక్ మెమొరీ అంటే ‘చంచల...’ (సూర్య నటించిన ‘సూర్య సన్నాఫ్ కృష్ణన్’ సినిమా) పాట వచ్చినప్పుడు... ఆ రోజు నాకు కలిగిన అనుభూతిని ఈరోజు వరకు మరచిపోలేదు. ఇప్పటికీ ఆ పాటని వింటూ నా బాల్యంలోకి వెళుతుంటాను. నాకు ‘పెళ్ళిచూపులు, అర్జున్ రెడ్డి’ సినిమాలతో కొంచెం డబ్బు చూసినప్పటి నుంచి చదువుకునేవారి కోసం ఏదైనా చేయాలనే కోరిక ఉండి.. చిన్నగా ట్రై చేశాను. కానీ, పదిహేనేళ్లుగా సూర్య అన్న ‘అగరం ఫౌండేషన్’ ద్వారా వేలమంది చదువుకి ఆర్థిక చేయూతనిస్తూ, ఉద్యోగాలు ఇప్పిస్తుండటం చాలా గొప్ప. ఆయన స్ఫూర్తితో ఈ ఏడాది నేను కూడా విద్యార్థులతో ఓ కమ్యూనిటీ ఏర్పరచి వారికి చేయూతనిస్తాం. ఇక కశ్మీర్ మనదే.. కశ్మీరీయులు మన వారే. ఇండియా.. పాకిస్తాన్ మీద దాడి చేయాల్సిన పనే లేదు. ఈ దాడులు ఇలానే కొనసాగితే పాకిస్తాన్ వాళ్లకే విరక్తి వచ్చి వారి ప్రభుత్వంపై దాడి చేస్తారు. ఇక ‘రెట్రో’ సినిమాని నేను థియేటర్లో చూస్తాను. మీరు కూడా చూసి ఎంజాయ్ చేస్తారనుకుంటున్నాను’’ అన్నారు. **సూర్య మాట్లాడుతూ–** ‘‘కశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకుశాంతి చేకూరాలి. ఇలాంటి సంఘటన మళ్లీ ఎప్పుడూ జరగకూడదు. ‘రెట్రో’లో లవ్, కామెడీ, యాక్షన్, ఇంటెన్సిటీ.. అన్నీ ఉంటాయి. ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది. నాగవంశీగారిది లక్కీ హ్యాండ్ అంటుంటారు. నా తదుపరి చిత్రాన్ని నాగవంశీగారి నిర్మాణంలో వెంకీ అట్లూరి దర్శకత్వంలో చేస్తున్నాను. మే 1న విడుదలవుతున్న నాని ‘హిట్–3’ కూడా విజయం సాధించాలి. విజయ్ ‘కింగ్ డమ్’ సినిమా కూడా సక్సెస్ కావాలి. ‘అగరం ఫౌండేషన్’ గురించి విజయ్ మాట్లాడాడు.. అయితే చిరంజీవిగారి బ్లడ్ బ్యాంక్ నా సేవా కార్యక్రమాలకు స్ఫూర్తి అని చెప్పవచ్చు. మా ‘అగరం ఫౌండేషన్’కి ఎందరో తెలుగు వారు అండగా ఉన్నారు’’ అన్నారు. **నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ–** ‘‘రెట్రో’ సినిమాని తెలుగులో పంపిణీ చేసే అవకాశం ఇచ్చిన సూర్య సర్‌కి థ్యాంక్స్. ఈ సినిమాతో మీకు ఇక్కడ బ్లాక్ బస్టర్ ఇస్తామనే నమ్మకం ఉంది’’ అన్నారు. ఈ వేడుకలో ‘రెట్రో’ చిత్ర సహ నిర్మాత కార్తికేయన్ సంతానం, డైరెక్టర్ వెంకీ అట్లూరి, పాటల రచయిత కాసర్ల శ్యాం, నటుడు కరుణాకరన్ మాట్లాడారు.

ఆ సినిమాని నేను తిరస్కరించలేదు

\- శ్రీనిధీ శెట్టి



‘‘తెలుగులో నా తొలి సినిమా ‘హిట్ 3: ది థర్డ్ కేస్’. ఈ సినిమాలో మృదుల అనే పాత్ర చేశాను. ముందు నా క్యారెక్టర్‌కు ఓ డబ్బింగ్ ఆర్టిస్ట్‌తో డబ్బింగ్ చెప్పించారు. కానీ నేనే డబ్బింగ్ చెబితే బాగుంటుందని భావించి, దర్శకుడు శైలేష్‌గారిని రిక్వెస్ట్ చేస్తే, సరే అన్నారు. అలా నా తొలి తెలుగు సినిమాకు నేనే డబ్బింగ్ చెప్పాను’’ అని శ్రీనిధీ శెట్టి అన్నారు. నాని హీరోగా నటించిన ‘హిట్ 3: ది థర్డ్ కేస్’ చిత్రంలో శ్రీనిధీ శెట్టి హీరోయిన్‌గా నటించారు. శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మే 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీనిధీ శెట్టి విలేకరులతో మాట్లాడుతూ– ‘‘హిట్ 3: ది థర్డ్ కేస్’లో స్వతంత్ర భావాలు ఉన్న అమ్మాయి మృదులగా నటించాను. అర్జున్ సర్కార్ (సినిమాలో నాని క్యారెక్టర్ పాత్ర)కు పూర్తి భిన్నమైన మనస్తత్వం మృదులది. సినిమాలో అర్జున్ ఎవరి మాటన్నా వింటాడంటే అది మృదల మాటే. ‘హిట్ 3’లాంటి క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ చిత్రాల్లో హీరోయిన్ పాత్రకు స్కోప్ తక్కువ ఉండొచ్చనుకుంటారు. కానీ ఈ మూవీలో మృదుల పాత్రకు ఇంపార్టెన్స్ ఉంది. ఇక నా కెరీర్‌లో ఇప్పటివరకు యాక్షన్ చిత్రాలే ఉన్నాయి. ‘కేజీఎఫ్’ సినిమాలో ఉన్న డైలాగ్ మాదిరి... ‘ఐ డోంట్ లైక్ వయొలెన్స్... బట్ వయొలెన్స్ లైక్స్ మీ’ (నవ్వుతూ) అన్నట్లు నాకు యాక్షన్ సినిమాలు వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో ‘తెలుసు కదా’ మూవీ చేస్తున్నాను’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘హిందీ ‘రామాయణ’ సినిమాలోని సీత పాత్రకు ఆడిషన్ ఇచ్చాను. అప్పటికే ఈ పాత్ర కోసం మేకర్స్ ఆలియా భట్, సాయి పల్లవిలను కూడా సంప్రదించారు. సాయిపల్లవి ఫైనలైజ్ అయ్యారు. అంతే కానీ... నేను ఆ సినిమాను రిజెక్ట్ చేయలేదు. కానీ నేను రిజెక్ట్ చేసినట్లుగా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అంత పెద్ద సినిమాను నేనెందుకు తిరస్కరిస్తాను’’ అన్నారు.


ఎన్టీఆర్ తొలి సినిమాకు ప్లాటినమ్ జూబ్లీ!


‘పల్లెటూరి పిల్ల’లో ఎన్టీఆర్

సినీ నటుడిగా మొదలై ప్రజాపాలకుడిగా ఎదిగిన నందమూరి తారక రామారావు తొలి సినిమా అనగానే ‘మన దేశం’ (1949) అంటాం కానీ, అసలు ఆయన నటుడిగా తొలిసారిగా ఎంపికైనదీ, తొట్టతొలిసారిగా కెమెరా ముందు నిల్చున్నదీ ‘పల్లెటూరి పిల్ల’ (1950) చిత్రంతో! అయితే, రిలీజులో మొదట ‘మన దేశం’ వస్తే, రెండోది ‘షావుకారు’, మూడోది ‘పల్లెటూరి పిల్ల’ అయ్యాయి. తెలుగు సినిమా పరిశ్రమ పురోగతిలో ఇవాళ్టికీ ధ్రువతారలుగా చెప్పుకొనే అగ్రనటులు ఎన్టీఆర్ – ఏయన్నార్‌లు ఇద్దరూ కలసి తొలిసారిగా నటించిన చిత్రం కూడా ‘పల్లెటూరి పిల్లే’. అప్పటి దాకా మీర్జాపురం రాజా వారి ‘శోభనాచల’ సంస్థలో ప్రొడక్షన్ నుంచి డైరెక్షన్ దాకా వివిధ శాఖల్లో, స్థాయుల్లో పనిచేస్తున్న బి.ఎ. సుబ్బారావు ఆసక్తి కొద్దీ, దర్శకుడిగా, నిర్మాతగా మారిందీ ఈ సినిమాతోనే! 1948 మొదట్లోనే షూటింగ్ ఆరంభమైనా, చిత్ర నిర్మాణం బాగా జాప్యమైంది. ఆఖరికి రాజా వారి అండతో, అలనాటి ప్రసిద్ధ పంపిణీ సంస్థ ‘పూర్ణా పిక్చర్స్’ (అధినేత జి.కె. మంగరాజు) ఆర్థిక సహకారంతో 1950 మొదట్లో సినిమా పూర్తి చేశారు.

ఈ చిత్రానికి మూలమైన ఆంగ్ల నాటకం ‘పిజారో’ ఇతివృత్తం స్ఫూర్తితో తర్వాత అనేక భాషల్లో సినిమాలు వచ్చాయి. జాగ్రత్తగా గమనిస్తే, బాక్సాఫీస్ సూపర్‌హిట్ ‘షోలే’కూ ఇదే ప్రేరణ. ఇలాంటి విశేషాలెన్నో ఉన్న ‘పల్లెటూరి పిల్ల’కు నేటి (ఏప్రిల్ 27)తో సరిగ్గా 75 వసంతాలు (ప్లాటినమ్ జూబ్లీ) నిండాయి. చెరిగిపోని ముద్ర వేసిన ఆ చిత్ర విశేషాలపై రెంటాల జయదేవ ప్రత్యేక వ్యాసం **75 వసంతాల... ‘పల్లెటూరి పిల్ల’... ఇవాళ్టి ‘సాక్షి సినిమా ఫ్లస్’ ఇ–పేపర్‌లో!**

పవర్‌ఫుల్ పాత్రలో...


సముద్ర ఖని

దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం ‘కాంత’. సెల్వమణి సెల్వరాజ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సముద్ర ఖని కీలక పాత్ర పోషించారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. శనివారం (ఏప్రిల్ 26) సముద్ర ఖని పుట్టినరోజు సందర్భంగా ‘కాంత’ మూవీలోని ఆయన ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ‘‘ఈ పీరియాడికల్ డ్రామాలో సముద్ర ఖని పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. గొప్ప కథతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినివ్వనుంది’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: డాని శాంచెజ్ లోపెజ్, సంగీతం: ఝను చంతర్.

ధర్మో రక్షతి రక్షితః


జగదీష్, శ్రావణి శెట్టి

జగదీష్ ఆమంచి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘యముడు’. ‘ధర్మో రక్షతి రక్షితః’ అనేది ఉప శీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించారు. జగన్నాథ పిక్చర్స్ పతాకంపై రూపొందిన ‘యముడు’ నుంచి కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. యముడి రూపంలో ఉన్న జగదీష్ ఆమంచి చేతికి సంకెళ్లు, ఆయన వెనుక వైపు మహిషాసుర రూపం, హీరోయిన్‌ను యమపాశంతో కట్టి పడేసిన తీరు పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ‘‘మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రం ‘యముడు’. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు అందర్నీ ఆకట్టుకున్నాయి. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం’’ అని జగదీష్ ఆమంచి అన్నారు. ఈ చిత్రానికి కెమేరా: విష్ణు రెడ్డి వంగా, సంగీతం: భవానీ రాకేశ్.

11 నుంచి పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు

6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మ వారి ఆలయంలో మే 11 నుంచి 13 వరకు వార్షిక వసంతోత్సవాలు నిర్వ హించనున్నట్లు టీటీడీ అధికారులు శనివారం ఓ ప్రకట నలో తెలిపారు. మే 10న అంకురార్పణ చేయనున్నారు. వసంతోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు ఒక్కొ క్కరు రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. మే 12న స్వర్ణ రథోత్సవం జరుగుతుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యా హ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వ హించనున్నారు. రాత్రి ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరిస్తారు. వసంతోత్సవాల సందర్భంగా మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. ఉత్సవాల కారణంగా మే 6, 10 నుంచి 13 వరకూ కళ్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

ఇంట్లోని రూ.3.20 కోట్ల నగదు, బంగారం తీసుకెళ్లిన భార్య

- ఫిర్యాదు చేసిన భర్త

పంజగుట్ట (హైదరాబాద్): ఓ న్యాయవాది ఇంట్లో నుంచి భారీ మొత్తంలో నగదు ఎత్తుకెళ్లిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను పంజగుట్ట పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ద్వారకాపురి కాలనీలో నివాసం ఉండే పురుషోత్తంరెడ్డి హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఇతనికి భార్గవితో 2007లో కులాంతర వివాహం జరిగింది. భార్గవి సికింద్రాబాద్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా విధులు నిర్వహిస్తోంది. భార్యాభర్తలకు తరచూ గొడవలు జరగడంతో పలుమార్లు భార్గవి పురుషోత్తంరెడ్డిపై గృహహింస, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టింది. ఈ క్రమంలో పురుషోత్తంరెడ్డి ఇంట్లో ఉన్న రూ.3.20 కోట్ల నగదు, బంగారు ఆభరణాలు తీసుకున్న భార్గవి ఆమెకు పాతపరిచయం ఉన్న సంగారెడ్డి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరవింద్ కిరణ్ ఇటికి వెళ్లి అక్కడే ఉంటోంది. గత నెల 30న ఇంట్లో నగదు, బంగారం కనిపించకపోవడంతో పురుషోత్తంరెడ్డి ఆరాతీశాడు. భార్గవి అల్వాల్‌లోని అరవింద్ కిరణ్ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి డబ్బుల విషయమై ఆరాతీస్తే తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. దీంతో పురుషోత్తంరెడ్డి పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అరవింద్ కిరణ్, భార్గవిని అదుపులోకి తీసుకున్నారు.

కొను ‘గోడు’ పట్టదా?

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల్లేక రైతుల అవస్థలు | **రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉన్నా కాంటా వేయని నిర్వాహకులు**

క్వింటాల్‌కు 5 కేజీలు తరుగు తీస్తామంటున్న మిల్లర్లు

ధాన్యం తరలించేందుకు లారీల కొరతతో ఇక్కట్లు

మారుతున్న వాతావరణ పరిస్థితులతో అన్నదాతల్లో ఆందోళన

సాక్షిప్రతినిధి, ఖమ్మం/సాక్షి నెట్‌వర్క్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు కొనుగోళ్లు జరగక, మరోవైపు వాన భయం, ఇంకోవైపు అసౌకర్యాలు వెరసి రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద కంటిమీద కును కు లేకుండా పోయింది. అయినా వీరి గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఖమ్మం జిల్లాలో యాసంగిలో పండించిన సన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రా ల్లో అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు షాక్ తగులు తోంది. ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా నిర్వాహకులు కాంటాలు పెట్టడానికి ముందుకు రావడం లేదు. దీంతో రైతులకు పడిగాపులు తప్ప డం లేదు. క్వింటాకు 5 కేజీల వరకు తరుగు తీస్తేనే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. రైతులు ఈ షరతుకు ఒప్పుకోకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు కాంటాలు వేయడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు వీల్లేక, అకాల వర్షాలకు తడుస్తుండటంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.



నిజామాబాద్ జిల్లా జానకంపేట కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబెడుతున్న రైతులు

ఏడు చేపల కథ..

చేపా..చేపా ఎందుకు ఎండలేదంటే.. గడ్డి మోపు అడ్డమొచ్చిందన్న చందంగా ఉంది కొనుగోలు కేంద్రాల తీరు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ధాన్యం కాంటా వేయడం లేదు. ఎందుకు వేయడం లేదంటే లారీలు వస్తేనే కాంటా వేస్తామంటున్నారు. లారీలు ఎందుకు సరఫరా చేయడం లేదని సప్లయర్స్‌ను అడిగితే లోడింగ్, అన్‌లోడింగ్ వెంటనే చేస్తేనే లారీలు పెడతామంటున్నారు. అన్‌లోడింగ్ వెంటనే చేయమని మిల్లర్లను అడిగితే క్వింటాకు 5 కేజీల తరుగు తీస్తేనే దిగుమతి చేసుకుంటామంటున్నారు. ఇలా ఒకదానికి ఒకటి లింక్ పెట్టి రైతులతో ఆడుకుంటున్నారు.

ప్రైవేట్ వ్యాపారుల వైపే..

కొనుగోలు కేంద్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యలతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.2,100 కు కొనుగోలు చేస్తుండగా, ఆ మొత్తానికే విక్రయిస్తున్నారు. తద్వారా అటు మద్దతు ధర, ఇటు బోనస్ కోల్పోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే ఓపిక లేక అమ్ముకుంటున్నారు.

అసౌకర్యాల నడుమ..

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఏ కేంద్రంలోనూ రైతులకు సౌకర్యాలు లేవు.

- ఓ టెంట్ ఏర్పాటు చేశారు. ఈ టెంట్ కింద ధాన్యం కొనుగోలు చేసే వీఓ గ్రూప్ సభ్యులు, ఐకేపీ సీసీలు రెండు మూడు కుర్చీలు వేసుకొని కూర్చుంటున్నారు.
- ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. ధాన్యం మీద కప్పుకోవడానికి రైతులే రూ.10 వేలు విలువ చేసే పట్టాలు కొనుగోలు చేస్తున్నారు. ఐకేపీ నుంచి ఎలాంటి టార్పాలిన్లు ఇవ్వడం లేదు.
- రైతులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారే క్యాన్లు వెంట తెచ్చుకుంటున్నారు.
- ధాన్యం తూర్పార పట్టడానికి మాత్రం ఓ ఫ్యాన్ ఏర్పాటు చేస్తున్నారు. దానిని నడిపించడానికి ట్రాక్టర్‌ను రైతులే తెచ్చుకోవాలి.
- కొనుగోలు చేసిన తర్వాత లారీలోకి ఎక్కించి మిల్లుకు తరలించడానికి వారం పట్టినా, పది రోజులైనా ధాన్యం జాగ్రత్త బాధ్యతలు రైతులవే. ఒకవేళ వాన పడితే ఇబ్బందే.
- కొణిజర్ల మండల రైతులు సాగు చేసిన యాసంగి పంటను ముదిగొండ మండలంలోని ఓ రైస్ మిల్లు కు, సత్తుపల్లి శివారులోని మరో రైస్ మిల్లుకు కేటాయించారు. సత్తుపల్లి మిల్లర్ తమ వద్ద బాయిలర్ రిపేర్‌కు వచ్చిందని కొనుగోలు నిలిపేశాడు.
- ముదిగొండ సమీపంలోని రైస్ మిల్లు యజమాని నేరుగా రైతులతో మాట్లాడుకొని ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా ఇస్తానంటే లారీ దిగుమతి చేసుకుంటున్నాడు. లేదంటే అంతే. ప్రస్తుతం నాలుగు రోజులుగా మల్లుపల్లికి చెందిన ఓ లారీ ఆ మిల్లు వద్దే ఉంది.
- నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జానకంపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామ శివారులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 30 వేల బస్తాల ధాన్యం తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించారు. మరో 10 వేల బస్తాలు తూకం వేయాల్సి ఉంది. నాలుగైదు రోజుల క్రితం తూకం వేసిన 1,800 బస్తాలు వరకు కొనుగోలు కేంద్రంలో ఉన్నాయి. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోంది.
- సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా ధాన్యం కాంటా నిలిచిపోయినట్టు రైతులు పేర్కొన్నారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేదతీరడానికి నీడ లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం నిర్వాహకులు టార్పాలిన్ కవర్లతో వేసిన గుడిసె.. మంచినీటి డ్రమ్ములు పెట్టడానికి రికార్డులు రాసుకోవడానికి మాత్రమే సరిపోతుంది. రైతులు, కూలీలు సమీపంలో కంపచెట్ల కింద చాలీచాలని నీడన అలసట తీర్చుకుంటున్నారు.

ఎండలోనే మగ్గుతున్నాం..



వారం రోజుల క్రితం మార్కెట్‌లో వడ్లు పోశాను. టెంట్ లేకపోవడం, దగ్గరలో చెట్లు లేకపోవడం వల్ల మాతో పాటు కూలీలు ఎండలోనే మగ్గుతున్నారు. గాలి దుమారానికి గుడిసె దెబ్బతిన్నది. ప్రభుత్వం రైతుల సౌలభ్యం కోసం టెంట్ ఏర్పాటు చేయాలి.

– నడిగోటి భిక్షం, రైతు కక్కిరేణి, రామన్నపేట మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం...



నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని చెరుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రంలో నీటిని డ్రమ్ముల్లో పోస్తుండడంతో ఎండకు వేడెక్కుతున్నాయి.

– లొడంగి చంద్రయ్య, రైతు, దాచారం, నల్లగొండ జిల్లా


తరుగు తీస్తామంటున్నారు..



నాలుగెకరాల్లో వరిసాగు చేస్తే 250 బస్తాల దిగుబడి వచ్చింది. 12 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చా. ఇప్పటి వరకు కాంటాలు వేయలేదు. క్వింటాకు 3 నుంచి 5 కిలోల తరుగు అడుగుతుంటే ఒప్పుకోలేదు. తరుగు ఇవ్వడం కన్నా..ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవడం మంచిది. కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నాం.

– నాగండ్ల ఉపేందర్, జల్లేపల్లి, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మంజిల్లా


కనీస సౌకర్యాలు కరువు



కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం చిన్న టెంటు ఏర్పాటు చేశారు. అది కూలిపోయింది. ఎండ సమయంలో ఇబ్బంది పడుతున్నాం. చెట్ల నీడన సేదతీరుతున్నాం. ఇక్కడ కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు.

– శంకర్ పుప్పాల, రైతు, జానకంపేట, ఎడపల్లి మండలం, నిజామాబాద్ జిల్లా

ఎండకు ఎండుతున్నాం.. వానకు తడుస్తున్నాం..




ధాన్యం తీసుకొచ్చి 5 రోజులు అవుతోంది. కొద్దిపాటి వర్షానికి ధాన్యం తడి సింది. ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం కోసం రోజంతా ఇక్కడే ఉండాల్సి వస్తోంది. దీంతో ఇక్కడ నీడ సౌకర్యం లేక తాగు నీరు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నా. గన్నీ సంచులు లేక ధాన్యం ఆగిపోయింది.

– ఖాతా మాధవరెడ్డి, రైతు, బక్రిచెప్యాల

‘ప్రైవేట్’కు ఇచ్చే అధికారం కలెక్టర్‌కు లేదు

- వివాదాన్ని తేల్చే అధికారం సివిల్ కోర్టుదే..
- కొండకల్ భూ వివాదంలో హైకోర్టు వ్యాఖ్యలు




సాక్షి, హైదరాబాద్: భూముల వర్గీకరణ, రెవెన్యూ రికార్డుల్లో ఎంట్రీలకు సంబంధించిన వివాదాల్లో జోక్యం చేసుకుని, ఉత్తర్వులు జారీ చేసే అధికారం కలెక్టర్‌కు ఉండదని హైకోర్టు తేల్చిచెప్పింది. సివిల్ కోర్టులకు మాత్రమే అలాంటి అధికారం ఉంటుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మారుస్తూ కలెక్టర్ కొత్తగా సర్వే నంబర్ కేటాయించడం చట్టవిరుద్ధమని చెప్పింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం కొండకల్, మోకిల గ్రామాల మధ్య ఉన్న 40.12 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చుతూ సర్వే శాఖ, తహసీల్దార్ 2014లోనే ఉత్తర్వులు జారీ చేసినా, జిల్లా కలెక్టర్ దాన్ని ప్రైవేటు వ్యక్తుల పేర్లపై రికార్డుల్లోకి చేర్చుతూ ప్రొసీడింగ్స్ ఇవ్వడాన్ని తప్పుబట్టింది. వెంటనే ఆ ఉత్తర్వులను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ సర్వే నంబర్ 398/ఏ, 400/ఏ, 402/ఏ, 402/ఏ1/1 లోని 2.14 ఎకరాల భూమిని 2008లో చట్టబద్ధంగా కొనుగోలు చేశామని, తన పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కృష్ణరామ్ భూపాల్ అనే వ్యక్తి కబ్జా చేసి తమకు దారి ఇవ్వడం లేదంటూ జూబ్లీహిల్స్‌కు చెందిన శైలజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆక్రమించిన 20.12 ఎకరాల ప్రభుత్వ భూమి ‘బిలా దాఖలా’(ఎవరికీ చెందనిది, ఏ సర్వే నంబర్‌లో లేనిది) కేటగిరీ కిందకు వస్తుందన్నారు. ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ 2022, 2023లో కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ భూ వివాదంపై 2014లో పిటిషన్ వేశామన్నారు. అప్పుడు సర్వే చేసిన అధికారులు 40.12 ఎకరాలు బిలాదాఖలా భూమిగా (ప్రభుత్వ భూమిగా) తేల్చారన్నారు. అందులో 20.12 ఎకరాలు ఆక్రమణల్లో ఉందని తహసీల్దార్ కౌంటర్ కూడా వేశారని చెప్పారు. ఇదిలా ఉండగా, ఆ భూమిని పట్టా భూమిగా పేర్కొంటూ విలేజ్ మ్యాప్‌ను మార్చాలని 2022లో కలెక్టర్ సర్వే శాఖకు ప్రొసీడింగ్స్ ఇచ్చారని నివేదించారు. 2023లో కొత్త సర్వే నంబర్లతో ప్రైవేటు వ్యక్తుల పేర్లను రికార్డుల్లో చేర్చారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సదరు భూములపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించడం, భూమిని ఇతరుల పేరు మీదకు మార్చడం చేయొద్దని పిటిషనర్‌ను ఆదేశించారు. తదుపరి విచారణను జూన్ 21కు వాయిదా వేశారు.

గతేడాదిలో రూ.148.09 కోట్ల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం

వెల్లడించిన డీజీపీ జితేందర్

- దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీజీ ఏఎన్‌బీ అధికారులకు రివార్డులు



సాక్షి, హైదరాబాద్: గతేడాది రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సోదాల్లో మొత్తం రూ.148.09 కోట్లు విలువ చేసే డ్రగ్స్, గంజాయిని సీజ్ చేసినట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. 2024లో మొత్తం 2,169 ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులు నమోదు చేయగా ఇందులో 5,205 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. కేసుల దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) అధికారులకు శనివారం రివార్డులు అందజేశారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో.. శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్, టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో కలిసి 75 మంది సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. వీరంతా 67 ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసుల్లో 189 మందిని అరెస్ట్ చేసి రూ.22.67 కోట్లు విలువ చేసే మాదకద్రవ్యాలని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి కేసుల్లో పటిష్టమైన దర్యాప్తు చేసినప్పుడే నేరస్తులకు కఠిన శిక్షలు పడుతాయని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బ్యూరోని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ, కేసులు దర్యాప్తు చేసేటప్పుడు న్యాయ, సాంకేతిక పరమైన అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూ చించారు. దర్యాప్తు లోపాలను ఆసరాగా చేసు కుని శిక్షల నుంచి తప్పించుకునే అవకాశం నేరస్తులకు ఇవ్వవద్దన్నారు. బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. పోలీసులకు ప్రజలు సహకరించి, సమాచారం ఇస్తే మాదకద్రవ్యాల సరఫరాను పటిష్టంగా అడ్డుకోగలమన్నారు.



‘రామప్ప’లో మిస్ వరల్డ్ పోటీదారు

ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని.. మిస్ వరల్డ్ పోటీల్లో భారతదేశం నుంచి పాల్గొనబోతున్న నందిని గుప్తా శనివారం సందర్శించారు. ఆలయంలో ఫొటో షూట్ నిర్వహించిన అనంతరం రామప్ప రామలింగేశ్వరస్వామికి ఆమె పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి శిల్పాన్ని ఆసక్తిగా పరిశీలించారు. సరిగమలు పలికే పొన్నచెట్టు శిల్పం, నీటిలో తేలియాడే ఇటుకలను కూడా ఆసక్తిగా తిలకించారు.

- వెంకటాపురం(ఎం)



శంషాబాద్ విమానాశ్రయంలో పర్యాటకులతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

కశ్మీర్ నుంచి తిరిగి వచ్చిన ఉమ్మడి మెదక్ వాసులు

శంషాబాద్: కశ్మీర్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ వాసులు పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో తమ టూర్‌ను ముగించుకుని స్వస్థలాలకు చేరుకుంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి కశ్మీర్ వెళ్లిన పలువురు పర్యాటకులు తమ పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు చెప్పడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని వారి ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు జామున ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక విమానంలో మొత్తం 116 మంది పర్యాటకులు హైదరాబాద్ చేరుకున్నారు. మైనంపల్లి హన్మంతరావు ఎయిర్‌పోర్టులో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 70 మంది వరకు కశ్మీర్ టూర్‌కు వెళ్లారన్నారు. ఉగ్రవాదుల దాడి తర్వాత వాళ్లు ఇచ్చిన సమాచారంతో అక్కడి ప్రభుత్వాధికారులతో మాట్లాడి వారిని సురక్షితంగా రప్పించినట్లు తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాని మద్దతుగా ఉంటుందన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

- కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పోలీసుల చర్యలు
- జిల్లా స్థాయిలోనూ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్‌ల అప్రమత్తం
- వివాదాస్పద పోస్టులను తొలగించడంతో పాటు ఆయా వ్యక్తులపై ఆరా



సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాతో మంచి ఎంత ఉందో.. చెడు కూడా అంతే ఉంటోంది. ఇటీవల కొందరు వ్యక్తులు విద్వేషాలు వెళ్లగక్కేందుకు సోషల్ మీడియా యాప్‌లను అస్త్రాలుగా మార్చుకుంటున్నారు. ఎదుటి వారిని రెచ్చగొట్టేలా పెట్టే అసభ్యకర పోస్టింగులకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. కశ్మీర్‌లో ఉగ్రదాడితో దేశంలో ఏర్పడిన సున్నితమైన పరిస్థితుల నేపథ్యంలో ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా మరో వర్గం వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేయడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో అనవసర ఉద్రిక్తతలకు దారి తీసే పోస్టులు ఏవైనా ఉన్నాయా? అని పోలీసులు నింతరం ఆరా తీస్తున్నారు. ఇందుకోసం సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్‌ను మరింత అప్రమత్తం చేసినట్టు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కేంద్రంతోపాటు అన్ని జిల్లాల్లోని సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ మరింత యాక్టివ్ అయినట్టు తెలిపారు. నకిలీ అకౌంట్లు క్రియేట్ చేసి మార్ఫింగ్ ఫొటోలు, అత్యంత హేయమైన అసభ్యకర పదజాలంతో సోషల్‌మీడియాలో పోస్టింగ్స్ పెట్టే వారికి చెక్ పెడుతున్నారు. అలాంటి పోస్టులను వెంటనే తొలగించడంతోపాటు అవి ఎక్కడి నుంచి, ఎవరు పెడుతున్నారన్నది కూడా ఆరా తీస్తున్నారు. కీలక ఆధారాలు లభించిన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని సైబర్ క్రైమ్ పోలీసులతో పాటు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు దీనిపై నిరంతరం నిఘా పెడుతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిఘా కోసం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ సోషల్ మీడియా సర్వైలెన్స్ వింగ్, సోషల్ మీడియా యాక్షన్ స్క్వాడ్ (స్మాష్)తో నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 230 మంది పాక్ పౌరులు

- దీర్ఘకాలిక వీసాలున్న 199 మంది కాకుండా మిగిలిన 31 మందికి నోటీసులిచ్చాం
- ‘సాక్షి’తో డీజీపీ జితేందర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: స్వల్పకాలిక వీసాలపై భారత్‌కు వచ్చి హైదరాబాద్ సహా తెలంగాణలో ఉంటున్న పాకిస్తాన్ పౌరులను వెంటనే వారి స్వదేశం వెళ్లిపోవాల్సిందిగా నోటీసులు జారీ చేసినట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో దీర్ఘకాలిక వీసాలపై ఉన్న పాక్ పౌరులు మినహా మిగిలిన వీసాలపై ఉన్న పాక్ పౌరులను వెనక్కి పంపాలంటూ కేంద్రం అన్ని రాష్ట్రాలను ఆదేశించడం తెలిసిందే. ఈ అంశంపై డీజీపీ జితేందర్ శనివారం ‘సాక్షి’తో మాట్లాడుతూ తెలంగాణలో మొత్తం 230 పాక్ పౌరులు ఉన్నట్లు వెల్లడించారు. వారిలో 199 మంది దీర్ఘకాలిక వీసాలపై ఉండగా మిగిలిన 31 మంది వివిధ రకాల వీసాలు కలిగి ఉన్నారన్నారు. ఆదివారంలోగా భారత్ విడిచి వెళ్లాలని లీవ్ ఇండియా పేరిట 31 మందికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ 31 మందిలో వైద్య వీసాలున్న వారికి మాత్రం కేంద్రం ఈ నెల 29 వరకు దేశం విడిచి వెళ్లేందుకు గడువు ఇచ్చిందని వివరించారు. ఒకవేళ ఎవరైనా కళ్లుగప్పి ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తే ఇమ్మిగ్రేషన్ చట్టంతోపాటు ఇతర చట్టాల కింద చర్యలు తీసుకుంటామని డీజీపీ జితేందర్ హెచ్చరించారు.

అక్కడికి మన బలగాలను పంపలేదు

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేత కోసం సాయుధ బలగాలు చేపట్టిన ఆపరేషన్‌తో తెలంగాణ పోలీసులకు సంబంధం లేదని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ కోసం తెలంగాణ నుంచి బలగాలను పంపలేదని తేల్చిచెప్పారు.

సమగ్ర భద్రతకు సెక్యూరిటీ ఆడిట్: జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా



సాక్షి, హైదరాబాద్: సమగ్ర భద్రతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లలో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహిస్తున్నట్టు జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా తెలిపారు. జైళ్లలో భద్రత, సాంకేతిక పరికరాల పనితీరు సహా మొత్తం 12 అంశాలపై పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా చంచల్‌గూడ, చర్లపల్లి సెంట్రల్ జైళ్లతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా జైళ్లు, సబ్ జైళ్లలో సమగ్ర భద్రతా తనిఖీలు (సెక్యూరిటీ ఆడిట్) నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సౌమ్యా మిశ్రా శనివారం ప్రారంభించారు. డీఐజీలు కేంద్ర కారాగారాల్లో, జైళ్ల సూపరింటెండెంట్లు జిల్లా జైళ్లలో, డిప్యూటీ సూపరింటెండెంట్లు స్పెషల్ సబ్ జైళ్లు, సబ్ జైళ్లలో తనిఖీలు చేయనున్నారు. ఖైదీల సంక్షేమాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా తెలంగాణ జైళ్లశాఖ అనేక చర్యలు తీసుకుంటోందని సౌమ్యామిశ్రా వెల్లడించారు.

పోలీస్ కారులో రీల్స్.. సోషల్ మీడియాలో వైరల్



నిందితుడు

ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ నగరంలో పోలీస్ వాహనంలో నిందితుడిని తరలిస్తుండగా తీసిన రీల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు వాహనంలో తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో నిందితుడి ఫొటోతోపాటు చేతికి వేసిన బేడీలు చూపిస్తూ రీల్స్ చేశారు. కోర్టులోనికి తీసుకువెళ్తుండగా కూడా వీడియో తీశారు. ఆ వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో వైరల్‌గా మారాయి. నిందితుడిని కలవడానికి వచ్చిన వ్యక్తులు రీల్స్‌తీసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ వీడియోలను ఫిబ్రవరి 13న తీసినట్లుగా తెలుస్తోంది. నిందితుడికి సంబంధించిన వ్యక్తులు ఆ రోజు వీడియోలు తీసి, తాజాగా సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినట్లుగా భావిస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
ఆదివారం । 27-4-2025


కిన్నెరసాని ప్రాజెక్టు వద్ద పర్యాటకులు (ఫైల్)


జలాశయంలో స్పీడ్‌బోట్‌పై పర్యాటకుల షికారు


కిన్నెరసానిలో చుక్కల దుప్పులు

కిన్నెరసాని.. చూసొద్దాం రండి..

అలరారే ప్రకృతి అందాలకు నిలయం

- మినీ ఊటీని తలపించేలా సుందర దృశ్యాలు
- జింకల వీక్షణం.. బోటు షికారు ప్రత్యేకం
- వేసవి సెలవుల్లో ఓ రోజు గడిపేందుకు అద్భుతమైన ప్రదేశం


కిన్నెరసాని జలాశయంలో ఐలాండ్

పాల్వంచ రూరల్:

వేసవి సెలవులు వచ్చాయి. చిన్నారులు, పెద్దలు, మహిళలు వెళ్లేందుకు కిన్నెరసాని ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనాన్ని పంచే అడవులు, స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే చెట్లు.. చెంగుచెంగున ఎగిరే వన్యప్రాణులు, గలగలా పారే సెలయేర్లు.. పక్షుల కిలకిలారావాలకు కిన్నెరసాని డీర్‌పార్కు చిరునామాగా నిలుస్తోంది. అడుగడుగునా ఆహ్లాదాన్ని పంచే జీవ వైవిధ్యం గల అటవీ అందాలతో మినీ ఊటీగా మారుతోంది కిన్నెరసాని పర్యాటక ప్రాంతం. కొండకోనలు, పచ్చని చెట్లు, జలాశయం, వన్యప్రాణులతో చూడచక్కని ప్రకృతి అందాలకు నిలయమైన కిన్నెరసానిలో పర్యాటకులను ఆకట్టుకునేలా పచ్చని పొదరిళ్లు, ఎత్తయిన కొండలు, గుట్టలు, జలాశయం, చూడచక్కని ద్వీపాలు కనిపిస్తాయి. పర్యాటకుల ఊహకు ఏమాత్రం తగ్గని రీతిలో ఇక్కడి ప్రకృతి సోయగాలు ప్రతీ ఒక్కరిని అలరిస్తాయి. ఈ సుందర దృశ్యాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వస్తుంటారు.

కిన్నెరసానిలో పర్యాటకుల ప్రవేశ టికెట్ ధరలు

పెద్దలకు	50
చిన్నారులకు	30
టూ, త్రీ వీలర్	15
నాలుగు చక్రాల వాహనం	50
బస్సు	100
కెమెరా	50
సినిమా కెమెరా	2,250
విదేశీయులకు	100
విదేశీ కెమెరా	250
బోటు షికారు పెద్దలకు	50
చిన్నారులకు	30
స్పీడ్‌బోట్‌లో నలుగురికి	350

కిన్నెరసానికి ఎలా చేరుకోవాలంటే..

ఖమ్మం నుంచి భద్రాద్రి జిల్లా పాల్వంచకు 90 కిలోమీటర్లు ఉంటుంది. ఈ పట్టణానికి చేరుకున్నాక అంబేడ్కర్ సెంటర్ నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే కిన్నెరసాని ప్రాజెక్టు వస్తుంది. అక్కడ ప్రకృతి అందాలతో నిండిన జలాశయం, జింకల పార్కు ఉంటాయి. కిన్నెరసానికి సమీపంలోని మందెరకలపాడు సమీప అటవీ ప్రాంతంలో జలపాతం ఉంది. ఇక్కడ నుంచి తిరిగి భద్రాచలం వెళ్లే మార్గంలో పెద్దమ్మతల్లి ఆలయం ఉంది. కాగా, కిన్నెరసాని చేరడానికి బస్ సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయించాల్సిందే. వేసవి సెలవుల్లోనైనా బస్సు సౌకర్యం కల్పిస్తే కిన్నెరసానికి పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఇక వరంగల్ జిల్లా లక్నవరంలో ఏర్పాటు చేసినట్లుగా కిన్నెరసానిలో కూడా నీళ్ల మధ్య వంతెన నిర్మించి, ప్రత్యేక హోటళ్లు, వసతి గృహాలను నిర్మిస్తే పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవచ్చు.

పర్యాటకులను ఆకర్షించేలా కాటేజీలు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో నీతి ఆయోగ్ పథకం కింద రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఆయా నిధులతో కిన్నెరసానిలో తొమ్మిది కాటేజీలు, అద్దాలమేడ నిర్మాణం చేపడుతున్నారు. కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల కోసం బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు డీర్‌పార్క్‌లోని చుక్కల జింకలు, జలాశయం అందాలను చూసి.. మరోసారి రావడానికి ఉత్సాహం చూపుతుంటారు.

అద్దాలమేడకు ఎంతో ప్రాముఖ్యం

కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఒకప్పుడు అద్దాలమేడకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. 1978లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అద్దాలమేడతో పాటు పలు కాటేజీలు నిర్మించారు. అయితే ఆ తర్వాత అద్దాలమేడను మావోయిస్టులు ధ్వంసం చేయడంతో కళావిహీనంగా తయారైంది. కాగా, కిన్నెరసానిని పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా అద్దాలమేడ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ.10.77 కోట్లు ఖర్చు చేశారు. శిథిలావస్థకు చేరిన అద్దాలమేడతో పాటు కాటేజీలను కూల్చి వాటి స్థానంలో కొత్తవి నిర్మించారు. రిజర్వాయర్ చుట్టూ ఎత్తయిన గుట్టపై రెండంతస్తుల్లో 9 కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు నిర్మించారు.



కిన్నెరసాని ముఖ ద్వారం

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి: తలసాని



సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని, భారత్ వైపు చూడాలంటేనే భయపడేలా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఉగ్రవాదం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు.




తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ సదస్సులో రాష్ట్ర మంత్రులు శనివారం సందడి చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాట్నంపై నూలు వడికారు.

భారత్ సమ్మిట్ వేదికపై పలు దేశాల ప్రతినిధులతో మంత్రులు దామోదర, సీతక్క, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్


కేంద్ర మంత్రి బిజీబిజీ..

- మే 5న పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొననున్న గడ్కరీ
- రాష్ట్ర వినతులపై సానుకూల స్పందన
- హాజరుకానున్న కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేందుకు జాతీయ రహదారి–765పై మన్ననూరు నుంచి తెలంగాణ, ఏపీ సరిహద్దు వరకు ప్రతిపాదిత నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. దీంతో ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతోపాటుగా.. రాష్ట్ర సామాజిక, ఆర్థిక స్థితిగతులను మరింత మెరుగుపరిచేందుకు.. హైదరాబాద్– శ్రీశైలం మధ్య ప్రతిపాదిత 4 లేన్ ఎలివేటెడ్ కారిడార్ దోహదపడనుంది. ఈ ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ ఫారెస్టు మధ్య నుంచి వెళ్తున్నందున దీనికి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను వీలైనంత త్వరగా తీసుకుని, డీపీఆర్ పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కోరింది. హైదరాబాద్–కల్వకుర్తి మధ్య ప్రస్తుతం ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని, జాతీయ రహదారి–765ను 4 లేన్లకు విస్తరించేలా ప్రాజెక్టును మంజూరు చేయాలని గడ్కరీని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు.

దీంతోపాటు హైదరాబాద్–విజయవాడ మధ్య జాతీయ రహదారి–65ను 6లేన్లకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించిన ప్రాజెక్టును త్వరితగతిన మంజూరు చేయాలని కిషన్‌రెడ్డి కోరారు. తెలంగాణలో పలు రోడ్డు, రవాణా ప్రాజెక్టులు భూసేకరణ కారణంగా ఆలస్యం అవుతున్నాయని, మరో 10 ప్రాజెక్టులు అటవీ శాఖ అనుమతుల జాప్యం కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని.. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుంటే ఈ ప్రాజెక్టులను చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో రూ.4,891 కోట్లతో 233కి.మీ. మేర చేపట్టిన ఏడు ప్రాజెక్టులను కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ఇప్పటికే మంజూరు చేసింది. వీటిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చేపట్టనుంది.

హైదరాబాద్ నుంచి జరిగే కార్యక్రమాలు

ప్రారంభోత్సవాలు: (22.57 కిలోమీటర్లు, రూ.895.64 కోట్లు)

1. 44వ నంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్–బెంగళూరు సెక్షన్‌లో.. ఆరాంఘర్ – శంషాబాద్ మధ్యలో 10 కిలోమీటర్ల మేర రూ.300 కోట్లతో.. 6 లేనింగ్.
2. 202వ నంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్‌లోని అంబర్‌పేట వద్ద.. 1.47 కిలోమీటర్ల మేర.. రూ.265.88 కోట్లతో ఫ్లైఓవర్.
3. 65వ నంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్‌లో 1.65 కిలోమీటర్ల మేర.. రూ.172.56 కోట్లతో ఫ్లైఓవర్.
4. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో మెదక్ జిల్లా రెడ్డిపల్లి జంక్షన్ వద్ద.. కిలోమీటర్ మేర.. రూ.17.24 కోట్లతో నిర్మించిన.. 6లేన్ అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు
5. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో మెదక్ జిల్లా జాప్తిశివనూర్ గ్రామం వద్ద.. కిలోమీటర్ మేర రూ.16.62 కోట్లతో నిర్మించిన అండర్ పాస్, సర్వీస్ రోడ్డు.
6. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో మెదక్ జిల్లా.. గోల్డెన్ ధాబా జంక్షన్ వద్ద కిలోమీటర్ మేర రూ.17 కోట్లతో సర్వీస్ రోడ్డు, 6లేన్ అండర్ పాస్.
7. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో కామారెడ్డి జిల్లా.. టెక్రియాల్, పొందుర్తి గీ రోడ్స్ వద్ద.. 3.55 కిలోమీటర్ల మేర.. రూ.47.29 కోట్లతో.. అండర్ పాస్, ఇతర అభివృద్ధి పనులు.
8. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో కామారెడ్డి జిల్లా.. పద్మాజివాడ జంక్షన్ వద్ద.. 1.17 కిలోమీటర్ల మేర. రూ.22.79 కోట్లతో.. అండర్ పాస్, స్లిప్ రోడ్డు.
9. 163 నంబరు జాతీయ రహదారిపై.. హైదరాబాద్–వరంగల్ సెక్షన్‌లో.. ఆలేరు–జీడికల్ ఎక్స్ రోడ్స్ వద్ద.. 1.68 కిలోమీటర్ల మేర, రూ.35.57 కోట్లతో 4లేన్ అండర్ పాస్.

శంకుస్థాపనలు: (20.87 కిలోమీటర్లు, రూ.657.27 కోట్లు)

1. 65వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్–విజయవాడ సెక్షన్‌లో.. టేకుమట్ల సమీపంలో.. రూ.10.69 కిలోమీటర్ల మేర రూ.422.12 కోట్లతో.. జంక్షన్ తొలగింపు, ప్రయాణికుల రవాణా సదుపాయాల సౌలభ్యం.
2. 65వ నంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్–విజయవాడ సెక్షన్‌లో.. ధర్మోజిగూడ వద్ద.. కిలోమీటర్ మేర.. రూ.37.68 కోట్లతో 6 లేన్ అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు నిర్మాణం.
3. 44వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్–బెంగళూరు సెక్షన్‌లో.. బాలానగర్ వద్ద.. రూ.1.26 కిలోమీటర్ల మేర.. రూ.31.56 కోట్లతో.. 6లేన్ అండర్ పాస్.
4. 163వ నంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్–యాద్గిర్ సెక్షన్‌లో.. అంకుషాపూర్ వద్ద .. 2.77 కిలోమీటర్ల మేర.. రూ.56.19 కోట్లతో.. 6లేన్ అండర్ పాస్.
5. 163వ నంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్–యాదగిరి సెక్షన్‌లో.. ఘట్‌కేసర్ జంక్షన్ వద్ద.. రూ.1.70 కోట్లతో రూ.68.95 కోట్లతో.. 6లేన్ ఫ్లై ఓవర్ నిర్మాణం.
6. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో.. 3.45 కిలోమీటర్ల మేర, రూ.40.77 కోట్లతో కోమట్‌పల్లి జంక్షన్, వల్లూరు జంక్షన్‌ల అభివృద్ధి, 6లేన్ అండర్‌పాస్ నిర్మాణం.

ఆదిలాబాద్ నుంచి జరిగే కార్యక్రమాలు

ప్రారంభోత్సవాలు: (115.39 కిలోమీటర్లు, రూ.3,694.42 కోట్లు)

1. నిర్మల్–ఖానాపూర్ మధ్యలో 17.79 కిలోమీటర్ల మేర రూ.126.5 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యాయి. (నిర్మల్ జిల్లా)
2. మంచిర్యాల–రేపల్లెవాడ మధ్యలో 42 కిలోమీటర్ల మేర రూ. 2001 కోట్లతో 4 లేనింగ్ పనులు పూర్తయ్యాయి. (మంచిర్యాల జిల్లా)
3. రేపల్లెవాడ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు 52.6 కిలోమీటర్ల మేర రూ.1,525 కోట్లతో 4 లేనింగ్ పనులు పూర్తయ్యాయి. (ఆసిఫాబాద్ జిల్లా)
4. 44 వ నెంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో కడ్తాల్ వద్ద.. కిలోమీటర్ మేర రూ.23.54 కోట్లతో 6లేన్ అండర్‌పాస్ పనులు పూర్తయ్యాయి. (నిర్మల్ జిల్లా)
5. 44వ నెంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో 2 కిలోమీటర్ల మేర.. రూ.18.38 కోట్లతో.. 8 వేర్వేరు చోట్ల సర్వీస్‌రోడ్లు, జంక్షన్ మార్పుల పనులు పూర్తయ్యాయి. (నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు)

శంకుస్థాపనలు: (8.1 కిలోమీటర్లు, రూ.168.47 కోట్లు)

1. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో గుడిహత్నూర్ వద్ద కిలోమీటర్ మేర రూ.19.63 కోట్లతో 6లేన్ అండర్‌పాస్ (ఆదిలాబాద్ జిల్లా)
2. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో మావల చెక్‌పోస్ట్ దగ్గర 1.4 కిలోమీటర్ల సర్వీస్ రోడ్డు, రిటైనింగ్ వాల్ కోసం.. రూ.23.75 కోట్లతో పనులు (ఆదిలాబాద్)
3. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో సీతాగోంది వద్ద కిలోమీటర్ మేర రూ.26.17 కోట్లతో 6లేన్ అండర్ పాస్ (ఆదిలాబాద్ జిల్లా)
4. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో ముప్కాల్ క్రాస్‌రోడ్స్ దగ్గర కిలోమీటర్ మే రూ.42.13 కోట్లతో సర్వీస్ రోడ్డు, అండర్ పాస్ (నిజామాబాద్ జిల్లా)
5. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో సీఎంసీ జంక్షన్ వద్ద కిలోమీటర్ మేర రూ.38.25 కోట్లతో.. అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు (నిజామాబాద్ జిల్లా)
6. 44వ నంబరు జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో చిట్టాపూర్ జంక్షన్ వద్ద 2.7 కిలోమీటర్ల మేర రూ.18.54 కోట్లతో సర్వీస్ రోడ్డు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (నిజామాబాద్ జిల్లా)

పిల్లల వ్యవ'సాయం'



బడికి సెలవులివ్వడంతో పిల్లలు రెక్కలు విప్పుకుని విహరిస్తున్నారు. ఇష్టమైన పనుల్లో తలమునకలవుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల సమీపంలో పిల్లలు తండ్రికి వరి కుప్పలు పేర్చడంలో ఇలా సహాయపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

మట్టి మనుషులు



ఎండయినా, వానయినా వారి జీవితం మట్టితోనే.. తెల్లారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు మట్టిని ఇటుకగా మార్చేందుకు వారు శ్రమిస్తూనే ఉంటారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో ఇటుక బట్టీ కార్మికులు మండుటెండలో ఇటుకలను కాల్చేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భానుడి సెగ..



ఎండలు మండిపోతున్నాయి. ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే భయపడే పరిస్థితి. దీంతో ఉదయం పది గంటలు దాటితే చాలు ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారులు సైతం వెలవెలబోతున్నాయి. శనివారం మధ్యాహ్నం అనంతపురం క్లాక్ టవర్ సర్కిల్ నిర్మానుష్యంగా ఉన్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

60 ఏళ్లు.. సగర్వంగా

మన 'ఆంగ్రూ'

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) 60 ఏళ్ల పండుగకు ముస్తాబయ్యింది. ఈ నెల 29, 30 తేదీల్లో ఈ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కాబోతున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ 60 ఏళ్ల సాధించిన పురోగతిపై ప్రత్యేక కథనం..

వజ్రోత్సవాలకు ముస్తాబవుతున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

29, 30 తేదీల్లో 60 ఏళ్ల పండుగకు సర్వం సిద్ధం

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్యానంతరం రెండో జాతీయ విద్యా కమిషన్ సిఫార్సు మేరకు రాష్ట్రానికో వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాతిపదికన ఏర్పాటైన తొలి యూనివర్సిటీ ఇది. ఈ వర్సిటీ పరిధిలో ప్రస్తుతం ఏడు ప్రభుత్వ వ్యవసాయ, 6 అనుబంధ, 2 ఫుడ్ సైన్స్, 2 అగ్రి ఇంజనీరింగ్, ఒక కమ్యూనిటీ సైన్స్, 19 ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్, 62 ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఏటా 45 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. అరవై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో వర్సిటీ ఎన్నో విజయాలు సాధించింది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి.. రెట్టింపు ఆదాయం లక్ష్యంగా ఏటా పదుల సంఖ్యలో కొత్త రకాలను మార్కెట్‌లోకి తీసుకొస్తోంది. తెగుళ్లు, కీటకాలు, చీడపీడలు, వాతావరణ స్థితిగతులను తట్టుకునే వంగడాలు అభివృద్ధి చేయడమే కాకుండా, సన్న రకాల సృష్టికర్తగా ఖ్యాతి గడించింది. ఫలితంగా దశాబ్దాలుగా వరి వినియోగంలో వర్సిటీ రకాలు తమ ఆధిపత్యాన్ని చలాయిస్తున్నాయి.

కీర్తి కిరీటంలో ఆణిముత్యాలు..

- దేశంలో మూడో వంతు ప్రజలు ఆహారంగా తింటున్న వరి రకాలను అభివృద్ధి చేసిన ఘనత ఆంగ్రూకు దక్కుతుంది. దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు..తెలుగు రాష్ట్రాల్లో ప్రతి పది మందిలో తొమ్మిది మంది తినే ఆహార గింజలను వర్సిటీ సృష్టించింది.
- 60 ఏళ్లలో 503 వంగడాలను వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటిలో ప్రధానంగా చిరుధాన్యాలు, ధాన్యాలు 217, అపరాలు 84, నూనె గింజలు 56, వాణిజ్య పంటలు 89, ఉద్యాన పంటలు 54లతో పాటు రెండు పశుగ్రాస, ఒకటి బయో డీజిల్ పంటలకు సంబంధించిన వంగడాలున్నాయి. దేశంలోని 4.60 కోట్ల హెక్టార్ల వరి విస్తీర్ణంలో 1.40 కోట్ల హెక్టార్లలో వర్సిటీ రకాలే సాగవుతున్నాయి.
- ఏపీలో వర్సిటీ వరి రకాలు 87 శాతం, నువ్వుల రకాలు 87.50 శాతం, వేరుశనగ రకాలు 95 శాతం, కందుల రకాలు 72 శాతం, చెరుకు రకాలు 62 శాతం, పప్పు ధాన్యాలు 36 శాతం విస్తీర్ణంలో సాగవుతున్నాయి.
- వర్సిటీ అభివృద్ధి చేసిన వరి రకాలు ఏపీలో 74 శాతం, జాతీయ స్థాయిలో 25 శాతం విస్తీర్ణంలో సాగవడమే కాకుండా, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, ఉగాండా, ఇథియోఫియా, కెన్యా వంటి దేశాల్లో కూడా సాగవుతున్నాయి.
- 15 రాష్ట్రాలతో పాటు 150కు పైగా ప్రైవేటు విత్తన కంపెనీలకు బ్రీడర్ విత్తనాలను ఇస్తున్న ఏకైక వర్సిటీ కూడా ఇదే.
- వర్సిటీ అభివృద్ధి చేసిన రకాలతో జాతీయ స్థాయిలో రూ.62,317 కోట్ల ఆదాయాన్ని రైతులు ఆర్జిస్తుండగా, ఏపీలో వర్సిటీ వరి రకాల ద్వారా రూ.20,243 కోట్లు, అపరాల ద్వారా రూ.2,113 కోట్లు, నూనె గింజల ద్వారా రూ.2,862 కోట్లు కలిపి మొత్తం రూ.25 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని రైతులు ఆర్జిస్తున్నారు.
- ఎగుమతుల్లో సింహ భాగమైన బాస్మతేతర బియ్యంలో మూడో వంతు ఆంగ్రూ అభివృద్ధి చేసిన రకాలే. వీటి ద్వారా ఏటా 8–10 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్య ఆర్జన జరుగుతోంది.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాత పరిపాలన భవనం



జగన్ హయాం.. స్వర్ణయుగం

వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో వర్సిటీ అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిచింది. అత్యాధునిక సౌకర్యాలు. అధునాతన భవనాలు సమకూర్చడంతో విస్తృత పరిశోధనలతో దూసుకెళ్లింది. డీజీసీఏ ఆమోదించిన డ్రోన్ శిక్షణ కేంద్రాన్ని గుంటూరు లాంలోని అప్సరా సెంటర్‌లో ప్రారంభించారు. పురుగు, తెగులు మందుల పిచికారికి ఆంగ్రూ పుష్పక్–1, విత్తనాలు, ఎరువుల పిచికారికి పుష్పక్ –2 డ్రోన్స్‌ను అభివృద్ధి చేశారు. 10 పంటల్లో పిచికారీ చేసి సత్ఫలితాలను సాధించారు. జాతీయ స్థాయిలో డ్రోన్ పైలెట్ శిక్షణ కోసం డీజీసీఏ సర్టిఫికేషన్ పొందిన తొలి వర్సిటీగా నిలిచింది. ఐసీఏఆర్ ర్యాంకింగ్స్‌లో 2022–23లో జాతీయ స్థాయిలో వర్సిటీ ఏడవ స్థానంలో నిలవగా, పీజీ అడ్మిషన్స్‌లో రెండో స్థానంలో నిలిచింది. అన్ని ఇనిస్టిట్యూట్స్ లలో 11వ స్థానంలో నిలిచింది. అగ్రిప్రెన్యూర్ షిప్ ఓరియంటేషన్, ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ (సంకల్ప, 2021)లో 55 ఇంక్యుబేట్‌లు ఎంపికయ్యాయి. ఆర్ఎఆర్ఎస్– తిరుపతిలో అభివృద్ధి చేసిన మల్టీ టాస్క్ టూల్ బార్, నాప్‌సాక్ వీడర్‌లు వినూత్న వ్యవసాయ యంత్రాలుగా ఎంపికయ్యాయి. 2020లో రెండో అత్యధిక సంఖ్యలో ఐసీఏఆర్ పీజీ స్కాలర్‌షిప్‌లను పొందిన వర్సిటీగా ఐసీఏఆర్ నుంచి జాతీయ అవార్డు దక్కింది. గిరిజన వ్యవసాయ వ్యవస్థల్లో అత్యుత్తమ పరిశోధన కోసం ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అవార్డు–2020 వరించింది. వ్యవసాయ పరిశోధన, విద్యారంగ కేటగిరిలో 2022లో స్కాచ్ సిల్వర్, స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు సర్టిఫికెట్‌సహా ఎన్నో అవార్డులు వర్సిటీకి దక్కాయి. అలాంటి యూనివర్సిటీ 2024–25లో వ్యవసాయ వర్సిటీల్లో 26వ స్థానానికి, ఓవర్ ఆల్‌గా 151వ స్థానానికి దిగజారిపోయింది.

ఎంతో గర్వంగా ఉంది

ఈ 60 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఆంగ్రూ ఎన్నో విజయాలను సాధించింది. జాతీయ స్థాయిలో 40 శాతం మంది రైతులు ఆంగ్రూ రకాలు సాగు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ప్రతి రైతు వర్సిటీ రకాలపైనే ఆదారపడి వ్యవసాయం చేస్తున్నారు. ప్రతి ఏటా వరితో పాటు ఇతర పంటల్లో కూడా పెద్ద సంఖ్యలో కొత్త వంగడాలను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నాం. ఆంగ్రూ 60 ఏళ్ల పండుగ వేళ వీసీగా ఉండడం గర్వంగా ఉంది.

– డాక్టర్ శారదా జయలక్ష్మి దేవి, వైస్ చాన్సలర్



ధరలు లేక పొలంలోనే వదిలిపెట్టిన బంతిపూలు

బంతిపూలు ధరలు పతనం కావడంతో రైతులు పూలను తోటల్లోనే వదిలిపెడుతున్నారు. ఆరుగాలం శ్రమటోడ్చి పండించిన పూల ధరలు మార్కెట్‌లో అకస్మాత్తుగా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా బంతిపూలు సాగు చేయడం.. ధరలు పతనం కావడం.. రైతులు బంతిపూల సాగు చేయాలంటేనే హడలిపోయే పరిస్థితులు దాపురించాయి. బంతి పూలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బంతి విలాపం

- బంతిపూల ధరలు నేల చూపు
- పెట్టుబడి ఖర్చులు దక్కని వైనం

కుప్పం రూరల్: చిత్తూరు జిల్లా కుప్పంలో బంతిపూల ధరలు నేల చూపు చూస్తున్నాయి. రైతులు పెట్టుబడి రాక పూలను తోటల్లోన్నే వదిలిపెడుతున్నారు. కుప్పం మార్కెట్‌లో కిలో రూ.5 నుంచి 10 రూపాయలు పలుకుతున్నాయి. దీంతో రైతులు కోత కూలీ కూడ రాదని ఆవేదన చెందుతున్నారు. కొంత మంది రైతులు ధరలు లేకపోవడంతో మార్కెట్ బయటే పారబోసి వెళ్తున్నారు. మిగిలిన పూల ధరలు ఓ మోస్తరుగా ఉన్నా బంతి పూల ధరలు మాత్రం పతనమయ్యాయి. వ్యాపారులు మాత్రం అధిక దిగుబడే కారణమంటున్నారు.

వివిధ రాష్ట్రాలకు ఎగుమతి

మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న కుప్పానికి పూల సాగులో ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ పండిన పూలు రాష్ట్రాలు చుట్టి వస్తున్నాయి. ప్రస్తుతం కుప్పం మార్కెట్ నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. అన్ని రకాల పూల ధరలు ఓ రకంగా ఉన్నా బంతిపూల ధరలు మాత్రం నేలకు దిగిపోయాయి. కుప్పం మార్కెట్‌లో వారం రోజులుగా సరాసరిన కిలో రూ.10 పలుకుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూలను కోయక తోటల్లోన్నే వదిలిపెడుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ఎకరాకు 40 వేలు ఖర్చు చేసి బంతిపూలు సాగు చేస్తే కనీసం కూలీ ఖర్చులు కూడా రావడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. బంతిపూల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. బంతి సాగులో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు కనీసం రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సాగు ఖర్చులు రావడం లేదు..

ఎకరా బంతి సాగు రూ.40 వేలు ఖర్చు అవుతుండగా ప్రస్తుతం ధరలతో కోత కూలీ రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 7,500 మొక్కలను నాటాల్సి ఉంటుంది. ఒక్కో మొక్క ధర రూ.2.50 రూపాయలుగా ఉంది. ఇలా దుక్కులు చేయడం, మొక్కలు నాటడం, ఎరువులు వెరసి ఎకరా సాగుకు రూ.40 వేలు ఖర్చు వస్తోంది. ధరలు పతనం కావడంతో సాగు ఖర్చులు వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. మిగిలిన పూలైన చామంతి కుప్పం మార్కెట్‌లో కిలో రూ.150–170, రోజా రూ.80–100, కనకాంబరం రూ.600, మల్లె రూ.280– 320, సంపంగి రూ.60, జాజిమల్లె రూ.240 పలికింది. కానీ బంతి మాత్రమే కిలో రూ.5–10 రూపాయలు పలుకుతున్నాయి. అధిక దిగుబడి రావడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కుప్పంలో టమాట తరువాత రైతులు ఎక్కువ మొత్తంలో బంతి పూలు సాగు చేయడం ధరల పతనానికి కారణంగా చెబుతున్నారు.



ఆపుకోలేని ఆవేదనకు బ్రేక్!

- లోకోపైలట్లను కరుణించిన రైల్వేశాఖ
- రైలింజన్‌లోనే యూరినల్స్, ఏసీ, ఎర్గోనామిక్ సీట్లు

రాజంపేట : ఆపుకోలేని ఆవేదనకు రైల్వేశాఖ బ్రేక్ వేసింది..ఇదేంటబ్బా అనుకోవచ్చు..విధి నిర్వహణలో రైలింజన్ నడిపే లోకోపైలెట్స్, అసిస్టెంట్ లోకోపైలట్స్ యూరినల్స్ తదితర సమస్యలు ఉత్పన్నమైతే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. లోకోపైలట్స్ నీళ్లు తాగటానికి ఒకటికి నాలుగుసార్లు ఆలోచించే పరిస్థితి..మూత్ర విసర్జనకు వెళ్లాంటే రైలు ఆగే స్టేషన్ రాకోసం ఎదురుచూడాల్సిందే. అందుకు ఒక్కోసారి ఐదారు గంటలు కూడా పట్టొచ్చు.. మహిళాలోకోపైలట్లు చాలా అవస్థలు పడేవారు.ఈ సమస్యను పరిష్కరించాలని ఇంతకాలానికి రైల్వేశాఖ ముందడుగు వేసింది. రైలింజన్ క్యాబిన్‌లో యూరినల్స్, ఏసీ వసతి, ఆధునిక ఎర్గోనామిక్ సీట్ల ఏర్పాట్లను తప్పనిసరి చేసింది. దీంతో ఎల్‌పీ.ఎల్‌పీలకు పెద్ద ఉపశమనం లభించనుంది.రైల్వేశాఖ నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- కొత్తగా తయారుచేసే అన్ని లోకో క్యాబిన్లలో యూరినల్స్, ఏసీ, ఎర్గోనామిక్‌సీట్లు ఏర్పాటు కోసం వాటి డిజైన్లను రైల్వేశాఖ మార్చింది. ఇప్పటికే వినియోగిస్తున్న లోకోమోటివ్‌లలో వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గుత్తి, విజయవాడ, లాలాగూడా, మౌలాలి, లోకోషెడ్లను ఈ పనులు ప్రారంభించారు. తొలుత గూడ్స్‌రైళ్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 42 లోకోమోటివ్‌లలో ఏర్పాటుచేశారు. ఇంజిన్‌ను పరిశీలించేందుకు వీలుగా అన్ని కారిడార్ చిన్న క్యాబిన్ ఏర్పాటుచేసి ,అందులో యూరినల్స్ కమోడ్ ఏర్పాటుచేస్తున్నారు. లోకోమోటివ్‌లో నీటి వసతి ఉండదు. కాబట్టి టాయిలెట్ కాకుండా యూరినల్స్ వసతి మాత్రమే ఏర్పాటుచేస్తున్నారు.

క్లీనింగ్ ప్రశ్నార్థకరం..

సాధారణ కోచ్ నాలుగురోజులకొకసారి స్పెషల్ క్లీనింగ్‌కు షెడ్డుకు వెళుతుంది. అప్పుడు అందులోని మానవ వ్యర్థాలను తొలగిస్తారు. కానీ లోకోమోటివ్ 90రోజులకొకసారి మాత్రమే షెడ్డుకు వెళుతుంది. అప్పటి వరకు వ్యర్థాలను నిల్వ ఉంచలేరు. లోకోమోటివ్ కంపు కొడుతుందని ఎల్‌పీలు అంటున్నారు. దీంతో క్లీనింగ్ ప్రశ్నార్థకరంగా మారింది.

ఎర్గోనాటిక్ సీట్లు...

గతంలో 90 డిగ్రీల కోణంలో సీట్లు ఉండేవి. ఇవి ఏమాత్రం అనుకూలంగా ఉండేవి కాదు. వీటిల్లో ఎ క్కువ గంటలు కూర్చొని పనిచేస్తే నడుము, వెన్నముక నొప్పులొస్తున్నాయనే ఆరోపణలున్నాయి. రైల్వేశాఖకు ఫిర్యాదులు వెళుతున్నాయి. మహిళా సిబ్బంది మరింత ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పుడు వీటి స్థానంలో ఎర్గోనామిక్ సీట్లను ఏర్పాటుచేస్తున్నారు.



డివిజన్	:గుంతకల్
లోకోపైలెట్స్	:2500
రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్	:తిరుపతి, రేణిగుంట, నందలూరు, ఎర్రగుంట్ల, గుత్తి, గుంతకల్లు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. యూరినల్స్‌కే పరిమితం కాకుండా, టాయిలెట్ వసతి కూడా ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

– సూర్యరావు, లోకోపైలట్, రేణిగుంట

టాయిలెట్ వసతి ఏర్పాటు అవసరం



లోకోమోటివ్స్‌లో యూరినల్స్‌తో టాయిలెట్ వసతి ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. యూరినల్స్ ఏర్పాటు విషయంలో రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయ హర్షణీయం. ఎల్‌పీ.ఎఎల్‌పీలు పడే ఇబ్బందులు తొలుగుతాయి. విధి నిర్వహణలో ఇక ఆపుకోనక్కరలేదు.


– రామకృష్ణ, లోకోపైలట్, నందలూరు



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో స్వామివారి సర్వ దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,536 మంది స్వామివారిని దర్శించుకోగా 30,612 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిలలక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి ఊంజల్‌సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్లకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు ఉభయ దేవేరులతో కలసి తిరుచ్చిపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు కావడంతో మండుటెండను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా భక్త జనమే కనిపించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, స్వామివారి ఉచిత ప్రసాదం పంపిణీ ప్రాంతం, దర్శనం క్యూలైన్లు భక్తులతో పోటెత్తాయి.

పారిజాతగిరిలో పూజలు




జంగారెడ్డి గూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శనివారం కావడంతో స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్టి, బాలభోగ నివేదన తదితరలు పూజలను అర్చకులు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగను అందించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, విద్యార్థులు మొక్కుబడులు తీర్చుకున్నారు.

మద్ది ఆంజనేయస్వామికి అభిషేకాలు



జంగారెడ్డి గూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయి గూడెంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువులై వెలసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించు అభిషేక సేవ సందర్భంగా ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవ మూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,34,242 ఆదాయం సమకూరింది.



శోభనాచల అధినేత
మీర్జాపురం రాజా

దర్శక, నిర్మాత
బి.ఎ. సుబ్బారావు

● ఎన్టీఆర్

ఎన్టీఆర్ కెమెరా ముందుకొచ్చిన మొదటి సినిమా, ఎన్టీఆర్ - ఏయన్నార్‌ల కాంబినేషన్‌లోని తొలి చిత్రం 'పల్లెటూరి పిల్ల'కు నేటితో 75 ఏళ్ళు

75 వసంతాల పల్లెటూరి పిల్ల

జయాపజయాల స్థాయితో సంబంధం లేకుండా కొన్ని సినిమాలకు చరిత్రలో ఓ ప్రత్యేక స్థానం ఉంటుంది. వాటికి ఉండే అనేకానేక ఇతర విశేషాల తాలూకు ఘనత అది. కాలం గడిచిన కొద్దీ చిత్ర కథ, కథనాల కన్నా ఆ విశేషాల వల్ల సదరు సినిమా మైలురాయిగా మిగిలిపోతుంది. ఈ ఏప్రిల్ 27తో సరిగ్గా 75 వసంతాలు (ప్లాటినమ్ జూబ్లీ) నిండిన 'పల్లెటూరి పిల్ల' అలాంటిదే. అప్పట్లో ఘన విజయం సాధించి, 7 కేంద్రాల్లో నేరుగా శతదినోత్సవం జరుపుకొన్న ఈ సినిమా ప్రత్యేకతలు పుష్కలం.

ఆనాటి 'పల్లెటూరి పిల్ల' చిత్రం చెరిగిపోని తన ముద్రలను ఈనాటికీ గుర్తు చేస్తూనే ఉంది.

ఎన్టీఆర్ అసలు మొదటి సినిమా ఇదే!

నటుడిగా మొదలై ప్రజానేతగా ఎదిగిన ఎన్టీ రామారావు తొలి సినిమా అనగానే 'మన దేశం' (1949) అనుకుంటాం కానీ, అసలు ఆయన నటుడిగా తొలిసారిగా ఎంపికైనదీ, తొట్టతొలిసారిగా కెమెరా ముందు నిల్చున్నదీ ఈ 'పల్లెటూరి పిల్ల'తోనే! అయితే, రిలీజులో మొదట 'మన దేశం' వస్తే, రెండోది 'షావుకారు', మూడోది 'పల్లెటూరి పిల్ల' అయ్యాయి. నిజానికి, ఎన్టీఆర్‌ను ఈ 'పల్లెటూరి పిల్ల' దర్శక - నిర్మాత బి.ఏ. సుబ్బారావు వద్దకు తీసుకువెళ్ళింది కూడా 'మన దేశం' దర్శకుడు ఎల్వీ ప్రసాదే! అందగాడు, స్ఫురద్రూపి అయిన ఎన్టీఆర్‌ను చూస్తూనే, తన తొలి సినిమా హీరో ఇతనే అని సుబ్బారావు తేల్చేశారు. అయితే, తొలి సినిమా రూపొందిస్తూ, తొలిసారి కెమెరా ముందుకు వస్తున్న నటుణ్ణి హీరోగా పెట్టడం భారమేనంటూ ప్రసాద్, ఈలోగా తన సినిమాలో ఒక సహాయక పాత్ర ఇస్తానన్నారు. అదే - ఎన్టీఆర్ తొలిసారి తెరపై కనిపించిన 'మన దేశం'లోని పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్ర అన్న మాట!

తెలుగు సినిమా పరిశ్రమ పురోగతిలో ఇవాళ్టికీ ధ్రువతారలుగా చెప్పుకొనే ఎన్టీఆర్ - ఏయన్నార్ అనే ఇద్దరు అగ్రనటులు కలసి తొలిసారిగా నటించిన చిత్రం కూడా 'పల్లెటూరి పిల్లే'. అప్పటి దాకా మీర్జాపురం రాజా వారి 'శోభనాచల' సంస్థలో ప్రొడక్షన్ నుంచి డైరెక్షన్ దాకా వివిధ శాఖల్లో, స్థాయిల్లో పనిచేస్తున్న బి.ఏ. సుబ్బారావు ఆసక్తి కొద్దీ, ఆ సంస్థ అండదండలతో దర్శకుడిగా, నిర్మాతగా మారిందీ ఈ సినిమాతోనే. 1948 మొదట్లోనే షూటింగ్ ఆరంభమైనా, ఆర్థిక ఇబ్బందులతో చిత్రనిర్మాణం విపరీతంగా జాప్యమైంది. ఆఖరికి మళ్ళీ రాజా వారి చేయూతతోనే 1950 మొదట్లో సినిమా పూర్తి చేశారు. అందుకే, 'బి.ఏ. సుబ్బారావు, శోభనాచల పిక్చర్స్ జాయింట్ ప్రొడక్షన్' అంటూ నిర్మాణసంస్థగా రెండు పేర్లూ వేశారు. ఎట్టకేలకు నాటి ప్రసిద్ధ పంపిణీ సంస్థ పూర్ణా పిక్చర్స్ ద్వారా విడుదల చేయించారు.

గాంధీ ఆశయం చూపే జానపదం

జానపద చిత్రాలకే డబ్బు వస్తుందనీ, సాంఘికాలు సహా తక్కినవి ఏవి తీసినా ఆర్థికంగా నష్టం వస్తుందనీ తెలుగు చిత్రసీమలో భావిస్తున్న రోజులవి. నిర్మాతలంతా జానపదాల వైపు, మంత్రతంత్రాల కాకమ్మకథల వైపు పరుగులు తీస్తున్న కాలమది. అలాంటి వాతావరణంలో అనారోగ్యకరమైన అంశాలను ప్రేక్షకుల మీద రుద్దకుండా, అభ్యుదయానికి దోహదం చేస్తూనే విజయవంతమయ్యే ఫోక్‌లోర్ సినిమా తీయడం సాధ్యమేనని 'పల్లెటూరి పిల్ల' ఋజువు చేసింది. కత్తులూ కటార్లూ వాడినా, మాయలూ మంత్రాలూ లేని ఈ జానపదం మన తెలుగు ప్రాంతాల్లో ప్రభువుల పక్షాన పాలన చేసిన పాలెగాళ్ళ సంస్కృతిని తెరపై చూపింది. గ్రామాలను కాపు కాయాల్సిన వాళ్ళు కొన్నిసార్లు నిరంకుశంగా, పల్లెల్ని దోచుకు తినే వైనానికి విలన్ కంపన దొర (నటుడు ఏ.వి. సుబ్బారావు) పాత్ర ప్రతిరూపం.

అయితే, ఈ చిత్రానికి మూలం మాత్రం 18వ శతాబ్దిలోకెల్లా ప్రాచుర్యం పొందిన నాటకాల్లో రెండోదైన షెరిడాన్ ఆంగ్ల రచన 'పిజారో'. అధికారం, అత్యాశ, నమ్మకద్రోహం లాంటి ఎన్నో మిళితమైన విషాదాంత డ్రామా ఇది. దాన్ని ఆధారంగా తీసుకొని, తాపీ ధర్మారావు, ఆదినారాయణ రావు, సదాశివబ్రహ్మం,



● అంజలీదేవి

చిత్రపు నారాయణమూర్తి, బి.ఏ. సుబ్బారావు... ఇలా అందరూ కలసి మన నేటివిటీకి తగ్గట్టుగా వండిన వంటకం 'పల్లెటూరి పిల్ల'. మూడు ముక్కల్లో చెప్పాలంటే, ఒక గ్రామాన్ని స్వాధీనం చేసుకోవడానికి కంపన దొర అనే ముఠా నేత ప్రయత్నాలను గ్రామస్థులంతా ఏకమై ప్రతిఘటించడమే కథా వస్తువు. దుర్మార్గుడైన ముఠా నేతకు చివరలో హృదయ పరివర్తన కలుగుతుంది. ''జీవితకాలమంతా గాంధీజీ కలవరించిన గ్రామ పునర్నిర్మాణమును ప్రత్యక్షంగా నిరూపించే మహత్తర చిత్రము'' అంటూ అప్పట్లో ప్రచారం చేశారు.


కంపన దొర అనుచరుడిగా ఉండి, పల్లెటూరి పిల్ల (అంజలీదేవి) దెబ్బతో మనిషిగా మారి, గ్రామం కోసం పోరాడే హీరో పాత్ర ఎన్టీఆర్‌ది. సదరు పల్లెటూరి పిల్లకు వరసైన వాడైనా, హీరో హీరోయిన్ల సాన్నిహిత్యం చూసి, తన ప్రేమను వదులుకొని పక్కకు తప్పుకొని, ఆఖరులో వారి కోసం, ప్రజాక్షేమం కోసం ప్రాణమే త్యాగం చేసి మహాత్ముడిగా నిలిచే కీలక పాత్ర ఏయన్నార్‌ది. తాపీ ధర్మారావు రాసిన మాటలు, 'శాంత వంటి పిల్ల లేదోయి...' లాంటి పాటలు అప్పట్లో జనానికి పట్టాయి.

ఇటు ఎన్టీఆర్... అటు ఎమ్జీఆర్!

ఇవాళ ఇంతగా చెప్పుకుంటున్న ఈ 'పల్లెటూరి పిల్ల' నిర్మాణమే కాదు, రిలీజ్ కూడా ఆలస్యమే. రకరకాల రిలీజ్ తేదీలు మారింది. ఆఖరి క్షణంలోనూ 1950 ఏప్రిల్ 20 నుంచి ఎందుకనో ఓ వారం వాయిదా వేశారు. ఆఖరికి ఏప్రిల్ 27న మద్రాసు సహా తెలుగు నాట అంతటా జనం ముందుకొచ్చింది. ఎన్టీఆర్ హీరోగా చేసిన తొలి చిత్రమిదే అయినా, ఆయన హీరోగా తర్వాత మొదలైన విజయా వారి 'షావుకారు' జనం ముందుకొచ్చి, సక్సెస్‌ఫుల్‌గా 3 వారాలవుతున్న వేళ ఈ 'పల్లెటూరి పిల్ల' విడుదలైంది. ఈ సినిమా రిలీజ్ నాటికే ఒకపక్క విజయా వారి 'పాతాళభైరవి' షూటింగ్ జోరుగా సాగుతోంది. మరోపక్క వాహినీ వారి ఆణిముత్యం 'మల్లీశ్వరి' కొంత పూర్తయింది. రిలీజుకు ముందే ఆ ఏడాది తమిళ ఉగాది నాడు ఉదయం మద్రాసులోని 'మినర్వా' థియేటర్‌లో ఈ 'పల్లెటూరి పిల్ల' ప్రివ్యూ వేశారు. గమ్మత్తేమిటంటే, ఒక పక్కన ఎన్టీఆర్ సినిమా చూపిస్తుంటే, అదే రోజున అదే సమయంలో 'సాగర్' టాకీస్‌లో ఎమ్జీఆర్ కొత్త తమిళ చిత్రం 'మరుదనాడ్ ఇళవరసి' ప్రెస్‌షో వేయడం. (ఆ తమిళ చిత్రం మిగిలిన కేంద్రాల కన్నా 12 రోజులు ఆలస్యంగా ఆ రోజే మద్రాస్‌లో రిలీజైంది).

యాదృచ్ఛికమే అయినా ఆ రెండు చిత్రాల ప్రివ్యూలు జరిగిన సరిగ్గా ఆ ఉగాది నాటి రాత్రే 8.47 గంటలకు తిరువణ్ణామలైలో భగవాన్ రమణ మహర్షి సమాధిగతులయ్యారు.





హీరోగా ఎన్టీఆర్‌కు అదే తొలి సినిమా కానీ, ఎమ్జీఆర్‌కు మాత్రం అప్పటికే హీరోగా కొంత పేరుంది. ఇటు ఎన్టీఆర్ తెలుగు సినిమా, అటు ఎమ్జీఆర్ తమిళ సినిమా... రెండూ జానపదాలే. రెండూ హిట్టే. కాలగతిలో ఇద్దరూ ఆయా భాషల చిత్రసీమలకు మకుటం లేని మహారాజులయ్యారు. ఆపైన పార్టీలు పెట్టి, జనరంజక పాలకులూ అయ్యారు.

ఆఖరు దాకా... ఆనాటి మంచితనం!

రిలీజులో ఆలస్యమైనా, హీరోగా ఎన్టీఆర్‌కు తొలి రోజులైనా, 'పల్లెటూరి పిల్ల' హిట్టయింది. హీరోగా ఎన్టీఆర్, దర్శక - నిర్మాతగా సుబ్బారావు స్థిరపడ్డారు. మూడు దశాబ్దాల పైగా ఇద్దరూ ఎవరికి వారు వెండితెరపై వెలిగారు. 'రాజు - పేద', 'చెంచులక్ష్మి', 'భీష్మ', 'రాణీ రత్నప్రభ', 'మోహినీ భస్మాసుర' లాంటి అనేక చిత్రాలను సుబ్బారావు స్వీయ నిర్మాణంలో రూపొందించారు. తెరపై తొలి అవకాశమిచ్చారన్న కృతజ్ఞతతో ఎన్టీఆర్ 'సతీ సావిత్రి', 'మావారి మంచితనం' వరకు సుబ్బారావుతో సినిమాలు చేస్తూనే వచ్చారు. కుమారులు హరికృష్ణ - బాలకృష్ణలు తొలిసారిగా కలిసి నటించిన 'రామ్ - రహీమ్' (1974)కు కూడా సుబ్బారావే డైరెక్టర్. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయనను ప్రత్యేకంగా హైదరాబాద్ పిలిపించి, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ)లో రాష్ట్ర ప్రభుత్వ న్యూస్‌రీల్స్ రూపకల్పన బాధ్యతలు అప్పగించడం విశేషం.

దిలీప్ కుమార్‌కు ఫ్లాపు... అమితాబ్‌కు హిట్టు!

ఎన్టీఆర్ - బి.ఏ. సుబ్బారావుల తొలి ప్రయత్నం 'పల్లెటూరి పిల్ల' 1990ల దాకా రీరిలీజ్ అవుతూ, అభిమానుల్ని అలరించింది. తొలి రిలీజప్పుడే ఈ సినిమా తమిళంలో 'గ్రామ పెణ్'గా అనువాదమైంది. (తమిళంలో అనువాదమైన తొలి తెలుగు సినిమా ఏయన్నార్ 'కీలుగుర్రం' అయితే, రెండో తెలుగు సినిమా ఎన్టీఆర్ 'పల్లెటూరి పిల్ల'). తరువాత కొన్నేళ్ళకు ప్రసిద్ధ నిర్మాత 'జెమినీ' వాసన్ ఇదే కథను దేవానంద్, దిలీప్‌కుమార్‌లతో హిందీలో 'ఇన్సానియత్' (1955) పేరిట రీమేక్ చేశారు. హిందీ చలనచిత్ర చరిత్రలో ఆ అగ్రతారలిద్దరూ కలసి నటించిన ఏకైక సినిమా అది. హాలీవుడ్ నుంచి ప్రత్యేకంగా జిప్పీ అనే చింపాజీని రప్పించి, ఈ హిందీ వెర్షన్‌లో నటింపజేయడం విశేషం. హీరోల కన్నా ఈ హాలీవుడ్ చింపాజీకి ఇచ్చిన పారితోషికం, చేసిన ఖర్చే ఎక్కువ.



జెమినీ వారి హిందీ హిట్స్ 'చంద్రలేఖ' వగైరాలతో పోలిక లేదు కానీ, పల్లి సిటీ ప్రభంజనంలో 'ఇన్సానియత్' సో సో అనిపించుకుంది. చిత్రమేమంటే, వీటన్నిటికీ మూలమైన 'పిజారో' నాటక ఇతివృత్తం స్ఫూర్తితో రకరకాల మార్పులతో తర్వాత అనేక భాషల్లో సినిమాలొచ్చాయి. జాగ్రత్తగా గమనిస్తే, చిరస్మరణీయ బాక్సాఫీస్ సూపర్‌హిట్ 'షోలే'కు కూడా ఇదే ప్రేరణ. త్యాగంలో దిలీప్ కుమార్ పాత్రకూ, అమితాబ్ పాత్రకూ పోలికలు కనిపిస్తాయి. ఆ క్యారెక్టరైజేషన్ దిలీప్‌కు ఫ్లాపైతే, అమితాబ్‌కు సూపర్ హిట్.

మానిన గాయాల మధురస్మృతులు

ఈ 'పల్లెటూరి పిల్ల'తో మొదలైన ఎన్టీఆర్, ఏయన్నార్ల టాప్ స్టార్ కాంబినేషన్ మాత్రం మరెక్కడా లేని విధంగా మొత్తం 15 చిత్రాల్లో కొనసాగింది. ఈ చిత్రంలోనే ఏయన్నార్ మీదకు వచ్చే ఎద్దుతో పోరాడే సీన్‌లో రియలిస్టిక్‌గా నటించినప్పుడు ఎన్టీఆర్ కుడి చేతి ఎముక విరిగింది. అలా ఆ తొలి చిత్రం నుంచి సినీ కెరీర్‌లో మొత్తం 7 సందర్భాల్లో వివిధ సినిమాల షూటింగుల్లో అదే చేతికి దెబ్బ తగిలి, ఎన్టీఆర్‌కు ఫ్రాక్చరైంది. అలా జరిగినప్పుడల్లా ఆయన పుత్తూరు రాజుల కట్టు వైద్యాన్ని ఆశ్రయించి, ఆరోగ్యవంతులయ్యారు.

తొలి చిత్రం 'పల్లెటూరి పిల్ల' ఫైట్ సీన్‌లోనే ఆస్ట్రేలియన్ ఎద్దు కొమ్ము విసిరినప్పుడు గాయమై, ఎన్టీఆర్ ఎడమ కన్ను కింద చిన్న గాటు పడింది. ముఖం మీద ఆ చిరుగాటు మచ్చ కెరీర్‌కు అవరోధమవుతుందని అందరూ భావించారు కానీ, అవేవీ ఎన్టీఆర్ ప్రస్థానానికి అడ్డు కాలేదు. ఆ చిరుగాటునే 'కొండవీటి సింహం' (1981)లో ఎన్టీఆర్ వేసిన ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ పాత్రకు తగ్గట్టుగా మేకప్‌లో పెద్దదిగా చేసి, ఎఫెక్టివ్‌గా వాడుకోవడం విశేషం. తొలి సినిమా 'పల్లెటూరి పిల్ల' ఇచ్చిన గుర్తులు ఎన్టీఆర్‌కే కాదు... సినీ ప్రియులకూ ఇవాళ్టికీ ఇలా మిగిలాయి.

- రెంటాల జయదేవ

ఏయన్నార్ అలా వచ్చారు!

'పల్లెటూరి పిల్ల' రూపకల్పన ప్రస్థానం ఆది నుంచి అనేక మలుపులు తిరిగింది. కాకినాడలో ప్రసిద్ధ 'యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్' నాటకాల రోజుల నుంచి బి.ఏ. సుబ్బారావుకు సుపరిచితులైన అంజలీదేవి, ఆదినారాయణరావులు చిత్ర హీరోయిన్, సంగీత దర్శకులుగా ఓకే. మొదట ఎన్టీఆర్‌తో పాటు ఉండే మరో హీరో పాత్రకు ఈలపాట రఘురామయ్యను అనుకున్నారు. రఘురామయ్యతో కొద్దిగా షూటింగ్ కూడా చేశాక, చిత్రనిర్మాణం విపరీతంగా ఆలస్యమైంది. ఆఖరికి ఆ పాత్ర ఏయన్నార్‌కు దక్కింది. అప్పటికే, 'బాలరాజు' (1948 ఫిబ్రవరి 26) వచ్చేసింది. శోభనాచల వారి 'కీలుగుర్రం' (రిలీజ్ 1949 ఫిబ్రవరి 19) పట్టాలెక్కింది. అలా హీరోగా పేరు తెచ్చుకున్న ఏయన్నార్ ఈ చిత్రంలో హీరోయిన్ లేకుండా, ఆఖరికి ప్రాణాలు కూడా వదులుకొనే త్యాగమయ పాత్రకు ఒప్పుకోవడం విశేషమే. స్టార్‌డమ్ ఇంతగా ప్రబలని ఆ రోజుల్లో రంగస్థల, సినీ నటీనటులకు తాము పోషించే పాత్ర తాలూకు ప్రాధాన్యమే తప్ప, ఇమేజ్ పట్టింపులు ఉండేవి కాదనడానికి ఇది పెద్ద ఉదాహరణ. ఏయన్నార్ రాకతో, అంతకు ముందు రఘురామయ్యతో తీసిన సీన్లను రీషూట్ చేశారు.



● ఏయన్నార్

పట్టాలెక్కని బాలకృష్ణ - నాగార్జున రీమేక్

సమకాలీన వాతావరణాన్ని ప్రతిఫలిస్తూ, మాయలు - మంత్రాలు లేని జానపదం 'పల్లెటూరి పిల్ల' అంటే హీరో బాలకృష్ణకు చాలా ఇష్టం. ఇప్పటికీ తరచూ ఆ సినిమా చూస్తుంటారట. ఎన్టీఆర్, ఏయన్నార్ పాత్రలను బాలకృష్ణ, నాగార్జున పోషించగా, ఈ సినిమాను రీమేక్ చేయాలని ఒక దశలో ప్రతిపాదన కూడా వచ్చింది. కొందరు ప్రయత్నించారు. నాగార్జున వెనుకంజ వేయడంతో అది ఫలించలేదు.

క్రైమ్ థ్రిల్లర్‌లో..?



● నాగార్జున

'నా సామిరంగ' సినిమా తర్వాత నాగార్జున హీరోగా నటించనున్న చిత్రంపై ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేదు. గత ఏడాది సంక్రాంతికి (జనవరి 14) విడుదలైన 'నా సామిరంగ' చిత్రం హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం నాగార్జున హీరోగా ఏ సినిమానూ సెట్స్‌లో లేదు కానీ, రజనీకాంత్ 'కూలీ' చిత్రంతో పాటు ధనుష్‌తో కలిసి 'కుబేర' సినిమాలో నటిస్తున్నారు. కాగా సోలో హీరోగా చేసేందుకు పలువురు దర్శకులు చెప్పిన కథలు విన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ పచ్చజెండా ఊపలేదు ఆయన. ఇదిలా ఉంటే... 'హిట్, హిట్ 2, సైంధవ్' తదితర చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో నాగార్జున ఓ సినిమా చేయనున్నారనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుందని భోగట్టా. గతంలో నాగార్జునకి వినిపించిన ఓ కథకి మరిన్ని మార్పులూ చేర్పులూ చేసి, తాజాగా ఫైనల్ స్క్రిప్ట్‌ని వినిపించారట శైలేష్. ఈ కథ నాగార్జునకి నచ్చడంతో ఓకే చెప్పారట. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఓ హత్య ఘటన నేపథ్యంలో ఈ కథ సాగుతుందని టాక్. నాగార్జున పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండేలా శైలేష్ స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరి... నాగార్జున సోలో హీరోగా తెరకెక్కనున్న చిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తారా? అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. ఇక నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్' మే 1న విడుదల కానుంది.

మోహన్‌లాల్ కాదు... ఉపేంద్ర?



● ఉపేంద్ర

రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రంలో ఉపేంద్ర ఓ లీడ్ రోల్ చేయనున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రామ్ హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాగర్ పాత్రలో రామ్, మహాలక్ష్మి పాత్రలో భాగ్య శ్రీ బోర్సే కనిపిస్తారు. కాగా.. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం మేకర్స్ మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్‌ను అనుకున్నారట. కానీ కొన్ని కారణాల వల్ల కుదరకపోవడంతో, కన్నడ స్టార్ ఉపేంద్రను సంప్రదించారట. ఈ పాత్ర చేసేందుకు ఉపేంద్ర సుముఖంగా ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఉపేంద్ర చేయనున్నది సినిమా హీరో క్యారెక్టర్ అని సమాచారం. మరి... రామ్ సినిమాలో సినిమా హీరోగా ఉపేంద్ర నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మే 15న రామ్ బర్త్‌డేకి 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమా గురించిన అప్‌డేట్ రావొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

బాలీవుడ్‌లో బిజీ బిజీగా...



● తమన్నా

బాలీవుడ్‌లో తమన్నాకు అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఈ బ్యూటీ అజయ్ దేవగన్ 'రేంజర్' మూవీలో హీరోయిన్‌గా చేస్తున్నారు. అలాగే అజయ్ దేవగన్ 'రైడ్ 2'లో ఓ స్పెషల్ సాంగ్ చేశారు. జాన్ అబ్రహాం హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వం వహించనున్న బయోగ్రాఫికల్ ఫిల్మ్‌లోనూ తమన్నా హీరోయిన్‌గా దాదాపు ఖరారు అయ్యారు. అర్జున్ కపూర్-వరుణ్ ధావన్‌ల 'నో ఎంట్రీ 2' చిత్రంలో తమన్నా ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. లేటెస్ట్‌గా సిద్ధార్థ్ మల్హోత్రా సినిమాలోనూ హీరోయిన్‌గా తమన్నాకు అవకాశం దక్కిందని బీ టౌన్‌లో ప్రచారం జరుగుతోంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా దీపక్ మిశ్రా దర్శకత్వంలో 'వ్వాన్' అనే భారీ మైథలాజికల్ ఫిల్మ్ రానుంది. ఈ మూవీలోని హీరోయిన్ పాత్రకు తమన్నాను సంప్రదించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ భోగట్టా. ఈ సినిమాలన్నింటినీ గమనిస్తుంటే... ప్రస్తుతం తమన్నా చేతిలో హీరోయిన్‌గా నాలుగు హిందీ సినిమాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇండస్ట్రీకి వచ్చి పదిహేను సంవత్సరాలు పూర్తయిన తర్వాత కూడా ఓ యంగ్ హీరోయిన్ మాదిరి తమన్నాకు వరుస అవకాశాలు వస్తుండటం విశేషమనే చెప్పుకోవచ్చు. ప్రస్తుతం తమన్నా సినిమాల గురించి వింటుంటే మరో రెండు సంవత్సరాలు బాలీవుడ్‌లో ఆమె ఫుల్ బిజీగా ఉంటారని, కెరీర్‌లో ఫుల్‌ఫామ్‌లో ఉన్నారని చెప్పొచ్చు.

బిజినెస్ రీల్

ఎస్ఎంఎల్ ఇసుజులో మహీంద్రాకు వాటాలు

58.96% వాటాలకు రూ. 555 కోట్లు

న్యూఢిల్లీ: కమర్షియల్ వాహనాల తయారీ సంస్థ ఎస్ఎంఎల్ ఇసుజులో 58.96 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా వెల్లడించింది. ఈ డీల్ విలువ రూ. 555 కోట్లుగా ఉంటుంది. లావాదేవీ ప్రకారం, ఎస్ఎంఎల్ ప్రమోటర్ అయిన సుమిటోమో కార్పొరేషన్ నుంచి మొత్తం 43.96 శాతం వాటాలను, విడిగా ఇసుజు మోటార్స్.. ఎస్ఎంఎల్ నుంచి మరో 15 శాతం వాటాలను మహీంద్రా అండ్ మహీంద్రా కొనుగోలు చేస్తుంది. మరో 26 శాతం వాటా కోసం ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. 1983లో ఏర్పాటైన ఎస్ఎంఎల్ ఇసుజు ప్రస్తుతం ట్రక్కులు, బస్సుల సెగ్మెంట్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈడీగా అనంత్ అంబానీ



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా (ఈడీ) ముకేశ్ అంబానీ చిన్న కొడుకు అనంత్ అంబానీ నియమితులయ్యారు. 2025 మే 1 నుంచి అయిదేళ్ల పాటు ఆయన హోల్–టైమ్ డైరెక్టర్గా ఉంటారని స్టాక్ ఎక్స్చేంజీలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. అనంత్ అంబానీ అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్తో పాటు అనేక రిలయన్స్ గ్రూప్ సంస్థల్లో పనిచేస్తున్నారు. జియో ప్లాట్ఫామ్స్లో (2020 మార్చి నుంచి), రిలయన్స్ రిటైల్ వెంచర్స్లో (2022 మే నుంచి), రిలయన్స్ న్యూ ఎనర్జీ అండ్ రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీలో (2021 జూన్ నుంచి) బోర్డ్ సభ్యుడిగా ఉన్నారు. ముకేశ్ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ గ్రూప్ టెలికాం, డిజిటల్ సేవల విభాగమైన 'రిలయన్స్ జియో ఇన్ఫోకామ్'కు జూన్ 2022 నుంచి చైర్మన్గా సేవలు అందిస్తున్నారు. కూతురు ఇషా అంబానీ కంపెనీ రిటైల్, ఈ–కామర్స్, లగ్జరీ వ్యాపార బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

దక్షిణాదిలో మెర్సిడెస్ బెంజ్ నెట్వర్క్ పటిష్టం



బెంగళూరు: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ దక్షిణాదిలో తమ సర్వీసింగ్ నెట్వర్క్ను పటిష్టం చేసుకుంది. హైదరాబాద్లో రెండు, బెంగళూరులో ఒకటి చొప్పున అధునాతన లగ్జరీ సర్వీస్ కేంద్రాలను ప్రారంభించింది. హైదరాబాద్లోని మహవీర్ మోటర్స్, ల్యాండ్మార్క్ కార్స్లో.. బెంగళూరులో సుందరం మోటర్స్లో వీటిని ఏర్పాటు చేసింది. వీటిలో ప్రైవేట్ కన్సల్టింగ్ రూమ్లు, బొటిక్ ఐటమ్ షాప్లు మొదలైన ఫీచర్లు ఉంటాయని సంస్థ తెలిపింది. రెండు ప్రధాన నగరాల్లోనూ కస్టమర్లకు లగ్జరీ అనుభూతి కలిగించేలా వీటిని తీర్చిదిద్దినట్లు కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు.

ల్యాబ్ డైమండ్ల మార్కెట్లోకి శ్రీ జగదంబ పెరల్స్

హైదరాబాద్: శ్రీ జగదంబ పెరల్స్ తాజా గా ల్యాబ్–గ్రోన్ డైమండ్ల (ఎల్జీడీ) మార్కెట్లోకి ప్రవేశించింది. ఓరా పేరిట ప్రత్యేక బ్రాండ్ను ఆవిష్కరించింది. ఇటు సాంప్రదాయం, అటు ఆధునికత మేళవింపుతో ఈ వజ్రాభరణాలు ఉంటాయని సంస్థ మేనేజింగ్ పార్ట్నర్ అవనీష్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్లోని ప్రధాన స్టోర్లో ఇవి లభిస్తాయని, త్వరలో దేశవ్యాప్తంగా తమ స్టోర్స్ అన్నింటిలోనూ ప్రవేశపెడతామని పేర్కొన్నారు.

టీసీఎస్ నుంచి సావరీన్సెక్యూర్ క్లౌడ్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ తాజాగా 3 టెక్నాలజీ సేవలను ఆవిష్కరించింది. టీసీఎస్ సావరీన్సెక్యూర్ క్లౌడ్, డిజిబోల్ట్, సైబర్ డిఫెన్స్ సూట్ వీటిలో ఉన్నాయి. ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, నియంత్రిత పరిశ్రమలు కృత్రిమ మేధని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు టీసీఎస్ సావరీన్సెక్యూర్ క్లౌడ్ దోహదపడుతుంది. అలాగే, కీలకమైన డేటాను భారత్లోనే భద్రపర్చేందుకు తోడ్పడుతుంది.

కోడిగుడ్లు (హోల్సేల్–నెక్ / 100కు రూ.లలో)

27-4-2025

విశాఖ	430–00
చిత్తూరు	470–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

ప్రత్యక్ష పన్నులపై రిఫండ్ ఎఫెక్ట్



- లక్ష్యాన్ని చేరని నికర కలెక్షన్లు
- 2024–25లో రూ. 22.37 లక్షల కోట్ల టార్గెట్
- నికరంగా వసూలైనది రూ. 22.26 లక్షల కోట్లు
- రికార్డు స్థాయిలో రూ. 4.76 లక్షల కోట్లు రిఫండ్

న్యూఢిల్లీ: భారీ స్థాయిలో రిఫండ్లు జారీ చేయడంతో గత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు నిర్దేశించుకున్న లక్ష్యం స్థాయిలో వసూలు కాలేదు. 2024–25లో నికరంగా రూ. 22.37 లక్షల కోట్లు టార్గెట్గా పెట్టుకోగా నికరంగా రూ. 22.26 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఇది అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 13.57 శాతం అధికమే అయినప్పటికీ నిర్దేశిత లక్ష్యానికి మాత్రం చేరలేదు. గతేడాది జూలై నాటి బడ్జెట్లో రూ. 22,07,000 కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు నిర్దేశించుకోగా, దాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ. 22,37,000 కోట్లకు సవరించారు. సాధారణంగా కార్పొరేట్ ట్యాక్సులు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ), నాన్–కార్పొరేట్ ట్యాక్సులు (గతంలో వ్యక్తిగత ఆదాయ పన్ను) మొదలైనవి ప్రత్యక్ష పన్నుల పరిధిలోకి వస్తాయి. వ్యక్తులు, సంస్థలు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్యూఎఫ్లు) మొదలైన వర్గాలు కట్టే పన్నులు నాన్–కార్పొరేట్ ట్యాక్సుల పరిధిలోకి వస్తాయి.

స్థూల వసూళ్లు 16 శాతం అప్..

అధికారిక డేటా ప్రకారం మార్చి 31తో ముగిసిన 2024–25 ఆర్థిక సంవత్సరంలో స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు (రిఫండ్లకు ముందు) 15.59 శాతం పెరిగి రూ. 27.02 లక్షల కోట్లకు చేరాయి. అంతక్రితం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ. 23.37 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక, రిఫండ్ల జారీ తర్వాత నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్ల ప్రొవిజనల్ గణాంకాలు రూ. 22.26 లక్షల కోట్లుగా నమోదైయ్యాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 19.60 లక్షల కోట్లతో పోలిస్తే 13.57 శాతం పెరిగాయి. – ఇవన్నీ ప్రొవిజనల్ గణాంకాలు మాత్రమే. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తుది దశ రీకన్సిలియేషన్, సర్దుబాట్లు జరుగుతున్నందున నికర వసూళ్లు మరి కాస్త పెరగొచ్చని అధికారులు తెలిపారు.

మరిన్ని వివరాలు..

- ఎస్టీటీ నుంచి రెవెన్యూ రూ.34,192 కోట్ల నుంచి రూ. 53,296 కోట్లకు పెరిగింది.
- ప్రొవిజనల్ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు, జులై బడ్జెట్ లక్ష్యంతో పోలిస్తే (రూ. 22.07 లక్షల కోట్లు) 100.78 శాతం పెరగ్గా, ఫిబ్రవరిలో సవరించిన అంచనాలతో పోలిస్తే (రూ. 22.37 లక్షల కోట్లు) 99.51 శాతం పెరిగాయి.
- 2024–25లో ట్యాక్స్ డిపార్ట్మెంట్ అత్యధిక స్థాయిలో రూ. 4,76,743 కోట్లు రిఫండ్ జారీ చేసింది. 2023–24లో నమోదైన రూ. 3,78,255 కోట్లతో పోలిస్తే ఇది 26.04 శాతం అధికం.
- రికార్డు స్థాయిలో రూ. 4.76 లక్షల కోట్లు రిఫండ్లు జారీ చేసినప్పటికీ స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు బడ్జెట్లో నిర్దేశించుకున్న రూ. 22.37 లక్షల కోట్ల స్థాయిని మించి నమోదైనట్లు అధికారులు తెలిపారు. సిసలైన క్లెయిమ్లను పారదర్శమైన, సముచితమైన విధంగా తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని ట్యాక్స్పేయర్లకు ఇచ్చిన హామీకి డిపార్టుమెంట్ కట్టుబడి ఉండటం ఇందుకు కారణమని వివరించారు.
- సమీక్షాకాలంలో నికర కార్పొరేట్ ట్యాక్సుల వసూళ్లు (ప్రొవిజనల్) 8.30 శాతం పెరిగి రూ. 9,86,719 కోట్లకు చేరాయి. స్థూల కార్పొరేట్ వసూళ్లు 12.41 శాతం వృద్ధితో రూ. 12,72,516 కోట్లుగా నమోదయ్యాయి.

'వొడా'లో వాటాలు పెంచుకునేది లేదు

కేంద్ర మంత్రి సింధియా స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్)లో వాటాలను మరింతగా పెంచుకుని, దాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా మార్చే యోచనేదీ ప్రభుత్వానికి లేదని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 48.99 శాతం వాటాలకే ప్రభుత్వం పరిమితమవుతుందని తెలిపారు. కేంద్రం తన వంతు తోడ్పాటు అందించినందున ఇకపై పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన బాధ్యత వొడాఫోన్ ఐడియాదేనని ఆయన తెలిపారు. వొడాఫోన్ ఐడియా బకాయిలకు బదులుగా ప్రభుత్వం వాటాలు తీసుకోవడం వల్ల స్వల్పకాలిక ఊరట లభించినప్పటికీ కంపెనీ నిలదొక్కుకోవాలంటే యూజర్ల బేస్ స్థిరంగా ఉండటం, టారిఫ్లను పెంచడం, దీర్ఘకాలిక రుణాల సమీకరణ మొదలైనవి కీలకాంశాలుగా ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి గట్టెక్కినా, భవిష్యత్తులో బాకీల చెల్లింపుల విషయంలో కంపెనీ సవాళ్లు ఎదుర్కొనవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ రంగంలోకి దిగి మద్దతునిస్తుందా అనే సందేహాన్ని మంత్రి నివృత్తి చేశారు. మరోవైపు, బ్యాంక్ రుణాల చెల్లింపులో ఎంటీఎన్ఎల్ డిఫాల్ట్ కావడంపై స్పందిస్తూ కంపెనీకి గణనీయంగా స్థలాలు ఉన్నాయని, వాటిని నగదీకరణ చేయడం ద్వారా రుణాలను తీర్చేసే అవకాశం ఉందన్నారు.

రెట్టింపు ఆదాయంపై డీఎస్ గ్రూప్ దృష్టి

2029కల్లా రూ. 20,000 కోట్ల లక్ష్యం



న్యూఢిల్లీ: దేశీ ఎఫ్ఎంసీజీ కంపెనీ ధరమ్పాల్ సత్యపాల్(డీఎస్) గ్రూప్ నాలుగేళ్లలో ఆదాయాన్ని రెట్టింపునకు పెంచుకోవాలని చూస్తోంది. ఇందుకు వీలుగా మొత్తం రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ వైస్చైర్మన్ రాజీవ్ కుమార్ తెలియజేశారు. తద్వారా శత వసంతాలు పూర్తి చేసుకోనున్న 2029కల్లా రూ. 20,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా ఆతిథ్యం, ఆహారం, పానీయాల విభాగాలలో ఇతర సంస్థలను కొనుగోలుచేసే అవకాశాలను అన్వేషిస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా కార్యకలాపాలను వేగంగా విస్తరించే వ్యూహాలపై దృష్టిపెట్టినట్లు వివరించారు. గతంలో నమిలే పొగాకు ఉత్పత్తులతో ప్రసిద్ధమైన కంపెనీ వీటిని టర్నోవర్లో 10 శాతానికంటే తక్కువకు పరిమితం చేసినట్లు తెలియజేశారు. మార్చితో ముగిసిన గతేడాది(2024–25) సాధించిన రూ. 10,000 కోట్ల ఆదాయంలో వీటి వాటా 10 శాతంకంటే తక్కువేనని, అయితే ఈ విభాగం నుంచి పూర్తిగా వైదొలగబోమని స్పష్టం చేశారు. ఆహారం, పానీయాల నుంచి 42 శాతం సమకూరినట్లు వెల్లడించారు.

ప్యూర్పవర్ గ్రిడ్పై కంపెనీల ఆసక్తి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్యాటరీ ఆధారిత ప్యూర్పవర్ గ్రిడ్ ఉత్పత్తిపై పలు రెన్యూవబుల్ ఎనర్జీ ఈపీసీ సంస్థలు, భారీ పరిశ్రమలు ఆసక్తి చూపుతున్నాయని ఎలక్ట్రిక్ టూ వీలర్ల సంస్థ విద్యుత్ స్టోరేజీ ఉత్పత్తుల సంస్థ ప్యూర్ వెల్లడించింది. 10కి పైగా కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు వచ్చినట్లు కంపెనీ ఎండీ నిశాంత్ దొంగారి తెలిపారు. 5ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యంతో రూపొందిన ప్యూర్పవర్ గ్రిడ్లో క్లౌడ్, ప్రెడిక్టివ్ ఏఐ మొదలైన సాంకేతికతలు పొందుపర్చినట్లు పేర్కొన్నారు. దేశీయంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంల మార్కెట్ ఈ దశాబ్దం ఆఖరు నాటికి 36 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు చెప్పారు.

డిజిటల్ కామర్స్కు నియంత్రణ సంస్థ ఉండాలి

ట్రేడర్ల సమాఖ్య డిమాండ్



న్యూఢిల్లీ: పోటీ సంస్థలను దెబ్బతీసే విధమైన ధరలు నిర్ణయిస్తున్నాయని, భారీగా డిస్కౌంట్లు ఇస్తున్నాయని, గిగ్ వర్కర్ల శ్రమ దోపిడీ చేస్తున్నాయని ఈ–కామర్స్, క్విక్ కామర్స్ ప్లాట్ఫాంలపై ఆరోపణలున్న నేపథ్యంలో వాటిని పర్యవేక్షించేందుకు స్వతంత్ర డిజిటల్ కామర్స్ నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని ట్రేడర్ల సమాఖ్య సీఏఐటీ కేంద్రాన్ని కోరింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద నేషనల్ ఈ–కామర్స్ పాలసీ, ఈ–కామర్స్ నిబంధనలను సత్వరం ప్రకటించాలని విజ్ఞప్తి చేసింది. ఆన్లైన్లో కొనుగోళ్లు చేయడం లగ్జరీగానే పరిగణించవచ్చు కాబట్టి ఈ–కామర్స్ ప్లాట్ఫాంల ద్వారా విక్రయించే ఉత్పత్తులపై ప్రస్తుత జీఎస్టీ నిబంధన ప్రకారం 'లగ్జరీ ట్యాక్స్' విధించాలని సీఏఐటీ పేర్కొంది. లాభదాయకత లేకపోవడంతో గత రెండు, మూడేళ్లలో 10 లక్షల పైగా కిరాణా దుకాణాలు మూతబడ్డాయని ఆలిండియా కన్జూమర్ ప్రోడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్ ఫెడరేషన్ (ఏఐసీపీడీఎఫ్) నేషనల్ ప్రెసిడెంట్ ధైర్యశీల్ పాటిల్ తెలిపారు. ఈ వ్యవధిలో కొత్తగా ప్రారంభమైన స్టోర్లతో పోలిస్తే మూతబడినవే ఎక్కువని వివరించారు.

స్పర్శ్ సీసీటీవీలకు ఎస్టీక్యూసీ సర్టిఫికేషన్



ముంబై: సీసీటీవీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ స్పర్శ్ తమ ఉత్పత్తులకు ఎస్టీక్యూసీ (స్టాండర్డైజేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్) లభించినట్లు వెల్లడించింది. దేశీయంగా విక్రయించే అన్ని ఐపీ సీసీటీవీ కెమెరాలకు దీన్ని తప్పనిసరి చేసిన ఈ సర్టిఫికేషన్ పొందిన తొలి భారతీయ సంస్థ తమదేనని పేర్కొంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, కఠినతరమైన ప్రమాణాలు, అత్యంత నాణ్యతతో సీసీటీవీలను తయారు చేస్తున్నట్లు కంపెనీ ఎండీ సంజీవ్ సెహగల్ తెలిపారు.

మార్చి త్రైమాసిక ఫలితాలు

నిరాశపరిచిన ఎస్బీఐ కార్డ్

- 19 శాతం తగ్గిపోయిన లాభం
- పెరిగిన మొండి బకాయిలు



న్యూఢిల్లీ: ఎస్బీఐ కార్డ్ (క్రెడిట్ కార్డు సేవల్లోని) గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (2025 జనవరి–మార్చి) రూ.534 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.662 కోట్లతో పోల్చి చూస్తే 19 శాతం తగ్గిపోయింది. క్రెడిట్ కార్డులపై రుణ ఎగవేతలు పెరగడం లాభాలకు గండికొట్టింది. మొత్తం ఆదాయం మాత్రం ఇదే కాలంలో రూ.4,475 కోట్ల నుంచి రూ.4,832 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.2,415 కోట్లకు మెరుగుపడింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,139 కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక రుణాలు (వసూలు కాని/ఎన్పీఏలు) మొత్తం రుణాల్లో 3.08 శాతంగా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 2.76 శాతమే. నికర ఎన్పీఏలు గమనించినా.. 0.99 శాతం నుంచి 1.46 శాతానికి పెరిగాయి. నష్టాలు/మొండి బకాయిలకు కేటాయింపులు క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.944 కోట్లుగా ఉంటే, సమీక్షా కాలంలో రూ.1,245 కోట్లకు పెరిగిపోయాయి. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎస్బీఐ కార్డ్ రూ.1,916 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2023–24లో నమోదైన రూ.2,408 కోట్లతో పోల్చి చూస్తే 20 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.17,484 కోట్ల నుంచి రూ.18,637 కోట్లకు వృద్ధి చెందింది. బ్యాలన్స్ షీట్ విలువ రూ.58,171 కోట్ల నుంచి రూ.65,546 కోట్లకు పెరిగింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎస్బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ షేరు ధర ఒక శాతానికి పైగా లాభపడి రూ.927 వద్ద ముగిసింది.

ఎన్డీటీవీకి రూ.62 కోట్ల నష్టం



న్యూఢిల్లీ: ఎన్డీటీవీ మార్చి క్వార్టర్లో రూ.62 కోట్ల నష్టాన్ని చవిచూసింది. కార్యకలాపాల విస్తరణ, ఆధునిక ఫర్నిచర్ తదితర వాటిపై వ్యయాలు ఇందుకు దారితీసినట్లు సంస్థ తెలిపింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.8.68 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.118 కోట్ల నుంచి రూ.128 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 50 శాతం ఎగసి రూ.191 కోట్లుగా ఉన్నాయి. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీటీవీ కన్సాలిడేటెడ్ నష్టం రూ.218 కోట్లకు పెరిగిపోయింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నష్టం రూ.21 కోట్లుగానే ఉంది. తన వెబ్సైట్లు, యాప్లపై డిజిటల్ యూజర్ల సంఖ్య 47 శాతం పెరిగింది. వ్యూహాత్మ మార్పులు మార్చి త్రైమాసికంలో నష్టానికి దారితీసినట్టు కంపెనీ తెలిపింది. మరింత బలమైన మీడియా సంస్థగా మార్చే క్రమంలో ఈ చర్యలు అవసరమని పేర్కొంది. బీఎస్ఈలో కంపెనీ షేరు 4% నష్టపోయి రూ.123 వద్ద స్థిరపడింది.

ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ లాభం రూ. 304 కోట్లు



ముంబై: మైక్రోఫైనాన్స్ పోర్ట్ఫోలియోలో మొండి బాకీలకు సంబంధించి ప్రొవిజనింగ్ పెంచాల్సి రావడంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ నికర లాభంపై ప్రభావం పడింది. క్రితం క్యూ4లో నమోదైన 724 కోట్లతో పోలిస్తే లాభం సుమారు 58 శాతం తగ్గి రూ. 304 కోట్లకు పరిమితమైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం సుమారు 48.4 శాతం క్షీణించి రూ. 1,525 కోట్లుగా నమోదైంది. మొత్తం రుణాలు 20 శాతం పెరిగి రూ. 2,41,926 కోట్లకు చేరాయి. రిటైల్, గ్రామీణ, ఎంఎస్ఎంఈ రుణాలు 19 శాతం వృద్ధితో రూ. 1,97,568 కోట్లకు చేరగా, మైక్రోఫైనాన్స్ పోర్ట్ఫోలియో 28 శాతం తగ్గింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ. 5,515 కోట్ల మేర ప్రొవిజనింగ్ చేయాల్సి వచ్చింది. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) సుమారు 10 శాతం పెరిగి రూ. 4,907 కోట్లకు పెరగ్గా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి 17 శాతం వృద్ధి చెందింది. కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్ల జారీ ద్వారా రూ. 7,500 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసింది.

ఎంఆర్పీఎల్ లాభం 68 శాతం డౌన్



న్యూఢిల్లీ: రిఫైనరీ మార్జిన్లు తగ్గడంతో మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ (ఎంఆర్పీఎల్) నికర లాభం గత ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికంలో 68% క్షీణించి రూ. 363 కోట్లకు పరిమితమైంది. క్రితం క్యూ4లో ఇది రూ. 1,137 కోట్లు. ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ) అనుబంధ సంస్థ అయిన ఎంఆర్పీఎల్ సమీక్షా కాలంలో క్రూడాయిల్ను శుద్ధి చేయడం ద్వారా ప్రతి బ్యారెల్పై 6.23 డాలర్ల స్థూల రిఫైనింగ్ మార్జిన్ ఆర్జించింది. అంతక్రితం క్యూ4లో ఇది బ్యారెల్కు 11.35 డాలర్లుగా నమోదైంది. మరోవైపు, జనవరి–మార్చి త్రైమాసికంలో ఆదాయం రూ. 29,190 కోట్ల నుంచి రూ. 27,601 కోట్లకు తగ్గింది.

చోళమండలం ఇన్వెస్ట్మెంట్ లాభం రూ.1,260 కోట్లు

డివిడెండ్ రూ.0.75

న్యూఢిల్లీ: మురుగప్ప గ్రూప్ అనుబంధ సంస్థ చోళమండలం ఇన్వెస్ట్మెంట్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో రూ.1,260 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు క్యూ4లో ఆర్జించిన రూ.1,065 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 18% అధికం. తాజా క్యూ4లో మొత్తం ఆదాయం రూ.5,449 కోట్ల నుంచి రూ.7,137 కోట్లకు చేరింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ.0.75 డివిడెండ్ ప్రకటించింది. జనవరి 31న ప్రకటించిన రూ.1.30 మధ్యంతర డివిడెండ్కు ఇది అదనం.

భారత్ వృద్ధికి క్రూడాయిల్ దన్ను

- ఈసారి 6.5 శాతంగా ఈవై అంచనాలు
- ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గుదల, వినియోగ వృద్ధి సానుకూలాంశాలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్నప్పటికీ తగ్గిన క్రూడాయిల్ రేట్లతో దేశీయంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు నెమ్మదించడం, దేశీయంగా వినియోగం పెరగడం లాంటి దేశ వృద్ధికి సానుకూలంగా దోహదపడనున్నాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని కన్సల్టెన్సీ సంస్థ ఈవై ఒక నివేదికలో పేర్కొంది. ఎగుమతుల క్షీణత, గ్లోబల్ మందగమనం, ముడిచమురు ధరల తగ్గుదల, అంతర్జాతీయంగా ఉత్పత్తి సామర్థ్యాలు పెరిగిపోవడం వంటి అంశాలు భారత వృద్ధిపై ప్రభావం చూపనున్నాయని వివరించింది. సముచిత ఆర్థిక, ద్రవ్య విధానాలతో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం లోపునకు కట్టడి చేస్తూ, 2026 ఆర్థిక సంవత్సరంలోను, అలాగే మధ్యకాలికంగాను భారత్ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేయొచ్చని ఈవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ చెప్పారు. 'అంతర్జాతీయంగా క్రూడాయిల్ రేట్లు బ్యారెల్కు 60–65 డాలర్ల శ్రేణిలో ఉండొచ్చని, ఇది భారత్కు సానుకూలంగా పరిణమించగలదని అంచనా వేస్తున్నాం' అని వివరించారు. వివిధ అంతర్జాతీయ సంస్థలు అంచనా వేసిన 6.2–6.7 శాతం వృద్ధి రేటు శ్రేణిలోనే ఈవై అంచనాలు ఉండటం గమనార్హం. టారిఫ్ల యుద్ధం, అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత్ వృద్ధిరేటు 6.2 శాతం ఉంటుందని ఐఎంఎఫ్, 6.3 శాతం ఉంటుందని వరల్డ్ బ్యాంక్ పేర్కొన్నాయి. ఇక ఆర్బీఐ, ఎస్అండ్పీ గ్లోబల్ రేటింగ్స్ 6.5 శాతంగా ఉంటుందని, ఓఈసీడీ, ఫిచ్ రేటింగ్స్ 6.4 శాతానికి పరిమితమవుతుందని అంచనా వేశాయి.



నివేదికలో మరిన్ని విశేషాలు..

- అధిక టారిఫ్లు, అంతర్జాతీయంగా బలహీన డిమాండ్ కారణంగా ఎగుమతులు నెమ్మదించవచ్చు. అయితే, స్థూల దేశీయోత్పత్తిపై ప్రభావం ఒక మోస్తరుగానే ఉండొచ్చు.
- గ్లోబల్ మందగమనంతో ప్రపంచవ్యాప్తంగా వృద్ధి నెమ్మదించినా, పటిష్టమైన ఆర్థిక, ద్రవ్య విధానాల వల్ల భారత్ కాస్త మెరుగైన స్థితిలో ఉండొచ్చు.
- ప్రధాన ఎగుమతి దేశాల్లో ఉత్పత్తి సామర్థ్యాలు పెరగడం వల్ల డంపింగ్ రిస్కులు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి భారత్ యాంటీ–డంపింగ్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- గ్లోబల్ అవాంతరాలపై భారత్ వ్యూహాత్మకంగా స్పందించాల్సి ఉంటుంది. వృద్ధికి ఊతమిచ్చే ఆర్థిక విధానాలు, ఉదార ద్రవ్య విధానాల ద్వారా భారత్ ఈ పరిస్థితుల నుంచి పటిష్టంగా బైటపడొచ్చు.
- స్వల్పకాలికంగా అమెరికా నుంచి కొంత క్రూడాయిల్ దిగుమతులను పెంచుకోవడం ద్వారా ఆ దేశంతో వాణిజ్య లోటును భర్తీ చేసుకోవడంతో పాటు ప్రతీకార టారిఫ్ రేట్లను కూడా తగ్గిస్తే భారత్కు శ్రేయస్కరంగా ఉంటుంది.
- 2025 సెప్టెంబర్–అక్టోబర్ నాటికి సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే అమెరికాతో వాణిజ్యంలో కాస్త స్థిరత్వం వస్తుంది.
- స్వల్పకాలికం నుంచి దీర్ఘకాలిక దృష్టికోణంలో చూస్తే భూ, కార్మిక చట్టాల్లో సంస్కరణలు వేగవంతం చేయాలి. విద్య, ఏఐ.. జెన్ఏఐలాంటి కొత్త నైపుణ్యాల్లో శిక్షణపై మరింతగా ఇన్వెస్ట్ చేయాలి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల స్కీము పరిధిని విస్తరించాలి.

హెచ్పీ నుంచి కొత్త ల్యాప్టాప్ల శ్రేణి

ధర రూ. 78,999 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: కృత్రిమ మేధకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కంప్యూటర్స్ తయారీ దిగ్గజం హెచ్పీ తాజాగా తొమ్మిది ల్యాప్టాప్ మోడల్స్ను ఆవిష్కరించింది. వీటి ధర రూ. 78,999 (16 అంగుళాల హెచ్పీ ఆమ్నిబుక్5 నుంచి రూ. 1.86 లక్షల వరకు (హెచ్పీ ఆమ్నిబుక్ అల్ట్రా 14 అంగుళాలు) ఉంటుంది. మరోవైపు, భారత్లో తమ ఉత్పత్తుల తయారీని 2031 నాటికి రెట్టింపు చేసుకునే యోచనలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. దీనితో భారత్లో విక్రయించే ప్రతి మూడు హెచ్పీ పీసీల్లో ఒకటి ఇక్కడ తయారు చేసినదే ఉంటుందని సంస్థ భారత విభాగం సీనియర్ డైరెక్టర్ వినీత్ గెహానీ తెలిపారు. 2025లో భారత్లో తాము విక్రయించే మొత్తం పీసీల్లో 13 శాతం దేశీయంగా ఉత్పత్తి చేసినవే ఉంటాయని వివరించారు. 2024లో దేశీ పీసీ మార్కెట్లో 30.1 శాతం వాటాతో హెచ్పీ అగ్రస్థానంలో నిల్చింది. కంపెనీ తమ ల్యాప్టాప్ల కోసం ఎలక్ట్రానిక్స్ తయారీ సర్వీసుల కంపెనీలు డిక్సన్, వీవీడీఎన్తో జట్టు కట్టింది.

కోచింగ్‌లో కొత్త 'కీర్తి'

అథ్లెటిక్స్‌లో శిక్షకురాలిగా రాణిస్తున్న కీర్తి తివారి

క్రీడల్లో అటు పురుషుల, ఇటు మహిళల విభాగాల్లో గొప్ప విజయాలు అందుకున్న స్టార్లను మనం సాధారణంగా చూస్తూనే ఉంటాం. అయితే అదే శిక్షణకు వచ్చేసరికి మాత్రం పురుషులే పెద్ద సంఖ్యలో కనిపిస్తారు. క్రీడాంశం ఏదైనా కోచింగ్‌లో మహిళల సంఖ్య చాలా తక్కువ. అందులోనూ పురుష క్రీడాకారులకు మహిళలు కోచింగ్ ఇవ్వడం మరీ అరుదు. అయితే 32 ఏళ్ల కీర్తి తివారి ఇప్పుడు కోచింగ్‌లో తన ప్రత్యేకతను చాటుతోంది. ఇంకా ప్లేయర్ వయసులోనే ఉంటూ ఒక ప్లేయర్‌గానే కనిపించే ఆమె శిక్షణను చూస్తే ఎంత సాధికారికంగా కీర్తికి పట్టు ఉందో అర్థమవుతుంది. తనదైన శైలిలో ఆమె ఈతరం విజేతలను తయారు చేస్తోంది.




అథ్లెట్ దేవిడ్‌కు సూచనలు ఇస్తున్న కీర్తి

ప్లేయర్‌నుంచి కోచింగ్ వైపు...

కీర్తి స్వయంగా రన్నర్. 400 మీటర్ల పరుగులో పాల్గొన్న అథ్లెట్. కానీ అక్కడ పెట్టిన పరుగు ఫలితమివ్వకపోవడంతో కోచ్ పాత్ర పోషించేందుకు సిద్ధమైంది. వ్యాయామ విద్యలో మాస్టర్స్ డిగ్రీ చేసిన కీర్తి తదనంతరం పాటియాలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో కోచింగ్ డిప్లొమా పూర్తి చేసింది. 2019లో లక్నోలో తన శిక్షణను మొదలుపెట్టిన ఆమె ఫెడరేషన్ కప్‌లో ఓ విజేతను తయారు చేసింది. ఈ సీనియర్ జాతీయ ఈవెంట్‌లో పి. డేవిడ్ పురుషుల లాంగ్‌జంప్‌లో విజేతగా నిలువడంతో ఇప్పుడు కీర్తి పేరు తెరపైకి వచ్చింది.

ఆమె నా కోచ్...

కీర్తి ఫిజిక్‌ను చూసిన వారికి ఆమె ఓ అథ్లెట్‌గానే కనిపిస్తుంది. పురుషుల లాంగ్‌జంప్ పోటీ జరుగుతుంటే మహిళా అథ్లెట్‌కు ఏం పని అని అక్కడున్నవారు అనుకుంటుండగా... బరిలో ఉన్న డేవిడ్ కల్పించుకొని ఆమె నా కోచ్ అని చెప్పాల్సి వచ్చింది. ఎందుకంటే చాలామంది కోచ్‌లు మలివయసువారే ఉంటారు. యువకులెవరూ కోచ్‌లుగా ఉండరు. కానీ మూడు పదుల వయస్సున్న కీర్తిని సహజంగానే క్రీడాకారిణిగా భావించారంతా! అయితే ఈ యువ కోచ్ తన శిష్యుణ్ని తీర్చిదిద్దిన తీరు, విజేతగా మలచిన వైనం అందరిని ఆకట్టుకుంటోంది.

పురుష ప్రపంచంలో ఆమె ఒంటరి పయనం

విదేశాల సంగతి పక్కనబెడితే భారత్‌లాంటి దేశాల్లో అమ్మాయిలకైనా, అబ్బాయిలకైనా ఏ ఆటలో ఆసక్తి వుంటే తీసుకెళ్లేది పురుష కోచ్ వద్దకే. దిగ్గజ షట్లర్లు సైనా, సింధు తదితరులంతా పుల్లెల గోపీచంద్ శిక్షణలోనే ప్రపంచ బ్యాడ్మింటన్‌లో వెలిగారు. ఇలాంటి పురుష ప్రపంచంలో కీర్తి తన కోచింగ్ ప్రతిభతో పౌరుషాన్ని చాటింది. అకాడమీలో తాను ఒక ఒంటరనే ఫీలింగ్ ఉన్నా... తర్వాత అలవాటుపడింది. ఆటలో పడింది. కోచింగ్‌లోనే మమేకమైంది. దీంతో ఒంటరి పయనంలో ఆమె కనిపించేందుకు ఒక్కరే కావొచ్చు. కానీ కోచ్ పాత్ర తోడు-నీడ కావడంతో ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసింది.

కష్టమైనా... కోచింగే ఇష్టం

మహిళా కోచ్‌కు ఎదురయ్యే సవాళ్లు మామూలుగా వుండవు. పురుషాధిక్య సమాజంలో ఈ సవాళ్లతోనే సహవాసం చేయాల్సి ఉంటుంది. కుటుంబంతో దూరమయ్యే పరిస్థితి పురుషులకు సులువు... కానీ అమ్మాయిల పరిస్థితి చాలా భిన్నం. అందుకేనేమో చాలామంది మహిళలు కోచింగ్ వైపు వచ్చినప్పటికీ నిలదొక్కుకునే ముందే అస్త్రసన్యాసం చేస్తారు. తిరుగుటపా కట్టేస్తారు. కానీ కీర్తి మాత్రం ఎన్ని కష్టాలెదురైనా... తనకెంతో ఇష్టమైన కోచింగ్‌ను వదిలిపెట్టలేదు. కొన్నాళ్లుగా డేవిడ్ ప్రదర్శనకు మెరుగులు దిద్దుతున్న ఆమె చివరకు ఫెడరేషన్ కప్‌లో ఆశించిన ఫలితాన్ని సాధించింది. ఇంత చేసినా కూడా కొందరు ఈ మాత్రం ప్రదర్శనతో ఒలింపిక్స్‌కు తీసుకెళ్తావా అని గేలి చేసినవారూ ఉన్నారు. దానికి ఆమె సమాధానం... అవును ఒలింపియన్‌ను తయారు చేయడమే తన లక్ష్యమని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేది.

భారత మహిళల పరాజయం

3-5 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి



పెర్త్: భారత మహిళల హాకీ జట్టు ఆస్ట్రేలియా పర్యటనను పరాజయంతో ప్రారంభించింది. శనివారం ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన పోరులో సలీమా టెటె సారథ్యంలోని భారత జట్టు 3-5 గోల్స్ తేడాతో ఓడింది. భారత్ తరఫున మహిమ టెటె (27వ నిమిషంలో), నవ్‌నీత్ కౌర్ (45వ నిమిషంలో), లాల్‌రేమ్‌సియామి (50వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. ఆస్ట్రేలియా 'ఎ'జట్టు తరఫున నీసా ఫ్లైన్ (3వ నిమిషంలో), ఒలీవియా డోనెస్ (9వ నిమిషంలో), రుబీ హ్యారిస్ (11వ నిమిషంలో), స్టీవార్ట్ (21వ నిమిషంలో), కేంద్రా ఫిట్జ్‌ప్యాట్రిక్ (44వ నిమిషంలో) గోల్స్ చేశారు. పెర్త్ స్టేడియంలో జరిగిన ఈ పోరు ఆరంభం నుంచే ఆస్ట్రేలియా 'ఎ' జట్టు జోరు కనబర్చింది. తొలి క్వార్టర్‌లోనే మూడు గోల్స్ చేసిన కంగారూలు సొంతగడ్డపై సంపూర్ణ ఆధిపత్యం చాటారు. మూడో నిమిషంలో ఫ్లైన్ చేసిన గోల్‌తో ఖాతా తెరిచిన ఆసీస్... టీమిండియాపై ఒత్తిడి పెంచింది. ఆ తర్వాత డోనెస్, హ్యారిస్, స్టీవార్ట్... భారత డిఫెన్స్ లోపాలను వాడుకుంటూ గోల్స్ చేయడంతో... ఒక దశలో ఆసీస్ 4-0తో నిలిచింది. తిరిగి పుంజుకున్న భారత్... మహిమ గోల్‌తో ఖాతా తెరిచింది. ఈ క్రమంలో ఆసీస్ మరో గోల్ చేసి 5-1తో దూసుకెళ్లగా... ఆఖర్లో భారత్ రెండో గోల్స్ చేసి ఓటమి అంతరాన్ని తగ్గించగలిగింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో... ఈ మ్యాచ్‌లో భారత ప్లేయర్లు చేతికి నల్ల రిబ్బన్లతో బరిలోకి దిగారు. పర్యాటకుల మృతికి సంతాపంగా ఈ టూర్ ఆసాంతం మన ప్లేయర్లు నల్ల రిబ్బన్లతో ఆడాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం మరోసారి ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.

అవినాశ్ సాబ్లేకు 13వ స్థానం



జియామెన్ (చైనా): డైమండ్ లీగ్ కొత్త సీజన్‌లో బరిలోకి దిగిన తొలి రేసులో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే ఆకట్టుకోలేకపోయాడు. లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్ 13వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. 30 ఏళ్ల అవినాశ్ 8 నిమిషాల 22.59 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. సామ్యూల్ ఫైర్వు (8 నిమిషాల 05.61 సెకన్లు; ఇథియోపియా) అగ్రస్థానం దక్కించుకోగా... ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ చాంపియన్ సూఫియన్ ఎల్ బక్కలీ (8 నిమిసాల 06.66 సెకన్లు; మొరాకో), సిమోన్ కిప్రాప్ (8 నిమిషాల 07.12 సెకన్లు; కెన్యా) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో డైమండ్ లీగ్ ఫైనల్లో 8 నిమిషాల 17.09 సెకన్ల టైమింగ్‌తో తొమ్మిదో స్థానంలో నిలిచిన అవినాశ్... ఇప్పుడు దాని దరిదాపుల్లో కూడా నిలవలేకపోయాడు. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో జాతీయ రికార్డు (8 నిమిషాల 9.91 సెకన్లు) కూడా అవినాశ్ పేరిటే ఉంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 8 నిమిషాల 14.18 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 11వ స్థానంలో నిలిచిన అవినాశ్... తదుపరి వచ్చే నెల 3న షాంఘైలో జరగనున్న డైమండ్ లీగ్‌లో పాల్గొననున్నాడు. పారిస్ ఒలింపిక్స్ ప్రదర్శన ఆధారంగానే అవినాశ్... సెప్టెంబర్‌లో టోక్యో ఆతిథ్యమివ్వనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు.

'అజ్లాన్ షా'కు పాక్ బకాయిలు

ఈసారి బరిలో దిగే అవకాశం ఇవ్వని టోర్నీ నిర్వాహకులు

కరాచీ: క్రమం తప్పకుండా జరిగే సుప్రసిద్ధ హాకీ టోర్నీ 'అజ్లాన్ షా కప్'లో పాకిస్తాన్ జట్టు ఈసారి పోటీపడే అవకాశం కోల్పోయింది. టోర్నీ నిర్వాహకులకు పాకిస్తాన్ హాకీ సమాఖ్య (పీహెచ్ఎఫ్) బకాయి పడటంతో మలేసియా హాకీ సమాఖ్య (ఎమ్‌హెచ్ఎఫ్) ఆహ్వానాన్ని నిలిపివేసింది. రెండేళ్ల క్రితం 2023లో జరిగిన టోర్నీకి సంబంధించిన రూ. 8, 83, 582 (10,349 అమెరికా డాలర్లు) బకాయిల్ని జోహర్ హాకీ సంఘం (జేహెచ్ఏ)కు ఇంకా చెల్లించలేదు. దీంతో ఆహ్వానాన్ని పంపడం లేదని నిర్వాహకులు తెలిపారు. జేహెచ్ఏ నిబంధనల ప్రకారం ఆ టోర్నీలో పాల్గొనే జట్ల సభ్యులకు మాత్రం ఆతిథ్య ఏర్పాట్లు చేస్తారు. అంతేగాని వారి వెంట వచ్చే కుటుంబసభ్యులు, హాకీ సమాఖ్య ఉన్నతాధికారులు వస్తే బస, స్థానిక రవాణా, ఇతరాత్ర ఖర్చుల్ని వారే భరించాల్సివుంటుంది.

ప్రతీకార పోరు



- నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ ఢీ
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్షప్రసారం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా ఆదివారం జరగనున్న తొలి పోరులో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)తో ముంబై ఇండియన్స్ తలపడనుంది. ఆరంభంలో పరాజయాలు ఎదురైనా... ఆ తర్వాత చక్కటి ఆటతీరుతో గెలుపు బాట పట్టిన ముంబై మరో విజయంతో 'ప్లే ఆఫ్స్' వైపు మరో అడుగు ముందుకు వేయాలని భావిస్తోంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ కూడా మంచి టచ్‌లో ఉంది. అయితే ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకున్న హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై జట్టు గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మంచి జోరు మీద ఉంది. ఓవరాల్‌గా రెండు జట్లు 9 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 4 పరాజయాలతో 10 పాయింట్లతో ఉన్నాయి. అయితే ఇరు జట్లు గెలిచిన ఐదు మ్యాచ్‌ల్లోనూ... వేర్వేరు ఆటగాళ్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం... సమష్టి కృషికి నిదర్శనం. ముంబై తరఫున అశ్వని కుమార్, కరణ్ శర్మ, విల్ జాక్స్, రోహిత్ శర్మ, ట్రెంట్ బౌల్ట్ ఈ అవార్డు దక్కించుకోగా... లక్నో సూపర్ జెయింట్స్ తరఫున శార్దుల్ ఠాకూర్, దిగ్వేశ్ రాఠీ, నికోలస్ పూరన్, ఎయిడెన్ మార్క్‌రమ్, అవేశ్ ఖాన్ గెలుచుకున్నారు. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో లక్నో విజయం సాధించింది. లక్నో 203 పరుగులు చేయగా... లక్ష్యఛేదనలో ముంబై 191 పరుగులకే పరిమితమైంది. ఈ పోరులోనే భారీ షాట్లు ఆడలేక తిలక్ వర్మ రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. మరి రెండో మ్యాచ్‌లో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

జోరు సాగిస్తేనే...

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ తిరిగి ఫామ్‌లోకి రావడంతో... ముంబై కష్టాలు తీరిపోయాయి. సీజన్ ఆరంభంలో పరాజయాలతో సతమతమైన ముంబై.. ఇప్పుడు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. రోహిత్ దంచికొడుతూ శుభారంభాలు అందిస్తుండగా... మిడిలార్డర్‌లో సూర్యకుమార్ తన విలువ చాటుకుంటున్నాడు. రికెల్టన్, విల్ జాక్స్ కూడా మంచి టచ్‌లో ఉండగా... తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్ రూపంలో ముంబైకి మంచి బ్యాటింగ్ లైనప్ ఉంది. వీరంతా కలిసి కట్టుగా కదంతొక్కితే భారీ స్కోరు చేయడం పెద్ద కష్టం కాదు. సొంతగడ్డపై మ్యాచ్ జరగనుండడం ముంబైకి కలిసి రానుంది. ఇక బౌలింగ్‌లో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చహర్ పేస్ భారం మోయనుండగా... విగ్నేశ్, సాంట్నర్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు.

టాపార్డర్‌పైనే భారం...


లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌లో ఐదు విజయాలు సాధించిందంటే... వారి టాప్-3 ఆటగాళ్లు రాణించడమే దానికి ప్రధాన కారణం. మిచెల్ మార్ష్, మార్క్‌రమ్, పూరన్ ఈ ముగ్గురూ దంచికొడుతుండటంతో... లక్నో భారీ స్కోర్లు చేస్తోంది. ముఖ్యంగా పూరన్ ఈ సీజన్‌లో 200 పైగా స్ట్రయిక్‌రేట్‌తో 377 పరుగులు చేశాడు. మార్క్‌రమ్, మార్ష్ కూడా ధాటిగా ఆడుతున్నారు. కెప్టెన్ రిషబ్ పంత్ ఫామ్ ఆ జట్టును తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఈ సీజన్‌లో లయ దొరకబుచ్చుకోలేకపోతున్న పంత్ 9 మ్యాచ్‌ల్లో 106 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో మేనేజ్‌మెంట్ అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఆయుశ్ బదోనీ, అబ్దుల్ సమద్ ఫర్వాలేదనిపిస్తుండగా... డేవిడ్ మిల్లర్ రాణించాల్సిన అవసరముంది. బౌలింగ్‌లో శార్దుల్, అవేశ్, రవి బిష్ణోయ్, దిగ్వేశ్ రాఠీ కీలకం కానున్నారు.

తుది జట్లు (అంచనా)

ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రికెల్టన్, రోహిత్ శర్మ, విల్ జాక్స్, సూర్యకుమార్, తిలక్ వర్మ, నమన్ ధీర్, సాంట్నర్, దీపక్ చహర్, బౌల్ట్, బుమ్రా, విగ్నేశ్.

లక్నో సూపర్ జెయింట్స్: పంత్ (కెప్టెన్), మార్క్‌రమ్, మార్ష్, పూరన్, బదోనీ, మిల్లర్, సమద్, శార్దుల్ ఠాకూర్, రవి బిష్ణోయ్, దిగ్వేశ్ రాఠీ, అవేశ్ ఖాన్, ప్రిన్స్ యాదవ్.

కోహ్లి X రాహుల్



- ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూఢిల్లీ: భారత ప్రధాన బ్యాటర్లు... ఆస్ట్రేలియా ప్రధాన పేసర్ల మధ్య పోరులా అభివర్ణిస్తున్న మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ)తో రాయల్ చెలంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ సాధించలేకపోయిన ఈ రెండు జట్లు... తాజా సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాయి. కెప్టెన్‌లు కాకపోయినా... బెంగళూరు బ్యాటింగ్ భారాన్ని విరాట్ కోహ్లి మోస్తుండగా... ఢిల్లీ క్యాపిటల్స్‌కు కేఎల్ రాహుల్ వెన్నెముకగా నిలుస్తున్నాడు. సాధికారికంగా ఆడుతున్న ఈ ఇద్దరి మధ్య ప్రధాన పోటీ ఉండనుంది. ఇరు జట్ల మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ రాణించడంతో ఢిల్లీ సునాయాసంగా విజయం సాధించింది. స్వతహాగా కర్ణాటకకు చెందిన రాహుల్... ఆ మ్యాచ్ గెలిచిన తర్వాత 'ఇది నా అడ్డా' అన్న తరహాలో సంబరాలు జరుపుకొని వార్తల్లో నిలిచాడు. మరి ఢిల్లీకి చెందిన విరాట్ కోహ్లి ఆదివారం తన సొంత నగరంలో జరగనున్న పోరులో దీనికి సమాధానం చెప్తాడా చూడాలి. ఢిల్లీ స్టేడియంలో విరాట్‌కు మంచి రికార్డు ఉంది. ఈ సీజన్‌లో తొమ్మిది మ్యాచ్‌లాడిన కోహ్లి అందులో 5 అర్ధ శతకాలు సాధించి ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇక బౌలింగ్‌లోనూ ఇరు జట్ల ఆసీస్ పేసర్ల మధ్య పోటీ కనిపిస్తోంది. ఢిల్లీ ప్రధాన పేసర్ స్టార్క్ మంచి జోష్‌లో ఉండగా... బెంగళూరు తరఫున హాజల్‌వుడ్ మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆసక్తికర పోరు ఖాయమే!

డుప్లెసిస్ రాకతో...

ఇప్పటి వరకు ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు... ఈ సీజన్‌లో అత్యుత్తమ ఆటతీరు కనబరుస్తోంది. అక్షర్ పటేల్ సారథ్యంలో ముందుకు సాగుతున్న క్యాపిటల్స్... 8 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 2 పరాజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో ఉంది. గాయం కారణంగా జట్టుకు దూరమైన ఫాఫ్ డుప్లెసిస్ తిరిగి అందుబాటులోకి రావడం ఆ జట్టు బలాన్ని మరింత పెంచుతోంది. ఓపెనర్ అభిషేక్ పొరెల్ మంచి ఫామ్‌లో ఉండగా... కరుణ్ నాయర్ తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటున్నాడు. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, స్టబ్స్, అశుతోష్ శర్మతో మిడిలార్డర్ పటిష్టంగా ఉంది.స్టార్క్‌తో కలిసి ముకేశ్ కుమార్ పేస్ భారం పంచుకోనుండగా... కుల్దీప్ యాదవ్, విప్రాజ్ నిగమ్ స్పిన్ బాధ్యతలు మోయనున్నారు.

జోరు సాగేనా..!

అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం ఆడుతున్న తొలి ఐపీఎల్లో విరాట్ దంచికొడుతున్నాడు. బరిలోకి దిగితే చివరి వరకు నిలవాలనే కసితో ముందుకు సాగుతున్నాడు. 65.33 సగటుతో అతడు పరుగులు రాబట్టాడు. ఈ సీజన్‌లో ప్రత్యర్థుల మైదానాల్లో ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బెంగళూరు అదే కొనసాగించాలనుకుంటోంది. కోహ్లితో పాటు మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్ కూడా మంచి టచ్‌లో ఉండగా... మిడిలార్డర్‌లో దేవదత్ పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటీదార్, జితేశ్ శర్మ కీలకం కానున్నారు. టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్ ఫినిషర్ల బాధ్యతలు మోస్తున్నారు. భువనేశ్వర్ కుమార్, హాజల్‌వుడ్, యశ్ దయాళ్ పేస్ భారం మోస్తుండగా... సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్యా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఈ సీజన్‌లో 16 వికెట్లు తీసిన హాజల్‌వుడ్‌పై భారీ అంచనాలున్నాయి.



తుది జట్లు (అంచనా)

ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ పటేల్ (కెప్టెన్), అభిషేక్ పొరెల్, డుప్లెసిస్, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, స్టబ్స్, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, స్టార్క్, కుల్దీప్, ముకేశ్ కుమార్, చమీరా.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, పడిక్కల్, జితేశ్ శర్మ, షెఫర్డ్, డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, హాజల్‌వుడ్, యశ్ దయాళ్, సుయాశ్ శర్మ.

మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో మానుశ్ జోడి



ట్యూనిస్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ట్యూనిస్ కంటెండర్ టోర్నమెంట్‌లో భారత ప్యాడ్లర్లు మానుశ్ షా, దియా చిటాలె ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో మానుశ్-దియా జంట 11-4, 11-5, 11-6తో వసీమ్ ఇసిద్-హానా గోడా ద్వయంపై విజయం సాధించింది. వరుస గేమ్‌ల్లో విజృంభించిన భారత జోడీ... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. ఫైనల్లో రెండో సీడ్ జపాన్‌కు చెందిన సోరా మునుషిమా-మివా హరిమోటోతో భారత ద్వయం తలపడనుంది. మరోవైపు పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో మానుశ్ ఓటమి పాలయ్యాడు. పురుషుల డబుల్స్ సెమీస్‌లో మానుశ్-మానవ్ ఠక్కర్ జంట 11-8, 7-11, 11-8, 9-11, 10-12తో జర్మనీకి చెందిన బెనెడిక్ట్ డుడా-ఆండ్రే బ్రెటెల్స్‌మైర్ జోడీ చేతిలో ఓడింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో దియా చిటాలె 11-8, 6-11, 7-11, 9-11 సబీనె వింటెర్ (జర్మనీ) చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో హర్మీత్ దేశాయ్ 11-9, 9-11, 8-11, 1-11తో ఆరో సీడ్ హిరోటో షినోజుకా (జపాన్) చేతిలో ఓడాడు.

ఉగ్ర బెదిరింపులు బేఖాతరు



శనివారం జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకుల సందడి. మంగళవారం ఇక్కడే ఏకంగా 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. దాంతో భారీ సంఖ్యలో పర్యాటకులు లోయను వీడి వెళ్లిపోయారు కూడా. దాడికి వేదికైన పహల్గాం రోజుల వ్యవధిలోనే ఇలా మళ్లీ టూరిస్టులతో కళకళలాడుతోంది.

నన్ను ఇక్కడే ఉండనివ్వండి

- పాకిస్తాన్ కూతురును కావచ్చు
- కానీ ఇప్పుడు భారత్ కోడలిని
- మోదీకి సీమా హైదర్ విజ్ఞప్తి

'నేను పాకిస్తాన్ కుమార్తెను, కానీ ఇప్పుడు నేను భారతదేశ కోడలిని. నాకు పాకిస్తాన్‌కు వెళ్లడం ఇష్టం లేదు. నన్ను ఇక్కడే ఉండనివ్వండి. నన్ను భారతదేశంలో ఉండడానికి అనుమతివ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగిలకు విజ్ఞప్తి చేస్తున్నాను'ఇది పాకిస్తాన్ పౌరురాలైన... ప్రస్తుతం యూపీలో ఉంటున్న సీమా హైదర్ చేసిన విజ్ఞప్తి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ పౌరుల వీసాలను కేంద్రం రద్దు చేసిన విషయం తెలిసిందే. తనను కూడా పంపించేస్తారేమోనన్న ఆందోళనతో సీమ చేసిన వీడియో విజ్ఞప్తి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఎవరీ సీమా హైదర్. పాకిస్తాన్ పౌరురాలు యూపీ కోడలు ఎలా అయ్యింది?

సీమా హైదర్... పాకిస్తాన్ సింధ్ ప్రావిన్స్‌కు చెందిన మహిళ. 2019లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండగా ఆమెకు యూపీకి చెందిన సచిన్ మీనాతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. అయితే.. అప్పటికే సీమాకు పెళ్లయ్యింది. భర్త గులాం హైదర్‌తో ఆమెకు నలుగురు పిల్లలు కూడా. అయితే సచిన్ మీద ప్రేమతో.. నలుగురు పిల్లలను తీసుకుని ఆమె భారత్‌కు వచ్చేసింది. నేపాల్ మీదుగా సరిహద్దు నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించింది. యూపీలోని సచిన్‌ను పెళ్లి చేసుకుంది. గౌతమ్ బుద్ధ నగర్ జిల్లాలోని రబుపుర ప్రాంతంలో నివసిస్తోంది. వీరి విషయం 2023 జూలైలో బయటకు వచ్చింది. అక్రమంగా ప్రవేశించినందుకు సీమాను, ఆశ్రయం కల్పించినందుకు సచిన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తరువాత ఇద్దరూ బెయిల్‌పై విడుదలయ్యారు. ఆమె కేసును ఏటీఎస్ విచారిస్తోంది.



పహల్గాం ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పాకిస్తాన్ పౌరుల వీసాలను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం సీమా సైతం భారత్‌ను వీడి వెళ్లాలి. కాని తాను పాక్‌కు వెళ్లనని, ఇక్కడే ఉంటానని, అందుకు తనకు అనుమతి ఇవ్వాలని సీమా విజ్ఞప్తి చేస్తోంది. తానిప్పుడు సీమా హైదర్‌ను కాదని, సీమా మీనానని, సచిన్‌ను పెళ్లి చేసుకున్నా తరువాత హిందూ మతాన్ని స్వీకరించానని చెబుతోంది. అయితే ఆమె భారత్‌లో నివసించడానికి అర్హురాలని ఆమె తరపు న్యాయవాది ఏపీ సింగ్ సైతం వాదిస్తున్నారు. సచిన్ మీనాతో పెళ్లి తరువాత ఆ దంపతులకు కూతురు పుట్టింది. ఆ చిన్నారి ఇప్పుడు భారతీయురాలు. అంతర్జాతీయ న్యాయస్థానం, సంరక్షణ చట్టాల ప్రకారం చిన్నారి సంరక్షణ బాధ్యత తల్లిది. తల్లి సీమా మీనా భారత్‌ను వీడితే.. చిన్నారిని కూడా వెంట తీసుకెళ్లాల్సి వస్తుంది. భారతీయ పౌరురాలిని పాక్‌కు ఎలా పంపిస్తారని ఆయన ప్రశ్నిస్తున్నారు. పాకిస్తాన్ పౌరులందరూ దేశం విడిచి వెళ్లాలనే ఆదేశం నుంచి ఆమెకు మినహాయింపు ఉంటుందని ఆయన భావిస్తున్నారు. సీమ కేసు భిన్నమైనదని, ఈ విషయమై రాష్ట్రపతి దగ్గర పిటిషన్ కూడా ఉందని ఆయన వాదిస్తున్నారు. అంతేకాదు.. బెయిల్‌పై ఉన్న సీమను అత్తమామల ఇల్లు తప్ప రబుపురా దాటరాదని జెవార్ కోర్టు ఆదేశాలు కూడా ఉన్నందున.. వీసా రద్దు ఉత్తర్వులు ఆమెకు వర్తించవని చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాక్‌ను వీడిన 450 మంది భారతీయులు

లాహోర్: మూడు రోజుల్లో 450 మందికి పైగా భారతీయులు పాక్‌ను వీడారు. వాఘా సరిహద్దు గుండా వారంతా భారత్‌కు చేరుకున్నారు. శనివారం పాక్‌ను వీడిన వారిలో పీఎస్ఎల్ (పాకిస్తాన్ సూపర్ లీగ్) 2025 ప్రసార సంస్థలో భాగమైన 23 మంది భారతీయులు ఉన్నారని పాక్ అధికారులు తెలిపారు. శుక్రవారం 300 మంది, గురువారం 100 మంది భారతీయులు ఇదే మార్గంలో స్వదేశానికి తిరిగి వెళ్లారని వెల్లడించారు. ఇక 200 మంది పాకిస్తానీయులు భారత్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చారని పేర్కొన్నారు. పాకిస్తాన్‌లో దీర్ఘకాలిక వీసాలు, ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ), 'రిటర్న్ టు ఇండియా' స్టాంపులు ఉన్నవారు సరిహద్దు దాటడానికి అధికారులు నిరాకరించారు. మరోవైపు సిక్కు కుటుంబాలతో సహా కొందరు భారత సంతతికి చెందిన విదేశీయులను భారత ఇమ్మిగ్రేషన్, భద్రతా అధికారులు పాకిస్తాన్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారు. లాహోర్‌కు 80 కిలోమీటర్ల దూరంలోని నాన్‌కానా సాహిబ్‌లో నివసిస్తున్న భారత సంతతికి చెందిన కెనడియన్ సిక్కు కుటుంబం వాఘా సరిహద్దు గుండా భారత్‌లోకి ప్రవేశించడాన్ని అడ్డుకున్నారు. దుబాయ్ మీదుగా విమాన మార్గం గుండా ప్రయాణించాలని సూచించారు.

విచారణకు సహకరించని తహవ్వూర్ రాణా

ముంబై: ముంబై ఉగ్రదాడుల ప్రధాన నిందితుడు తహవ్వూర్ రాణా పోలీసుల విచారణకు సహకరించడం లేదు. ఆయనను ముంబై క్రైమ్ బ్రాంచ్ న్యూఢిల్లీలో ఎనిమిది గంటలకు పైగా ప్రశ్నించింది. విచారణకు ఆయన సహకరించలేదు. సరికదా తప్పించుకునేందుకు పొంతనలేని రీతిలో సమాధానమిచ్చారు. పాకిస్తాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడైన తహవ్వూర్ రాణా 26/11 ముంబై ఉగ్రదాడుల కేసులో ప్రధాన నిందితుడు.ముంబై దాడుల కుట్రలో రాణా పాత్ర అతని చిన్ననాటి స్నేహితుడు, సహనిందితుడు డేవిడ్ హెడ్లీ విచారణలో వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయనను అమెరికా నుంచి రప్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశ రాజధానిలో ఎన్ఐఏ కస్టడీలో ఉన్నాడు. నవంబర్ 26, 2008న జరిగిన ముంబై ఉగ్రవాద దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీ, లష్కరే తోయిబా, హర్కత్ ఉల్ జిహాదీ ఇస్లామీ (హుజీ) ఉగ్రవాద సంస్థల నిర్వాహకులు, పాకిస్తాన్‌కు చెందిన కుట్రదారులతో కలిసి రాణా భారత ఆర్థిక రాజధానిపై ఉగ్రదాడికి కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ముగిసిన ఇరాన్, అమెరికా మూడో దఫా చర్చలు

మస్కట్ (ఒమన్): యురేనియం శుద్ధి కార్యక్రమం వేగాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఇరాన్‌తో అమెరికా చేపట్టిన మూడో దఫా పరోక్ష చర్చలు శనివారం ఒమన్‌లో ముగిశాయి. అయితే ఈ చర్చల్లో ఎలాంటి సానుకూల ఫలితాలు వచ్చాయి అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. చర్చల తర్వాత అమెరికా తరపున అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలు ఒమన్ నుంచి తమ స్వదేశాలకు పయనమయ్యారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ''పరస్పర గౌరవం, హామీలకు కట్టుబడేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు రెండు దేశాలు ఆసక్తి కనబర్చాయి. కీలక ప్రతిపాదనలు, సాంకేతిక అభ్యంతరాలు, తదితరాలపై మరోదఫా చర్చలు జరుపుతాం. వచ్చే వారం సైతం సంప్రతింపుల ప్రక్రియ కొనసాగుతుంది. మళ్లీ అత్యున్నత స్థాయి సమావేశం జరుగుతుంది. మే మూడో తేదీన తదుపరి భేటీ ఉంటుంది''అని ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్ బుసైదీ ప్రకటించారు. గతంలో మస్కట్, రోమ్‌లో ఇలా పరోక్ష చర్చలు జరిగాయి. గతంలో మాదిరే ఈసారి చర్చల్లో సైతం ఒమన్ విదేశాంగ మంత్రి బుసైదీ మధ్యవర్తిగా ఉన్న విషయం విదితమే. చర్చలకు ముందు విట్కాఫ్ రష్యాలో ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. చర్చలు మొదలైన సమయంలోనే దక్షిణ ఇరాన్‌లో రజేయీ నౌకాశ్రయంలో శనివారం పేలుళ్లు సంభవించడం గమనార్హం. అర్ధశతాబ్ద శత్రుత్వాన్ని పక్కనబెట్టిమరీ ఇరాన్‌పై కఠిన ఆంక్షలను సడలిస్తామని, అందుకు ప్రతిగా అణ్వాయుధంలో ఉపయోగించే యురేనియం శుద్ధి వేగాన్ని తగ్గించాలని అమెరికా డిమాండ్ చేయడం తెల్సిందే. తమ డిమాండ్లను ఒప్పుకోకుంటే దాడులతో తెగబడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. అయితే అందుకు దీటుగా బదులిస్తామని ఇరాన్ ప్రతిస్పందించడం విదితమే.

అటారీ-వాఘా సరిహద్దు మూసివేత..

ఆగిపోయిన బ్యాండ్, బాజా, బరాత్..!

రాజస్తాన్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి..భారత్, పాకిస్తాన్‌ల మధ్య రాజుకున్న ఉద్రిక్తతలు.. సరిహద్దుల మూసివేత సామాన్యులకు ఎన్నో అవస్థలు తెచ్చిపెట్టాయి. రాజస్తాన్‌లోని బర్మేర్‌కు చెందిన షైతాన్ సింగ్ అనే యువకుడికి పాకిస్తాన్‌లోని సింధు ప్రావిన్స్‌కు చెందిన కేసర్ కన్వర్‌తో నాలుగేళ్ల క్రితమే పెళ్లి నిశ్చయమైంది. వరుడికి, అతడి కుటుంబీలకు వీసా దొరక్క పెళ్లి ఇప్పటిదాకా జరగలేదు. ఫిబ్రవరి 28న వీసాలు మంజూరయ్యాయి. ఈ నెల 30వ తేదీన సింధ్ ప్రావిన్స్‌లోని అమర్‌కోట్‌లో వధువు ఇంట్లో వివాహ వేడుక జరగాల్సి ఉంది. ఇందుకోసం సరిహద్దులకు రెండువైపులా ఉన్న కుటుంబాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇంతలోనే చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలతో బుధవారం అట్టారీ-వాఘా సరిహద్దును అధికారులు మూసివేశారు. విషయం తెలియని షైతాన్ సింగ్ కుటుంబం ఊరేగింపుగా అటారీ-వాఘా బోర్డర్ పాయింట్‌కు చేరుకుంది. అక్కడ ఆర్మీ అధికారులు అసలు విషయం చెప్పడంతో అంతా షాకయ్యారు. 'ఎప్పటి నుంచో ఈ రోజు కోసం ఎదురుచూస్తున్నాం. కానీ, ఇలా జరిగింది'అంటూ షైతాన్ సింగ్ ఆవేదన చెందారు. 'మమ్మల్ని ఆహ్వానించేందుకు బోర్డర్ పోస్ట్ వద్దకు చేరుకున్న మా బంధువులు చేసేది లేక తిరిగి వెళ్లిపోయారు'అని అతడి సోదరుడు చెప్పారు. ఉగ్రదాడుల కారణంగా తమ బంధుత్వాలు కూడా దెబ్బతింటున్నాయని అతడు పేర్కొన్నాడు. అయితే, ఈ కుటుంబానికి మరో చిన్న ఆశ మిగులుంది. అదేంటంటే, వీరి వీసాల గడువు మే 12వ తేదీ వరకు ఉండటం. అప్పటికల్లా తిరిగి సరిహద్దులు తెరుచుకుంటాయని, పెళ్లి జరుగుతుందని ఆశతో వీరున్నారు. కాగా, భారత, పాకిస్తాన్ సరిహద్దులకు సమీప ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఉంటున్న సోధా రాజ్‌పుట్ వర్గం ప్రజల మధ్య వివాహ సంబంధాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి.

ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లు కూల్చివేత

శ్రీనగర్: పహల్గాం దాడి బాధ్యులపై అధికార యంత్రాంగం తీవ్ర చర్యలకు దిగింది. దాడితో సంబంధముందనే అనుమానంతో పుల్వామా, షోపియాన్, కుల్గాం, కుప్వారా జిల్లాలకు చెందిన ఐదుగురు ఉగ్రవాదుల ఇళ్లను శుక్రవారం రాత్రి కూల్చివేశామని అధికారులు తెలిపారు. లష్కరే తొయిబాతో సంబంధాలున్న ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లు గురు, శుక్రవారాల్లో జరిగిన పేలుళ్లలో నేలమట్టమైన విషయం తెల్సిందే. తాజాగా, పుల్వామా జిల్లా మురాన్ ప్రాంతానికి చెందిన అహ్సాన్ ఉల్ హక్ షేక్ ఇంటిని, అనంత్‌నాగ్ జిల్లా తొకెర్‌పురాకు చెందిన ఆదిల్ అహ్మద్ తొకర్ ఇంటిని పేల్చివేశామని అధికారులు తెలిపారు. 2018లో పాకిస్తాన్‌లో ఉగ్ర శిక్షణ పొందిన ఇతడు ఇటీవల చొరబడ్డాడని చెప్పారు. అదేవిధంగా, షోపియాన్ జిల్లా చోటిపొరాకు చెందిన లష్కరే కమాండర్ షాహిద్ అహ్మద్ కుట్టే ఇంటిని, కుల్గాం జిల్లా మటల్‌హామాలోని జకీర్ అహ్మద్‌గనీ, కుప్వారా జిల్లాకు చెందిన ఫరూక్ అహ్మద్‌ల ఇళ్లను నేల మట్టం చేశామని చెప్పారు.

జూన్ నుంచి మానస సరోవర్ యాత్ర

న్యూఢిల్లీ: కైలాస్ మానస సరోవర్ యాత్ర జూన్‌నుంచి ప్రారంభం కానుంది. ఐదేళ్ల తరువాత పునఃప్రారంభమవుతున్న ఈ యాత్ర జూన్ నుంచి ఆగస్టు వరకు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథులా మార్గాల ద్వారా జరుగుతుందని విదేశాంగ శాఖ శనివారం తెలిపింది. ఇరు మార్గాల ద్వారా ఈ ఏడాది 50 మంది యాత్రికులతో పదిహేను బ్యాచ్‌లు ప్రయాణిస్తాయని వెల్లడించింది.


కిమ్ అమ్ముల పొదిలో డెస్ట్రాయర్

సియోల్: ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ తాజాగా మరో కీలకమైన అస్త్రాన్ని సమకూర్చుకున్నారు. శుక్రవారం పశ్చిమ తీరంలోని నంపో నౌకాశ్రయంలో జరిగిన 5 వేల టన్నుల రకం యుద్ధ నౌక ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డెస్ట్రాయర్ ప్రారంభం సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. అణు జలాంతర్గామిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా నావికా శక్తిని బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వచ్చే ఏడాది ఆరంభం నుంచి డెస్ట్రాయర్ విధుల్లో ఉంటుందని కిమ్ అన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అధికార వార్తా సంస్థ వెల్లడించింది.

యువతకు ఉపాధి అవకాశాలు పైపైకి

- 15వ విడత రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ వ్యాఖ్య
- 51వేల మందికి నియామక పత్రాల జారీ

న్యూఢిల్లీ: దేశ యువతకు ఉపాధి అవకాశాలు ప్రతిఏటా పెరిగేలా తమ ప్రభుత్వం విధానపర నిర్ణయాలు అమలుచేస్తోందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 15వ విడత రోజ్‌గార్ మేళలో భాగంగా శనివారం దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన 51,000 మందికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేసి ప్రసంగించారు. ''అత్యంత వేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ కొనసాగుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సైతం స్పష్టంచేసింది. దేశంలోని ప్రతి రంగంలోనూ ఉపాధి అవకాశాలు ఏటికేడు పెరుగుతూనే ఉంటాయి. ఆటోమొబైల్, ఫుట్‌వేర్ పరిశ్రమల్లో ఉత్పత్తి, ఎగుమతులు నూతన రికార్డులను నెలకొల్పాయి. ఈ రంగాలు నూతన ఉద్యోగాల కల్పన మరింత ఎక్కువైంది''అని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పోలిస్తే ప్రస్తుతం ఎంతో మార్పులొచ్చాయని చెప్పారు. ''2014 ఏడాది ముందువరకు నదీ జలాల ద్వారా సరకు రవాణా 1.8 కోట్ల టన్నులు ఉండేది. ఇప్పుడు అది ఏకంగా



15.5 కోట్ల టన్నులకు పెరిగింది. నదీజల మార్గాలు గతంలో ఐదు ఉంటే ఇప్పుడవి 110కి పెరిగాయి. గతంలో 2,700 కిలోమీటర్ల పొడవునా రాకపోకలు జరిగేవి. ఇప్పుడు నదీ జలాల్లో 5,000 కిలోమీటర్ల పొడవునా రాకపోకలు జరుగుతున్నాయి. ప్రతి రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. ఈ ఏడాది యూపీఎస్సీ తుది ఫలితాల్లోనూ టాప్-5 ర్యాంకర్లలో ముగ్గురు మహిళలే. త్వరలో ముంబైలో జరగబోయే వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్(వేవ్స్) భారతీయ యువత తమ డిజిటల్ నైపుణ్యాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించేందుకు ఒక చక్కటి అవకాశం''అని మోదీ అన్నారు.

'పంచాయతీ' అభ్యర్థులు పెండింగ్ కేసులను వెల్లడించాల్సిందే: సుప్రీం

న్యూఢిల్లీ: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అఫిడవిట్లలో తమపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను వెల్లడించాలంటూ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఇందుకు సంబంధించి మండి జిల్లా పస్నా గ్రామ ప్రధాన్ బసంత్ లాల్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కొట్టివేసింది. పెండింగ్ కేసుల వివరాలను దాచటం హిమాచల్ ప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994ను ఉల్లంఘించడం కిందికి వస్తుందని, ఎన్నికను రద్దు చేసేందుకు ఇది కూడా ప్రాతిపదికేనంటూ ఇచ్చిన హైకోర్టు తీర్పు సహేతుకంగానే ఉందని ధర్మాసనం పేర్కొంది. క్రిమినల్ కేసు దాచిన కారణంగా తనపై అనర్హత వేటు వేసి ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించారని లాల్ పేర్కొన్నారు. అయితే, క్రిమినల్ కేసు నుంచి ఆ తర్వాత లాల్ బయటపడినప్పటికీ, కేసును దాచినందుకే అనర్హతకు గురవ్వాల్సి వచ్చిందని పేర్కొంటూ ధర్మాసనం కేసును కొట్టివేసింది. కావాలనుకుంటే, సరైన సమయంలో తిరిగి హైకోర్టునే ఆశ్రయించాలని, అప్పటి వరకు ఫిబ్రవరిలో ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తామని పిటిషనర్‌కు తెలిపింది.

పహల్గాం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రకటన విడుదల చేసిన భద్రతా మండలి

ఐక్యరాజ్యసమితి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఐరాస భద్రతా మండలి తీవ్రంగా ఖండించింది. బాధ్యులను, సంబంధిత ఉగ్ర సంస్థలు, కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫ్రాన్స్ ప్రతినిధి, ఐరాస రాయబారి జెరోమ్ బొన్నాఫాంట్ మండలి తరఫున ఒక ప్రకటన విడుదల చేశారు. 15 దేశాలతో కూడిన మండలికి ఏప్రిల్ నెలకుగాను అధ్యక్ష బాధ్యతల్లో ఫ్రాన్స్ ఉంది. 'ఈ ఉగ్ర చర్య ఖండించదగింది. ఇందుకు బాధ్యులు, కుట్ర దారులు, ఆర్థిక తోడ్పాటునందించే వారిని జవాబుదారులను చేయాలి. వారిని న్యాయం ముందు తప్పనిసరిగా నిలబెట్టాలి. అంతర్జాతీయ చట్టం, సంబంధిత భద్రతా మండలి తీర్మానాలకు లోబడి ఈ విషయంలో అన్ని దేశాలు సంబంధిత అధికారులకు సహకారం అందించాలని మండలి కోరుతోంది'అని ఆ ప్రకటన పేర్కొంది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలపడంతోపాటు క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ ప్రకటన ఆకాంక్షించింది. అమెరికా రూపొందించిన ఈ ముసాయిదా తీర్మానంపై సభ్య దేశాలు చర్చించి, ఆమోదం తెలిపాయి. పాకిస్తాన్ ప్రస్తుతం మండలి శాశ్వతేతర సభ్యదేశంగా ఉంది. అన్ని సభ్య దేశాలు చర్చించి, ఆమోదించిన ప్రకటనను మాత్రమే మండలి విడుదల చేయాల్సి ఉంటుంది.

అఖిలపక్షానికి హాజరుకాకుండా ర్యాలీలా: ఖర్గే

బెంగళూరు: పహల్గాం ఉగ్రదాడిపై జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ గైర్హాజరీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. అఖిలపక్ష సమావేశానికి హాజరుకాకుండా బీహార్ ఎన్నికల ర్యాలీలో పాల్గొనడమేంటని ఆయన మండిపడ్డారు. ఆయన సీరియస్‌నెస్ ఏమిటో దీన్నిబట్టే అర్థమవుతోందన్నారు. గురువారం జరిగిన అఖిలపక్షం సమావేశ వివరాలను శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో పంచుకున్నారు. ఉగ్రదాడి ఎలా జరిగింది? భద్రతా లోపమా? ఇంటలిజెన్స్ లోపమా? ఇన్‌ఫార్మర్లు లేదా పోలీసుల తప్పిదమా అనే విషయాలు చెప్పకుండా హిందీ, ఇంగ్లీషుల్లో భాషలు మార్చి మాట్లాడితే లాభమేంటని ఆయన ప్రశ్నించారు. పహల్గాం ఉగ్రదాడి భద్రతా లోపం వల్లే జరిగిందని సమావేశానికి అధ్యక్షత వహించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంగీకరించారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట భద్రత కల్పించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్లు ఖర్గే తెలిపారు. మూడంచెల భద్రతా వ్యవస్థ ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రజలను కాపాడలేకపోయిందని ఖర్గే దుయ్యబట్టారు.

ప్రయాణికులకు కచ్చితమైన సమాచారమివ్వండి

విమానయాన సంస్థలకు డీజీసీఏ కీలక సూచనలు

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ నుంచి వచ్చే విమానాలను తమ గగనతలంలోకి అనుతించరాదంటూ పాక్ తీసుకున్న నిర్ణయంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పందించింది. దేశంలోని విమానయాన సంస్థలకు శనివారం కీలక సూచనలు జారీ చేసింది. పాక్ నిర్ణయం ప్రభావం భారత పౌర విమానయానంపై పడిందని తెలిపింది. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు సంబంధించి ప్రయాణ సమయం పెరగనుందని డీజీసీఏ పేర్కొంది. ఇందులో భాగంగా విమానాల ల్యాండింగ్, టేకాఫ్, సాంకేతిక ఇబ్బందులు, సమస్యలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు చెక్-ఇన్, బోర్డింగ్ సమయంలో లేదా డిజిటల్ రూపంలో అందించాలని సూచించింది. విమానాల్లో ప్రయాణికులకు సరిపడా ఆహారం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య, కాల్‌సెంటర్లు, కస్టమర్ కేర్, ఇతర సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని, పాటించని సంస్థలపై తగు చర్యలు తప్పవని హెచ్చరించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఇవి అమల్లో ఉంటాయని డీజీసీఏ స్పష్టం చేసింది.

రేపు ముంబైలో తీర ప్రాంత రాష్ట్రాల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మత్స్య రంగం అభివృద్ధే లక్ష్యం ఏప్రిల్ 28న ముంబైలో కోస్టల్ స్టేట్స్ మీటింగ్-2025 జరగనుందని కేంద్రం తెలిపింది. కార్యక్రమానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధకం, పాడిపరిశ్రమ శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అధ్యక్షత వహించనున్నట్లు వివరించింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద మొత్తం రూ.255.30 కోట్లతో 7 తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తలపెట్టిన ప్రధాన ప్రాజెక్టులను మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రారంభించనున్నారు.

రబీలో పెరిగిన గోధుమల సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత రబీ సీజన్‌లో అంచనాకు మించి గోధుమల సేకరణ జరుగుతోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటివరకు 9 రాష్ట్రాల్లో 2 కోట్ల మెట్రిక్ టన్నుల మేర గోధుమలను సేకరించామని తెలిపింది. గత ఏడాది సేకరణ 1.35 కోట్ల మెట్రిక్ టన్నులతో పోలిస్తే ఏకంగా 46 శాతం అధికమని తెలిపింది. రోజువారీ సేకరణ 14-15 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటోందని వెల్లడించింది. అత్యధికంగా పంజాబ్‌లో 68.4 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ జరగ్గా, గతేడాది ఇదే సమయంలో 45 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించామని వివరించింది. హరియాణాలోనూ రికార్డు స్థాయిలో ఇప్పటికే 58లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తయిందని తెలిపింది.

ఏడుగురు పారిశుధ్య కార్మికులు మృతి

గురుగ్రామ్: ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ హైవేని శుభ్రం చేసే పనుల్లో ఉండగా వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఏడుగురు పారిశుధ్య కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదం శనివారం ఇబ్రహీంబస్ గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఘటన సమయంలో అక్కడ 12 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా సమీప ఖేరీ కలాన్, జిమ్రావత్ గ్రామాలకు చెందిన వారని పోలీసులు తెలిపారు.

17 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

న్యూయార్క్: భారత్‌లో పదేళ్ల కాలంలో 17.1 కోట్ల మంది అత్యంత పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. 'గత దశాబ్ద కాలంలో భారత్‌లో పేదరికం గణనీయంగా తగ్గింది. రోజుకు సుమారు రూ.183 కంటే తక్కువ సంపాదనతో అత్యంత పేదరికంలో ఉన్న ప్రజలు 2011-12లో 16.2% మంది ఉండగా, 2022-23 నాటికి 2.3%కి తగ్గింది. అంటే సుమారు 17.1 కోట్లమంది అత్యంత పేదరికం స్థాయిని అధిగమించారు'అని ఓ నివేదికలో ప్రపంచ బ్యాంక్ వివరించింది. అత్యంత పేదరికం స్థాయిలు గ్రామీణ ప్రాంతాల్లో 18.4% నుంచి 2.8%కి, పట్టణ ప్రాంతాల్లో 10.7% నుంచి 1.1%కి తగ్గిందని తెలిపింది. దిగువ మధ్య తరగతి ఆదాయ కేటగిరీలో సైతం పేదరికం స్థాయి 61.8% నుంచి 28.1% తగ్గిందని, ఈ విభాగం నుంచి 37.8 కోట్ల మంది బయటపడ్డారని వివరించింది. దేశంలోని 65% అత్యంత పేదరికం 2011-12లో అతి పెద్ద జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లలోనే ఉండగా నేడది మూడో వంతుకు తగ్గిందని కూడా ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

రక్షణ, భద్రతదళాల ప్రత్యక్ష ప్రసారాలు వద్దు

మీడియాకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్రం మీడియా సంస్థలకు కొత్త సూచనలు చేసింది. రక్షణ కార్యకలాపాలు, భద్రతా దళాల కదలికలకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలు చేయొద్దని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శనివారం సూచించింది. జాతీయ భద్రత దృష్ట్యా రక్షణ, ఇతర భద్రతా సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన విషయాలను నివేదించేటప్పుడు అన్ని మీడియా సంస్థలు, న్యూస్ ఏజెన్సీలు, సోషల్ మీడియా వినియోగదారులు అత్యంత బాధ్యతగా ఉండాలని, ఇప్పటికే ఉన్న చట్టాలు, నిబంధనలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని హెచ్చరించింది.

జీవించే హక్కును వివరించే అధికరణ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాలు

వ్యక్తి పరిపూర్ణ అభివృద్ధికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాథమిక హక్కులు పెట్టని కోట. భారత ప్రజాస్వామ్యానికి ఇవి పునాదిరాళ్లు. ప్రాథమిక హక్కులను మన రాజ్యాంగానికి మాగ్నాకార్టాగా పేర్కొంటారు. వీటికి, ఆదేశిక సూత్రాలకు మధ్య సంబంధం విషయంలో.. న్యాయ శాస్త్రవేత్తలకు, రాజ్యాంగ నిపుణులకు, రాజనీతిజ్ఞులకు మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. న్యాయ సంరక్షణ లేని హక్కులుగా బి.ఎస్.రావు వర్ణించిన ఆదేశిక సూత్రాల స్థితిగతులపై అనేక వాదనలున్నాయి. రాజ్యాధికార దుర్వినియోగం, నియంతృత్వ చట్టాల నుంచి పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే బాధ్యతను మన రాజ్యాంగం సుప్రీం కోర్టు, హైకోర్టులకు అప్పగించింది. తద్వారా ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ లభించింది. వీటి రక్షణ కోసం సుప్రీంకోర్టు 32వ అధికరణ ప్రకారం, హైకోర్టులు 226వ అధికరణ ప్రకారం రిట్లను జారీ చేస్తాయి. రాజ్యాంగంలోని 37వ అధికరణను అనుసరించి ఎలాంటి న్యాయ సంరక్షణ లేని ఆదేశిక సూత్రాలు అంతగా పట్టించుకోదగినవి కావని కె. సంతానం వ్యాఖ్యానించడం గమనార్హం. నిర్దేశిక నియమాలకు న్యాయసంరక్షణ లేకపోయినప్పటికీ సామాజిక మద్దతు ఉందని డా.బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు సమాజానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఈ విషయాన్ని విస్మరించడానికి అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాల మధ్య సంబంధం:

ప్రాథమిక హక్కులు- ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యాలు, తేడాలు మాత్రమే ఉన్నాయని, ఎలాంటి సంబంధం, సమన్వయం లేదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. 19(1)(ఎ) అధికరణ వ్యక్తి భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యాల గురించి పేర్కొంటోంది. 21వ అధికరణ వ్యక్తి స్వేచ్ఛను తెలుపుతోంది. సాధారణంగా అన్ని రకాల ఆర్థిక వనరులను కలిగి రాజ్యాంగం, హక్కుల గురించి అవగాహన ఉన్నవారు వాటిని పొందడం పెద్ద సమస్య కాదు. కానీ పేదలు, నిరక్షరాస్యులు, ప్రాథమిక హక్కుల గురించి అవగాహనలేనివారు ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందడానికి ఆదేశిక సూత్రాల్లోని 39-ఎ అధికరణ ఉచిత న్యాయ సేవా సహాయ కేంద్రాల ద్వారా అవకాశం కల్పిస్తోంది. పేదలకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఉచిత న్యాయసేవా సహాయం అందించడానికి 1987లో లీగల్ ఎయిడ్ అథారిటీని ఏర్పాటు చేశారు.రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కును వివరిస్తోంది. 41వ అధికరణ, 48ఎ అధికరణలు ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య అవినాభావ సంబంధాన్ని తెలుపుతున్నాయి. రాజ్యాంగంలోని 46వ అధికరణ వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగపరంగా ప్రత్యేక అవకాశాలను కల్పించాలని పేర్కొంటోంది. రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలను 15(4), 15(5), 16(4), 16(4ఎ) అధికరణలు సమర్థిస్తాయి. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల అమలులో ఒక దానికి మరొకటి సహకరించడంతో పాటు ఒక అంశాన్ని మరొక అంశం పటిష్టపరిచేందుకు



దోహదపడడం గమనార్హం.

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య భిన్నత్వం:

ప్రాథమిక హక్కులు ప్రధానంగా వ్యక్తి ప్రాతిపదికపై రూపొందించినవి. ఆదేశిక సూత్రాలు సమాజ సమష్టి ప్రయోజనం కోసం ఉద్దేశించినవి. హక్కులు వ్యక్తి స్వేచ్ఛను, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు తోడ్పడతాయి. ప్రాథమిక హక్కుల సంరక్షణ, అమలు కోసం పౌరులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు అవకాశం ఉండగా, వాటి సంరక్షణ కోసం న్యాయస్థానాలు కూడా ఆజ్ఞలు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉంటాయి. ఆదేశిక సూత్రాలకు అలాంటి న్యాయ సంరక్షణ లేకపోవడం గమనార్హం. ప్రాథమిక హక్కులు ఎల్లప్పుడూ పౌరులకు అందుబాటులో ఉంటాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన సందర్భంలో మాత్రమే భారత రాష్ట్రపతి వాటిని తాత్కాలికంగా సస్పెండ్ చేయొచ్చు. కానీ నిర్దేశిక నియమాలు ఎల్లప్పుడూ సుప్తచేతనావస్థలో ఉంటాయి. అంటే వాటికి జీవం పోయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను చేసి అమలు పర్చాలి. ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యత న్యాయస్థానాలపై, నిర్దేశిక నియమాల అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలకు సకారాత్మక దృక్పథాన్ని కల్పిస్తాయి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాన్ని చూపుతాయి. ప్రాథమిక హక్కులు ప్రధానంగా ఏ పనులు చేయకూడదో తెలుపుతాయి. అంటే కొన్ని హక్కులు తప్ప మిగతావన్నీ నకారాత్మక దృక్పథాన్ని తెలుపుతాయి.

ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ సంక్షేమ లక్ష్యాలను తెలిపితే... ప్రాథమిక హక్కులు ఆ లక్ష్యాలను సాధించే సాధనాలు, మార్గాలుగా ఉపయోగపడతాయి.

సంక్షేమ రాజ్యస్థాపనలో నిమగ్నమైన మన దేశంలో నిర్దేశిక నియమాలు.. ప్రభుత్వ శాసనాల రూపకల్పనలో, పరిపాలనా విషయంలో మాత్రమే కాకుండా న్యాయస్థానాల న్యాయ నిర్వహణలోనూ అధిక ప్రాధాన్యతను కలిగి ఉంటాయి.

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యం:

ఆదేశిక సూత్రాలను అమలు పర్చాల్సిన బాధ్యత కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఆదేశిక సూత్రాల అమలుకు ప్రభుత్వాలు రూపొందించే చట్టాలు... ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నప్పుడు ఉన్నత న్యాయస్థానాలు న్యాయ సమీక్ష నిర్వహించి ఆ చట్టాలు చెల్లవని ప్రకటిస్తున్నాయి.

- ★ 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంలో మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం 46వ అధికరణను అమలు జరపడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. సమానత్వపు హక్కుకు రిజర్వేషన్లు విరుద్ధమని పేర్కొంటూ చంపకం దొరై రాజన్ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్ల చట్టం 13వ అధికరణ ప్రకారం ప్రాథమిక హక్కులకు విరుద్ధమని తీర్పునిచ్చింది.
- ★ 1950 లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 39(బి), 39(సి) అధికరణలను అమలు పర్చడంలో భాగంగా భూ సంస్కరణల చట్టాలను రూపొందించాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ హైకోర్టులు భూ సంస్కరణల చట్టాలను సమర్థించగా... బీహార్, పశ్చిమబెంగాల్ హైకోర్టులు ఈ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాయి. కారణం అప్పట్లో ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుగా ఉండడమే. అంతేకాకుండా దేశంలోని వివిధ హైకోర్టుల్లో వందలాది కేసులు విచారణలో ఉన్నాయి.
- ★ రిజర్వేషన్లు, భూ సంస్కరణల చట్టాల విషయంలో ఉన్నత న్యాయస్థానాలిచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకొని 1951 లో నెహ్రూ ప్రభుత్వం మొదటి రాజ్యాంగ సవరణను చేసింది. ఈ సవరణ ద్వారా భూ సంస్కరణల చట్టాలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పిస్తూ 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. ప్రైవేట్ ఆస్తులను చట్టబద్ధంగా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ 31(ఎ), 31(బి) అధికరణలను మన రాజ్యాంగంలో పొందుపర్చారు.
- ★ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధతను కల్పిస్తూ 15(4) అనే అధికరణను కూడా చేర్చారు. మొదటి రాజ్యాంగ సవరణ కూడా ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉందనే కారణంతో శంకరీ ప్రసాద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.
- ★ 1951లో శంకరీ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... మొదటి రాజ్యాంగ సవరణను, తద్వారా రాజ్యాంగంలో చేర్చిన అంశాలను సమర్థించింది. ఈ కేసులో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించింది. 13వ అధికరణ ప్రకారం సాధారణ చట్టాలను మాత్రమే న్యాయ సమీక్షకు గురిచేయొచ్చని, 368 అధికరణ ప్రకారం చేసిన రాజ్యాంగ సవరణలను న్యాయ సమీక్షకు గురిచేసే అవకాశం లేదని పేర్కొంది.
- ★ బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్, కామేశ్వరీ సింగ్ వర్సెస్ బీహార్ మధ్య జరిగిన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు... ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న వ్యక్తిగత ఆస్తులను సమాజ ప్రయోజనం కోసం జాతీయం చేసినప్పుడు వారికి నష్టపరిహారం న్యాయబద్ధంగా చెల్లించాలని, అంటే మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాలని తీర్పునిచ్చింది. దీంతో పార్లమెంట్ 4వ రాజ్యాంగ సవరణ చేసింది. వ్యక్తులకు చెల్లించే నష్టపరిహారాన్ని చట్టబద్ధంగా మాత్రమే చెల్లించాలని పేర్కొంది.
- ★ సజ్జన్‌సింగ్ వర్సెస్ రాజస్థాన్ మధ్య జరిగిన వ్యాజ్యంలో కూడా సుప్రీంకోర్టు 1965లో 4వ సవరణను సమర్థించింది. కానీ, 1967లో గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... గత తీర్పులకు భిన్నమైన తీర్పునిచ్చింది. ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ప్రాథమిక హక్కులను సవరించినట్లయితే.. ఆ సదరు సవరణలను కూడా న్యాయసమీక్షకు గురిచేస్తామని కోర్టు పేర్కొంది.
- ★ 1969లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 14 బ్యాంకులను జాతీయం చేసిన అంశాన్ని, 1970లో రాజభరణాలను రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్స్‌లు కూడా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పులనిచ్చింది. దీంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం 24, 25, 26వ రాజ్యాంగ సవరణలను చేపట్టింది.
- ★ 24వ సవరణ ప్రకారం... ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.
- ★ 25వ సవరణ ప్రకారం ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించే నష్టపరిహారం అనే పదానికి బదులుగా కొంత మొత్తం చెల్లించాలని, ఈ అంశాన్ని ఏ న్యాయస్థానంలో కూడా సవాల్ చేసే అవకాశం లేదని పేర్కొంటూ 'సి' క్లాజును చేర్చారు.
- ★ 26వ సవరణ ప్రకారం రాజభరణాల రద్దుకు రాజ్యాంగబద్ధతను కల్పించారు.
- ★ పై మూడు రాజ్యాంగ సవరణలను 1973లో కేశవానంద భారతి వర్సెస్ కేరళ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. 24వ రాజ్యాంగ సవరణను సమర్థిస్తూ ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మాత్రం సవరించే అధికారం లేదని పేర్కొంది.
- ★ 25వ సవరణను సమర్థించినప్పటికీ అందులోని సి క్లాజు చెల్లదని తీర్పునిచ్చింది.
- ★ 26వ రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సమర్థించింది.
- ★ 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా పార్లమెంట్ సవరిస్తుందని, అలా సవరించిన అంశాన్ని ఏ న్యాయస్థానం ముందు ప్రశ్నించొద్దని, ఆ అంశాన్ని న్యాయ సమీక్షకు గురిచేసే అధికారం కూడా న్యాయస్థానాలకు లేదని పేర్కొంది.
- ★ 42వ సవరణ ద్వారా చేర్చిన అంశాలను 1980లో జరిగిన మినర్వా మిల్స్ కేసులో ప్రశ్నించారు. మినర్వామిల్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ పరస్పరం విరుద్ధమైనవి కావు. భారత ప్రజాస్వామ్యానికి రెండు రథచక్రాల వంటివి, ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఆదేశిక సూత్రాలన్నింటికీ కాకుండా 39(బి), 39(సి) అధికరణలకు మాత్రమే న్యాయ సంరక్షణ ఉంటుందని పేర్కొంది. ప్రాథమిక హక్కులు మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని వెల్లడిస్తూ ఆదేశిక సూత్రాలపై ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను చాటి చెప్పింది.
- ★ ఎం.హెచ్. హోస్కాట్ వర్సెస్ మహారాష్ట్ర మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఉచిత న్యాయ సేవా సహాయాన్ని అందించడం కూడా ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పునిచ్చింది.
- ★ 1992లో మోహినీజైన్ కేసులో, ఉన్నికృష్ణన్ కేసులో ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించింది. ఇందిరాసహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య వ్యాజ్యంలో సంక్షేమ స్వభావం కూడా మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని పేర్కొంది.
- ★ ఆదేశిక సూత్రాల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని కూడా సమర్థిస్తూ ఎం.సి.మెహతా కేసులో తాజ్‌మహల్ చుట్టూ కాలుష్యాన్ని వెదజల్లే 18 రకాల పరిశ్రమలను మూసివేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
- ★ 2006లో భారత పార్లమెంట్ 93వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని అశోక్‌కుమార్ ఠాకూర్ కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది.

ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయోగించాలి?



బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వచించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడి' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
    1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
    3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సందర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
    1) సమస్యా పరిష్కార పద్ధతి
    2) సాంఘిక ఉద్గార పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
    1) వేములవాడ 2) ఆకాశవాణి
    3) మనదేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
    1) ప్రాజెక్టు నిర్వహణ
    2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
    3) నమోదు చేయడం
    4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
    1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
    3) ఆర్యుల నాగరికత
    4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
    1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
    2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
    3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం?
    1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
    4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
    1) పాఠశాల వాతావరణంలోకి తీసుకువచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
    2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
    3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
    4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
    1) సమస్య, విషయం, గ్రూపు
    2) సమస్య, విషయం
    3) నాయకుడు, గ్రూపు, విషయం
    4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
    1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
    2) సంక్లిష్టత నుంచి సరళతకు
    3) అమూర్తం నుంచి మూర్తానికి
    4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
    1) చర్చ 2) క్షేత్ర పర్యటన
    3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపానాల్లో రెండోది?
    1) సమస్య అధ్యయనం
    2) సమాచార సేకరణ
    3) సమస్యను గుర్తించడం
    4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
    1) స్టీవెన్‌సన్ 2) కిల్ పాట్రిక్
    3) అండర్‌సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
    3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చా
    3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
    1) ప్రణాళికా పద్ధతి
    2) సమస్యా పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి
    4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
    1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సంఘీకీకృత ఉద్గార
    4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సంఘీకీకృత ఉద్గార
    4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
    1) సమస్యా పద్ధతి
    2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమ యంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి
    2) వివరణ పద్ధతి
    3) కథనా పద్ధతి
    4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
    1) వివరణ పద్ధతి
    2) ప్రదర్శనా పద్ధతి
    3) సమస్యా పద్ధతి
    4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సమస్యా పద్ధతి
    4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలి గే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
    1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
    3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
    1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
    3) సంఘీకీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
    1) తృతీయ 2) చతుర్థ
    3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
    1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
    3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
    1) వాగ్వాదం 2) చర్చ
    3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతితో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
    1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
    1) జట్టు బోధన 2) చర్చ
    3) సమస్యా పరిష్కారం
    4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
    1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
    3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
    1) జాన్ డ్యూయి
    2) కిల్ పాట్రిక్
    3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
    1) ప్రాజెక్టు
    2) సమస్యా పరిష్కార
    3) ఉపన్యాస
    4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయోగించాలి?
    1) సింహావలోకనం చేయడానికి
    2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
    3) అభిమానులను ఉద్దీపించడానికి
    4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
    1) ప్రక్షేపణ పద్ధతి
    2) సమస్యా పద్ధతి
    3) అన్వేషణా పద్ధతి
    4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
    1) స్వేచ్ఛా సూత్రం
    2) వాస్తవికతా సూత్రం
    3) ఉద్దేశ సూత్రం
    4) ఉపయుక్తతా సూత్రం

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 3	5) 4
6) 1	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 4	13) 2	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 4	20) 1
21) 2	22) 2	23) 4	24) 2	25) 2
26) 1	27) 4	28) 1	29) 2	30) 3
31) 1	32) 2	33) 2	34) 2	35) 1
36) 3	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 2	43) 3	44) 4	45) 1
46) 4				

ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీవ రసాయనాలు

జీవుల్లో మాత్రమే తయారయ్యే రసాయనాలను జీవ రసాయనాలు (Biochemicals) అంటారు. వీటి అంతర చర్యల ద్వారా మాత్రమే జీవి మనుగడ సాధ్యమవుతుంది. ప్రస్తుతం మానవుడు వీటిని కృత్రిమంగా తయారు చేయగలుగుతున్నాడు. పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, కేంద్రకామ్లాలు ముఖ్యమైన జీవ రసాయనాలు.

పిండి పదార్థాలు

పిండి పదార్థాలు(Carbohydrates) జీవులకు ప్రధాన శక్తి వనరులు. ఇవి C, H, D లాంటి పదార్థాలతో నిర్మితమై ఉంటాయి. వీటి ని సాధారణంగా చక్కెరలు (Sugars) అంటా రు. అన్ని చక్కెరలు తియ్యగా ఉండవు. అత్యంత సరళమైన పిండి పదార్థాలు మోనోశాకరైడ్స్.

ఉదా: గ్లూకోజ్, ఫ్రక్టోజ్, గాలక్టోజ్.

ఈ మూడింటిలోనూ ఆరు కార్బన్లు ($C_6H_{12}O_6$) ఉంటాయి. కాబట్టి వీటిని హెక్సోజ్‌లు అంటారు. రెండు మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా డై శాకరైడ్ తయారవుతుంది.

ఉదా: సుక్రోజ్, లాక్టోజ్, మాల్టోజ్.

సుక్రోజ్ చెరకురసంలో ఉంటుంది. దీన్ని కేన్ షుగర్ అంటారు.దీన్ని Invert Sugar and Table Sugar అని కూడా అంటారు. అనేక మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా లభించేది పాలీశాకరైడ్. **ఉదా:** స్టార్చ్, సెల్యులోజ్, గ్లైకోజన్.

సాధారణంగా పాలీశాకరైడ్‌లు తియ్యగా ఉండవు. మోనో, డై శాకరైడ్‌లు తియ్యగా ఉంటాయి.

ప్రోటీన్లు

శరీర అభివృద్ధికి కీలకమైన జీవ రసాయనాలు ప్రోటీన్లు. వీటినే మాంసకృత్తులు అంటారు. ఇవి అమైనో ఆమ్లాలు అనే ప్రమాణాల పాలిమర్లు. అమైనో ఆమ్లాల మధ్య పెప్టైడ్ బంధాలు ఏర్పడటం ద్వారా ప్రోటీన్ తయారవుతుంది. ప్రోటీన్లు మానవ శరీరంలో అనేక విధులను నిర్వర్తిస్తాయి. శరీరంలో అత్యధిక ప్రోటీన్లు ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. శరీరంలో జరిగే రసాయనిక చర్యల్లో ఇవి ఉత్ప్రేరకాలుగా వ్యవహరించి, చర్యలు తక్కువ శక్తి వద్ద వేగంగా జరిగేలా తోడ్పడతాయి. జీర్ణక్రియ, శ్వాసక్రియ, కండర సంకోచం, రక్తస్కంధనం లాంటి శరీర క్రియలన్నీ రసాయనిక చర్యల ద్వారానే సాధ్యమవుతాయి. ఎంజైమ్‌లు ఈ రసాయనిక చర్యలను నిర్వహిస్తూ, శరీర పెరుగుదలకు దోహదపడతాయి.

ఉదా: పెప్సిన్, ట్రిప్సిన్.

కొన్ని ప్రోటీన్లు హార్మోన్‌లుగా కూడా వ్యవహరించి, శరీర జీవక్రియలను నియంత్రిస్తాయి.

ఉదా: పెరుగుదల హార్మోన్.

ఇది పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఇన్సులిన్, గ్లూకగాన్ రెండూ కలిసి రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తాయి. మరికొన్ని ప్రోటీన్లు నిర్మాణ ప్రమాణాలుగా వ్యవహరిస్తాయి.

ఉదా: కెరాటిన్. ఇది గోర్లు, రోమాలు, కొమ్ములు లాంటి నిర్మాణాల్లో ఉంటుంది.

కొవ్వులు

కొవ్వులు శక్తి వనరులుగా, రిజర్వు ఆహారంగా ఉపయోగపడతాయి. సరళ కొవ్వులను ట్రై గ్లిసరైడ్స్ అంటారు. ఒక ట్రై గ్లిసరైడ్‌లో ఒక గ్లిసరాల్ అణువుకు మూడు కొవ్వు ఆమ్లాలు ప్రత్యేక ఎస్టర్ బంధాల ద్వారా బంధితమై ఉంటాయి. అన్ని రకాల వంట నూనెల్లో ఈ ట్రై గ్లిసరైడ్‌లు ఉంటాయి. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్లన్నింటి మధ్య ఏకబంధాలు ఉంటే దాన్ని సంతృప్త (Saturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్ల మధ్య కనీసం ఒక ద్వి బంధం లేదా త్రి బంధం ఉన్నట్లయితే దాన్ని అసంతృప్త (Unsaturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఇలాంటి ద్వి బంధాలు, త్రి బంధాలు ఎక్కువగా ఉంటే దాన్ని Poly Unsaturated Fatty Acids (PUFA) అంటారు. ఇవి ఆరోగ్యానికి, ముఖ్యంగా గుండె పనితీరును మెరుగుపరచడానికి తోడ్పడతాయి. సంక్లిష్ట కొవ్వులకు కొలెస్టరాల్ మంచి ఉదాహరణ. శరీరంలో కొవ్వు నిల్వ ఉన్న కణజాలం అడిపోజ్. స్టీరాయిడ్‌లు, మైనం (Waxes) కూడా కొవ్వు పదార్థాలే.

విటమిన్లు



మానవుడికి పోషణలో కేవలం స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలనే విటమిన్లు అంటారు. ఇవి శక్తి వనరులు కావు. ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని భాగం లేదా దాని ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యల్లో ఎంజైమ్‌లకు దోహదం చేస్తాయి. ఇవి ముఖ్యంగా శక్తి విడుదలయ్యే ప్రక్రియల్లో సహ ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. రసాయనిక స్వభావం ఆధారంగా విటమిన్లను రెండు రకాలుగా విభజిస్తారు. అవి..

1. **కొవ్వుల్లో కరిగేవి:** A, D, E, K
2. **నీటిలో కరిగేవి:** బి-కాంప్లెక్స్, C.

ఆరోగ్యకరమైన దృష్టికి విటమిన్ A అవసరం. B_1 (థయామిన్), B_2 (రైబోఫ్లేవిన్), B_3 (నియాసిన్) లాంటివి ప్రధానంగా శక్తి విడుదల ప్రక్రియకు, ప్రోటీన్, పిండి పదార్థం, కొవ్వుల జీవక్రియల్లో అవసరమవుతాయి. B_9 (ఫోలిక్ ఆమ్లం), B_{12} (సయనకోబాలమిన్) విటమిన్లు హిమోగ్లోబిన్ ఏర్పడటానికి, ఎర్ర రక్త కణాల పరిపక్వతకు తోడ్పడతాయి. బలమైన ఎముకలు, దంతాలకు, కాల్షియం, ఫాస్ఫరస్ జీవక్రియ నియంత్రణకు విటమిన్ D అవసరమవుతుంది. ఇది సూర్యరశ్మి నుంచి లభిస్తుంది. విటమిన్ K ఒక అనుబంధ రక్తస్కంధన కారకంగా వ్యవహరిస్తుంది.

ఆరోగ్యకరమైన చర్మానికి, ప్రత్యుత్పత్తి వ్యవస్థ అభివృద్ధికి విటమిన్ E అవసరం. నోటి ఆరోగ్యానికి, బలమైన చిగుళ్లకు విటమిన్ C అవసరం. విటమిన్ E, విటమిన్ C యాంటీ ఆక్సిడెంట్లుగా వ్యవహరిస్తాయి.

విటమిన్	రసాయనిక నామం	దాని లోపం ద్వారా వచ్చే వ్యాధులు
A	రెటినాల్	రేచీకటి, కెరటోమలేసియా, జీరాఫ్తాల్మియా
D	కాల్సిఫెరాల్	రికెట్స్, ఆస్టియోమలేసియా
E	టోకోఫెరాల్	లోపం అరుదు. పక్షుల్లో వంధ్యత్వం, నవజాత శిశువుల్లో హీమోలైటిక్ అనీమియా
K	ఫిల్లోక్వినోన్/ మినాక్వినోన్	డయాథెసిస్, ఆలస్యంగా రక్తస్కంధనం
B_1	థయామిన్	బెరిబెరి, పాలీ న్యూరిటిస్, వెర్నికె-కోర్సకాఫ్ సిండ్రోమ్
B_2	రైబోఫ్లేవిన్	ఎరైబోఫ్లేవినోసిస్, గ్లాసిటిస్, కీలోసిస్
B_3	నియాసిన్/ నికొటినమైడ్	పెల్లాగ్రా/ 4డి సిండ్రోమ్
B_5	పాంటోథెనిక్ ఆమ్లం	పారెస్తీసియా
B_6	పైరిడాక్సిన్/ పైరిడాక్సామైన్	న్యూరోపతి
B_7	బయోటిన్	డెర్మటైటిస్, ఎంటిరైటిస్
B_9	ఫోలిక్ ఆమ్లం/ ఫాలాసిన్	మెగలోబ్లాస్టిక్ అనీమియా
B_{12}	సయనకోబాలమిన్	పెర్నీసియస్ అనీమియా
C	ఆస్కార్బిక్ ఆమ్లం	స్కర్వీ

కేంద్రకామ్లాలు

కేంద్రకామ్లాలు అనే జీవ రసాయనాలు జన్యు పదార్థంగా వ్యవహరిస్తాయి. ఇవి రెండు రకాలు. 1) డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ యాసిడ్ (DNA), 2) రైబో న్యూక్లిక్ యాసిడ్ (RNA). వీటిలో ప్రధాన జన్యు పదార్థం DNA. కేవలం కొన్ని వైరస్‌లలో RNA ప్రధాన జన్యు పదార్థంగా ఉంటుంది. జీవుల లక్షణాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరుచుకోవడమే కాకుండా వాటిని కొత్త తరానికి సంక్రమింపజేసే విధులను DNA నిర్వర్తిస్తుంది. DNA, RNA రెండూ న్యూక్లియోటైడ్ అనే ప్రమాణాల పాలిమర్లు.

మాదిరి ప్రశ్నలు

1. చెరకురసం నుంచి ప్రత్యేకంగా తయారుచేసే మత్తు పానీయం?
   ఎ) విస్కీ బి) వోడ్కా
   సి) రమ్ డి) ఫెన్నీ
2. డీఎన్ఏలో ఏ రకమైన చక్కెర ఉంటుంది?
   ఎ) హెక్సోజ్ బి) పెంటోజ్
   సి) టెట్రోజ్ డి) ట్రయోజ్
3. సహజ చక్కెరల్లో తియ్యనిది ఏది?
   ఎ) సుక్రోజ్ బి) గ్లూకోజ్
   సి) స్టార్చ్ డి) ఫ్రక్టోజ్
4. మధుమేహ రోగుల కోసం ప్రత్యేకంగా ఉపయోగించే కృత్రిమ తీపి రసాయనం?
   ఎ) సుక్రలోజ్ బి) ఆస్పర్టేం
   సి) శాకరిన్ డి) అన్నీ
5. ఒక గ్రాము ఆల్కహాల్ ద్వారా ఎన్ని కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది?
   ఎ) 4 బి) 7 సి) 9 డి) 12
6. ఖడ్గమృగం కొమ్ముల్లో ప్రధానంగా కన్పించే ప్రోటీన్?
   ఎ) కెరాటిన్ బి) సెరిసిన్
   సి) ఫైబ్రోమిన్ డి) కొల్లాజెన్
7. కిందివాటిలో ఆవశ్యక అమైనో ఆమ్లం?
   ఎ) ఫినైల్ అలనిన్ బి) ఆస్పర్టిక్ ఆమ్లం
   సి) గ్లుటమిక్ ఆమ్లం డి) గ్లైసిన్
8. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు ఏ చేపలో లభిస్తాయి?
   ఎ) హిల్సా బి) సాల్మన్
   సి) మెకరల్ డి) అన్నీ
9. కిందివాటిలో స్యాచురేటెడ్ కొవ్వు ఆమ్లం?
   ఎ) పామిటిక్ ఆమ్లం
   బి) లినోలిక్ ఆమ్లం
   సి) లినోలెనిక్ ఆమ్లం
   డి) అరాకిడోనిక్ ఆమ్లం
10. ఆహారంలో ప్రోటీన్ల లోపం వల్ల పిల్లల్లో అభివృద్ధి కుంటుపడటాన్ని ఏమంటారు?
    ఎ) మరాస్మస్ బి) క్వాషియోర్కర్
    సి) మరుగుజ్జుతనం డి) విల్సన్ డిసీజ్
11. ప్రోటీన్ కర్మాగారాలు ఏవి?
    ఎ) మైటోకాండ్రియా
    బి) లైసోజోమ్‌లు
    సి) రైబోజోమ్‌లు డి) గాల్జీ సంక్లిష్టం
12. మనిషి కండరాల్లో అత్యధిక మోతాదులో కన్పించే ప్రోటీన్ ఏది?
    ఎ) ఆక్టిన్ బి) మయోసిన్
    సి) కొల్లాజెన్ డి) కెరాటిన్
13. బ్రౌన్ ఫ్యాట్ అంటే?
    ఎ) రక్త సరఫరా లేని కొవ్వు
    బి) రక్త సరఫరా ఉన్న కొవ్వు
    సి) కుళ్లుతున్న కొవ్వు
    డి) పిండి పదార్థంతో కలిసిన కొవ్వు
14. కిందివాటిలో ఎంజైమ్ కానిది ఏది?
    ఎ) పెప్సిన్ బి) టయలిన్
    సి) గ్యాస్ట్రిన్ డి) స్టియాప్సిన్
15. ఆంగ్ల అక్షరాల ఆధారంగా విటమిన్లను సంబోధించే విధానాన్ని ప్రవేశపెట్టిందెవరు?
    ఎ) కాసిమర్ ఫంక్ బి) జె.సి.డ్రామండ్
    సి) జేమ్స్ లిండ్ డి) ఐజక్‌మన్
16. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
    ఎ) రెటినాల్ బి) రైబోఫ్లేవిన్
    సి) బయోటిన్ డి) నియాసిన్
17. ఏ విటమిన్ లోపం ద్వారా నోటి అంచుల వద్ద పగుళ్లు ఏర్పడే కీలోసిస్ అనే వ్యాధి వస్తుంది?
    ఎ) B_1 బి) B_2
    సి) B_3 డి) B_5

సమాధానాలు

1) సి 2) బి 3) డి 4) డి 5) బి
6) ఎ 7) ఎ 8) డి 9) ఎ 10) బి
11) సి 12) బి 13) ఎ 14) సి 15) బి
16) బి 17) బి.

Which step number is the following output?



Bank Exams

REASONING

INPUT - OUTPUT

In Input-Output problems an aspirant is asked to imagine a kind of computer or a word processing machine which performs some operations repeatedly on a given input as per a pre-fixed manner and subsequently different output are given in different steps.

Arrangement: The words or the numbers are arranged as per a fixed order.

Generally the order can be alphabetical order incase of words, incre- asing or decreasing incase of numbers. Arrangement ends as soon as the desired order is achieved.

In case of arrangement a word that comes alphabetically first (or last) in a dictionary will go to first (or last) place, in the first step. Similarly a word which comes second (or second last) in alphabetical order which go to second (or second last) place and so on.

If the input consists of numbers, the smallest (or largest) number going to the first (or last) place in first step. Similarly the second smallest (or second largest) will go to second (or second last) place in the second step.

Directions (Q.No: 1–5):

Study the following information carefully and answer the questions given below:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and various steps of rearrangement. (All the numbers are two digit numbers).

Input: plan more vacation 35 56 92 nice holiday tours 84 61 12
Step I: 92 plan more vacation 35 56 nice tours 84 61 12 holiday
Step II: 92 84 plan vacation 35 56 nice tours 61 12 more holiday
Step III: 92 84 61 plan vacation 35 56 tours 12 nice more holiday
Step IV: 92 84 61 56 vacation 35 tours 12 plan nice more holiday
Step V: 92 84 61 56 35 vacation 12 tours plan nice more holiday
Step VI: 92 84 61 56 35 12 vacation tours plan nice more holiday

And Step VI is the last step of the rearrangement as the desired arrangement is obtained.

As per the rules followed in the above steps, find out in each of the questions the appropriate step for the given input.

Analysis: On observing the last step it can be concluded that numbers are arranged in the descending order from left end and the words are arranged in the alphabetical order from the right end. The first five steps reveal that one number and one word are arranged in the respective order in each step. Each time the remaining numbers are pushed to the right.

Questions:

Input: hard work pays 96 42 in 79 long run 18 25 57

1. **Which step number is the following output?**
   96 79 57 42 work run 18 25 pays long in hard
   1) Step II 2) Step III
   3) Step IV 4) Step V
   5) There is no such step

A: 3
As four numbers 96, 79, 57 and 42 are arranged in descending order from left and four words viz. hard, in, long and pays are arranged in alphabetical order from right end, it can be established that the given step is the fourth step of the arrangement.

2. **How many elements (words/ numbers) are there between "work" and "in" as they appear in Step III?**
   1) Six 2) Five 3) Seven
   4) Four 5) Three

A: 1
In the III step the elements 96, 79 and 57 will take the first three positions and the word 'work' will take the fourth position from the left end. Similarly the word 'in' will occupy the second position from right end (i.e. eleventh position from the left end). Therefore there are 11– 4– 1 = 6 elements (words/numbers) between 'work' and 'in'.

3. **Which of the following represents the positions of "pays" in the Step II?**
   1) Seventh from right
   2) Sixth from left
   3) Eighth from right
   4) Fourth from left
   5) Fifth from left

A: 4
In II step 96 and 79 will occupy the first and second positions respectively followed by the words 'work' and 'pays' in the next two positions. Therefore the word 'pays' represents the fourth position from the left end in step II.

4. **Which word/ number would be at the seventh position from the right in the Step IV?**
   1) work 2) run 3) long
   4) 18 5) 25

A: 2
In Q. No. 1, the IV step is given. It can be seen that the word 'run' takes seventh position from the right end.

5. **Which word/number would be third to the left of the fourth element from the right in the Step III?**
   1) pays 2) 42 3) run
   4) 18 5) work

A: 2;
The element third to the left of fourth element from the right will be 4+3=7th element from the right.Therefore the same element will occupy 13–7=6th position from the left end. In step III 96, 79 and 57 will occupy the first three positions followed by 'work', 'pays' and 42 in the subsequent three positions. Therefore the number 42 will take the sixth position from the left end in step III.

Directions (Q.No: 6-10):

Study the given information and answer the following questions:

When a word and number arrangement machine is given an input line of words and numbers, it arranges them following a particular rule. The following is an illustration of input and rearrangement. (All the numbers are two digit numbers).

Input: 40 made butter 23 37 cookies salt extra 52 86 92 fell now 19
Step I: butter 19 40 made 23 37 cookies salt extra 52 86 92 fell now
Step II: cookies 23 butter 19 40 made 37 salt extra 52 86 92 fell now
Step III: extra 37 cookies 23 butter 19 40 made salt 52 86 92 fell now
Step IV: fell 40 extra 37 cookies 23 butter 19 made salt 52 86 92 now
Step V: made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 86 92 now
Step VI: now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 92
Step VII: salt 92 now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19

Step VII is the last step of the above arrangement as the intended arrangement is obtained. As per the rules followed in the given steps, find out the appropriate steps for the given input.

Analysis: It is observed from the last step, numbers and words are arranged alternately, words in the reverse dictionary order and numbers in the descending order from the left end or the words in the dictionary order and the numbers in the ascending order from the right end. From the first six steps it can be concluded that every time a word and a number are arranged in dictionary order and ascending order respectively from the left end but they are pushed to right in the subsequent steps.

Questions:

Input: 32 proud girl beautiful 48 55 97 rich family 61 72 17 nice life

6. **How many steps will be requi- red to complete the given input?**
   1) Five 2) Six 3) Seven
   4) Eight 5) Nine

A: 3
There are fourteen elements in the given input. In each step a word and a number (two elements) are arranged in the respective order, it will take 14 by 2 i.e. 7 steps to complete the arrangement.

7. **Which of the following is the third element from the left end of Step VI?**
   1) beautiful 2) life 3) 61
   4) nice 5) 17

A: 4
In V step, the word 'nice' will take the first position and the number 61 will take the second position. In the subsequent VI step they are pushed towards right taking third and fourth positions respectively. Therefore the word 'nice' will take the third position from the left end in the VI step.

8. **Which of the following is Step III of the given input?**
   1) proud 72 girl 48 family 32 beautiful 17 55 97 rich 61 nice life
   2) life 55 girl 48 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice
   3) girl 48 family 32 beautiful 17 proud 55 97 rich 61 72 nice life
   4) family 32 beautiful 17 proud girl 48 55 97 rich 61 72 nice life
   5) girl 48 life 55 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice

A: 3
In III step, the word 'girl' will take the first position and the number 48 will take the second position. Since the word 'family' and the number 32 take the first and second positions in the previous step, will occupy the third and fourth positions respectively in Step III. Only option 3 will satisfy the above two conditions.

9. **What is the position of nice from the left end in the final step?**
   1) Fifth 2) Sixth
   3) Seventh 4) Eighth
   5) Ninth

A: 1
The word 'nice' takes the first position in Step V and in each of subsequent VI and VII steps two elements precede this word. Therefore a total of four elements precede the word 'nice' that means the word 'nice' will take the fifth position from the left end in the final step.

10. **Which element is third to the right of 'family' in Step V?**
    1) beautiful 2) 17 3) proud
    4) 97 5) 32

A: 2
In step II the word 'family' takes the first position, the number 32 the second position, the word 'beautiful' the third position and the number 17 the fourth position from the left end. In every subsequent steps the elements 'family 32 beautiful 17' will be pushed to the right with no element coming in between them. Therefore the element third to the right of 'family' will be 17 in each of the steps from II to VII.